ISSN No : 2581-7477

# సాహిత్య ప్రస్థానం

Sahitya Prasthanam

సంపుటి - 4 సంచిక - 12 సెప్టెంబరు 2023 [illegible] పేజీలు 68 వెల రూ. 20



## ప్రజా గాయకుడు గద్దర్ కి నివాళి

సాహితీస్రవంతి



సంత దారిలో...: ఉమ్మడిగా.. సందడిగా...

సాహిత్య ప్రస్థానం
సెప్టెంబరు 2023
సంపుటి : 4 సంచిక : 12

# ఎర్రెర్ర జెండాగా .. ఎలుగెత్తు పాటగా ...

ప్రజల పోరు పాటగట్టి తూటాగా పేల్చినోడ
జనబాధల గాథలతో జండా ఎగరేసినోడా
రొమ్ములోన గుండెతోటి దుమ్మురేపి బతికినోడ
నీ ఆటపాటలతో ఉత్తేజం నింపినోడ

**మ**హా గాయకుడు, ప్రయోగశీల ప్రయోక్త, ప్రజా కళా సేనాని గద్దర్ అస్తమయంతో ప్రజా సాంస్కృతిక రంగం చిన్నబోయింది. వేలపాటల వటవృక్షం నేలకొరిగింది. ఒక అగ్గిగొంతుక, ఒక నిప్పుల కంఠం చరిత్రగా మిగిలిపోయింది. అస్వస్థతతో ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్న గద్దర్ ఊహించని రీతిలో హఠాత్తుగా కన్నుమూయడం అభ్యుదయ కళాభిమానులకు అశనిపాతమైంది. ఆట పాట మాట నటన నృత్యం చిందులతో సమాజమే రంగస్థలంగా, కళావనినే సమరభూమిగా చేసుకున్న గద్దర్ ప్రస్థానం– ప్రజా కళాసాహిత్య రంగాల్లో ఒక సజీవ పాఠం, ఒక నిరంతర సంగీతం. తన బాటలో వందల వేలమందిని ఉత్తేజపరచిన సృజన గద్దర్ ప్రత్యేకత. పల్లెటూరి పాటగాడుగా మొదలై జననాట్యమండలి పతాకగా రూపొంది, ఆఖరి వరకు ఆగని అమరగానమై, అరుణరాగమై విరాజిల్లిన విప్లవ స్ఫూర్తి గద్దర్. రాజకీయ సైద్ధాంతిక కోణాల్లో తేడాలుండొచ్చు గానీ ఎప్పటికప్పుడు ఎక్కడికక్కడ స్వచ్ఛమైన సమరగీతమై సాక్షాత్కరించిన ఆయన ఆశయబలం విషయంలో అన్యమైన అంచనాలకు అవకాశమే లేదు.

తను పాట కట్టని పోరాటం లేదు. తను నివాళులివ్వని అమరవీరులు లేరు. తన గజ్జెకట్టని ప్రజావేదిక లేదు. వాగ్గేయ కారుల వరవడికీ, ప్రజా కవులు గాయకుల వురవడికీ మన కాలపు మహా నిదర్శనం గద్దర్. ఆఖరి మజిలీలో ఆయన అడుగులను కొందరు ప్రస్తావించవచ్చు గాని తన ఎడతెగని పయనం ముందు అవి లెక్కలోవి కావు. లెక్కించాల్సినవీ కావు. సాహితీ స్రవంతి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో మొదటిసారిగా జనకవనం జరుపుతున్నప్పుడు తనే స్వతంత్రంగా వచ్చి పాటపాడి పరవశింపచేసిన గద్దర్ అన్ని దశల్లోనూ దానికి అండగా ఉన్నారు. ఆ క్రమంలోనే, అందులో భాగంగానే ఈ విషయాలన్నీ చర్చించాడు. తన సుదీర్ఘ ప్రయాణం అనుభవాలనూ, అనుసరించిన పద్ధతులను, ఆలోచించిన విషయాలను ఆయన మాటల్లోనే చెప్పిన సవివరమైన ఇంటర్వ్యూ లోపలి పేజీల్లో వుంది. ప్రస్థానం పేరిట మాసప్రతిక ప్రారంభం కాకముందే వెలువరించిన ప్రత్యేక సంచికకు ఇచ్చిన ఆ ఇంటర్వ్యూ గద్దర్ ఇన్నర్ వ్యూ కూడా. కళాజీవిగా తన తపన, ఘర్షణ ఇందులో మనకు స్పష్టమవుతాయి. కవులూ కళాకారులెవరికైనా సృజన సమరశీలత గురించి చెప్పే అపురూపమైన అంశాలవి. గద్దర్‌కు అరుణాంజలులర్పిస్తూ ఆయనకు నివాళిగా ఆయన వారసత్వం కొనసాగించేందుకు మార్గనిర్దేశకంగా ఈ ఇంటర్వ్యూ పునర్ముద్రిస్తున్నాం. ▪

ప్రధాన సంపాదకుడు
తెలకపల్లి రవి
వర్కింగ్ ఎడిటర్
సత్యాజీ

సంపాదకవర్గం
కె.సత్యరంజన్ ◆ కెంగార మోహన్ ◆ వొరప్రసాద్
◆ చీకటి దివాకర్ ◆ గనారా ◆ కుమార స్వామి
మేనేజర్ : కె.లక్ష్మయ్య

బొమ్మలు
తుంబలి శివాజీ
చిదంబరం

Owned, Printed and Published by **V. Krishnaiah** 41-9 -16, 1st Floor, F-3, Ramalayam Street, Near Kalpana Prints, Krishna Lanka, Vijayawada (Urban) - 520013, Krishna District. Andhrapradesh. Printed at Sri Chaitanya Offset Printers, 29-7-36, Vishnuvardhan Rao Street, Suryaraopet, Vijayawada - 520 002, Andhrapradesh. Published at 27-30-4, M.B.Vignanakendram, 3rd Floor, Akulavari Veedhi, Governorpet, Vijayawada - 520 001, Andhrapradesh.
Editor : Telakapalli Ravi

ఈ సంచికలో ... **సాహిత్య ప్రస్థానం** సెప్టెంబరు 2023

## కథలు


మా ఊరి సోనూసూద్ : ఉదయమిత్ర ................ 5
హీరో : వి.రెడ్డెప్ప రెడ్డి ............. 31
నీ కృప చాలును : కెంగార మోహన్ ........... 49


## కవితలు


పాట ఆగదు నది ఎండదు : నారమోని యాదగిరి ....... 9
కవి పుట్టిన సమయం : పద్మావతి రాంభక్త ........ 9
చీలిన పొద్దు : కంచరాన భుజంగరావు ... 13
చంద్రుడిపై పతాకం : రెడ్డి శంకరరావు ........ 17
అష్టపది : జంగం స్వయంప్రభ ..... 25
ఆత్మీయత పంచు : కోరాడ అప్పలరాజు ..... 26
నిష్ఠూరపు సమయం : కళ్యాణదుర్గం స్వర్ణలత ..... 27
మా పిల్లాడి మైదానం : గవిడి శ్రీనివాస్ .......... 27
తర్వాత ... : అను : జానీ తక్కెడశిల .. 29
రెప్ప చాటు స్వప్నం : స్వప్న మేకల ................ 30
కాలం చెప్పుడు మాటలు వినదు : చందలూరి నారాయణరావు ......... 30
పాట మరణించదు : బి.గోవర్ధనరావు ........ 36
మేరా భాష మహాన్ : కోటం చంద్రశేఖర్ ......... 36
ప్రొజక్షన్ : రోహిణి వంజారి ........ 42
కనువిప్పు : గిద్దలూరు సాయి కిశోర్ 48
జీవితం : డాక్టర్ ఎడ్ల కల్లేశ్ ......... 52
వేకువ రాగం : స్వప్న మేకల ............ 55
కణాలు : ఏటూరి నాగేంద్రరావు .... 58
స్వర్ణకారుడు : రమేష్ నల్లగొండ .......... 61
అలా మొదలైంది ... : డా. ఎన్.గోపి ............. 65
పరిమళం : డా.డివిజి శంకరరావు ..... 65


## వ్యాసాలు


అలంకార గ్రంథాలు - ఒక పరిశీలన
- డా. ఆర్.కుసుమ కుమారి ....... 10
మధురవాణి - పద్మసాని పాత్రలు : ఒక తులనాత్మక పరిశీలన
- బుక్కే ధనక నాయక్ ............. 14
నీకొచ్చిన భాషలో రాయి.. నీ విముక్తి కోసం రాయి
- ప్రస్థానం ఇంటర్వ్యూలో గద్దర్ 18
మద్యంపై పోరాటం .. కాళ్లకూరి 'మధుసేవ' నాటకం
- డాక్టర్ జోస్యుల కృష్ణబాబు ....... 23
మహానుభూతి కలిగించిన కాలనాళిక
- డా. తిరునగరి శ్రీనివాస్ ....... 28
అధ్యయనం, సాధనతోనే నానీల సృజన
- ఎన్.లహరి ......................... 37
ముఖాముఖి : కవిత్వం జీవధాతువులాగా ఉండాలి!
- ఆచార్య బేతవోలు రామబ్రహ్మం 40
సాహిత్య బాటసారి శారదా నటరాజన్
- దాసరి రామచంద్రరావు .......... 43
వర్తమానం: అభాసు పాలైన అంతర్జాతీయ అభాండం
- తెలకపల్లి రవి ..................... 46
జీవన తాత్వికతను ఒంపుకున్న చిన్ని చిన్ని సంగతులు
- సురగౌని రామకృష్ణ ............. 53
అస్తవ్యస్త వర్తమానంపై ఆవిష్కృతమైన కవిత్వం
- సత్యాజీ ........................... 56
ఎన్ని అవరోధాలు ఎదురైనా ... ధైర్యంగానే ...
- ఎస్ఆర్ పృథ్వి .................. 59
పర్యటన : గాంధీ మెమోరియల్‌లో బాపిరాజు స్మరణ
- నాగసూరి వేణుగోపాల్ ........... 62
డైరీ ................................................ **66**



ISSN No: 2581 - 7477


**సాహిత్య ప్రస్థానం మాసపత్రికను ప్రోత్సహించండి. తెలుగు భాష, సాహిత్య వికాసాలకు మీరూ తోడ్పడండి !**

:: రచనలు, చందాలు, విరాళాలు, మనీ ఆర్డర్లు పంపవలసిన చిరునామా ::

సాహిత్య ప్రస్థానం, ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, తాడేపల్లి - 522501, గుంటూరు జిల్లా. ,
ఫోన్ : 0866-2577248, చందా వివరాలకు : 94900 99057, రచనలకు : 94900 99167
ఇ-మెయిల్ : ssprasthanam@gmail.com, వెబ్‌సైట్ : www.prasthanam.com

1 సంవత్సర చందా రూ. 240 ◆ 5 సంవత్సరాల చందా రూ.1000 ◆ 10 సంవత్సరాల చందా రూ. 2000

Bank A/c Details: A/c Name: PRASTHANAM, SBI, Governorpet, Vijayawada. A/c No. 52001500585, IFSC: SBIN0020343. చెక్కులు, డిడిలపై prasthanam అని రాయగలరు.



- ఉదయమిత్ర
89196 50545

# మన ఊరి సోనూసూద్

"ఊరంతా
భయంకర దృశ్యాలతో
మునిగిపోయిన తర్వాత
అతను నెమ్మదిగా, ప్రశాంతంగా
అంటుకడుతుంటాడు."

– బాల సుధాకర్ మౌళి

ఔటర్ రింగ్ రోడ్డు మీద కారు రయ్యి న దూసుకుపోతోంది. వర్షం వెలిసి ఎండ కొడుతుండడంతో చెట్లు తలార బోసుకున్నట్లున్నాయి. పేరు తెలువని చెట్లు, భాష తెలువని యాసలో పాడుకుంటూ, ఆదివాసి నాట్యంలాగా, లయబద్ధంగా ఊగుతున్నాయి.

❖ ❖ ❖

వెనుక సీట్లో మిత్రులు ఇద్దరు ఏవో రాజకీయాలు మాట్లాడుకుంటున్నారు. వాళ్ళ లోకం వాళ్లది .నేను మెల్లగా డ్రైవర్తో మాటలు కలిపాను

మనం వీళ్లను డ్రైవర్లే అనుకుంటాంగానీ, కడుపునిండా ఎన్నెన్ని కథలో. కదిలిస్తే గాని బయటికి రావు.

"నాయక్ ..నీకు సొంతం కారు ఉండేదట కదా .ఎప్పుడైనా లాంగ్ టూరు పోతుంటివా "అన్నాను మాటల్లోకి దింపుతూ.

"ఓ ..మస్తుగా వోయిన సార్ .తిరుపతి ,తమిళనాడు, కేరళ, కన్యాకుమారి ఇట్లా మస్తు తిరిగిన సార్" అన్నాడు హుషారుగా కారును పోనిస్తూ.

"అమ్మా.. నువ్వు కన్యాకుమారి దాంక పోయినవా .." అన్నాను ఆశ్చర్యంగా

"అవును సార్. ఒకసారి పోయిన." అన్నాడు క్లుప్తంగా.

"అది సరే. ఇన్ని టూర్లు చేసినావ్ కదా. అన్నింటికన్నా నిన్ను బాగాఇబ్బంది పెట్టిన టూర్ ఏది?" నవ్వుతూ అడిగాను.

"కన్యాకుమారి టూర్ సార్." ఠక్కున జవాబు ఇచ్చాడు.

"ఎందుకూ? బాగా దూరం ఉన్నందుకా?"

"కాదు సార్. శవాన్ని తీసుక పోయిన."

ఒక్కసారిగా నాకు దిమ్మతిరిగినట్టయింది.

"శవాన్నా. శవాన్ని తీసుకపోవుడు ఏంది?" అడిగాను.

వెనుక మా మిత్రులు ఇవేమీ పట్టించుకున్నట్టు లేదు. వాళ్ల లోకంలో వాళ్ళు న్నారు.

"అదంతా పెద్ద కథ సార్. నేను హైదరాబాదులో మల్కాజి గిరిలో ఉంటుంటి. ఒక రోజున మా పక్కింటాయన వచ్చి కన్యాకుమారి ట్రిప్పు పోవాలన్నాడు. ఎందుకు, ఏమిటి అని అడగకుండా సరే అన్నాను. బాగా పైసలు వస్తాయని ఆశ వడ్డ."

"కన్యాకుమారికి ఎందుకు?"

"అదే సార్, అసలు కథ. వాళ్ళింట్లో వాళ్ల తండ్రి సావు బతుకులల్ల ఉన్నడంట. వాళ్ళ సొంత ఊరు కన్యా కుమారట. తాను సొంతూరులోనే చావాలనీ, అక్కడనే బొంద పెట్టాలనీ ముసలాయన ఆఖరి కోరికనట."

"ఓహెూ"

"బయలుదేరేటప్పుడు ముసలాయన మంచిగనే ఉన్నడు

సార్. మధ్యకు పోయినంక 'రప్'మన్నడు. మధ్యల వొదిలి రాలేం కదా సార్. తప్పనిసరి శవాన్ని తీసుక పోవాల్సి వచ్చింది సార్."

"శవంతో జర్నీ.చేసినవా.. ఏమనిపించలేదా?"

"తొలుత భయమనిపించింది. తర్వాత అలవాటయింది. ఎనక సీట్ల శవాన్ని కూసోబెట్టి, కొడుకు కోడలు చెరో పక్కన పట్టుకుని కూసున్నరు. ముందర నేను బండి నడుపుతున్న. ఎన్క సీట్ల శవమున్నది."

"ఇంతకూ కొడుకు కోడలు సంగతేంది. మస్తు పరేషాన్ అయి ఉంటరు గదా.."

"వాళ్లా.. హూ.. పక్కన శవం పెట్టుకొని ప్రశాంతంగ ఉన్నరు సార్. మధ్యన రెండుసార్లు కారు ఆపి, శవాన్ని సీట్ల కూకుండబెట్టి, ప్రశాంతంగా టిఫిన్లు, ఛాయలు కానిచ్చిన్రు. నన్ను తినమన్నరు గాని నాకు మనసొప్పలే. సొంత తండ్రి చచ్చిపోతే కొడుకుకు ఏ ఫీలింగ్ లేదు సార్. ఎప్పుడు కన్యా కుమారి చేరుదమా. ఎప్పుడు బొందపెట్టి చేతులు దులుపుకొని, హైదరాబాద్ చేరుకుందమా అన్నట్టున్నరు సార్"

ఒక కొత్త అనుభవాన్ని, ఒక కొత్త దృశ్యాన్ని, ఒక కొత్త వాస్తవాన్ని అతను నా ముందు పరుస్తున్నాడు. శవాన్ని కార్ల పెట్టుకొని వందలాది మైళ్ళు ప్రయాణం చేయడమా. అందులో అది పరాయి శవం. ఒళ్ళు గగుర్పొడిచే విషయం. ఏదో 'హిచ్ కాక్' సినిమా చూస్తున్నట్టనిపించింది.

❖ ❖ ❖

ఎప్పుడో జరిగిన సంఘటన యాది కొచ్చి కలుక్కుమంది. మా మిత్రుడి తండ్రి చనిపోతే, సమయానికి ఎవరు లేకపోవడంతో నేను బాడీని ఆటోలో తీసుకురావాల్సి వచ్చింది.

ఆ సీను తలుచుకుంటే, ఇప్పటికీ భయమేస్తది. ఆటోలో ముందు సీట్లో నేను. వెనుక సీట్లో శవం. ఆ మూడు కిలో మీటర్లు, మూడు వందల కిలోమీటర్లు ప్రయాణం చేసినట్టు అయింది. ఎగుడు దిగుడు గుంతల్లో ఆటో పడుతూ లేస్తూ పోతుంటే, శవమెక్కడ పడిపోతుందోనని విపరీతంగా భయపడి పోయాను. ఆ నిశ్శబ్దం, ఆ చీకటి ఇప్పటికీ నన్ను వెంటాడుతై.

ఇది జరిగి చాలా కాలమైనా, ఇప్పుడు యాది కొస్తే చెమటలు పట్టినట్టు ఉంటది. ఒక్క మూడు కిలోమీటర్లకే నేను అంత టెన్షన్ పడితే, ఈ మనిషి ఆరొందల కిలోమీటర్లు శవాన్ని ఎలా తీసుకుపోయి ఉంటాడో.. అంతుబట్టని విషయం. ఈ మనిషిలో ఏదో మతలబు ఉంది.

❖ ❖ ❖

ముస్లిములు శవపేటికను మోయడం అనేది పుణ్యకార్యంగా భావిస్తారట. హిందువుల్లోనూ కొన్ని కులాల్లో ఆ భావన ఉంటుంది. "శవాన్ని మోస్తే పుణ్యమొస్తది రా" అని మా తాత అంటుండేవాడు.

ఈ నాయక్ కూడా అంతేనా. ఇదేదో పుణ్యకార్యంగా భావించి ఉంటాడా.. ఏమో!

❖ ❖ ❖

"నమ్మబుద్ధి కావడం లేదు" అన్నాను కిటికీ అద్దంలోంచి బయటికి చూస్తూ.

కారు ఔటర్ రింగ్ రోడ్డు మీద నుంచి శంషాబాద్ దగ్గర మలుపు తిరిగి, హైవే మీదకి వచ్చింది. కారు నడపడంలో నాయక్‌కు మంచి అనుభవమున్నట్టుంది. ఎటువంటి బెదురు లేకుండా కారు నడుపుతూ, మాతో హుషారుగ మాట్లాడుతున్నాడు.

వెనుక ఉన్న మిత్రులలో కదలిక ఏదో వచ్చినట్టుంది. వాళ్లూ మా సంభాషణలో గొంతు కలిపారు.

"అయ్యో సార్. మీరు దీనికే ఆశ్చర్యపోతున్నారు. కరోనా టైంలో ఇతను ఎన్ని సాహసాలు చేసిండో.. చెప్పు నాయక్ చెప్పు." అన్నాడు ఒక మిత్రుడు. అతడు నాయక్‌కు గురువు కావడం వల్ల కాస్త చొరవగానే ఉంటాడు.

"అవునా" నేను నోరెళ్ల బెట్టాను.

"అవును సార్. ఓ ఇరవై మందిని, కరోనాబారినుండి కాపాడి ఉంటాడు. ఓ పది కరోనా శవాల్ని తన ఆటోల తీసుకొచ్చి బంధువులకు అప్పజెప్పి ఉంటాడు." అన్నాడు మా మిత్రుడు కొనసాగింపుగా.

"నిజమా.. నాయక్." అని ఆశ్చర్యంగా అతని వైపు చూశాను సుమారుగా పాతికేళ్లుంటాయి. బక్క పల్చగా, అతి సామాన్యంగా కనిపించే మనిషి, ఇట్లాంటి అసాధ్యమైన పనులు చేసిండా అనిపించింది.

"అప్పట్లో నాకొక ఆటో ఉండేది సార్. ఎవరికైనా కరోనా వస్తే మస్తు భయపడి పోయేవాళ్ళు. సరిగ్గా ఆ సమయంలో మా పెదనాయినకు కరోనా వొచ్చింది. చెట్టంత మనిషి. కరోనా వచ్చి వొంగిపోయిండు. "నన్నెక్కడికన్నా దవఖానకు తీసుక పోరా" అన్నడు ఏడ్చుకుంటూ. కరోనా సంగతి తెలిసి మా పెద్దమ్మ రాత్రి రాత్రే, ఆయనను ఇంట్ల ఒక్కడిని ఇడ్సిపెట్టి తల్లిగారింటికి పారిపోయింది. నాకేమో మా పెదనాన్న అంటే పానం నన్ను చిన్నప్పటినుంచి ఎత్తి దించిండు. నన్ను సాది సదివిపిచ్చింది ఆయనే." గొంతుగద్గదమైంది. కాసేపు మౌనం.

"తర్వాతేం జరిగింది?"

"నేను నా ఆటో తీసుకొని, మా పెద్దనాన్నను ఆటోలో కూసోబెట్టుకొని, సరాసరి గాంధీ దవఖానకు తీసుకుపోయిన. అక్కడ షరీకు చేయించి, ఏవో కాగితాలు అడిగితే తీసుకురానీకే

మల్ల ఇంటికి వొచ్చిన. మరుసటి రోజు పోయేసరికి మనిషి బెడ్ మీద లేడు.

"ఏమైంది?"

"తెలువదు సార్. మస్తు పరేషానైన. అక్కడ ఇక్కడ దిరిగిన. అక్కడున్న అటెండర్‌లను అడిగితే మార్చురీల చూడమన్నరు. అక్కడ మా పెద నాయినశవమై కనపడ్డడు. ఎవరిని ఏమి అనేటట్టు లేదు. కరోనా కాలం. డాక్టర్‌ని అడిగితే, కరోనా శవాన్ని ఇచ్చేది లేదని చెప్పేసింది. నేను డాక్టరమ్మను బతిమిలాడి బామాలి ఒప్పించి శవాన్ని ఊరికి తీసుకుపోయిన."

"మరి ఊరి వాళ్ళు ఏమి అనలేదా"

"మస్తు లొల్లి అయ్యింది సార్. బాడీని ఊర్లకు తేవొద్దన్నరు. తెస్తే ఊర్లో కెల్ళి మమ్ములను ఎల్ల గొడుతమన్నరు. చానా కొట్లాటలు అయినయి. ఆఖరికి నలుగురు పోరల్ని పట్టుకొని స్మశాన వాటికల బొందపెట్టినం."

కరోనా కాలంలో గజగజ వొణికే మనుషుల మధ్యన, భయంలేని ఒక నూతన మానవుడు నా ముందు ఆవిష్కరించ బడుతున్నాడు. ఇతనికి బతుకు పట్ల తీపి లేదా?

"ఆ తరువాత ఏం జరిగింది?"

"ఈ సంగతి చుట్టుపక్కల ఊర్లల్ల తెలిసింది సార్. కరోనా సోకిందంటే చాలు. మెల్లగ నాకు ఫోను చేసేటోల్లు. ఫోన్లోనే బతిమి లాడేటోల్లు. ఏడ్చేటోళ్లు. నేను ఆలోచన చేయకుండా వెంటనే ఆటో తీసుకొని ఆ ఊరికి పోయి మనిషిని తెచ్చి దవాఖాన్ల చేరిపిస్తుంటి. బతికితే మనిషిని తెచ్చి అప్పగిస్తుంటి. చనిపోతే శవాన్ని అప్పగిస్తుంటి. శవాన్ని పూడ్చనీకె ఇంట్లో భయపడితే, నేనే నలుగురిని కూడగట్టి, సావు సందం చేస్తుంటి"

"మరి డబ్బులు?"

"ఎంతిస్తే అంత. మనిషి పానం ముఖ్యం కదా సార్. నాకా సమయంలో వాళ్ళ ఏడుపు ,వాళ్ళ ఫ్యామిలీ తప్ప మరేమీ కనబడేది కాదు మీరు నమ్మరు గాని, దయ్యం పట్టినట్టే తిరుగుతుంటి. 'ఆటో నాయక్' పేరు బాలానగర్ మండలంలో అందరికీ తెలిసిపోయింది సార్."

"అది సరే. మీ ఇంట్లో మీ భార్యాపిల్లలు, అమ్మానాన్నలు ఏమి అనేటోళ్లు కాదా"

"అదృష్టం సార్. ఏమీ అనేటోళ్లు కాదు. నా భార్య కూడా నన్ను అర్థం చేసుకునే మనిషి దొరికింది. నేను చేస్తున్నది మంచి పని అనే ఉద్దేశంతో అందరూ నాకు సాప్దారి (మద్దతు) ఇచ్చేటోళ్లు."

"అది సరే. నీకు గాని, నీ కుటుంబ సభ్యులకు గానీ ఎవరికీ కరోనా రాలేదా?"

"దేవుని దయవల్ల ఎవరికి రాలేదు సార్. అసలు నేను ఇంట్లో ఉంటే గదా రావడానికి"

"నమ్మ బుద్ధి కావడం లేదు, నాయక్."

"మీకే కాదు సార్. చెబితే ఎవరూ నమ్మరు. గప్పాలు కొడుతున్నరనుకుంటరు"

"మరి నువ్వు కరోనా పేషెంట్లను తీసుకుపోయి, వాపసు తెస్తుంటే మీ ఊరు వాళ్ళు లొల్లి పెట్టలేదా"

"అయ్యో సార్. మస్తు లొల్లులు అయినయి. నన్ను ఊర్లకు రావద్దన్నరు. వస్తే కాళ్లు ఇరుగగొడతమన్నరు. ఇల్లు ఖాళీ చేయిస్తమని అన్నరు"

"మస్తు అవస్థలు పడ్డట్టున్నావు కదా"

"అవును సార్. రాత్రి 11 గంటలకు ఊరు బయట చెట్లల్ల ఆటోను వెట్టి, చెప్పులు చేతుల వట్టుకొని పిల్లిలాగా ఇంటికి వొచ్చెటోడిని. మల్ల తెల్లారుజామున ఎవరు లేవకముందే ఇండ్లకెల్లి బైలెల్లి పోయేటోన్ని"

"నీ మీద కంప్లైంట్ చేయలేదా ఎవరు"

"ఎందుకు చేయలేదు సార్. మావార్డ్ మెంబర్, మా బామ్మర్దే నా మీద పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ ఇచ్చిండు. పోలీసులొచ్చి నా ఆటో గుంజుకుపోయి బాలానగర్ స్టేషన్లో పెట్టుకున్న."

"అమ్మా.పోలీస్ స్టేషన్ దాకా పోయిందన్నమాట సంగతి"

"అవును సార్. రెండు మూడు రోజులు, నా ఆటో స్టేషన్ లోనే ఉండిపోయింది. ఆ తర్వాత నేను స్టేషన్కు పోయి లొల్లి పెట్టుకున్న. నేను చేసిన తప్పేంది అన్న. మీరు ఆటో గుంజుకొస్తే నా బతుకేట్ల అన్న. అదన్న ఇదన్న. చివరకు స్టేషన్లో ఓ పెద్దాయనకు నేను చేస్తున్న పనినచ్చి, నా మాటలు నచ్చి నా ఆటోను విడిపించి నా చేతిలో పెట్టిండు"

❖❖❖

ఆ కాలంలో సోనూసూద్ లాంటి సెలబ్రిటీ ల గురించే మీడియా చెప్పుకొచ్చింది కానీ ఇట్లాంటి అనామకులు కూడా కరోనాకాలంల ముందుకు వచ్చారని, మనుషుల్ని ఆదుకున్నారని ఎక్కడా చెప్పలేదు.

**'ఏ అక్షరము రాయదు**

**ఏ కుంచె బొమ్మ గీయదు"**

❖❖❖

కారు వేగంతో నా ఆలోచనలు కదులుతున్నాయి .ప్రశ్నలు పుట్టలు పుట్టలుగా వస్తున్నాయి.

"ఎంతమందిని కాపాడినవ్ నాయక్."

"ఇరవై మందికి పైననే కాపాడిన సార్. ఓ పదిమంది పానాలు పోయినయి. దవాఖాన్ల వరండాలల్ల శవాలను పడేస్తే ఇంటోళ్లు తీసుకుపోవడానికి భయపడేవాళ్లు. మనం దిల్ కీరాజా. ఎవరికి భయపడలేదు. వాళ్లను నా ఆటోలనే తెచ్చి

ఊర్లకు చేరుస్తుంటి.. "

"ఆటోల తెచ్చేటప్పుడు ,ఎవరైనా సాయం చేస్తుండి రా."

"అందరూ భయపడేటోల్లు సార్ .బంధువులే దగ్గరికి రాకపోతే వేరేవాల్లు ఎందుకొస్తరు సార్ .శవాన్ని ఎనక సీటుకు కట్టేసి నేనే రాత్రిపూట ఆటో నడుపుకుంటూ వచ్చేటోడిని. "

❖❖❖

మాటలకు అందని అనుభూతి. ఒక గొప్ప కవిత చదువు తున్నట్టు, ఒక గొప్ప దృశ్యం చూస్తున్నట్టు, ఒక గొప్ప పాట వింటున్నట్టు అనిపించింది. ఇవేవీ పట్టని నాయక్, కారు నడిపిస్తూ తన ధోరణిల చెప్పుకుపోతున్నాడు.అతడి ముందు నేను మరుగుజ్జునై పోతున్న భావన.

తల్లిని కొడుకు, కొడుకు తల్లిని, భార్యను భర్త, భర్త భార్యను నమ్మని పాడు కాలం. శవాలు సైతం అనాథ శవాలవుతున్న కాలం. మనిషి తన నీడను చూసి తానే భయపడే కాలం. సర్కారు చేతులెత్తేసి ప్రజల్ని వాళ్లమానానికి వాళ్లను వదిలేసిన కాలం. ఎటు చూసినా ఒక నిస్సహాయ స్థితి. మనిషి కల్లోల సముద్రంలో కొట్టుకుపోతున్న ఒంటరి జీవిలా ఉన్నాడు. అట్లాంటి సమయాన ఏ పుస్తకాలు చదవని పల్లెటూరు మనిషి, తానే ఒక పుస్తకమై పర్చుకొని, మనల్ని చదవమంటున్నాడు.

**"విధ్వంసాల మధ్య**

**నిశ్చల దీపం అతడు"**

❖❖❖

నాకు కరోనా వచ్చినప్పటికీ దుర్భరస్థితి యాదికొచ్చింది. కరోనా సంగతి తెలిసినంక బంధువులు, స్నేహితులు ఒక్కరొక్కరు మాయమయ్యారు.పలకరించడం కాదు కదా, కనీసం ఫోన్ కాల్ కరువైంది. ఒక్కసారి మాత్రం ఓ డాక్టరు, ఇద్దరు ఆశా వర్కర్లు మొక్కుబడిగా చూసి వెళ్లారు. తర్వాత పత్తా లేరు.

బంధువుల సంగతి సరే సరి. అన్నీ తెలిసి తెలువనట్లే నటించారు. ఫోన్ చేస్తే, ఎక్కడ కరోనా సోకుతుందో అన్నట్లు మిన్నకుండిపోయారు. కొందరైతే "పోతానేమో"నని "తనకి ఇష్టం వచ్చిన తిండి పెట్టమని" ఉచిత సలహాలు ఇచ్చి మరింత భయపెట్టారు. సముద్రంలో నీళ్ల కోసం వెతికినట్టు అందరూ ఉండి ఒంటరినయ్యాను

బంధువులు, స్నేహితులు పరాయి వాళ్ళయిన చోట, నిజ బంధాలను నిర్వచిస్తూ ఇక్కడొక 'ఆత్మబంధువు' పరిచయ మవుతున్నాడు. సాధారణ మానవుల్లో ఒక అసాధారణ మానవుడిని చూస్తున్నాను.

❖❖❖

దేశ విభజన సమయంలో, మతాలవారీగా మనుషులు, ఒకరినొకరు నరుక్కు చంపు కుంటున్నప్పుడు, సాధారణ మానవులు సైతం ఎంత మానవీయంగా స్పందిస్తారో, సాదత హసన్ మంటో తన కథల్లో గొప్పగా చూపిస్తాడు.

ఇక్కడ నేను ఆ మనిషిని స్వయంగా చూస్తున్నాను .

❖❖❖

సంధ్య వేళ.

కారు దాబా దగ్గర ఆగింది. అక్కడి నుంచి అతను తన ఆటోను తీసుకొని తన ఊరికి వెళ్ళిపోతాడట.

దాబాలో అందరూ మాటల్లో మునిగి ఉన్నారు. చల్లగాలి ప్రేమగా నిమిరి పోతోంది. చుట్టుపక్కల పచ్చని గడ్డి, తల్లి మనసులా పరుచుకుని ఉంది. అందమైన సీతాకోకలు తంగేడు కొమ్మల మీద వాలి కొమ్మలకే అందాన్నిస్తున్నాయి.

నేను నాయక్ నే గమనిస్తున్నాను. అతడు ఏమి పట్టనట్టు టీ తాగుతూ, ఎవరితోనో ఫోన్లో మాట్లాడుతున్నాడు.

**కరోనా భయాన్ని జయించిన మనిషి**

**మరణ భయాన్ని జయించిన మనిషి**

**అనుబంధాలకు నిర్వచనం ఇచ్చిన మనిషి**

**ఆగామి యుగాల అనాది గీతం**

**అజేయ మానవుని సూక్ష్మ రూపం..**

❖❖❖

కథ సినిమా లాగ మొదలై, జీవితంలాగ ముగిసింది.

"ఇన్నిన్ని సాహసాలు చేశావు కదా. ఇప్పుడు మీ దోస్తులు కలిస్తే అప్పటి పాత విషయాలు యాది చేస్తరా" అన్నాను వీడుకోలు తీసుకుంటూ.

"మస్తు యాది చేస్తరు సార్. నన్ను మా ఏరియాల 'బాలానగర్ సోనూసూద్' అంటరు సార్" అన్నాడు ముసి ముసి నవ్వులు నవ్వుతూ.

నిర్మలమైన సెలయేటి నవ్వు. పసిపాప లాంటి నవ్వు

❖❖❖

"పొయ్యొస్త సార్" అన్నాడు.

"గొప్పోడివయ్యా" అంటూ అతడిని మనసారా కౌగిలించు కున్నాను. అతను వెళ్ళిపోయాడు.బాట ఖాళీ అయింది. అయితేనేమి? నా మనసంతా నిండిపోయాడు

**"చంద్రుడుతోనే మనం**

**మనతోనే చంద్రుడు**

**వెన్నెలెప్పుడు / మాసి పోదు"** ■

■ **ఈ కథకు మూలాధారమైన 'దశరథ్ నాయక్'కు అంకితం.**

■ **ఈ కవితా చరణాలు బాల సుధాకర్ మౌళివి.**



## పాట ఆగదు.. నది ఎండదు

**మూ**గబోయిన గజ్జెల కోసం
మడమ తిప్పని పాదాలు కదిలివొస్తాయి
చిరిగిన రుమాలు ధరించ నీకే
ఎదిగిన భుజాలు ఎదురొస్తాయి
విరిగిన కర్రను సరిజేయనీకె
వొంగని వెన్నెముకలు సిద్ధమవుతాయి
జీవాక్షరాలు జీవం పోసుకు
వేదికలో మీద తాండవమాడుతాయి

ఎక్కడికి పోతావయ్యా!

లేఎండల సౌకుమార్యంలోనూ
పసి పిల్లలు నవ్వుల్లోనూ
గిరిజనుల విల్లంబుల్లోనూ
యూనివర్సిటీల నినాదాల్లోనూ
పోటెత్తిన వీధుల్లోనూ
నియంతల నిలదీసే
పదునెక్కే కాలంలోనూ
నిన్ను పోల్చుకుంటూనే ఉంటాం

పాటిక్కడ ఆగిపోతే
కొండల్లో అడవుల్లో
మారుమోగుతది
పాటుంటది, నువ్వుంటవు
పాటున్నంత దాకా నువ్వుంటవు!

**- నారమోని యాదగిరి**



## కవి పుట్టిన సమయం

**సూ**ర్యుడు రక్తవర్ణాన్ని ధరించి
మండు వేసవై
నిప్పులు కురిపిస్తున్నపుడా ...
పున్నమి చంద్రుడు
కిటికీలోంచి ఇంట్లోకి పాకుతూ
దేహాల్లో వేడిని రగిలిస్తున్నపుడా ...


మొక్క పుప్పొడి తుంపరలను చల్లుతూ
ఫక్కున ఉదయాన్నే నవ్వినపుడా...
నది పరవళ్ళ పల్లవులతో
పుడమి గొంతులోంచి
నీటిపాటై ఉబికినపుడా ...

మేఘం చినుకుపాదాల అల్లరితో
కొలనులో కలువను
వికసింపజేసినపుడా ...
రాత్రీపగళ్ళ గోడలను చాటు చేసుకుని
కాలం దోబూచులాట ఆడినపుడా ...

లేక ఇవన్నీ కలబోసుకున్న
జీవితపు అంచుల్లో
వాక్యాల కలనేత చీరను
మృదువుగా నేస్తున్నపుడా ...

ఎపుడంటారు
కవి పుట్టిన సమయం?
కవిత ఆ పెదవులను
ముద్దాడిన సొగసైన క్షణం!

**- పద్మావతి రాంభక్త**



# అలంకార గ్రంథాలు ఒక పరిశీలన

- డాక్టర్ ఆర్.కుసుమ కుమారి
తెలుగు సహాయ ఆచార్యులు (HOD),
డా॥వి.యస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ & పి.జి. కళాశాల,
విశాఖపట్నం
99636 25639.

**కా**వ్యానుశీలనం చేసే శాస్త్ర గ్రంథాలను కావ్యశాస్త్రాలని, సాహిత్యశాస్త్రాలని అంటారు. వీటికే అలంకార శాస్త్రాలని ప్రచారంలో ఉన్న పేరు. వీటిలో కావ్య సంబంధమైన చర్చలు ఉంటాయి కాబట్టి వీటిని దివ్య విమర్శనా గ్రంథాలని కూడా అనవచ్చు. ఇంకా వీటిల్లో లక్షణాలు, లక్ష్యభూతంగా కావ్యాల సమీక్షలు ఉండటం చేత వీటిని లక్షణ గ్రంథాలని కూడా అంటారు.

అయితే కావ్యాల సాధుత్వాసాధుత్వాలను నిర్ణయించ టానికి, పెడమార్గాన్ని పట్టే కవిత్వాన్ని సంరక్షించటానికి విమర్శన, లక్షణ రూపాలైన కావ్యశాస్త్రాలు ఉదయించాయి. ఈ గ్రంథాలు కేవలం లక్షణాలను చెప్పేవే కాకుండా కావ్య సమీక్షలు కూడా చేయబడేవిగా కూడా ఉంటాయి. వీటిలో కవిత్వదోషాదులు, కవిత గుణాలంకార రసాదులు, కవి ప్రతిభాదులు చర్చించబడి ప్రాచీన కాలంలో కావ్య విమర్శలు జరుగలేదనే లోటును ఈ అలంకార శాస్త్ర గ్రంథాలు తీరుస్తున్నాయి.

**లక్షణాలు :** అతి ప్రాచీనమైన కాలంలోనే అలంకార శాస్త్ర గ్రంథాలు రచించబడ్డాయి. అలంకార శాస్త్రాల్లో ప్రధానంలో చర్చించబడే అంశాలు : కావ్యనాటక లక్షణాలు, కావ్య సిద్ధాంతాలు, కావ్యభేదాలు, నాయికా నాయక లక్షణాలు. రసవి ప్రముఖ అలంకారికుల గ్రంథాల్లోని విషయాలు చూద్దాం. రూపణం, కావ్యగుణ దోషాలు, శబ్దశక్తులు, అలంకారాదులు మొదలైనవి.

**భరతుని నాట్యశాస్త్రం:** అలంకార శాస్త్ర గ్రంథాల్లో మొదటిది భరతుని నాట్యశాస్త్రం. ఇది సూత్ర, భాష్య, కారికలు అనే మూడు రూపాల్లో ఉంది. దీనిలో 600 శ్లోకాలున్నాయి. అక్కడక్కడ గద్యం కూడా ఉంది. దీనిలో నాటకోత్పత్తి, నాటక భేదాలు, వాటి లక్షణాలు, నృత్యం, అభినయ విధానాలు, నాటకాల్లోని భాష, సంవాద స్వరూపం, ఇతివృత్త విధానం, గాయనవాదనలు, నాయికా నాయక లక్షణాలు, రస నిష్పత్తి, రసస్వరూపం, ప్రేక్షకులు, నాట్యశాలల నిర్మాణ పద్ధతులు, రంగస్థలం, రంగాలంకరణలు మొదలైనవి చర్చించబడ్డాయి. తర్వాత వచ్చిన అలంకార శాస్త్ర గ్రంథాలకు ఇది ఉప జీవ్య గ్రంథంగా ఏర్పడింది. నాట్యకళా విజ్ఞానమంతా చెప్పబడిన ఈ గ్రంథానికి నాట్యవేదం అని కూడా పేరు ఉంది. భరతుని నాట్యశాస్త్రమే పండిత జనాదరణ పొంది అధిక ప్రచారంలో ఉంది. ఆయా కాలాల్లో ప్రక్షిప్తాలను తనలో చేర్చుకుంటూ నశించకుండా నిలిచింది.

**భామహుడు – కావ్యాలంకారం :** ఇప్పుడు లభ్యమయ్యే అలంకార శాస్త్ర గ్రంథాల్లో నాట్యశాస్త్రం తర్వాత కావ్యాలంకా రమే మొదటిది. శ్రవ్యకావ్య స్వరూప లక్షణాలను చర్చించే కావ్యశాస్త్ర గ్రంథాల్లో ఇది ప్రప్రథమమైంది.

భామహుని కావ్యశాస్త్రంలో ఆరు పరిచ్ఛేదాలున్నాయి. ప్రథమ పరిచ్ఛేదంలో కావ్య ప్రయోజనాలు, కావ్య హేతువులు, కావ్య లక్షణాలు, కావ్య భేదాలను గురించి చర్చించారు. ద్వితీయ పరిచ్ఛేదంలో గుణ, అలంకారాలు వివరించారు. తృతీయ పరిచ్ఛేదంలో గత పరిచ్ఛేదంలోని అలంకారాల్లో మిగిలినవి వివరించారు. చతుర్థ పరిచ్ఛేదంలో తర్కశాస్త్రం ఆధారంగా, షష్ఠ పరిచ్ఛేదంలో వ్యాకరణం ఆధారంగా దోషాలను వివరించారు. అలంకారాలను, దోషాలను గూర్చి భామహుడు ఎక్కువ వివరించటం చేత అతని దృష్టిలో కావ్యం దోషాలను పరిహరిస్తూ, శబ్దశుద్ధి కలిగి అలంకారయుక్తమై ఉండాలని

తెలుస్తుంది. దీనిలో మొత్తం 400 కారికలున్నాయి.

భామహుడు దృష్టిలో శబ్దార్థాలే కావ్యం. అందులో వైచిత్రి, వక్రోక్తితో కూడిన అర్థ సంయోజనం కావ్యానికి అవసరమని అతడు తలంచాడు. అందుకే వక్రోక్తి మూలతత్త్వంగా కలిగిన అలంకారాలు కావ్యానికి అవసరమని గుర్తించాడు. కావ్యం దోషరహితంగా, గుణసహితంగా ఉండాలని అతని అభిప్రాయం. రసాన్ని భామహుడు రసవదలంకారంగా గుర్తించి వివరించాడు. దీన్నిబట్టి అలంకారమే కావ్యానికి ప్రధానమని, దృశ్య కావ్యంలో వలె శ్రవ్యకావ్యానికి రసం ప్రధానం కాదని అతని అభిప్రాయమైనట్లు తెలుస్తోంది. భామహుడు 36 అర్థాలంకారాలను, 2 శబ్దాలంకారాలను వివరించాడు. ప్రసాదమాధుర్య ఓజో గుణాలను పేర్కొని, ప్రసాద మాధుర్య గుణాలు శ్రేష్ఠమైనవిగా అంగీకరించాడు.

**దండి - కావ్యదర్శం :** దండి అలంకార శాస్త్ర గ్రంథం పేరు కావ్యాదర్శం. కావ్యాదర్శానికి అలంకార శాస్త్ర గ్రంథాల్లో విశేష స్థానం ఉంది. అగ్ని, పురాణం, కావ్యాలంకారాల తర్వాత కావ్యాదర్శమే లభ్యమయ్యే అలంకార శాస్త్ర గ్రంథం. కావ్యాదర్శంలో మూడు పరిచ్ఛేదాలున్నాయి. ప్రథమ పరిచ్ఛేదం లో కావ్య పరిభాష కావ్య భేదాలు, మహాకావ్య లక్షణాలు, గద్యకావ్య భేదాలు వివరించబడ్డాయి. ద్వితీయ పరిచ్ఛేదంలో 35 అర్థాలంకారాలు సోదాహరణంగా వివరించబడ్డాయి. తృతీయ పరిచ్ఛేదంలో యమక భేదాలు, చిత్రబంధాలు వివరించారు. తర్వాత విస్తారంగా దోష నిరూపణ జరిగింది. కావ్యాదర్శంలో మొత్తం 360 శ్లోకాలున్నాయి. దండి విశేషంగా అలంకార గుణరీతుల వివేచన చేశాడు. దోష నిరూపణను విస్తారంగా చేసి కవిత్వంలో గుణాల ప్రాధాన్యాన్ని ఎత్తి చూపాడు. అందుచేత అతడు గుణ సిద్ధాంతవాది అని కొందరు విశ్వసించారు. అలంకార వివేచనను కూడా చాలా వివరంగా చేశాడు. మొత్తమ్మీద ఆయన్ని గుణాలంకారవాది అని చెప్పవచ్చు. దండి రసాన్ని అలంకారంగానే అంగీకరించాడు. శ్రవ్యకావ్యంలో ఉక్తివైచిత్రికి, గుణాలకు ప్రాధాన్యమని, వాటి చేత అది పఠనీయం అవుతుందని దండి అభిప్రాయం. దోష రహితత్వం కూడా చాలా ముఖ్యమని గ్రహించి భామహుని వలెనే దోష నిరూపణకు ప్రాధాన్యమిచ్చాడు. కావ్యాన్ని దండి ఒక వ్యక్తిగా దర్శించాడు.

**రుద్రభట్టు- శృంగారతిలకం :** శృంగారతిలకంలో నాయికా నాయకుల భేదాలు, రసాలంకార నిరూపణలు చేశారు. దీనిలో మూడు పరిచ్ఛేదాలున్నాయి. శృంగార, కరుణ, వీర అద్భుత, శాంత, హాస్యాది నవ రసాల వివరణ ఉంది. నాట్యశాస్త్రంలో రూపక సంబంధి రసవివేచన చేయబడింది. రుద్రభట్టు కావ్యసంబంధి రసవివేచన చేశాడు. విశేషంగా శృంగార రసాన్ని వివరించి, అది నాయక రసంగా అంగీకరించాడు. రసవిహీనమైన వాణి నీరసమైందని రుద్రభట్టు అభిప్రాయం.

**ఆనందవర్ధనుడు- ధ్వన్యాలోకం :** ఆనందవర్ధనుని 'ధ్వన్యాలోకం'కు 'కావ్యాలోకం' అని కూడా పేరు. ధ్వన్యాలోకం ప్రౌఢమైన మౌలిక గ్రంథం. కావ్యాశాస్త్రాల్లో ఒక కొత్త మలుపును తెచ్చిన గ్రంథం ఇది. దీనిలో 129 కారికలున్నాయి. వీటికి ధ్వనికారికలని పేరు. ఈ కారికలకు వ్రాయబడిన వృత్తి పేరు ధ్వన్యాలోకం. ఈ ధ్వన్యాలోకానికి 150 సంవత్సరాల తర్వాత అభినవ గుప్తుడు లోచమనే వ్యాఖ్యానం వ్రాశాడు.

పూర్వ విద్వాంసులు కావ్యాత్మధ్వని అని పేర్కొన్నారు. కొందరు దాన్ని లక్షణాంతర్గతమని అంటారు. కొందరు వాచమగోచరమని అంటారు. సహృదయుల ప్రీతికై నేను దాని తత్త్వాన్ని నిరూపిస్తాను అని చెప్పటం చేత కావ్యాత్మ ధ్వని అని ఆనందవర్ధనుని కన్న పూర్వమే స్థాపించబడిందని, దానితో అంగీకరించని పండితులుండరని తెలుస్తుంది. ఆనంద వర్ధనుడు ధ్వని ఉపస్థితిని, స్వరూప స్వభావ భేదాలను సంపూర్ణంగా వివరించి ధ్వని సిద్ధాంతాన్ని సర్వమాన్యంగా చేసి ధ్వని సిద్ధాంత స్థాపకుడనే పేరు గడించి ఉండాడని ఆధునిక విమర్శకులు అభిప్రాయపడుతున్నారు.

**రాజానక కుంతకుడు - వక్రోక్తి జీవితం :** ఆనందవర్ధనుడు రాసిన ధ్వని సిద్ధాంతానికి ప్రతిగా కుంతకుడు వక్రోక్తి సిద్ధాంతాన్ని స్థాపించాడు. అతని కృతి పేరే 'వక్రోక్తి జీవితమ్' అన్నాడు. ఆరు విధాలైన వక్రోక్తులను వివరించాడు. 1. వర్ణ విన్యాస వక్రత, 2. పద పూర్వార్ధ వక్రత, 3. పదపరార్థ వక్రత, 4.వాక్య వక్రత, 5. ప్రకరణ వక్రత, 6. ప్రబంధ వక్రత. వీటిలోనూ విభేదాలను వివరించాడు. వక్రోక్తి సిద్ధాంతంలో అంతర్గతంగా కావ్య స్వరూపం, కావ్య ప్రయోజనాలు, కావ్య హేతువులు, కావ్య రీతుల గురించి చర్చించాడు. పూర్వాచార్యులు పేర్కొన్న వైదర్భి, గౌడి, పాంచాలీ రీతులను దేశపరంగా పిలవటానికి అంగీకరించక వాటిని సుకుమార, విచిత్ర, మధ్యమ మార్గాలుగా పేర్కొన్నాడు. కాళిదాసాదులు సుకుమార మార్గానికి, బాణ భవభూతులు విచిత్ర మార్గానికి, మాతృగుప్తమయూర రాజాదులు మధ్యమ మార్గానికి చెందిన కవులని వివరించాడు.

**మహిమభట్టు-వ్యక్తివివేకం :** ధ్వని సిద్ధాంతంతో సంతృప్తి చెందక, దానితో అంగీకరించక కొత్త సిద్ధాంతాన్ని స్థాపించిన వారిలో మహిమభట్టు ఒకడు. ఇతని గ్రంథం 'వ్యక్తి వివేకం'. మహిమభట్టు ధ్వని సిద్ధాంతాన్ని ఖండించాడు. ధ్వని అనేది

ప్రత్యేకంగా చెప్పనవసరం లేదని, అది అనుమానాంతర్గమే అని దాన్ని కావ్య సిద్ధాంతంగా వేరే ప్రతిపాదించే అవసరం లేదని మహిమభట్టు మతం. ఇతని మతాన్ని అనుమితివాద మంటారు. 'వ్యక్తి వివేకం' మొదటి ఖండంలో ధ్వని లక్షణాన్ని చెప్పి అది అనుమానంలో అంతర్భవించినట్లుగా వివరించారు. రెండవ ఖంఢంలో అనౌచిత్యాన్ని కావ్యదోషంగా గ్రహించి అనౌచిత్యం రూపం వివరించారు. మూడవ ఖండంలో తిరిగి ధ్వని అనుమానంలో ఎట్లా అంతర్భవిస్తుందో తర్కపూర్ణంగా చెప్పారు.

**ధనంజయుడు - దశరూపకం :** ధనంజయుని కృతి దశరూపకం. ఇది నాట్యశాస్త్ర మీద ఆధారితమైన రచన. నాటక లక్షణాలకు ఇది ప్రామాణికమైన గ్రంథం. ఇందులో నాలుగు ప్రకాశాలు, 300 కారికలు ఉన్నాయి. దీనిలో రూపక భేదాలు, తల్లక్షణాలు, నాయికానాయక భేదాలు, భాషా ప్రయోగంలో నియమాలు, అభినయ భేదాలు, వృత్తులు, రసపోషణ, రస నిష్పత్తి, రస భేదాలను వివరించారు. దశ రూపకానికి ధనికుడు 'అవలోక' మనే వ్యాఖ్య వ్రాశాడు. ధనికుడు ధనుంజయుని సోదరుడని ప్రతీతి. దృశ్యకావ్య లక్షణాల విషయంలో దశ రూపకమే ప్రామాణిక గ్రంథమైంది. ఇది సులభ పద్ధతిలో నాటక లక్షణాలను వివరిస్తుంది. కాబట్టి దశరూపకమే ఎక్కువ అందుబాటులో ఉండి ప్రామాణికంగా నిలిచింది.

**క్షేమేంద్రుడు-ఔచిత్య విచార చర్చ :** క్షేమేంద్రుడు అభినవ గుప్తుని శిష్యుడు, కవి పండితుడు, అలంకారికుడు. వివిధ విషయాల మీద 33 గ్రంథాల వరకు వ్రాశాడు. కవి కంఠాభరణం, ఔచిత్య విచార చర్చ, ఇతని రెండు అలంకార కృతులు. ఔచిత్య విచార చర్చలో క్షేమేంద్రుడు ఔచిత్య ప్రాధాన్యాన్ని ప్రతిపాదించాడు. అనౌచిత్యం కన్న రసభంగ కారణం లేదని, ఔచిత్య ప్రాధానాదులు గుర్తించి ఉన్నారు. దాన్ని తీసుకొని క్షేమేంద్రుడు ఔచిత్యాన్ని ఒక కావ్య సిద్ధాంతంగా నిలబెట్టాడు. శబ్ధ, అర్థ, గుణ, అలంకార రససంబంధమైన ఔచిత్యాలను సోదాహరణకంగా వివరించాడు. అనౌచిత్య దోషాలను చూపేటప్పుడు అతడు ప్రసిద్ధ కవుల కావ్యాల నుంచి కూడా నిర్భయంగా ఎత్తి చూపాడు. ధ్వని సిద్ధాంత ప్రభావం క్షేమేంద్రుని మీద చాలా ఉంది. ఔచిత్యం ఒక కావ్య సిద్ధాంత రూపాన్ని ధరించదని విమర్శకుల అభిప్రాయం. విభిన్న తత్త్వాల మిశ్రణాన్ని మనం ఔచిత్య సిద్ధాంతంలో చూడవచ్చు. ఇది ఒక స్వతంత్రమైన సిద్ధాంతం కంటే ఒక అత్యావశ్యక కావ్యతత్త్వంగా గ్రహించాలి. ఎందుకంటే ఇది ధ్వనిలోనే చివరకు అంతర్భ విస్తుంది.

**మమ్మటుడు - కావ్య ప్రకాశం :** సాహిత్య శాస్త్రం రంగంలో మమ్మటుని కావ్య ప్రకాశానికి ప్రత్యేక స్థానముంది. కావ్య ప్రకాశం పది ఉల్లాసాలుగా విభజించబడింది. 140 కారికలు ఉన్నాయి. తొమ్మిదవ ఉల్లాసంలో శబ్ధాలంకారాలు, పదవ ఉల్లాసంలో అర్థాలంకారాల గురించి వివరించారు. మొదటి ఉల్లాసంలో కావ్య ప్రయోజనాలు, హేతువులు, భేదాలు, కావ్యస్వరూపం వివరించారు. రెండవ ఉల్లాసంలో శబ్ధార్థ స్వరూప నిర్ణయం, శాబ్ధీవ్యంజనను గురించి చెప్పారు. మూడవ ఉల్లాసంలో అర్థీవ్యంజన నిరూపించబడింది. నాల్గవ ఉల్లాసంలో రసాదిధ్వని గురించి వివరించారు. ఐదవ ఉల్లాసంలో వ్యంజనాశక్తి ప్రతిష్ఠాపింపబడింది. ఆరవ ఉల్లాసంలో చిత్ర కావ్య నిరూపణ చేయబడింది. మమ్మటుడు 'తదదోషౌశబ్ధార్థౌస గుణావనలంకృతీ పున:క్వాపి' అని నిర్వచించాడు. దండి వలెనే ఇతడు కావ్యం దోషరహితంగా ఉండాలని, గుణ సహితంగా ఉండాలని చెప్పాడు. 'అనలంకృతీ పున:క్వాపి' అని అలంకారాల భేదాలను విశదంగానే నిరూపించాడు. మమ్మటుని కావ్య హేతువుల, కావ్య ప్రయోజనాల వివేచన చాలా మాన్యయోగ్యంగా ఉంది. మమ్మటుని శబ్ధశక్తుల వివరణ ప్రామాణికమైంది.

**ముగింపు :** అలంకారాలు ఎప్పుడు పుట్టాయి? అంటే ఖచ్చితంగా సమయాన్ని నిర్ణయించి చెప్పటం కష్టం. మానవుడు మాట్లాడటం నేర్చినప్పుడే ఏదో ఒక విధమైన అలంకారం పుట్టి ఉంటుంది. మానవుడు తాను చూసిన, అనుభవించిన వస్తు భావాలను ఎదుటి వానికి స్పష్టం చేసి చెప్పేటప్పుడు, తాను ఏవిధంగా వస్తు భావాలను దర్శించాడో ఆ విధంగానే ఎదుటివాని చేత దర్శింపజేయాలనే కోరికతో తాను వర్ణించి చెప్పే వస్తు భావాలను ఎదుటివానికి అతిపరిచితాలైన వస్తువులతో పోల్చి చెప్పి ఉంటాడు. ఆ పోలికను చెప్పటంతోటే అలంకారావిర్భావం జరిగి ఉంటుంది. ప్రపంచంలోని ప్రతి భాషలో ఏదో ఒక విధమైన అలంకారం ఉంటుంది. గ్రంథస్థమైన అలంకారోదాహరణలు మనకు ఋగ్వేదంలోనే లభిస్తున్నాయి. ఆ తర్వాత బ్రాహ్మణ, ఉపనిషదాదుల్లో, పురాణాదుల్లో అలంకార సృష్టి ఉంది. సాహిత్యంలో ప్రచురంగా ప్రయోగింపబడే అలంకారాలను క్రమబద్ధం, శాస్త్రబద్ధం చేయవలసిన ఆవశ్యకత ఏర్పడి ఉండి ఉంటుంది. అప్పుడు ఉద్భవించినవే పైన చెప్పిన అలంకార గ్రంథాలు, వాటిని రచించిన గ్రంథకర్తలు అని చెప్పొచ్చు. ■


**సాహిత్య ప్రస్థానం**

విలువైన పత్రిక .. విలువలున్న పత్రిక

**చందాదారులుగా చేరండి .. మీ మిత్రులను చేర్పించండి ..!**

# చీలిన పొద్దు

- కంచరాన భుజంగరావు
94415 89602

ఎప్పటికప్పుడు
తలవొంపుల దృశ్యాల్లో
తలమునకలౌతూనే ఉన్నాం
కళ్ళకింది నెత్తుటి మరకల్ని
తుడుచుకోక ముందే
బొమ్మాబొరుసు వాదనలొచ్చి
చూపుల్ని చుట్టేస్తున్నాయ్
సోషల్ మీడియా వ్యూయర్ల లెక్కకు
ఒక సంఖ్యగా నమోదవగానే
నిజమేమిటో తేలని మీమాంసలో
మునిగిపోతున్నాం!

పగలూ రేయీ
పొద్దు రెండుగా చీలుతున్నట్టు
సత్యం ప్రతినిత్యం
రెండు నిజాలుగా దృశ్యమానమౌతుంది
నిజరూప నిజానికి నెత్తురూ కన్నీళ్ళు సాక్షి
నిజమని నమ్మబలికే నకిలీ వాదానికి
వంచక మూకల రహస్య గొంతుకలు సాక్షి
ఎటూ తేల్చుకోలేని పాఠకుడి మనసుకు
ఏ అలలూ పోటెత్తని నిర్లిప్త సముద్రం
ప్రతిబింబం

ఇంటినుండి బయల్దేరి
తిరిగి ఇంటికి చేరేలోపు
ఎప్పుడెక్కడ ఏమి పోగొట్టుకుంటుందో
తెలియక బిక్కుబిక్కుమనే
ఆమెను కదా అడగాలి సత్యమేమిటో ...

దారి పాదాలను నరికేసి
నవ్వమని నడకల్ని బుజ్జగించే
వికృత పోకడల సారం తెలిసిన
నిత్య బాటసారుల్ని కదా
తేల్చమనాలి యథార్థమేమిటో ...

నేల నెత్తుటి రుచి మరిచిపోకుండా
నాలుక చాటున కత్తులు తిప్పే
విద్వేషం ఎవరిదో ఎందుకోసమో



గాయపడిన పావురాళ్ళని కదా
చెప్పమనాలి వాస్తవమేమిటో ..

మీరేంటబ్బా! తెల్లారితే ఒకటే భజన
మీ తప్పెట్లు తాళాలు
సత్యాన్ని ఎలుగెత్తి చాటే
గుండె మంటల ముందు నిలబడతాయా?

మీ అగ్గి అనుకుంటే మీ ఒళ్ళో పోసుకోండి
మాకేం అభ్యంతరం?
దేశాన్నది బుగ్గి చేస్తున్నా
మహా అగ్గి.. దయగల అగ్గి..
దేవదూత లాంటి అగ్గి.. అంటారేం?

మీరెంత పాకంపట్టి వండి వార్చినా
కల్పిత కథనాల కుళ్ళు కూడళ్ళ మీదుగా
రేపటికి భళ్ళున తెల్లారేది సత్యమే!
అబద్ధాన్ని నెత్తిన మోసేవారు అక్షరాలా నేరస్థులే! ■






# పద్మసాని - మధురవాణి
# తులనాత్మక పరిశీలన

- బుక్కే ధనక నాయక్
పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు
8187056010,

**మ**హాకవి గురజాడ అప్పారావు గారి కన్యాశుల్కం నాటకంలో మధురవాణి గొప్ప పాత్ర. ఆమె మానవత్వం కలిగిన వేశ్య. దురాచారాల్ని సహించదు. కన్యావేషంలో ఉన్న శిష్యుణ్ణి లుబ్ధావధానికి కట్టబెట్టి, సుబ్బి పెళ్ళి తప్పించడంలో ఆమె వ్యూహశక్తి మనకి తెలుస్తుంది. పొరుగువారికి సాయపడుతూ, ఈ పాపపు లోకంలో కూడా మంచి ఉందని నిరూపించిన త్యాగజీవి ఆమె. బండి నారాయణ స్వామి గారి నవల 'శప్తభూమి'లో పద్మసాని కూడా అలాంటి ఉదాత్తమైన పాత్ర. ఆమె హండే రాజుకు ఉంపుడుగత్తె, వేశ్య. ఈమె పేదరికంలో ఉన్న బీరప్ప ఇజ్జయినమ్మల పాప ఇమ్మడమ్మను రూ.50 లకు కొని పెంచుకుంటుంది. వేశ్యవృత్తి ఇష్టం లేకపోయినా ఆ కాలంనాటి పరిస్థితులకు లొంగి, ఆ వృత్తిలో జీవనం గడుపుతుంది. తన కొడుకుని ఇంగ్లీష్ చదువులు చదివించి, తనకు హండేరాజు దానం ఇచ్చిన జక్కలూరు గ్రామ మాన్యాన్ని అభివృద్ధి చేసే దిశలో ఆమె ఆస్తి మొత్తాన్ని ధారాదత్తం చేసిన మానవతా మూర్తి. సమాజం నీచంగా చూసే వృత్తిలో ఉన్నప్పటికీ – తమ మానవత్వం పుష్కలంగా ఉందని ఈ రెండు పాత్రలూ నిరూపిస్తాయి.

గురజాడ రచనల్లో కన్యాశుల్కం (నాటకం) అగ్రగణ్యమైంది. కన్యాశుల్కం దురాచారాన్ని విమర్శిస్తూ రచించిన ఈ నాటకం భారతీయ భాషల్లో వెలువడిన అత్యుత్తమమైన రచనల్లో ఒకటి. బండి నారాయణ స్వామి తెలుగు నవలా రచయిత, ఉపాధ్యాయుడు. రాయలసీమ మాండలికాన్ని ఉపయోగిస్తూ రాజకీయ, ఆర్థిక, సాంఘిక అరాచకాలను వివరిస్తూ ప్రజల మధ్య సామాజిక స్పృహను, చైతన్యాన్ని పెంపొందించే విధంగా రచనలు చేస్తున్నారు. నారాయణ స్వామి గారి నవలల్లో శప్తభూమి నవల అత్యంత ప్రాముఖ్యమైనది.

**కన్యాశుల్కం ఇతివృత్తం**

కన్యాశుల్కం నాటకం ప్రధానమైన ఇతివృత్తం సంఘ సంస్కరణ. అగ్నిహోత్రావధాన్లు తన రెండవ కుమార్తెను 70 ఏళ్ళు నిండుతూన్న లుబ్ధావధాన్లకి ఇచ్చి కన్యాశుల్కం కోసం పెళ్ళి చేయబోతాడు. అగ్నిహోత్రావధాన్లు కుమారుడికి ట్యూషన్ చెప్తానంటూ అప్పులు చేస్తూ, గొప్పలు చెప్పుకుంటూన్న గిరీశం ఆ ఇంట్లో ప్రవేశిస్తాడు. విధవగా ఇంట్లో ఉన్న బుచ్చెమ్మ అందానికి ముగ్ధుడై ఆమెను మభ్యపెట్టి వివాహమాడదామని ప్రయత్నిస్తాడు. గతంలో గిరీశం పోషణలో ఉండే మానవత్వం కలిగిన సాని మనిషి మధురవాణి, లుబ్ధావధాన్లును మోసం చేసి పెళ్ళికి ఒప్పించి డబ్బు తీసుకుందామని ప్రయత్నిస్తున్న రామప్పంతులు వద్దకు చేరుతుంది. కుమార్తెకు ఆ పెళ్ళి చేస్తే, చనిపోతానని అగ్నిహోత్రావధాన్లు భార్య బెదిరించగా, ఆమె అన్న గారు కరటకశాస్త్రి ఆ పెళ్ళి తప్పించేందుకు ప్రయత్నిస్తాడు. తన శిష్యుడికి ఆడవేషం వేసి రామప్పంతులుకు గుంటూరు శాస్త్రులుగా పరిచయం చేసుకుని, అగ్నిహోత్రావధాన్లు కుమార్తెతో లుబ్ధావధాన్లుకు పెళ్ళి తప్పించి ఆడవేషం వేసిన శిష్యునికి ఇచ్చి పెళ్ళి చేసి కన్యాశుల్కం తీసుకుని వెళ్ళిపోతాడు. ఈ సంగతి తెలిసినా కరటకశాస్త్రి చేసే పని మంచిదన్న ఉద్దేశంతో పెళ్ళికి మధురవాణి సాయం చేస్తుంది. ఆడవేషంలోని శిష్యుడు సాధ్యమైనంత బాధపెట్టి, నగలు, బట్టలు మూట

కట్టుకుని వెళ్ళిపోతాడు. ఈలోగా పెళ్ళికి తరలివచ్చిన అగ్ని హొూత్రావధాన్లు బంధుకోటిలోంచి బుచ్చెమ్మను తీసుకుని గిరీశం లేచిపోతాడు. అగ్నిహొూత్రావధాన్లు ఈ పరిణామాలకు ఆగ్రహం చెంది, రామప్పంతులుతో కలిసి లుబ్ధావధాన్లుపై దావా తెస్తాడు. ఈ కేసులో లుబ్ధావధాన్లు పక్షాన్ని ధర్మాత్మునిగా, సంఘసంస్కర్తగా, వేశ్యా వ్యతిరేకిగా పేరొందిన లాయరు సౌజన్యారావు పంతులు వకాల్తా పుచ్చుకుంటాడు. చివరికి నిజం తేలడంతో పాటుగా, మధురవాణి సౌజన్యారావు పంతులుకి గిరీశం నిజస్వరూపం తెలియజేయడంతో బుచ్చెమ్మను శరణాలయానికి పంపడంతో నాటకం ముగుస్తుంది.

**శప్తభూమి ఇతివృత్తం**

క్రి.శ.1775 ప్రాంతంలో అనంతపురం సంస్థానాన్ని హండేరాజు సిద్ధరామప్ప నాయుడు పరిపాలిస్తుంటాడు. తన శత్రువులైన తాడిమర్రి సంస్థానం వారు బుక్కరాయ సముద్రం చెరువుకు గండి పడేటట్లు చేసి అనంతపురాన్ని ముంచివేయాలనే కుట్ర పన్నుతారు. బిల్లే ఎల్లప్ప అనే గొర్రెల కాపరి సాహసంతో వారి కుట్రను భగ్నం చేస్తాడు. రాజు మెచ్చి అతడిని అమర నాయకుడిగా నియమిస్తాడు. అతడు ఎల్లప్ప జెట్టీగా పిలువబడతాడు. తన రాజు బొక్కసం నింపడం కోసం తాడిమర్రి సంస్థానానికి చెందిన యెల్లుట్లను దోచుకుంటాడు. సిద్ధరామప్ప నాయుడు మైసూరు నవాబు టిప్పుసుల్తానుకు రెండు సంవత్సరాలు ఖండినీ రూకలు బాకీ పడ్డాడు. దానిని వసూలు చేసుకోవడానికి మైసూరు నవాబు తరఫున గుత్తి సుబేదార్ అనంతపురం సంస్థానంపై దాడికి దిగుతాడు. అతడితో చెరువులో పల్లె పరగణా కుదువ పెట్టడానికి, 25 వేల రూకలు చెల్లించడానికి ఒప్పందం కుదురుతుంది. ఐతే 14 వేల రూకలు మాత్రమే సర్దుబాటు కావడం తో గుత్తి సుబేదార్ కోపంతో కోటవాకిళ్లు, దివాణం వాకిళ్లు పడగొట్టి పోతాడు. తమ దొరకు జరిగిన అవమానానికి ఎల్లప్పజెట్టీ కృంగిపోతాడు. వానల కోసం వీరమంటపం ఎక్కడానికి శ్రీశైలం మల్లికార్జున స్వామికి మొక్కుకుంటాడు. గండకత్తెరతో తన శరీరంలోని అంగాలను అన్నింటిని కత్తిరించి మల్లికార్జునికి అర్పించి దేహత్యాగం చేయడంతో నవల సమాప్తమౌతుంది. ఈ కథతో పాటు ఎల్లప్పజెట్టీని తిరస్కరించి వివాహ బంధం నుంచి బయటపడిన ఇమ్మడమ్మ, నాయక రాజుల సంప్రదాయాన్ని పుణికి పుచ్చుకున్న రాచవేశ్య పద్మసాని, ఇంగ్లీషు చదువులు చదివిన ఆమె కుమారుడు మన్నారుదాసు, కండబలం వున్నా కులం బలం లేక అన్యాయాన్ని ఎదురించలేని కంబళి శరభుడు, తండ్రి మరణానికి కారకుడైన వాడిపై ప్రతీకారం తీర్చుకునే హరియక్క, మతం ముసుగుతో లైంగిక దోపిడీకి పాల్పడే నాగప్ప ప్రగడ, ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు ప్రయత్నించే గురవడు, తన కూతురి దుర్గతికి కారణమైన స్త్రీలోలుడు సిద్ధప్పనాయుడి పతనానికి ఎత్తులు వేసిన బయ్యన్న గారి అనంతయ్య శ్రేష్టి మొదలైనవారి కథలు ఉన్నాయి.

**మధురవాణి ( కన్యాశుల్కం)**

ఏ నాటకానికైనా, ఇతివృత్తానికైనా ప్రాణం పాత్రలే. కన్యాశుల్కం నాటకంలోని పాత్రలు సజీవంగా ప్రకాశిస్తూం టాయి. ఒక పాత్ర మరొక పాత్రతో పోటీ పడుతూంటుంది. ఇవి మన సమాజం లో మనకు కనుపించే పాత్రలే. రామప్పంతులు వంటి దగాకోరులు, స్వార్థపరులు, గిరీశంలాంటి బడాయి కోరులూ మాటకారులు, అగ్నిహొూత్రావధాన్లులాంటి ధనాశాపరులు, సంస్కర్తలకి కూడా బుద్ధి చెప్పగల మధురవాణి వంటి సమయోచిత ప్రజ్ఞగల స్త్రీలు నేటి సమాజంలోనూ కన్పిస్తారు. ఇంతటి వైవిధ్యం, సహజత్వం గల పాత్రపోషణ వల్ల నాటకం సజీవంగా నిలిచింది.

మధురవాణి పాత్రలో అసాధారణత, పరిణామం, శీఘ్ర ప్రగతీ కన్పిస్తాయి. మొదట్లో సామాన్య వేశ్యగా కన్పించే మధురవాణి, నాటకం ముగిసేసరికి గొప్ప మనిషిగా కనబడు తుంది. ఇది గురజాడ ఇంద్రజాలం. రామప్పంతులు తన బుగ్గ గిల్లినప్పుడు, 'మొగవాడికైనా ఆడదానికైనా నీతి ఉండాలి. తాక వద్దంటే చెవిని బెట్టరు గదా' (అప్పారావు గురజాడ, కన్యాశు ల్కం అం, 2) అని మందలించడంలోనే ఆమె మనసు అర్థమవు తుంది. మధురవాణి వ్యక్తి స్వాతంత్ర్యాన్ని, పట్టుదలను ఎలాంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ కోల్పోని గుండె నిబ్బరం గలది. విమర్శన్నానం, విశ్లేషణ కలది. ఎదుటి వాళ్ళ గురించి ఆలోచిస్తుంది. తృతీయాంకంలో రామప్పంతులు పైన పటారం లోన లొటారం అని పసిగడుతుంది. ఇతర వేశ్యలు ధనం గుంజాలని చూస్తూంటే, మధురవాణి తనని ఉంచుకున్నవాడు బాగుపడాలనీ, అదే తనకు ఎక్కువ గొప్పనీ చెబుతుంది. కరటక శాస్త్రితో 'వృత్తి చేత వేశ్యని గనక చెయ్యవలసిన చోట ద్రవ్యాకర్షణ చేస్తాను గాని మధురవాణికి దయాదాక్షిణ్యాలు సున్న అని తలిచారా?' అనడం ప్రత్యక్షర సత్యం. ఈ నాటకంలో 'వేశ్యలు విద్యలు నేర్చి ఇతర వృత్తుల వల్ల సత్కాలక్షేపం చేయరాదా?' (సత్యనారాయణమన్నె, మాలిక పత్రిక, ఆగష్టు 2011) అని సౌజన్యారావు పంతులంటే "అట్లా చేస్తే తమవంటి వారు వాళ్ళను వివాహమాడతారా?" (కనక లింగేశ్వర రావు బందా AIR TV హైదరాబాద్) అనే మధురవాణి మాటల్లో వేశ్య స్త్రీలకి సాధారణమైన స్త్రీలకి తేడా కనిపిస్తుంది. "వేశ్యలము దేవాలయములో భగవంతుని చూడడానికి పోవచ్చును గదా! సత్పురుషులైన మీవంటివారి దర్శనమునకు మాత్రం

నిరోధమా?" (నూటపాతికేళ్ల కన్యాశుల్కం నాటకం, కృష్ణారావు అబ్బూరి) అని అడుగుతుంది. శ్రీ కృష్ణుడు సానిదానితో కూడా స్నేహం కడతాడా? శ్రీకృష్ణుడు మైల పడిపోడఅండీ?" అని మధురవాణి వేసిన ప్రశ్నలు సౌజన్యారావు పంతులు అంతరంగాన్ని కుదిపివేసాయి! మధుర వాణి ఉన్నతమైన ఆలోచన విధానం కలిగిన మానసిక పవిత్రతగల స్త్రీ మూర్తి అనిచెప్పవచ్చు.

**పద్మసాని (శప్తభూమి)**

పద్మసాని శాస్త్రాలను ఆపోశన పట్టిన పండితురాలు కాక పోయినా, శాస్త్ర పరిచయం బాగానే ఉంది. విద్యారణ్యస్వాముల వారి వేదాంతం చదివి, అర్థం చేసుకోగలిగిన తర్కజ్ఞానం కూడా ఉంది. కానీ అనుష్టాన వేదాంతం పట్లే ఆమెకు ఆసక్తి ఎక్కువ. అష్టవక్రగీత ఆమెకు ఇష్టమైనది. అది పారాయణ గ్రంథం కూడా. శాస్త్రాల్లో చెప్పిన అవధూత లక్షణాలు ఆమెకు ఎరుకనే! ఈ లక్షణా లన్నీ ఈమె విద్యాజ్ఞానం కలిగివున్న స్త్రీ అని చెప్పడానికి ప్రతీకలు. పద్మసానికి ఒక చిక్కు వచ్చి పడింది. అది తన పెంపుడు కూతురు నాగసాని నుంచి రాలేదు. కన్నకొడుకు మన్నారుదాసు నుంచి వచ్చింది. తమ దేవదాసి కుటుంబాల్లో సాధారణంగా మగపిల్లలు ఎదుర్కొనే సమస్య ఇది. మన్నారుదాసును, నాగసానిని తాను సమానంగా చూస్తుంది. ఇద్దరూ ఒకే రకం చదువులు చదువు తారు. కానీ నాగసాని నుంచి ఏ సమస్య లేదు. "ఇలాంటి బతుకెందుకు అమ్మ? నీ తండ్రి ఎవరు అని నన్ను అడుగు తున్నారు. వారికి నా తండ్రి ఎవరని సమాధానం చెప్పాలి? నాకు తండ్రి ఉ న్నాడా? ఉంటే ఒకరా లేదా చాలామంది ఉన్నారా?" (శప్తభూమి ప్రథమార్థం) అని మన్నారుదాసు తల్లిని అడిగే ప్రశ్నల్లో తల్లి చేసే వృత్తి మీద అసహ్యం, ఆవేదన బహిర్గతమవుతాయి. ఇలాంటి ప్రశ్నకు ఏ తల్లి అయినా తన బిడ్డకు ఏమని సమాధానం చెబుతుంది? ప్రశ్నలకు సమాధానం తన దగ్గర ఉన్నా సమాధానం చెప్పలేని పరిస్థితి పద్మసానిది. కొడుకు మన్నారుదాసు బాధను అర్థం చేసుకోగలిగిన పద్మసాని ఇక్కడే ఉంటే తన కొడుకు మరింత మనస్తాపానికి గురవుతాడని ముందే గ్రహించి ఉన్నత విద్యలకు విదేశాలకు పంపించి అతని అభిరుచి అనుసారం స్వేచ్ఛ స్వాతంత్ర్యాలు సమకూర్చి పెట్టింది.

**వేశ్యలు**

వ్యభిచారం లేదా పడుపు వృత్తి (Prostitution) అంటే డబ్బు కోసం ఒళ్ళు అమ్ముకోవడం. ఇలా జీవించేవారిని వేశ్యలు అంటారు. కొంతమంది స్త్రీలు పేదరికం, ఆకలి వల్ల వ్యభిచారి ణులుగా మారుతారు. కొంత మంది స్త్రీలు తల్లితండ్రుల నిర్లక్ష్యం ప్రభావం వల్ల వ్యభిచారిణులుగా మారుతారు. కొన్ని ముఠాలు ఉద్యోగాలు పేరుతో అమాయక బాలికలని నిర్బంధించి (కిడ్నాప్ చేసి) వ్యభిచార కేంద్రాలకి అమ్మేస్తుంటాయి. జెర్మనీ లాంటి కొన్ని దేశాల్లో మాత్రమే వ్యభిచారాన్ని చట్టబద్ధం చెయ్యడం జరిగింది. ఇరాన్ వంటి దేశాల్లో వ్యభిచారానికి మరణ శిక్ష వేస్తారు. చరిత్రలో రాజులు, చక్రవర్తులు తమ భోగవిలాసాల కోసం వేశ్యలను పోషించేవారు. పురాణాల్లోనూ, 15వ శతాబ్దానికి శ్రీ నాథుడు జక్కుల జాతి గురించి ఈ విధంగా చెప్పాడు :

"పురుషుడు గూడువేళబెడబుద్ధులు, యోగ్యముకాని చేతలున్
సరగున మేని కంపు, చెడు చందపు రూపము, నేహ్యవస్త్రముం
బరగునిరంతరంబు, నెడబాయని సౌఖ్యము, లేని ప్రేమయున్
విరహపు జూడ్కు, లుమ్మలిక వీసము, జల్లులు వేశ్యభామకున్!"

**(శ్రీ నాథుడు, క్రీడాభిరామం)**

దీనిని బట్టి ఆనాటి సమాజంలో వేశ్య స్త్రీల స్థానం ఏ విధంగా ఉందో పాఠకుల మేధాశక్తికే అర్థం అవ్వాలి అని అంటాడు చిలుకూరి పాపయ్య శాస్త్రి శ్రీనాథ కవితా సమీక్ష అనే గ్రంథంలో.

**దేవదాసీలు**

6 –13 శతాబ్దాల మధ్య దేవదాసీలు సమాజంలో ఉన్నత స్థాయి, గౌరవాన్ని కలిగి ఉన్నారు. వారు కళల రక్షకులుగా పరిగణించబడుతున్నందున వారు అనూహ్యంగా సంపన్నులు. ఈ కాలంలో రాజ పోషకులు వారికి భూమి, ఆస్తి, ఆభరణాలను బహుమతులుగా అందించారు. భారత ఉపఖండంలో బ్రిటీష్ పాలనలో, దేవాలయాలకు పోషకులుగా ఉన్న రాజులు తమ అధికారాన్ని కోల్పోయారు. తద్వారా ఆలయ కళాకారుల సంఘాలు కూడా తమ ప్రాముఖ్యతను కోల్పోయాయి. తత్ఫలితంగా, దేవదాసీలు వారి సాంప్రదాయక మద్దతు, ప్రోత్సాహం లేకుండా పోయాయి. అనేక చట్టాల ద్వారా నెమ్మదిగా ఆ వ్యవస్థను నిర్మూలనకు ప్రభుత్వాలు కృషి చేశాయి.

**పద్మసాని, మధురవాణి పాత్రల పోలిక**

అగ్రహారం గ్రామ ప్రజలు అక్కడి పన్నులు చెల్లించలేక జక్కులూరు గ్రామానికి వలస పోవలసి వచ్చింది. అగ్రహారం గ్రామ ప్రజలకు లంజకట్నం, పెళ్లిపన్నులు విధించి అవి చెల్లిస్తేగాని జక్కులూరూ పోయేదానికి అనుమతించలేదు అధికారి నాగప్పా ప్రెగడ. పద్మసాని కష్టాల్లో ఉన్న వారిని చూస్తే కరుణ పడుతుంది. కరుణను చూపించే కొలది ఆ కరుణ మరింత ఉధృతం అవుతుంది. మొదట ఆమె తన జక్కుల వంశం పేరు ప్రతిష్టలు నిలపాలనుకుంది. పదిమందిలో కీర్తి సంపాదించు కోవాలనుకుంది. పుణ్యం మూటగట్టుకుని మరణాంతరం సద్గతులు పొందాలనుకుంది. ఆపదల్లో ఉన్న

వారిని ఆదుకోవాలనే కరుణ ఆమె మనసులో సహజంగా జనించింది. ప్రజలకు సహాయపడే కొలది ఆమెలో కరుణ మరింత అధికంగా హెచ్చింపబడుతూ వచ్చింది. కౌలుదారులు కులవృత్తుల వారు నాగప్రగడకు చెల్లించాల్సిన పనులు చెల్లించి వారు వర్తక శ్రేణులకు కట్టవలసిన అప్పులు తీర్చి జక్కులూరు గ్రామంలోనే వారి జీవితకు ఏర్పాట్లు చేసింది పద్మసాని. ఆ విధంగా అగ్రహారం గ్రామం నుంచి వచ్చి జక్కులూరులో స్థిరపడిన కుటుంబాల్లో మంగలి గంగన్న కుటుంబం కూడా ఉంది. దొంగల కారణంగా ఆ కుటుంబం సంపదను కోల్పోయింది. దొంగలను అడ్డుకునే క్రమంలో మంగలి గంగన్న ప్రాణాలు కోల్పోయాడు. గంగన్న జ్ఞాపకార్థం వీరగల్లు నిర్మించి మహోన్నతమై మానవతా మూర్తిగా కీర్తి గడించింది పద్మసాని.

మధురవాణి శారీరకంగా మైలపడినదే కానీ మానసికంగా మలినం లేని స్త్రీ. సాంఘిక దురాచారాలను పాతాళానికి అణగదొక్కిన సంఘ సంస్కర్త. సాధారణ వేశ్య స్త్రీల వలె సుఖానికి, ధనానికి పరిమితం కాకుండా ఒక కుటుంబాన్ని అంధకారానికి నెట్టి వేయబడకుండా కాపాడిన వ్యక్తి. గిరీశం, రామప్ప పంతులు వంటి దగాకోరుల ఎత్తులకు పై ఎత్తులు వేసి, వారి మోసాన్ని పటాపంచలు చేసింది మధురవాణి. పద్మసాని, మధురవాణి లిరువురూ చేసేది వేశ్యవృత్తి కానీ కళ్ళ ముందు కనిపించే అన్యాయాన్ని ఎదిరించడంలోనూ, సమాజంలో పట్టిన భ్రష్టును వదిలించడంలోనూ, సహాయం చేసే గుణంలోనూ, విద్య పాండిత్యంలోనూ సమానులుగా కనిపిస్తారు.

**ముగింపు :** ప్రతి మనిషి సాధారణమైన జీవితాన్ని కొనసాగించడానికే ఇష్టపడతాడు. కానీ పరిస్థితుల రీత్యా తను నిర్మించుకున్న గోడల హద్దులను దాటి ప్రవర్తించాల్సి వస్తుంది. ఇది సాధారణమైన విషయంగానే మారిపోయింది ప్రస్తుత సమాజంలో. అవి వయస్సు రీత్యా పరస్త్రీల పట్ల ఆకర్షణ కావచ్చు, బంధుప్రీతి శత్రువుల వల్ల గెలుపోటములు కావచ్చు, ప్రేమ పెళ్లి వ్యాపారంలో నష్టము, దుఃఖం వలన ఆత్మహత్యలు కావచ్చు.. ఇలా ఎన్నో మరెన్నో పరిస్థితుల రీత్యా మాత్రమే మనిషి ప్రవర్తించాల్సి వస్తుంది. అదేవిధంగా పద్మసాని, మధురవాణి వంశపారపర్యంగా దాసి/ వేశ్య కుటుంబంలో పుట్టడం వల్ల కావచ్చు, ఇష్టంగాను అఇష్టంగాను ఆ వృత్తిలో కొనసాగుతూ తమ కుటుంబాలను ఆర్థికంగా కాపాడుకుంటూ, సమాజాన్ని, సమాజానికి పట్టిన మకిలిని వదిలించడానికి తమ సహాయ శక్తుల ప్రవర్తిస్తారు. నాటకంలోను, నవలలోను మొదటగా సాధారణ స్థాయి పోషించినప్పటికీ ఆ రచన పూర్తయ్యేటప్పటికి మానసిక పవిత్రతను పుణికిపుచ్చుకున్నాయి ఈ రెండు పాత్రలు. ■




- రెడ్డి శంకరరావు

94943 33511


# చంద్రుడిపై పతాకం

ఇప్పుడు చెప్పండి
భారతీయుల గొప్పదనం
చంద్రునిపై త్రివర్ణ పతాకం రెపరెపలాడింది
నిజమే కదా
అవును నిజమే... కాదనలేని నిజం

ప్రచార కళ వాగుడు గాయలారా
జైహో భారత్.. జైహో ఇస్రో కాదు
నిజాన్ని నిర్భయంగా చెప్పండి
ఇప్పుడు.. అవును ఇప్పుడే చెప్పండి
ఎవరికి సలామ్ చెయ్యాలో చెప్పండి!

తర తరాలుగా చంద్రుణ్ణి మింగిన
పాముకథ చంద్రయాన్ త్రీ కథ
ఏది నిజం... ప్రపంచానికి చెప్పండి
శాస్త్రవేత్తలా? స్వామి వారా?
ఎవరు గొప్ప? ఇప్పుడే చెప్పండి!

మంత్రాలకు చింతకాయలు రాలవని
చంద్రయాన్3 చెప్పిన నగ్న సత్యం
ఏలియన్స్ లేని చంద్రుణ్ణి చూపించే
భారతీయ చంద్రయాన్ గొప్పదనం
ప్రజల బుర్రల్లో కి ఎక్కించండి..!

ఆవువుచ్చ తాగే సన్నాసులం కాదని
సున్నాను కనుగొన్న ఆర్యభట్టకి
వారసులమని ఇప్పుడే చెప్పండి
ఆధునికతకు ఆద్యులం మేమేనని
మూఢ నమ్మకాల ముసుగు తీయండి! ■



# నీకొచ్చిన భాషలో రాయి నీ విముక్తి కోసం రాయి

## గద్దర్ - తెలకపల్లి రవి ముఖాముఖి

**సిరిమల్లె చెట్టుకింద లచ్చుమమ్మా, అంటూ మీ అమ్మ పేరు మీద రాసినదే మీ మొదటి పాట కదా... దానికి ముందు నేపథ్యం ఏమిటి? మీరు పాటగాడు కావడం ఎలా జరిగింది?**

మాది ఇక్కడికి దగ్గరే మెదక్ డిస్ట్రిక్ట్ తూప్రాను. నేను చిన్నప్పటి నుంచే పాటలు పాడేది. కట్టేది. ముఖ్యంగా మా అమ్మ జానపద పాటలు సానా బాగా పాడేది. వాటిల్ల సానా అర్థముండేది. అమ్మ వ్యవసాయ కూలీ. ఫాదర్ కాంట్రాక్టులు చేసేది. తమ ప్రోగెసివ్ కాంట్రాక్టుల కోసం మహారాష్ట్రలో ఔరంగాబాదు అదంతా పోయేటోడు. అక్కడే అంబేద్కర్ వంటి వాళ్ళను గురించి తెలుసుకుని వచ్చాడు. అంబేద్కర్ ఉద్యమం బాగా చదువుకోవాల్నెనేటోడు. అందుకే మమ్మల్ను చదివించాడు. మా ప్రాంతంలో హెచ్ఎస్సి పూర్తి చేసిన ఫస్టు ఎస్సిని నేనే. సరే. మా నాయన మొబిలిటీ వల్ల చైతన్యం పెంచుకున్నాడు. మా అక్కలను కూడా ఉద్యోగాలు చేసేటోళ్ళకే ఇచ్చి పెళ్ళి చేసినాడు. సబ్‌కాస్ట్ తేడాలు పాటించేటోడు కాదు. ఒకసారి ఎద్దును వండిపెట్టాడు. అలా చేసినందుకు తనను శిక్ష వేసి ఇల్లు గుంజుకున్నారు. అయినా భరించినాడు గాని తలవంచలేదు. నైట్ స్కూల్ నడిపేది. రాత్రిపూట దీపం జ్యోతి పరంబ్రహ్మం అని పాడించేవాడు. నేను హెచ్ఎస్సికి వచ్చేసరికి మా నాన్న చనిపోయినాడు. అమ్మనే పెంచింది. అక్కడ జీవితమే నాకు అన్నీ నేర్పించింది.

నేను ఎక్కువ మా అమ్మ దగ్గర్నే పెరిగిన. చదువుకుంటూనే కూలి పనికి పోయేటోన్ని. అప్పుడే ఈ పల్లెటూరి పాటలు పాడుతుంటి. అయితే చదువులో కూడా నేను బాగానే వుంటుంటి. నేను నాలుగు అయిదు తరగతులు చదువుతున్నప్పుడే పై క్లాసులు వాళ్ళకు చెప్పేటోడ్ని. చదువులో మరీ ఫస్టు కాదు కాని వున్నంతలో టాప్‌లో వుండేటోణ్ని. అంతకంటే పాటలు, ఆటలలో మాత్రం బెస్ట్ అనిపించుకున్న. పంద్రా ఆగస్టు వంటివి వచ్చినపుడల్లా నేను జానపద పాటలు, దేశభక్తి గీతాలు పాడేది. స్కూల్లో వున్నప్పుడే బుర్రకథ చెప్పడం నేర్చుకున్నా. అప్పుడేమీ తెల్సు – టీచర్లేమి చెప్తే అది చెప్పేటోళ్ళం. హెచ్ఎస్సికివచ్చే సరికి చాలా పేరు వచ్చేసింది. ఎస్టాబ్లిష్ అయిపోయాను. అల్లూరి సీతారామరాజు ఫ్యాన్సీ డ్రస్ వేయడం, బుర్రకథ, వాలీబాల్, జానపద కళలు అన్ని చేసేటోణ్ని. నాకు అది చాలా రిచ్ లైఫ్. కళాత్మకంగా. హాస్టల్‌లో వుండేవాణ్ని. కూలీకి పోతుండేటోన్ని.

స్కూల్లో పాటలేమో వేరే వుండేది. నాకు అమ్మ పాడే పల్లెపాటలే బాగవినిపించేది. స్కూలుకు పోతేనేమో జైజై భారత జాతీయాభ్యుయానందోత్సవ శుభ సమయం. ఇలాటివి నేర్పించేవాళ్ళు అవి కూడా పట్టి పాడేవాణ్ని.

**మీరు ఏక సంథాగ్రాహి అన్నమాట...**

క్రియేటివిటి ఎక్కువగానే వుండేది. నేను స్కూలు డేస్‌లోనే ఫేమసై పోయిన. చుట్టుపక్కల జిల్లాలలో కూడా మా దళం పాటలు, బుర్రకథలు బాగా తెలిసేవి. పౌరసంబంధాల శాఖ వంటి గవర్నమెంటు డిపార్టుమెంట్లు పెట్టే పోటీలన్నీటిలో మాకు బహుమానాలు వచ్చేటివి. తూప్రాన్‌లో వున్నప్పుడు శేషారెడ్డి అని మా టీచర్. ఆర్యసమాజీకుడు. నాకు ఆబగా ఎంకరేజ్‌మెంట్ ఇచ్చేటోడు. నేను మా తాలూకాలో మొదటి ఎస్సి హెచ్ఎస్సి. అందుకే నాకు సన్మానం కూడా చేసింద్రు.

**కులం కారణంగా ఏమైనా వివక్ష ఎదుర్కొన్నారా?**

పెద్దగాలేదు. నేను కళల్లో డామినేట్ చేసేటోన్ని గన్క ఏమనే టోళ్ళుకాదు. అయితే అస్సలు లేదని కాదు. మా నాయన కావాలని మాకందరికి మంచిగ పేర్లు పెట్టిండు. విఠల్‌రావు అని నాకు పేరు పెడితే మా సారు నీకు రావెందుకురా అంటూ గుండు సున్న చుట్టేది. మోహన్‌రెడ్డి నాకు సానా మంచిదోస్తు. వాళ్లింట్ల పెళ్లయితే పెద్దవాళ్ళు నాకు కొట్టంలో కూచోబెట్టి అన్నం పెట్టింద్రు. రానురాను ఆ బెరియర్ (అడ్డుగోడ) పోయింది. మా నాన్న శేషయ్య మేస్త్రీ కాబట్టి కొంచెం సామాజిక హోదా వుండేది. నాకు పేరెంటల్ ఇన్‌స్పిరేషన్ ఎక్కువ. కాని కొన్ని విషయాల్లో ఏం చేయలేము. ఎబి సుందర శాస్త్రి నా ఫ్రెండు. అన్నం పెడతానంటే ముసలిది వద్దంటుండె. కోమటి శంకర్ మరో దోస్తు. వాళ్ళ కొట్లో పెప్పరమెంట్లు తేచ్చేటోడు. చిన్న చిన్న దొంతగనాలు (నవ్వు) నేను లెక్కల్లో చాలా బ్రిలియంట్. నేను చూపిచ్చక పోతే కొంత మందికి జరగదు. అట్ల కూడా వూరుకుండేటోళ్ళు. సమాజం అవసరాలే వివక్ష పోగొట్తాయి. ఒక్క ఎగ్జాంపుల్. శివుడి గుడి దగ్గర ఫంక్షన్‌లో నేను బఫూన్‌గాడి వేషమేసేది. దేవుడి గద్దె మీద స్టేజి. నేను అక్కడికి రాగుడ్దని కొంత మంది లల్లిచేసింద్రు. అయితే వేషం ఏసేటోడు రాకుంటే ఎట్ల కుదురతదని ఇంకొందరు వాదించింద్రు. ఎట్లయినా గాని నేను గద్దె మీదనేవేషం ఆడిన.

అదంతా అప్పట్లోనే. ఇప్పుడు నన్ను చేసి మా వూరంతా గర్వపడుతుంటుంది. ఆ మధ్యన నా మీద దాడి తర్వాత వూరికి పోతే అందరూ వచ్చింద్రు. మా పిల్లగాడు ఇంత పెద్దోడైనాడని ఒకటే మెచ్చుకున్నరు. భూస్వాములు కూడా. అదో అభిమానం అంతే. అయితే మా అమ్మ అట్లగాదు. నేను యుజిలో నుంచి వచ్చిన తర్వాతి నిజాం కాలేజీల పెద్ద సభ జరిగింది. ఫొటోలు అన్ని పేపర్లల్ల వచ్చినయి. అవి తీస్కపోయి అమ్మకు చూపెడ్తె ఎమొస్తది ఇవి కడుక్క తాగనీకనా అనిందంట. నేను చదువుకుని ఉద్యోగం చేయలేదని ఆమె బాధ. తర్వాత మళ్లీ గుర్తించిందనుకో. నాకు మా అమ్మ నుంచి మానవత్వం వచ్చింది. ఫాదర్ నుంచి లిబరలిజం ఆలోచించే చైతన్యం పట్టుబడినాయి. అసలైన హ్యూమనిజం వుండేది కమ్యూనిజంలోనే కదా. కొంత మంది అనుకుంటారు. కమ్యూనిస్టులు తగలబెట్టుడు, చంపుడు ఇదే అని. కాని కాదు. మా ఇంట్లో పిల్లి పిల్లల బెట్టింది. రాత్రి అది వచ్చేసరికి వంటింటి తలుపు వేసుంది. ఇక లోపలికి రాలేక గోల చేస్తుంటే నాకు మెళకువ వచ్చి వెళ్ళి తలుపు తీస్తే దాని సంతోషం ఏం చెప్పాలె? అప్పుడే నా భార్యను లేపి చెప్పిన. మా ఇంట్ల కుక్క నా మీద కాల్పులు జరిగిన తర్వాత నాలుగు రోజులు తిండి తినలా. మేము పెంచిన కోడిని తినడానికి కొయ్యం. ఎవరికైనా ఇచ్చేస్తాం. దాండ్లన్నిటి మీద పాటలు రాసిన.

అంతర్గతంగా వుండే శక్తి మనిషిని కళాకారుడిని చేస్తుంది. ప్రతి మనిషీ కళాకారుడే. ప్రతిదీ కళారూపమే. అయితే ఒకానొక సామాజిక పరిస్థితిలో కళ బయటపడుతుంది. అలాగే నాలోవున్న కళ ఒక సామాజిక లక్ష్యంతో బయటకొచ్చింది.

**అదెలా జరిగింది?**

మా వూర్లో వున్నంత వరకు నాకు కమ్యూనిస్టు పార్టీ గురించి ఏమీ తెలియదు. పాటలు మాత్రం వినేది. చెయ్యి గుర్తుకే మీ ఓటు అని పాతపాటలు పాడుతుంటే వినేటోడ్ని. మా ఏరియాలో పార్టీ ఎంపికగా చేసిన కిషనయ్యబాగా తెలుసు. ఆయన కేవల్‌కిషన్. ఆరుట్ల రామచంద్రారెడ్డి పోటి చేసిండు. అప్పట్ల పార్టీ పిడిఎఫ్‌పేరిట పోటీ చేసింది. దాని గుర్తు చెయ్యి. అందుకనే ఎద్దును గట్టేది చెయ్యి, నాగలిపట్టేది చెయ్యి అని పాడితే విటుండేవాణ్ని. కాని మా ప్రాంతంలో పార్టీ అంతగా వుండేది కాదు. పైగా మా నాయన అంబేద్కర్ ఫాలోయర్ గనక కమ్యూనిస్టులంటే కొంచెం విముఖంగా వుండేది. హెచ్ఎస్‌సి వరకు చదువుకోవాలనే తప్ప పాటలు రాయాలా. ఇమిటేషన్ చేసే పాటలు మాత్రం రాసేవాణ్ని. యాసిఫైల్ యాల్‌ఖుదా అని ముస్లింలు చేసే ప్రార్థన అచ్చం వాళ్ళలాగే పాడేది. ఆ స్టైల్లో వేరే కూడా రాసేటోడ్ని. అంటే రాయడం అలవాటైంది. కాని ప్రోగ్రెసివ్‌గా రాయడం లేదు. 1960 నుంచి 66 వరకు బుర్రకథ టీమ్ నడిపినా చదివినా సాహిత్య దృష్టిలేదు. సోషల్ అవేర్‌నెస్ మాత్రం వుంది కాని సోషలిస్టు అవేర్‌నెస్ రాలేదు. మంచిగ వుండాలె అని మాత్రం అనుకునేది.

1967-69లో సైఫాబాదు కాలేజీలో చదివిన. మా అక్కను వెంకటాపురంలో ఇచ్చారు. పియుసిలో నాకు 77 పర్సెంట్ వచ్చింది. మెరిట్ స్టూడెంట్‌గా ఉస్మానియా ఇంజనీరింగ్ కాలేజీలో సీటు తెచ్చుకున్న. మొజాంజాహి మార్కెట్ ఎస్‌సి హాస్టల్‌లో వుండేటోన్ని. రోజూ నడిచి పోయి నడిచి వచ్చేది. పాటలు పాడడం లేదు. రాయడంలేదు. క్రియేటివిటి చచ్చిపోయినట్లనిపించింది. లెక్కలు చేసేవాణ్ని. నికృష్టమైన బతుకు గడిపాను. సాయంత్రం ఒక హోటల్‌లో సర్వర్‌గా పని చేసేది. ఢిల్లీ దర్బార్ హోటల్. పావలా ఇచ్చేవాళ్ళు రోజుకు. అది నా ఖర్చులకు.

ఇంజనీరింగ్‌లో చివరి బెంచిలో కూచునే వాణ్ని. రాగింగ్. ఇంగ్లీషు రాదనే ఫీలింగు. మొత్తంపైన ఇన్ఫీరియారిటీ కాంప్లెక్సుకు బాగా గురైన. కేశవరావు జాదవ్ అప్పుడు మా లెక్చరర్. ఆనాటి నా జీవితం పాటల్లో కనపడుతుంది. ఆ విధంగా క్రియేటివిటీ పూర్తిగా అదృశ్యమైపోయినట్లనిపించింది.

**తర్వాత...**

వెంకటాపురంలో వున్నప్పుడే బి. నరసింగరావుతో పరిచయమైంది. వాళ్ళు ఇక్కడ పెద్ద దొరలు. మిద్దె పైకెక్కితే కనిపించే భూమంతా వాళ్ళదేనన్నట్టు. ఆయన ఆర్ట్ లవర్స్ అసోసియేషన్ నడిపేది. దాంట్లో చేరినం. అప్పుడు బాపూజీ బుర్రకథ దళం పెట్టి కుటుంబ నియంత్రణ కథలు చెప్పి గవర్నమెంటు దగ్గర 75 రూపాయలు తీసుకునేవాళ్ళం (నవ్వు) కుటుంబ నియంత్రణ కథలోకూడా పేదరికం గురించి చెప్పేవాణ్ని.

బిచ్చగాని పాత్ర ఒకటి అందరికి నచ్చేది. తర్వాత అంబేద్కర్ కథ మొదలు పెట్టాం. ట్యూన్స్ పాపులర్‌గా వుండేవి తీసుకునే వాన్ని. “శాంభవి రావే...” ఇలాంటి పాటలకు కొత్త కంటెంట్‌తో రాసాను. అలా చెబుతూ వుండగా 1972లో ఆర్ట్ లవర్స్ వారు కథ చెప్పడానికి మమ్ములను పిలిచారు. కళలు దేనికోసం అంటూ నర్సింగరావు అక్కడ క్లాసు చెప్పిన తర్వాత కళలు ప్రజల కోసమని తెలుసుకుని కొత్త మార్గం పట్టాము. అంబేద్కర్ కుల నిర్మూలన పుస్తకం చదివాను. నెమ్మదిగా మార్క్స్ సోషలిజం వరకూ నడిచాము. నరసింగరావు ఆర్ట్ లవర్స్ సంస్థతో సంబంధం నా జీవితంలో టర్నింగ్ పాయింట్ అని చెప్పొచ్చు.

నాకెప్పుడూ ఒక లక్షణం వుంది. ఒకటి మంచిదనుకుంటే రెండోది వదిలిపెట్టేస్త. ఇప్పుడు కూడా అంతే అయింది. నా అభిప్రాయాలు మారగానే చదువు మీద ఇంట్రస్టు పోయింది. పాటలు కట్టడం మొదలు పెట్టిన. ఆపుర రిక్షడో రిక్షంట నేనొస్త అని రాసిన. అందరూ బాగుందన్నరు. దాంట్లో ఒక చోట కల్లు పోయిస్త అని వుంటుంది. అది చూసి కొంత మంది తప్పన్నారు. కాని నర్సింగరావు నన్నే సపోర్టు చేసిండు. జానపద బాణీలతో విప్లవ మెసేజ్ ఇయ్యాలన్నడు. ఆ పాయింటు తెలియగానే అంతా మారిపోయింది. నా పాట వాక్కు కాదు, శక్తి అయిపోయింది. నన్ను కొండపల్లి సీతారామయ్యకు పరిచయం చేశారు. ఆయన క్లాసు సాన సేపు చెప్పిండు. మాటి మాటికి మా కాంగ్రెస్ (మహాసభ)లో తీర్మానం చేసినం అంటుండు. నాకు కోపం వచ్చింది. అంతా చేసింది కాంగ్రెస్ అయితే ఈయన గిట్లంటడేంది అనుకునేది (నవ్వు) అంతసేపు చెప్పేసరికి నాకు ఇంట్రస్ట్ లేకుండా పోయింది. ఇట్ల చెబితే ఎక్కదు, ప్రజల భాషలో చెప్పాలనుకున్న. ఇంక ఇంజనీరింగు మానేసిన పాటల మీదనే పణ్ణ. మా ఫాదర్ చెప్పిన కులం పరిధికి మించి చూడటం మొదలుపెట్టిన. వర్గం అవగాహన వచ్చింది. ప్రపంచంలో వుండేది రెండే వర్గాలని, మనిషి చైతన్యవంతుడై చరిత్ర మార్చాడని తెలుసుకున్నా. అంబేద్కరిజం కొంతవరకు సరిపోతుంది. కాని అది మాత్రమే చాలదు. కె.ఎస్. మమ్ములను గ్రామాలకు పొమ్మన్నడు. పోయినం. అక్కడ ప్రత్యక్షంగా చూసినం. భూస్వామ్య విధానాలకు వ్యతిరేకంగా పోవడంవల్లనే అన్ని అర్థమైనాయి. జానపద కళారూపాలు తీసుకోవాల. వాళ్ళ బాణీలు, వాళ్ళ భాష కావాల. దున్నే వానికి భూమి వల్లనే విముక్తి కలుగుతుంది. పదిమందికి పని దొరుకుతుంది. రిజర్వేషన్ కొంత వరకే మేలు చేస్తుంది. అంతకంటే ఎక్కువగా క్లాస్ పోలరైజేషన్ జరగాల. నారాయణన్ ఎస్‌సి రాష్ట్రపతి అయ్యిండు. అయితే ఏం ఒరిగింది? కాబట్టీ క్లాసు ముఖ్యం. ఇలాంటి అవగాహన నాకు రావడానికి ప్రధాన కారణం నర్సింగరావే. పెద్ద మార్క్సిస్టు బ్రిలియంట్. ఇప్పటి వరకు జననాట్యమండలి రూపశిల్పి ఆయనే. గొప్ప సినిమాలుకూడా తీసిండు. ఆర్ట్ లవర్స్ అసోసియేషన్ల ఎద్యుకేట్ అయినంక జననాట్యమండలి దాకా వచ్చాను. ప్రజాట్యమండలి వారసత్వాన్ని కొనసాగిస్తామని డిక్లరేషన్ చేశాము. అప్పుడే సారస్వత పరిషత్ హాలులో టికెట్ నాటకం పెట్టినం. వీర కుంకుమ వేసినం. ఆర్గనైజర్‌నైన.

***పాటల రాయడంలో మీరు పాటించే జాగ్రత్తలు ఏమిటి?***

నేను పాట రాయను. ఏ విషయమైన అనుకుంటే అల్లుకుపోత, నీ మాటలో నీ గురించి నీ విముక్తి కోసం నువ్వు రాసుకోవాలె. ఎవరి కోసం నిరీక్షించకు. వచ్చిన భాషలో రాయి. పాటలో జానపద బాణీలు తీసుకుని రాయడం. బుర్రకథ వుండేది అంతకు ముందు. నాజర్ దాన్ని జనానికి దగ్గరగా తెచ్చాడు. నేను వచ్చి ఇంకా మార్చిన. గ్రామాల్లోకి ప్రజల దగ్గరికి వెళ్ళడం వల్లనే ఇదంతా జరిగింది. వారికి అర్థమయ్యే విధంగా పెద్ద పెద్ద విషయాలను మలచి రాశాను. ప్రతిదాన్ని పాట కట్టాను. ఇప్పటికి 35 క్యాసెట్లు తీశారు. 3000 పాటలు రాశాను. చాలా పాపులర్ అయ్యాయి. నా పాటలు జనానికి ఎంత ఇష్టమో తెలియాలంటే నాతో రావాలె. బయటకు పోతే చాలు. రిక్షావాడు వస్తాడు. తాగుబోతు వస్తాడు తన మీద పాట పాడమని. అన్నిటి మీద పాడేస్త. మార్క్సిస్టు సూత్రాల్లో పాయింట్లను పాటకట్టిన. ఇంటలిజెంట్‌గా వుండాలి. ఎవరికి ఏం చెప్పే ఎలా చెప్తే ఎక్కుతుందో ఆలోచించాలి. రిక్షా తొక్కే రహీమన్న, ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజిలో నిరుద్యోగులు, ఏజిబారై పోయిందా అంటూ పాడితే ఎక్కుతుంది. కవాలి ట్రూపు రాగాన్ని వాడి రాసినం. ఒగ్గుకథ రాసినం. ఇలా ఏది అవరరమైతే ఏది అనుకూలమైతే దాన్ని ఉపయోగించుకోవాలి. క్వాలిటేటివ్‌గా చూడాలి. జనంలోకి వెళ్ళాలి. ఎవరిని ఉపయోగించుకోవాలి. క్వాలిటేటివ్‌గా చూడాలి.

భాష కూడా జాగ్రత్త తీసుకోవాలి. సిరిమల్లె చెట్టుకింద లచ్చుమమ్మా, అన్నాక సితో కలిసే పదాలు, రితో కలిసే పదాలు ఇలా ఎంచుకోవాలి. అప్పుడు వినడానికి ఇంపుగా వుంటుంది. సిరి, సిగ, సింగ, సిత్ర ఇలా అన్నమాట. రిల్లి, రింగ కూడా అంతే. అంటే సింప్లిఫై చేయాల. భాష పదాలలో ఒక దాన్నించి మరో దానికి పోవడానికి కావలసినట్టు వుండాలి. ఒక భావాన్ని పాటగా చేయాలంటే ఏం చేయాలనే దానిపై క్లాసు పెట్టి చెప్పాలి. ఏదైనా తేలిగ్గా అర్థమయ్యేలా వుండాలి. నేను అక్షరాస్యతపైన కూడా పాటలు రాశాను.

*123456789. వీటినే అంకెలంటరండి,*
*వీటితోనే సంఖ్యలవుతయండి* అని పాడాము.

బ్రహ్మాండంగా అర్థమైంది. వేసి చూపిస్తాను. మరి అన్నమాచార్యులు అన్నివేల సంకీర్తనలు రాశాడంటే ఎంత సాధన వుండాలి, ఎంత సింపుల్‌గా చెప్పాలి. మా క్లాసులు పెట్టి చెబుతున్న పోతన గురించి, వేమన గురించి అన్ని చెబుతం. అయితే కొన్ని చెప్పడానికి కుదరనివి బొమ్మల ద్వారా చెప్తాం.

***ప్రజాజీవితంలో కవి, కళాకారుని పాత్ర ఎలా చూస్తారు?***

కవులు కళాకారులు కాగితాల్లాంటి వాళ్ళం. మా మీద చైతన్యం అనే అగ్గిపడితే అంటుకుంటాం. ఆ నిప్పు పెద్దమంట అవుతుంది. అందుకనే నేను అగ్గిపుల్ల మీద పాట కట్టిన.

కవులకు కళాకారులను సోషలిస్టు చైతన్యం వుండాలిగాని సెక్టేరియనిజం పనికిరాదు. చరిత్ర నుంచి నేర్చుకోవాలి. ప్రాపగాండా టీమ్‌గా మారినపుడు ప్రజలకు ఏదీ ఎంత వరకు అర్థమవుతుందనే ఆలోచన చేయాలి. అవసరమైనప్పుడు ఆత్మవిమర్శ చేసుకోవాలి. అలా చేసుకునేది నిజమైనకళ. సాహిత్యానికి సామాజిక ప్రయోజనం వుండాలి. అనేక ధోరణులను ఇముడ్చుకొని వైవిధ్యాన్ని చూపెట్టాలి. అనేక సమస్యలు తీసుకోవాలి. అందుకు తగిన రూపాన్ని ఎన్నుకోవాలి. సాహిత్యమే డిసైడింగ్ కాదు. అది సహాయపడుతుంది అంతే. నా పాటలను వెనక్కు తిరిగి చూసుకున్నప్పుడు ఈ లోపాలన్ని కనిపిస్తాయి.

సిరిమల్లె చెట్టుకింద లచ్చుమమ్మ పాటనే తీసుకోండి. చివరలో కొడవల్లు పట్టాలె లచ్చుమమ్మ అంటాను. అది నా ఆకాంక్షే కాని ఆమె భావం కాదు కదా. ఆమెకంత చైతన్యం లేదు. వీడు ఎందుకు దీంట్ల పోయిండు అని ఆ అమ్మ అంటుంటే నేను ఇలా రాస్తే అది వాస్తవికత ఎట్లా అవుతుంది? మనం పోరాట దశను ప్రజల చైతన్య స్థాయిని బట్టి పోవాలి. సాహిత్యం అనేది మాస్ ఆర్గనైజేషన్‌కు తోడుగా నిలిచేది కావాలి. మిలిటెన్సీని పెంచాలి. కత్తులు దూసుకుపోయినా నెత్తురుటేరులు పారినా పాట వుందనుకోండి. నేను దాన్ని సానా రకాలుగా పాడత. ఇదంతా ఎందుకంటే ప్రజలను ఆకర్షించడానికి, చైతన్యం పెంచడానికి, బాంబుల వర్షం కురిసినా ఎత్తిన జండా దించకోయ్ అని పాడితే ఎట్లుంటుంది? ఇప్పుడు ఫ్యాక్టరీలు మూతపడుతుంటే ఆ కార్మికుల దగ్గరికి పోయి పాడితే చూడాలి రెస్పాన్సు. అయినా మనం ప్రజల్లో సానా పనిచేసినా చివరకు ఓట్లు రావడంలేదు. మొన్న సిపిఎం సభలో సీతారాం ఏచూరి చెప్పినమాట నిజం. మనకు ఓట్లు పడ్తలేవు. కరీంనగర్ నక్సలైట్ ఏరియా అంటారు. అక్కడ విద్యాసాగరరావు గెలుస్తడు. ఇదేం విచిత్రం? మనం ఆలోచించాలి. అందుకే సానా దళాలు తయారు చేసి సాంస్కృతిక సైన్యంగా అడవుల్లోకి పంపాలనుకుంటున్నాం. వీళ్ళు కేవలం కళాకారులు కాదు. సైనికులు, కల్చరల్ ఆర్మీ అన్నట్టు. సెకండరీ ఫోర్స్‌గ వుంటారు. యుద్ధంలో ఓడిపోయినపుడు ఉత్సాహ మిస్తారు. సెంట్రీపని చేస్తారు. అవసరమైతే తుపాకి పట్టి పోట్లాడ్తరు. కళాకారులను సాంస్కృతిక సైన్యం అన్నారేగాని విద్యార్థులను యువకులను అనలేదు కదా. కళాకారుడు పార్టీకి తోడుంటాడు. కాని సృజనాత్మకతలో వాడికి స్వేచ్ఛ వుండాలి. విధానం పార్టీ విధానమే. కాని ఎలా వ్యక్తీకరించి చెప్పాలనే విషయంలో మాత్రం స్వేచ్ఛ ఇవ్వాలె. విధానం తప్పుగా రాస్తే సభ్యత్వం తీసెయ్. కాని కళాకారుని సృజనశీలతను మాత్రం అరికట్టకు. గోర్కి, నాజర్, గద్దర్ ఎవరైనా చేసిందదే. ఎందుకు సస్పెండ్ చేస్తారు? సినిమాల పాట పాడిన్ననా? ఇంతకుముందు కూడా రాయలేదా? మా భూమిల పాడలేదా? కనుక ఇది రాజకీయమైన చర్య. కవులు కళాకారుల పరిస్థితి వేరుగా వుంటుంది. ఒక్కపాట లోనే మొత్తం పార్టీ ప్రోగ్రాం ఇవ్వాల్నా?

సాహిత్యం కళలు వాస్తవాలు చెప్పాలి. భిన్నంగా చెప్పాలి. ఇది ఎలా వుండాలి. ఇందుకు సంబంధించిన సిద్ధాంత విషయాలేమిటి, అనుభవాలేమిటి అనే దానిపై సాన చర్చ జరగాల. కమ్యూనిస్టు సిద్ధాంతం ఎలా చూడాలి? ఒక కవి సరిగ్గా అర్థం చేసుకున్నాడా లేదా చూడాలి. చేసుకోకపోతే చెప్పాలి. ఆయుధం పట్టుకో అంటే బాగానేవుంటుంది. కాని ప్రజల్లో ఆ పరిస్థితి వుందా లేదా దశ కరెక్టాకాదా పరిశీలించాలి.

**అయితే ఈ దశలో కళాకారుల, సాహిత్యకారులు కర్తవ్యాన్ని గురించి మీరేమనుకుంటున్నారు?**

యుద్ధంలో వున్న వారిని చైతన్యవంతం చెయ్యాల. ప్రోత్సాహమియ్యాలి. ఇయాల సామ్రాజ్యవాద వ్యతిరేక విశాల వేదిక కావాలి. సామ్రాజ్యవాదాన్ని కూల్చడానికి కవి పనిచేయాల. దాన్ని సాయుధంగా కూల్చేయాలి. అంటే ప్రజలను మెంటల్‌గా ఆర్మ్ (మానసికంగా సాయుధం) చేయాలి. సెప్టెంబర్ 11 తర్వాత ప్రజలకు మరేమి మిగల్లేదు. సాయుధం అంటే తుపాకులు పట్టుకోవాలనే కాదు. పోరాటం చేయాలనే దృష్టి పెరగాలి. విద్యుదుద్యమం తీసుకోండి. అలాటివి రావాలి. నేను ఆగస్టు 28 ప్రదర్శన రోజున వెళ్ళాను. ముందున్న రాఘవులు గారు నన్ను వెనక్కు పొమ్మన్నడు. మేం నీతో మరో ప్రయోగం చేయలేము అన్నాడు. నాకర్థమైంది. ఇప్పటికే హత్యాప్రయత్నం నుంచి బయటపడ్డాడు. ఈ జనంలో శత్రువేమి చేస్తాడో తెలియదు అని ఆయన ఆందోళన పడుతున్నాడని తెలుసుకుని వెనక్కు పోయిన. బ్యాటిల్ జరుగుతున్నప్పుడు నేనక్కన్నే వున్న. 18 రౌండ్లు కాల్చిండ్రు. రెండవ బ్యాచిలో నేనున్న. నేలపైన పండుకున్న. సిపిఎం పార్టీ ఈనాడు తీసుకున్న లైను ఎందుకని ప్రజల్లో గుర్తింపు పొందుతుంది? ఆ పార్టీ ప్రజలను రోడ్డు మీదకు తీసుకొచ్చి పోరాడమంటుంది కనుకనే. అరెస్టు కాకుండా పోలీసులతో కుస్తి పట్టమంటుంది. అందుకనే గుర్తింపు వచ్చింది. లక్షలాది మంది అలా వచ్చినపుడు రాజకీయ మార్పులు కలుగుతాయి. కవులు అందుకు సహాయపడాలి.

**ప్రస్తుతం మీ కార్యక్రమం ఏమిటి?**

ఈ పీరియడ్‌ల పాటను బాగా పాపులర్ చేసిన, ప్రజల దగ్గరకు తీసుకెళ్ళడానికి ప్రతి వేదికను ఉపయోగించిన ఎర్రజండాను ప్రజల దగ్గరకు తీసకపోవడం నా లక్ష్యం. దానికి ఏ మార్గాలు పనికి వచ్చినా వాడుకుంట. నా పాటలు ప్రజలకు నచ్చడానికి కారణం అవి వాళ్ళకు దగ్గరగా వుండటమే. స్వామి అయ్యప్పలు కూడా మన బాణీలు తీసుకుంటున్నారంటే అంతే కద. మారిన పరిస్థితుల్లో దీన్ని ఎలా వాడుకోవాలి. ఎలా మలుచుకోవాలి అనే ప్రశ్న.

నాకు అన్నిటిలో పాట కనిపిస్తుంది. పాట కట్టాలనిపిస్తుంది. ఫ్యాను మీద రాసిన దాంట్లో ఫ్యానెట్ల తిరుగుతుందో దోమలను

తరిమేస్తుందో, పిల్లలను జోలపుచ్చుతుందో అన్ని రాసిన తర్వాత... "గుడిసెలో తిరిగెరోజు వరకు నడచుకుంట పోతుంది" అని ఫినిష్ చేసిన. ఈ థీమ్‌లో సోషల్‌గా చెప్పగలిగింది అది. కాని పీపుల్స్ వార్ ప్రోగ్రాం దాంట్లో లేదంటే నేనేం చేస్తాను? అన్ని ఒకటే విధంగా రాస్తామా? అది కరెక్టా?

**కొత్తగా రాసే వాళ్ళకు మీరేం చెప్తారు?**

పాట ఎప్పుడూ రాజ్యాన్ని ప్రశ్నించాలి. సాహిత్యం రాజ్యాన్ని ప్రశ్నిస్తుందా లేదా అని చూస్తాను నేను. ప్రజలు మనం చెప్పేదే కాదు. చేసేదీ చూస్తారు. చెప్పేదాంట్ల కొంతైనా చేయాలి. నూరు చెబితే పదైనా చేయాలి. అందుకే నేను యుజిలోకి పోయిన. అన్ని ఎదుర్కొన్న ఎన్నో పోగొట్టుకున్న ఈ మధ్య లండన్ నుంచి ఏదో సంస్థ పరిశోధన జరిపి బతికున్న వాళ్ళలో ఇంత ప్రజాదరణ గల కళాకారుడు లేదన్నట్లు చెప్పింది. నా మీద కాల్పులు జరిగిన తర్వాత ఆరోగ్య పరిస్థితిల మార్పు వచ్చింది. బుల్లెట్ లోపల వుండిపోయింది కదా గొంతు కొంచెం కొంచెంగా తగ్గిపోతుంది.

**బాగానే పాడుతున్నారు కదా?**

లేదు. ఇదివరకట్ల అయితే ఒక రాగం పట్టుకుంటే అట్లనే సానసేపు సాగతీస్తుంటి. ఇప్పుడు కొంచెం పోతుంది. అయినా ఏదో ఒక దాంట్లో పనిచేయాలని అనుకుంటున్న, చేస్తున్న. ఇప్పటికి చంపేస్తామనిసానా బెదిరింపులు వస్తుంటాయి. అయినా నా పద్ధతి నాకుంది. ఇప్పుడు నేను అన్ని వేదికలకు పోత. నాలైను నేను చెప్పుకుంట. ఈ పరిస్థితిని అడ్వాంటేజ్‌గా తీసుకుంటున్నాను. ఇందులో కూడా కిరికిరి వస్తుంటుంది.నేను లక్ష్యపెట్టను. కవి కళాకారుని పరిధిని కుదించడం కాదు. లైనుమీద చెక్‌పెట్టు. అంతే, బిబిసి వాడు నాతో ప్రోగ్రాంచేసి వరల్డంతా చూపుతనని ఫోన్ చేస్తున్నడు. ఒప్పుకోకుండా తర్జనభర్జనలు చేస్తున్నరు.

**రాజకీయం సరే. రచనాపరంగా కొత్తవాళ్ళకు మీ సలహాలు? ఎందుకంటే ఉద్యమ గీతాలు ఒకేరకంగా వుంటాయనే ఫిర్యాదు వుంది కదా?**

ఔను, మోనాటనీ కాకుండా జాగ్రత్త పడాలి. చేతులు కాళ్ళు శరీరం వున్నాయి కదా ఇవి అద్దంలో చూస్తే ఒక విధంగా కనపడతాయి. అదే ఫోటో తీస్తే మరోవిధంగా వుంటుంది. ఆర్ట్‌వేస్తే ఇంకా మరో విభిన్నంగా వుంటుంది. అదే కళా ప్రక్రియల మధ్యతేడా. అన్నిటికి ఒకే పద్ధతి పనికిరాదు. భూమి సమస్య మనకు కీలకమైంది. అది పరిష్కారమయ్యే వరకు దానిపై పాటలు వస్తూనే వుంటాయి. అయితే చెప్పేటప్పుడు విషయాన్ని అర్థం చేసుకుని చెప్పాలి. సీనియర్లను స్టడీ చేసి నేర్చుకోవలసినవి నేర్చుకోవాలి. పాత దాంట్లో నుంచి తీసుకుని కొత్త సందేశం జోడించాలి. "ఓలి ఓలిర ఓలి చెమ్మకేళీల వోలి" వుందనుకోండి. పాత తరహా పాటను మనం వాడుకోవడమే కదా. అలా అని ప్రజల తోకపట్టుకుని పోవద్దు. ప్రజల నుంచి నేర్చుకుని వారు నీ వెనక వచ్చే విధంగా రాయి, పాడు, ఆడు అది జరగాల్సింది. ట్యూన్ దొరికింది నేను ఏదో ఒకటి రాసేస్తానని రాయెద్దు. పని గట్టుకుని సాహిత్యం కోసం రాయొద్దు. రూపంలో మార్పు రావాలి. వస్తువు ఒకటే అయినా వైవిధ్యం వుండాలి. మన ముక్కు ఒకటే అయినా ఎన్ని రకాలున్నాయి? అట్లనే కళలో వైవిధ్యముండాలి.

**సాంకేతికంగా వస్తున్న సరికొత్త పరికరాలను ప్రజాకళలో ఎంతవరకు ఇముడ్చుకోవచ్చు?**

మారుతున్న కాలంలో అనేక కొత్త కొత్త పరికరాలు వచ్చాయి. వీటన్నింటిని మనం వాడుకోవాలి. ఆనాటి క్లాసికల్ సంగీతం నుంచి ఈనాటికీ బోర్డు వరకు ఏదైనా మనం తీసుకోవచ్చు. మనం చెప్పేది బాగా చెప్పడానికి ఉపయోగించవచ్చు. ఒక నాటకంలో అందరూ చనిపోయే సన్నివేశం వుంది. మా డైలాగుకు ఎంతకూ రెస్పాన్సు రాలేదు. క్లారినెట్ వాడుతూ విషాదరాగంలో డైలాగులు చెబితే చాలా స్పందన వచ్చింది. కాబట్టి ఎర్రజెండా కోసం దేన్నయినా ఉపయోగించవచ్చు. రహమాన్, బాల మురళీ కృష్ణ ఎవరైనా మన పాట పడితే మనకు అంతకంటే కావలసిందే ముంటుంది? బాలసుబ్రహ్మణ్యం వచ్చి మన పాటలు పాడతానంటే నేను ఆయన దగ్గర అసిస్టెంటుగా పని చేయనా? కమ్యూనిస్టులం. దేన్నయినా ఉపయోగించుకుంటాం. దేని మీదనైనా పాట కట్టగలను. ముక్కుమీద, చెట్టుమీద దేనిమీదనైనా మార్క్సిస్టు ప్రపంచ దృక్పథాన్ని చెప్పే పాట రాయొచ్చు. మీరు ఊహించలేరు.

**మీరు పాటగాడుగా బాగా జయప్రదమయ్యారు కదా. ఈనాడు పాట గొప్పదా, కవిత్వం గొప్పదా, వచనం గొప్పదా అని సాగే వాదోపవాదాలపై మీ అభిప్రాయం, అనుభవం ఏమిటి?**

కమ్యూనిస్టులం, పాట గొప్పది, కవిత్వం తక్కువది అంటూ వైరుధ్యాలు పెట్టడం మంచిది కాదు. ఫిలసాఫికల్‌గా దేని గొప్పతనం దానిదే. దేని పాత్ర దానికి వుంది. ఏదైనా ఒక సామాజిక విషయంలో విశ్లేషణ జనానికి సూటిగా చేరాలంటే మాత్రం కవిత్వం కన్నా నవల కన్నా పాట బాగా పని చేస్తుంది. అయితే వాటికి విలువ లేదనా? కాదు శ్రీశ్రీ నన్ను ఉత్తేజపరిస్తే నేను లక్ష మందిని ఉత్తేజపరుస్తాను. నేను ఆయన కవితలకు డాన్సు తయారు చేశాను. శ్రీశ్రీ, చెరబండరాజు, జాషువా, గోర్కి నవలలు కథలు కవితలు అన్ని ఎంతమందికో ప్రేరణ ఇచ్చి కదిలించాయి. ఆ రూపం ఎందుకు ఎన్నుకున్నారు. ఏది గొప్ప అనే చర్చల అర్థం లేదు. దేని గొప్ప దానిదే. ఇంట్లో వస్తువులలో ఏది గొప్ప? టేబులు, కుర్చీ, స్టవు, బీరువా, చీపురు కట్ట తక్కువదా? అది లేకుంటే జరుగుతుందా? దాని మీద కూడా పాట రాసిన కదా. కాబట్టి అన్ని సాహిత్య ప్రక్రియలకు వాటి వాటి స్థానం వాటికుంటుంది. అందులో భాష ఎలా వుండాలి. ప్రజల దగ్గరకు ఎలా తీసుకుపోవాలి, ఇందులో సిద్ధాంతం ఎట్ల చెప్పాలి వంటి విషయాలను లోతుగా చర్చించాలి. నేను దీనిపై చాలా నోట్సు తయారు చేయించిన. అయితే ఈ విషయాలను నేను ఇంత లోతుగా ఆలోచిస్తుంటనని చాలామందికి తెలియదు. మీలాటి వాళ్ళంతా విశ్లేషణ చేయాలి.

**(ప్రస్థానం ప్రత్యేక సంచిక మే 2002 నుంచి)** ■




# మద్యంపై పోరాటం కాళ్ళకూరి 'మధుసేవ'నాటకం

– డా॥ జోస్యుల కృష్ణబాబు
98664 54340

**మద్యరస మనుకార్చిచ్చు మానవుడను**
**తరువునకు సోకినంతనే తత్తదవయ**
**వమ్ములనెడి కొమ్మలతోడవమ్ము చేసి**
**బుద్ధియను చేవతో గూడ బుగ్గి సేయు!** అంటూ మద్యపాన వ్యవసనంపై పదునైన బాణాన్ని ఎక్కుపెట్టారు కాళ్ళకూరి నారాయణరావు. సమాజాన్ని ప్రభావితం చెయ్యాలంటే శ్రవ్యం కంటే దృశ్యం గొప్పదని ఆయన భావించారు. అందుకే ఆనాటి (ఈనాటికి కూడా) సమాజాన్ని పట్టి పీడించే మూడు సామాజిక సమస్యలపై మూడు పదునైన అస్త్రాల్ని ఆయన ప్రయోగించారు.

వేశ్యావృత్తి, వేశ్యాలోలత వల్ల కలిగే అనర్థాల్ని వివరిస్తూ చింతామణి నాటకాన్ని, వరకట్న దురాచారం వల్ల కలిగే కష్ట నష్టాల్ని వివరిస్తూ వర విక్రయాన్ని, మద్యం రక్కసి కోరల్లో చిక్కి కొంపలను ఆరోగ్యాన్ని గుల్లచేసికొనే వారి జీవితాల్లోని విషాదాన్ని గూర్చి మధుసేవ నాటకం ద్వారాను కాళ్ళకూరి చాలా బలంగా చిత్రీకరించారు.

అయితే ప్రదర్శన విషయానికి వస్తే చింతామణి నాటకం ఆంధ్రదేశమంతటా ఊరూరా, వాడవాడలా ప్రదర్శితమై ఆబాలగోపాలాన్నీ అలరించింది. వర విక్రయం ప్రదర్శన కంటే కూడా ఎక్కువగా రేడియో నాటికగా అనేకసార్లు ప్రసారమై జన హృదయాల్లో నిలిచిపోయింది. ఈ రెండూ చలన చిత్రాలుగా కూడ వచ్చాయి.

ఇక ఎటొచ్చీ ఈ మధుసేవ నాటకం మాత్రం తక్కిన రెండు నాటకాల్లాగా నాటక ప్రియులకు అంత దగ్గర కాలేకపోయింది. కాని రచనాపరంగా, సాహిత్యపరంగా ఇదికూడ గొప్పనాటకం. ఇప్పటికీ సమాజంలో మొదటి రెండు సమస్యలకంటే కూడ చాలా బలంగా వేళ్ళూనుకొన్న అతిపెద్ద సమస్య ఈ మద్యపానం. ఈ అంశాన్నే తీసుకొని కాళ్ళకూరి 1926లో 'మధుసేవ' నాటకాన్ని రాసారు. ఇది కూడా 10 అంకాలనాటకం. ప్రముఖ గాంధేయవాదులైన నారాయణరావు మహాత్ముని ప్రభావానికి లోనై మధుసేవను కథావస్తువుగా స్వీకరించి ఈ నాటకాన్ని రాసారు.

**కథావస్తువు :** ఇందులో నాయకుడు జమిందార్ రఘునాధరావు. చాలామంచివాడు, దైవభక్తి పరుడు, దుర్వ్యసన పరాఙ్ముఖుడు. మరీ ముఖ్యంగా మద్యపానాన్ని తీవ్రంగా వ్యతిరేకించేవాడు. ఒక్క మద్యపానమనేకాదు, నస్యము, సిగరెట్టు, బీడీ, నల్లమందు, గంజాయి – ఇవన్నీ మనిషికి ఎంత హాని చేస్తాయో తన మేనేజర్ అయిన విశ్వాసరావుకు చెపుతాడు. అతనిచేత నశ్యంకూడమాని పిస్తాడు. త్రాగుబోతురంగడుని పనిలోంచి తీసేస్తాడు.

అటువంటివాడు ఒకసారి అనుకోకుండా గుర్రం మీద నుండి పడిపోయి స్పృహతప్పుతాడు. అప్పుడు రంగడు అతని నోటిలో కొంత మద్యం పోసి డాక్టర్ వద్దకు తీసుకువెళతాడు. ఆ డాక్టర్ కూడ కొన్ని రోజులపాటు రఘునాధరావుచే మద్యం త్రాగిస్తాడు. అక్కడి నుండి రఘునాధరావు మద్యానికి బానిస అయిపోతాడు. శర్మ అని మరొక భ్రష్టుడు తన పబ్బం గడుపుకోవటం కోసం రోజూ రఘునాధరావుతో కలిసి మద్యం సేవించటమే కాక, కస్తూరి అనే వేశ్యని పరిచయం చేస్తాడు. పూర్తిగా ఆమె వలలో చిక్కిన రఘునాధరావు మొత్తం తన ఆస్తినంతా పోగొట్టుకొంటాడు. కనబడిన చోటెల్లా అప్పులు చేస్తాడు. రోడ్డున పడతాడు. ప్రాణంగా ప్రేమించిన భార్య కూడా బెంగతో మరణిస్తుంది. చివరకు జ్ఞానోదయ మవుతుంది. మామగారు చనిపోతూ కూతురు పేర రాసిన ఆస్తి ఇతనికి దక్కుతుంది. ఆ ధనాన్ని మద్యపాన వ్యతిరేక ఉద్యమానికి వినియోగించాలనే ఒక స్థిర నిశ్చయానికి వస్తాడు రఘునాధరావు. ఇతని మేనేజరు విశ్వాసరావు కూడ రఘునాధరావుకు చేదోడు వాదోడుగా ఉంటాడు. ఇదీ స్థూలంగా ఇందలి కథ.

**మద్యప్రియుల మనస్తత్వాలు :** రఘునాధరావు – శర్మ కలిసి

మద్యాన్ని సేవిస్తుంటారు. ఇంతమంది ఎందుకు మద్య ప్రియులుగా మారుతున్నారు, ఏమిటి దాని మహాత్మ్యం? అని రఘునాధరావు అడిగిన ప్రశ్నకు శర్మ దాని మహిమయే దానికి కారణమంటూ ఇలా వర్ణిస్తాడు.

**"బ్రాందిసీసా కంటబడగానె వరహాల**
**పాతు కాన్పించిన పగిది దోచు**
**రప్పుమంచును గార్కు చప్పుడైనంతనె**
**జయభేరి విన్నంత సంభ్రమొదవు**
**దొడదొడ గ్లాసులో దొలికించు సమయాన**
**నమృతంబు పడుచున్న యట్టులుండు**
**చుఱ చుఱ గొంతులో జొచ్చెడు తరి, పోయి**
**నట్టి ప్రాణము వచ్చినట్టులొప్పు**
**అవలనానంద వార్ధినోలాడునట్లు**
**స్వర్గ భూమి విహారము సలుపునట్లు**
**రంభ యొడిలోన నిద్దుర క్రమ్మినట్లు**
**తన్మయావస్థలోన జిత్తము సుఖించు"**

అంతేకాదు మధువు ఒక్క గ్లాసు సేవించటం వల్ల కసుకందు కూడ లేచి హనుమంతునికి గంతులు నేర్పుతాడని, మూగవాడు వేనోళ్ళతో ఆదిశేషుని వెక్కిరిస్తాడని, పిరికివాడు సహితం శత్రువును చాచికొడతాడని, పుంస్త్వహీనుడు సింహబలుడౌతాడని, లోభి దానకర్ణుడౌతాడని, శోకభరితుడు హర్షాంబుధిలో తేలతాడని – ఇలా సాధారణంగా మద్యప్రియులు చెప్పే ప్రయోజనాలన్నిటినీ ఏకరవు పెడతాడు.

ఈ నాటకంలో రఘునాధరావును మద్యమే సర్వభ్రష్టుణ్ణి చేస్తుంది. ఆ మద్యం వల్లే అతనికి వేశ్య కస్తూరి దగ్గరౌతుంది. ఆమె పరిచయం వల్లే మొత్తం అతని జమిందారీగిరి అంతా సర్వనాశన మవుతుంది. కడకు భార్యను కూడ పోగొట్టుకొంటాడు.

**కస్తూరిపై శ్రీహరి పాత్ర ప్రభావం :** ఇందులో కస్తూరి పాత్రలో మనకు చింతామణి పాత్ర కంటె ఆమె తల్లి శ్రీహరి పాత్ర ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంది. శర్మకి కస్తూరిపై మనసవుతుంది. కాని ఆమెను మెయింటైన్ చేసే స్తోమత అతనికి లేదు. అందుకని జమిందార్ రఘునాధరావును ఆమెకు అలవాటుచేసి తద్వారా ఆమెకు దగ్గరవ్వాలనుకొంటాడు. ఆయాసమాయనది–అనుభవము తనది చేసుకోవాలనుకొంటాడు. ఆమె అతని కంటే నాలుగాకులు ఎక్కువ చదివింది. రఘునాధరావు వశమవుతున్నాడన్న ఆనందాన్ని లోపల అణుచుకొని, శర్మ అంటేనే తనకెంతో ఇష్టమన్నట్లుగా, అతనిని చూడనిదే ఉండలేనన్నట్లుగా మాట్లాడుతుంది.

ముందుగా శర్మను పూర్తిగా వశం చేసుకొంటుంది. ఆతని ద్వారా జమిందార్ రఘునాధరావును లోబర్చుకొంటుంది. రఘునాధరావు పరిచయమైతే తాను కూడ తక్కిన తనతోటి సాని కూతుళ్ళ వలె ఒక వెలుగు వెలుగుతాననుకొంటుంది. అంతేకాదు వేశ్యకు ఒకానొక ఉన్నతుని ప్రాపకం అవసరమంటూ

**"వర్తకునకూర మేడయు, వైద్యునకొక**
**పతకమును, న్యాయవాదికి బండి, వేశ్య**
**కున్నత ప్రాపకంబివి యొదవెనేని**
**పరపతియు, గౌరవము వచ్చుబడియు హెచ్చు"** అని

భావిస్తుంది.

**మద్యపాన ప్రభావం :** రఘునాధరావు చాలా అందగాడు. విపరీతంగా తాగుడుకు బానిసైపోవడంతో, అప్పులపాలవడంతో అతని రూపురేఖలు పూర్తిగా మారిపోతాయి. రఘునాధరావును ఎంతో అభిమానించే ఆతని మేనేజర్ విశ్వాసరావు తాగుడుకు అలవాటుపడ్డ తన యజమాని రూపురేఖల్ని తలచుకొని, **"శివుని గళ మొక్కటియె నల్పుచేసినట్టి/ కాలకూటంబు సురకన్న మేలు కాదె"** అంటూ బాధపడతాడు. శివుని కంఠాన్ని మాత్రమే నలుపుచేసిన ఆ కాలకూట విషమే మద్యం కంటే నయమని కాళ్ళకూరి భావన. నిజమే! మద్యం గౌరవాన్ని పోగొడుతుంది. ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. అందాన్ని హరిస్తుంది. సాధారణంగా ఇలాంటి మద్యవ్యసనం ఎవరికైనా చెడు స్నేహాలవల్లే అలవాటవు తుందని అంటూ, ఖలునితో మైత్రి ఎంత ప్రమాదమో చెపుతూ, శర్మతో స్నేహమే తన యజమాని పతనానికి కారణమంటూ వాపోతాడు విశ్వాసరావు.

**మద్య బానిసల ఇల్లాళ్ల అగచాట్లు :** రఘునాధరావును మద్యవ్యసనం నుండి వేశ్యావ్యసనం నుండి మరల్చాలని భార్య నిర్మల ఎంతగానో ప్రయత్నిస్తుంది. అయినా అతడు దారికి రాడు. తనలాంటి స్త్రీలు లోకంలో ఎందరున్నారో, వారెలా ఈ నరకాన్ని భరిస్తున్నారో అంటూ ఆమె ఇలా బాధపడుతుంది.

**"భర్త యేవేశ్యపజ్జనో పండుకొనగ**
**నింటనొంటిగ శయనించి కంటగూర్కు,**
**వెంట తోడును లేక తపించునట్టి**
**రమణికంటెను నిర్భాగ్యురాలు కలదె?"** – అంతేకాదు
**"కానలోనమొఱడుగా బుట్టవచ్చును**
**నీటికుక్కగా జనింపవచ్చు**
**పరగ త్రాగుబోతు భార్య కాకూడదు**
**కలను నైన – నాటకముననైన"** అంటూ వాపోతుంది. భర్త

ఆస్తి అంతా హరించుకుపోయినా, తండ్రి మరణంతో ఆమెకు ఆస్తి దక్కుతుంది. ఆ ఆస్తికోసం శర్మ కస్తూరులు రంగడి ద్వారా ఆమెను హతమారుస్తారు. రఘునాధరావు పై ఆ హత్యానేరం మోపబడుతుంది. విశ్వాసరావు సహకారంతో రఘునాధరావు నిర్దోషిగా బయట కొస్తాడు.

**రఘునాధరావు పశ్చాత్తాపం :** తన ఇల్లాలిని అంత బాధ పెట్టినందుకు, ఆమెను పోగొట్టుకొన్నందుకు చాలా బాధపడతాడు

రఘునాధరావు.

**"ఎచటనో పుట్టి తమయిండ్లకేగుదెంచి**

**తమ్మెదైవములుగ చిత్తమునననమ్మి**

**తమనిమిత్తము బ్రతుకులు ధారవోయు**

**సతులనేడ్పించు పతులకు గతులు కలవె?**

అంటూ పరితపిస్తాడు. కస్తూరి మాటనమ్మి తానెంతో ఆత్మీయంగా మామా అని పిలిచే మేనేజర్ విశ్వాసరావుని కూడా అనుమానించి అవమానించినందుకు పరితపిస్తూ క్షమాపణకోరుతూ ఇలా పశ్చాత్తాపాన్ని వ్యక్తంచేస్తాడు.

**"కుల గోత్రములు మాపుకొని రేపవలు మద్య**

**పాన మొనర్చిన పాప ఫలము**

**ఎగ్గు సిగ్గులు వీడి యేవేళ వెలయాలి**

**పంచను బడియున్న పాప ఫలము**

**అగ్నిసాక్షిగ పెండ్లాడిన నిజ ధర్మ**

**పత్ని నేడ్పించిన పాపఫలము**

**దూరదృష్టియుడిగి దుష్టులతో సహ**

**వాసమొనర్చిన పాప ఫలము**

**అన్నెముంబున్నెము నెఱుంగనట్టి మిమ్ము**

**బరుషవచనంబు లాడిన పాపఫలము**

**నేడుగాకున్న మరియొకనాడయినను**

**వడ్డితో గూడ ననుభవింపగవలదె"** అంటూ పరితపిస్తాడు. చింతామణి కథానాయకుడు బిల్వమంగళుడికి, రఘునాధరావుకి చాలా దగ్గరి పోలికలు కనిపిస్తాయి.

ఈ నాటకం అప్పట్లో వేల సంఖ్యలో ప్రదర్శితమయింది. ఇతర రాష్ట్రాలలో కూడా, ముఖ్యంగా కలకత్తాలో ప్రదర్శితమైనట్లు ప్రముఖనటులు కీ.శే. స్థానం నరసింహారావు గారు తమ నటస్థానంలో పేర్కొన్నారు. మద్యపానం మంచిదికాదని ప్రబోధించే నాటకాలు కాళ్ళకూరే కాక ఆయన ప్రభావంతో మరికొందరు కూడా రాసారు. 1. మధుసేవ - నాటకసర్వతి (1928) 2. మధుసేవ - మద్దూరి శ్రీరామ్మూర్తి (1934) 3. సురానంద - కొడాలి సత్యనారాయణరావు (1924) 4. మద్యనిషేధం - పులిజాల వేంకట అప్పారావు (1949).

ఈ విధంగా చెడు స్నేహాలు, వాటివల్ల ఏర్పడే మద్యపాన వ్యసనం, దాని వల్ల ఏర్పడే వేశ్యా సంపర్కం, వీటన్నిటివల్ల సంప్రాప్తమయ్యే పతనం, సర్వభ్రష్టతలను కవి చాలా స్పష్టంగా ఈ నాటకంలో వివరించారు. ఈవిధంగా కాళ్ళకూరి నాటకాలు సాంఘిక దురాచారాలను తూర్పారబట్టి కవి కాళ్ళకూరి నారాయణరావు యొక్క ఖ్యాతిని ఇనుమడింపజేసాయి. నాటక సాహిత్యంలో కాళ్ళకూరికొక ప్రత్యేక స్థానాన్ని కలుగజేసాయి.

■

# అష్ట పది

**అ**లా చూడు..!
యెలా అల్లుకున్నానో
ఆంక్షలు లేని ఆకాశం
భూమిని కప్పేసినట్టుగా
తల్లిగర్భంలో బిడ్డను దాచినట్టు..

యిలా చూడు ..
నీలో యెలా కలిసిపోయానో
కడలిలో సంగమించిన నదిలా
అస్తిత్వాన్ని వీడి అనంతమయ్యాను
నదివి నీవని చూపలేనంతగా ..

యెలా చెప్పను..?
పంచభూతాల సాక్షిగా
ప్రాణమై ఉన్నాను
ఉచ్ఛ్వాస నిశ్వాసలో ఊపిరిలా
శబ్దంలో నిశ్శబ్దం దాగినట్టుగా ...

జయించాలనుకున్నావు
జీవిద్దామనుకున్న
ఆసరా నెట్టేసినంత మాత్రాన
మల్లెతీగ వాడిపోదు
పాదులో తల్లి వేరుంటుంది
దేహంలో ప్రాణం ఉన్నట్టుగా ...

విజయంలో యేముంది
ఓడించిన ఆనందమే
ఒడిదుడుకుల జీవితంలో
జీవనం సాగించాలంటే
జీవం ప్రధానం మెండుగా ఉంది
నాకు నేనే రాజు
నేనే మంత్రి నేనే బంటు అన్నట్టుగా
విరిగిన చోటే పరిష్కారముంటుంది
కనిపిస్తాను విసిరేసిన విత్తు
మహా వృక్షమైనట్టుగా
నమ్మకం నాకుంది..!

**- జంగం స్వయంప్రభ**
**88975 52022**

# ఆత్మీయత పంచు



**క**ళ్లున్నాయ్..!
జరుగుతున్న అకృత్యాలని
చూడడమే మానేసాయ్..!
చెవులు ఉన్నాయ్ ..
అబలల ఆవేదనను
వినడం మానేశాయ్.!
చేతులు ఉన్నాయ్..
సేవ చేయాలనే భావనని
ఏనాడో మర్చిపోయాయ్..!
అయ్యో...
నోరు కూడా ఉందండి బాబు..
నిజం తప్ప అన్నీ మాట్లాడుతుంది!

అప్పుడు వస్త్రాపరణం
ఒక సారే జరిగింది.
ఇప్పుడు రోజూ నిత్యకృత్యమే..
అందుకే కాబోలు
కళ్లు కలత చెంది..
చూడడమే మానుకున్నాయ్!

అప్పుడు జానకొక్కర్తికే
అవమానం జరిగింది
ఇప్పుడు జగతంతా
దగా పడ్డ జానకీలే !
అందుకే కాబోలు
ఆ మగువల ఆర్తనాదాల్ని
చెవులు వినడం మానుకున్నాయి!

అప్పుడు.. మాటల్లో మమకారం
వాక్కుల్లో వాత్సల్యం
దివ్వెలోని వెలుగులా
పువ్వులోని తావిలా
గుండెలోతుల్లో ఆత్మీయత పంచేవి
అదేంటో ఇప్పుడు
మాటలు మర్మాన్ని తొడిగి
మనిషిలోని మంచితనాన్ని
మాయం చేస్తున్నాయ్..!

అందుకే కాబోలు..
మాటలు మూగనోము వహించాయి

అప్పుడు
పరహిత చందనం పూసుకుని
తన పర బేధం వదులుకుని
దివ్వె మరిన్ని దీపాలను వెలిగించినట్లు..
సేవామృతాన్ని పంచే వాళ్లు..!
మరిప్పుడో..
సేవకి చరమగీతం పాడి
స్వార్థంతో చెలిమి చేస్తూ
మంచిని ముంచి
అసురత్వానికి ఆనవాళ్లుగా మిగిలిపోతున్నారు!

ఓ.. మనిషీ..!
కుళ్ళిన సమాజాన్ని
కళ్లతో చూడు..
వినిపించే వేదనని
దూది పింజెలా ఊది పారేయ్..
మాటల్లో భరోసా నింపి
బడుగుల జీవితాల్లో
పున్నాగ పూలు పూయించు
సేవతో చెలిమి చేసి
బతుకు నావను నడిపించు..
అందరి బంధువై ఆత్మీయత పంచు..

- కోరాడ అప్పలరాజు
95502 34204

# మా పిల్లాడి మైదానం

మీకు నా చిన్ని ప్రపంచాన్ని చూపినా
రెక్కలు విచ్చుకున్న మా పిల్లోడు
గుండెలపై తూనీగలా ఎగిరిగంతేవాడు
వాడికి నా గుండె ఓ మైదానంలా ఉండేది

ఇప్పుడు టీవీ చూడటం మొదలెట్టాడు
తమాషాగా బ్యాట్ పట్టుకొన్నాడు
ఓ మైదానాన్ని వెతుక్కున్నాడు

చిన్న వయసులో వాడు కొట్టే ప్రతి బంతిలో
ఉత్సాహం ఉరకలేస్తుంది

వాడి కళ్ళలో మెరిసే ఆనందాన్ని
నాలో దాచుకున్నాను


ఒక్కోసారి చెబుతాను
ఆటలో గెలిచినట్లు ఆటలో ఓడినట్లు
సంఘటనలు ఎదురవుతాయనీ..
ఓడినా వెనుతిరగని వాడే
గెలుస్తాడనీ బోధిస్తాను
జీవిత పాఠాలని వినిపిస్తాను

మా పిల్లోడు ఆకాశాన్ని ఆరేసుకుంటాడు
బంతులతో చుక్కల్ని చెక్కుతుంటాడు
ఆటల్లేని చదువులకి ఆరాటపడక
ముంగిట వాలిన బాల్యాన్ని ఆస్వాదిస్తున్నాడు
సమతుల్యతను సాధన చేస్తున్నాడు

బాల్యమంటేనే ఓ పూలపరిమళం
ముళ్ళుగుచ్చినా తీసి
ఇంకా పరిగెత్తటంలో ఆరితేరుతున్నాడు!

**- గవిడి శ్రీనివాస్**

**70192 78368**





# నిష్టూరపు సమయం

సడలిన బంధాలు
అరక్షణం కూడా ఆలోచించలేని
అపార్థాల నడుమ
మళ్ళీ మళ్ళీ ముడిపడలేక
తడిసిన ఆకాశపు అంచుల్లా
విలపించబోయే ముందు
ఒదిగి వున్న సంద్రంలా
బడబాగ్నిని గుండెల్లో దాచుకున్నాయి

ఆత్మాభిమానపు పెనుగులాటలో
భుజానికి తగిలించుకున్న ప్రశ్నలు మరింత బరువెక్కితే
యాంత్రికత్వపు ముసుగులో
వర్తమానం సమాధానంకై వెతికింది

ముళ్లకంప మీద విసిరేయబడ్డ మనసు
బయట పడేందుకు భ్రమను సాయం అడిగింది

ముడులను మళ్ళీ మళ్ళీ సరిచేస్తున్న మమకారం
చిరాకుకు చిరునామా అయితే
ఆత్మాభిమానం అనవసరపు
పెనుగులాటతో అంతర్యుద్ధం చేస్తోంది

అభిమాన ఆత్మాభిమానాల మధ్య జరుగుతున్న సంఘర్షణ
హోరెత్తిన సంద్రంలా అగుపించినా
కాళ్ళ కింద ఇసుకకు మల్లే కృంగదీస్తోంది

ఈ నిష్టూరపు సమయం కూడా జీవన దశే అని
సాగిపోవాలని తెలిసేందుకు అనుభవమే చాలట్లేదు!

**- కళ్యాణదుర్గం స్వర్ణలత**

**98486 26114**





# మహానుభూతి కలిగించిన కాలనాళిక

- డాక్టర్ తిరునగరి శ్రీనివాస్
84660 53933

**చ**రిత్రలో నమోదైన అనేక యుద్ధాలకు, ప్రతిఘటనలకు, ఆత్మార్పణలకు, ఎదురొడ్డిన తిరుగుబాట్లకు కేంద్రస్థానమై పరిఢవిల్లిన చారిత్రాత్మక ప్రాంతం వరంగల్లు. 1945 నుండి 2017 వరకు వరంగల్లు నగర చరిత్రను అధ్యయనం చేయడం ద్వారా తెలంగాణ రాష్ట్రాన్ని, బహుముఖంగా భారతదేశ చారిత్రక ఔన్నత్యాన్ని అవపోశన పట్టి విశ్లేషించిన నవల రామా చంద్రమౌళి కాలనాళిక. అనేక చారిత్రక సంఘటనల లోతుల్ని, ప్రజా ఉద్యమ పరంపరల్ని తడిమి విస్తారంగా విశ్లేషించిన తీరు ఈ నవల చదివే పాఠకులకు మహానుభూతిని కలిగిస్తుంది.

వందలాది కన్నీటి జ్ఞాపకాలను అగ్ని చినుకుల్లా కురిపించే సంఘటన క్రమాన్ని కాలనాళికలో చూడొచ్చు. తెలంగాణ ప్రాంతమంతా వేల మంది వీరుల ఆత్మార్పణలతో అగ్నిగోళమై మండి రక్తకాసారమై త్యాగాలకు ప్రతీకగా మారిన చారిత్రక సందర్భాలను ఈ నవల తేటతెల్లం చేసింది. పరాయి దోపిడీకి శతాబ్దాలుగా గురై అణగారి పోయిన తెలంగాణ జనసామాన్యం కంట నిండా పారిన కన్నీటిని బిగబడుతూనే అలుపెరగక జరిపిన పోరాటాల వివరణ కన్పిస్తుంది. వెట్టిచాకిరి, బానిసత్వం, నిస్సహాయత, నీ బాంచెను దొరా బతుకులు, చిత్ర హింసలతో ఇక్కడి మనుషుల జీవితాలు కన్నీటి చెరువులయ్యాయి. అన్యాయాన్ని ప్రతిఘటించిన ప్రతి మనిషీ ఒక ఆయుధమై సాయుధుడిగా మారి ప్రత్యక్ష యుద్ధమే చేశాడు. నిరంతర ప్రతిఘటన మధ్య రక్త సిక్తమైన చరిత్ర చిత్రణలో వీరోచిత దృక్కోణాలు ఎన్నో ఉన్నాయి.

కాకతీయ చక్రవర్తి రెండవ ప్రతాపరుద్రుడు 1924లో ఢిల్లీ సుల్తాన్ మహ్మద్బిన్ తుగ్లక్ చేతిలో పరాజయం పొందిన తరువాత తెలంగాణ ప్రాంతం పరాయి పాలనలోకి వెళ్లింది. 1324 నుండి 1347 వరకు దాదాపు 23 సంవత్సరాలు ఢిల్లీ సుల్తానులు, 1347 నుండి 1512 వరకు దాదాపు 165 సంవత్సరాలు బహుమనీలు, 1512 నుండి 1667 వరకు 17 సంవత్సరాలు కుతుబ్‌షాహీలు, 1687 నుండి 1723 వరకు 36 సంవత్సరాలు మొఘల్‌లు, చివరగా 1724 నుండి 1948 వరకు 224 సంవత్సరాలు అసఫ్ జాహి నిజాంలు ఈ ప్రాంతాన్ని పరిపాలించారు. మొత్తం 624 సంవత్సరాల సుదీర్ఘకాలం ఈ పాలన కొనసాగింది. బానిస బతుకులతో అణచివేత, దౌర్జన్యాలు, దోపిడీ, పీడనల మాటున తెలంగాణ చితికిపోగా పోరాటాలు ప్రజ్వరిల్లాయి. కత్తుల వంతెనపై నెత్తురోడిన రీతిలో ఆత్మాంతర గతాన్ని నవల అవలోకించింది.

భారత దేశంలోని 565 సంస్థానాలలో అతిపెద్ద సంస్థానంగా ఆనాడు హైద్రాబాదు ఉండేది. నిజాం ప్రభుత్వ ఏలుబడిలో 24,400 చదరపు మైళ్ళ విస్తీర్ణంలో 6848 జాగీర్లు ఉన్నాయి. భూములపై పూర్తిగా నిజాం పాలకులకే హక్కులుండేవి. ఇతర జాగిదార్లపై దేశ్‌ముఖ్‌లు, జాగీర్దార్లు, జమీన్‌దార్లు, ముక్తేదార్లు, ఇనాందార్లు అధిపతులుగా ఉండగా జరిగిన వెట్టిచాకిరి, విపరీతమైన హింసలు, పంటల దోపిడీ, లక్షల ఎకరాల భూ దోపిడీలను, రజాకార్ల దాడులను, ప్రజాప్రతిఘటన పోరాటాలను, అప్పటి ప్రభుత్వ సర్వీసుల్లోని తీవ్ర అసమానతలను ఈ నవల జరిగిన అనేక సంఘటనల ప్రాతిపదికగా విశ్లేషించి చూపింది.

పీడిత ప్రజలను చైతన్య పరిచి తరతరాల బానిస సంకెళ్లను ధ్వంసం చేయడానికి మొట్టమొదటి ప్రజాసంఘంగా ఆంధ్ర మహాసభ జరిపిన కృషిని వెల్లడించింది. నిజాం రాష్ట్ర వ్యాప్తంగా 13 ఆంధ్రమహాసభలను ప్రజల సహకారంతో కమ్యూనిస్టు పార్టీ ముఖ్యనేతలు తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల నుండి నిర్వహించి సంఘం పేరుతో నిజాంపై లక్షల మంది సాయుధ

జన సైన్యంతో ప్రతిఘటన ప్రారంభించిన ఉదంతాన్ని దృశ్యమానంగా నవల చూపింది. 1946 నుండి 1951 వరకు ఉద్విగ్నభరితంగా ప్రచండ ప్రభంజనంగా జరిగిన సుదీర్ఘ వీరోచిత సాయుధపోరు ప్రపంచాన్ని తెలంగాణ వైపు చూసేలా చేసింది. అది ఒక అద్భుత పోరాట చరిత్రగా ఈ నవల ఆవిష్కరించింది.


17 సెప్టెంబర్ 1948న భారత ప్రభుత్వానికి నిజాం లొంగిపోయిన తరువాత తెలంగాణ ప్రజలకు విమోచన కలిగిన విధాన్ని ఆ తదనంతరం 1949 డిసెంబర్ తరువాత తెలంగాణ రైతాంగ సాయుధ వీరులైన 3600 మందిని అడవుల్లో గాలించి ఊచకోత కోసిన సంఘటనలను నవల రక్తసిక్త వాస్తవ చరిత్రగా విశ్లేషించింది. పోరాటం ముగిసిన తరువాత ఎన్నో అకృత్యాలకు బాధ్యులైన వారికి శిక్షలు లేకుండా రాజభోగాలు సమకూరిన తీరును, రాజభరణాలు అనుభవించిన స్థితిని నవల పేర్కొంది.

ఎన్నో దురాగతాలకు కారణమైన వారు భారతదేశాన్ని విడిచివెళ్లి ఇతర దేశాల్లో స్థిరపడడాన్ని నవల ఎత్తిచూపింది. 1956 నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అవతరించిన తరువాత తెలంగాణ ప్రయోజనాలకు క్రమంగా జరిగిన భంగపాటును నవలలో వివరంగా పేర్కొన్నారు. తెలంగాణ ప్రయోజనాలను తాకట్టుపెట్టిన ఆనాటి రాజకీయ దుస్థితిని నవలలో ఎండగట్టారు. 1969 తెలంగాణ తొలిదశ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసి 14 పార్లమెంట్ సీట్లకు 10 మంది గెలిచిన తరువాత జరిగిన పరిణామాలలో విలువలు పతనమైన తీరును స్పష్టపరిచారు. వరంగల్లు నగరం తెలంగాణ స్థితిగతులకు నిత్య సంచలిత ప్రాంతమై ఉనికిని, అస్తిత్వాన్ని కాపాడేందుకు దేశవ్యవస్థతో మమేకమైన తీరును వెల్లడించారు.

నూతన పారిశ్రామిక విధానం – 1991తో ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణ పేరుతో జరిగిన నష్టాలను వివరించారు. నిస్సిగ్గుగా పతనమైన నైతిక విలువలు, పడిపోయిన జీవన ప్రమాణాలు, వ్యష్టి సౌకర్యాల అన్వేషణ వంటి విపరిణామాలతో ఏర్పడిన భ్రాంతిమయ స్థితిని రచయిత వివరించారు. 1991 నుండి విద్యారంగం వ్యాపారంగా మారి విద్యాప్రమాణాలు అడుగంటిన స్థితిని వెల్లడించారు. నైపుణ్యాలు శూన్యమై హ్యూమెన్ గార్బేజ్‌ను సృష్టిస్తున్న భయానక స్థితిని, మనుషుల్లో అనుచిత ప్రవర్తన, స్వార్థపూరిత ధోరణులు, అవినీతి వంటివి పెరిగిపోవడం వంటి వాటిని విశ్లేషించారు.

కెసిఆర్ తెలంగాణ కోసం 2001లో తెలంగాణ రాష్ట్ర సమితిని ఏర్పరిచి, ప్రజలను కదిలించి చేసిన పోరాటంతో 2జూన్ 2014న తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించడాన్ని ఒక అపురూప మహత్తర ఘట్టంగా తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత జరుగుతున్న కృషిని చెబుతూనే దుష్ట సంక్లిష్ట స్థితులను అధిగమించాల్సిన అవసరాన్ని నవల తెలిపింది. తెలుగు విశ్వవిద్యాలయం 2019 సంవత్సరానికి ఈ నవలకు ఉత్తమ పురస్కారాన్ని అందజేసింది. 1945 నుండి 2017 వరకు జరిగిన ప్రతిఘటన చారిత్రాత్మక వరంగల్లు నగరాన్ని కేంద్రబిందువుగా భావించి యావత్ తెలంగాణను, దేశాన్ని అవలోకించి మహానుభూతిని కలిగించిన అద్భుత నవలగా కాలనాళిక మిగిలిపోతుంది. ■

## తర్వాత ...



నీ స్వరం నన్ను అనువదించింది
అదొక స్పష్టమైన జ్ఞాపకం

నువ్వు నా చేతులు, మాటలను
ఎందులోనో బంధించుకున్నావు
ఇప్పుడదంతా పక్షులపాలైంది!

నువ్వు సంతకం చేయడానికి,
అనువదించడానికి
దారితీసింది ఏమిటి?
నీ పటిమ నన్ను ఉక్కిరిబిక్కిరి చేసింది

ఇతరులు ఎగతాళి చేయడంతో
చెవిటివాడిగా మారావు
నీ చెవులు వినడానికే అలవాటు పడ్డాయి

నన్ను మరొకసారి అనువదించు
మనమెలా పాడగలమో!
నాకు చాలా ఇష్టం

మరణం ఒక క్రూరమైన వ్యాఖ్యాత
తర్వాత ఏదీ అనువదించనీయదు!

**ఆంగ్లం : రేమండ్ లక్జాక్**
**స్వేచ్ఛానువాదం : జాని తక్కెడశిల**

# రెప్ప చాటు స్వప్నం

అప్పుడప్పుడు
ఆమెకు కొంచెం విశ్రాంతి కావాలి
జీవితమనే తక్కెడలో తనువు, మనసు
చెరో వైపు తూగుతుంటే
సరితూగవని తెలిసిన జీవిత కథనం ఆమెది..
మనసు కృంగిపోతే తనువు అలిసిపోతుంది
తనువు గాయమైతే
మనసంతా అల్లకల్లోలమవుతుంది!

తనకు తానుగా.. తనలో తానుగా
బాధ్యతల నడుమ అలసిపోతున్నప్పుడు
తనకంటూ కొన్ని క్షణాలను పోగేసుకోనివ్వు
తనను తాను చదువుకునే పుస్తకంగానో
ఎదుటి వారి ఆలోచనల్ని చదివే నేర్పరితనాన్నో
మనసు రాసిన డైరీని తెరిచి
జ్ఞాపకాలను తడుముకోవడానికో
ఓ ఏకాంతపు తీరాన్ని అలా వదిలేయ్..!

నడకకు నడతకు మధ్య ఆలోచనలో నలుగుతుంటే
అప్యాయతకు అపేక్షకై ఎదురు చూస్తుంటే
ఆమె కథగానో, కవిత్వంగానో మారాలనుకున్నప్పుడు
ఆమెకో ఆలంబనగా మారి అక్షరమై ఓదార్పు నివ్వు !
ఓ ఏకాంతానికి గాలి పాట రాస్తుంటే
పక్షుల కువకువల రాగాలన్నీ కోరస్‌గా
వినిపిస్తుంటే అలా సాగే దారిలో సాగిపోనివ్వు !

ఆమె ఆలోచనలనీ అలలా సాగనీ..
రేపటి భవితవ్యం కలలతో జత కలపనీ..
మాటల రుసరుసలన్నీ విసిరి గుండె గాయాన్ని రేపి
కంటి స్వప్నాన్ని చెరిపివేయకు..
వడిగా సాగిపోయే అడుగుల్లో
ముళ్ల కంచె వేసి తీరని వేదనని రేపకు..!

ఆమెకి మనసుందని
వేకువ వెలుగులో పయనించాలనే
ఆశయానికి రెక్కలు కట్టుకొనివ్వు..!
ఆనందంగా అయిన రెప్పచాటు స్వప్నంలో
ఓ ఛాయాచిత్రాన్ని అందంగా దిద్దుకొనివ్వు
ఊహ నిజమైతేనే కదా వాస్తవంలో
ఆమె ఆమెగా జీవించేది...!

- స్వప్న మేకల
90522 21870

# కాలం చెప్పేడు మాటలు వినదు

కాలం తోక పట్టి
కలతల్ని కణితకి గురిపెట్టి
నిప్పులాంటి నిజాల్ని కక్కిస్తే
నెత్తుటిలో ఉడికిన ఆశలు
నిజాయితిని కలబోసుకుని
నుదుటి రాతలై మొలిస్తే ...
కాళ్ళు మొలిచిన ఆచరణ కళ్ళు తెరచి
విశ్వాసంతో చేతులు కట్టుకుని
అడ్డంగా కాళ్లు జాపిన కొండల్ని నరికి
నడక కింద పడేకేసిన పల్లేరులను పీకేసి
ఆశను కళ్లలో కుక్కోని అడుగులు వేస్తుంటే
చెమటలు పట్టిన దారి
పాదాలకు వంగి నమస్కరించి ...

ఇన్నాళ్లూ
చెప్పుడు మాటలు విన్న కాలం
బతుకు ఇంటిని ప్రేమగా
పేరు పెట్టి తట్టి పిలిచింది!

- చందలూరి నారాయణరావు
97044 37247





# హీరో

- వంకిరెడ్డి రెడ్డెప్పరెడ్డి
94400 44922

అనంతపురం జిల్లా, కదిరి. ఊరి పేరు వినగానే గుర్తొచ్చేవి ఖాద్రి నరసింహస్వామి గుడి, వేమన పుట్టిన కటారుపల్లి, మేక మార్కు బీడీలు, విస్తారంగా విత్తే వేరుశెనగ, తెలుగు భాషకు సవితి అనిపించే తురక తెలుగు. ఇరుకు వీధులు. వీధుల్ని అడ్డదిడ్డంగా కలిపే సందుగొందులు, ఆ ఇరుకు వీధుల్లోనే కార్లు, బస్సులు, లారీలు, ఆటోలు, మోటార్ సైకిళ్ళు, బండ్లు, మనుషులు, ఆవులు, ఎద్దులు, గాడిదలు, గుర్రాలు. సిగరెట్టు పీకలు, బీడీ ముక్కలు, పేడ లద్దెలు, ఆయిల్ మరకలు, అరటి తొక్కలు, పేకముక్కలు, గోళీ గుండ్లు, కమ్మర్ కట్లు, సమోసాలు, చెకోడీలు అమ్మేవారి అరుపులు. చాలవన్నట్లు పిల్లలూదే పీపీలు, 'చెప్పల్సే మార్ రే సాలేకు', 'తేరి మాకీ' అరుపులు, 'బాగున్నావా అక్కా? మామ బాగున్నాడా'? పలకరింపులు. గోళీలాటలు... జీవన రంగులు వెదజల్లే పేదరికానికి అడ్రస్ లాంటి టౌను.

ఆ టౌనుకు నేడు కొత్త జీవం వచ్చినట్టైంది.

'కాలేజ్ డేస్' సినిమా శతదినోత్సవ వేడుక జరుపుకుంటుండమే కారణం. సంగం థియేటర్ లోపల బయటా ఇసుకేస్తే ఒకటో రెండు రేణువులు మాత్రమే నేల రాలేంత జనం. అయినా ఈ సినిమా హీరోను చూస్తున్న జనంలో అరుపులు కేకలు లేవు. ఉద్వేగం ఉద్రేకం ఉన్మాదం లేవు. తమలో ఒకడ్ని చూస్తున్న ఆనందం.

థియేటరు గోడలపైనుంచి కిందవరకు హెూరుజల్లు చినుకుల్లా, తెరిపి లేకుండా, ధారధారలుగా కదిరి మల్లెలమాలలు వేలాడుతున్నాయి. థియేటర్ 'మల్లెపూల తేరు'లా ఉంది. చుట్టూ కిలోమీటర్ మేర 'కదిరి మల్లెల తెమ్మెర' విస్తరించింది. బెంగళూరు, చెన్నై మార్కెట్లకు వెళ్ళే పూలు ఈరోజు థియేటర్ అలంకరణకై వాడారు. కదిరిమల్లెలు పండించే రైతులు 'కాలేజ్ డేస్' సినిమాపై మక్కువతో మాలలు కట్టి ఉచితంగా అందించారు.

'కాలేజ్ డేస్' అన్ని రకాల ప్రేక్షకులను ఆకట్టుకున్న సినిమా. ఇందులో హీరో హీరోయిన్లు నిరుద్యోగులు. ఆ నిరుద్యోగుల ఉద్యోగాన్వేషణే సినిమా కథ. నిరుద్యోగ యువత ఏయే అంశాలపై దృష్టి పెట్టాలో, కెరీర్ మొదటి అడుగులెలా వేయాలో, ఆ అడుగులేయటంలో ఎలాంటి తప్పులు జరిగే అవకాశముందో, తప్పులు జరగకుండా ఎలాంటి శ్రద్ధ తీసుకోవాలో, కెరీరుకు సంబంధించి సలహాలెక్కడ తీసుకోవాలో, అందిన సలహాలనెలా వడబోసి వాడుకోవాలో, కెరీరును సంతృప్తికరంగా ఎలా మలుచుకోవాలో, దేన్నయినా సాధించగలమనే మానసిక స్థైర్యమెలా పొందాలో సినిమాలో నిశితంగా చూపించారు. కెరీరులో నిచ్చెనలెక్కడ ఉంటాయో, వానిని అందుకోవడమెలాగో, పాములెక్కడుంటాయో, వాని కోరలకు అందకుండా తప్పించుకోవడమెలాగో లాంటి పాఠాలనూ చూపారు. ఈ సినిమా 'మాకోసం' అని యువత చూశారు. 'మన పిల్లల కోసమట' అని తల్లిదండ్రులు చూశారు. 'సమాజం గురించి ఆలోచించిన సినిమా' అంటూ విమర్శకులు, 'యువతకు జీవితానుభవాల పాఠం' అని మేధావులు పొగిడారు.

హీరో అభిజ్ఞ ఐదేళ్ళుగా సినిమా ఇండస్ట్రీలో ఉన్నాడు. అతడి ఐదు సినిమాలు రిలీజయ్యాయి. అన్నీ సాధారణ హిట్లే. ప్రజల సమస్యలపై, వాని పరిష్కారానికై స్పష్టమైన విధానాలు చూపే సినిమాల్లో నటించడం అతడి ప్రత్యేకత. కథానాయకుడిగా నటించడంతోపాటు ఆ సినిమాలకు కథ, కథనం అతఃడే సమకూర్చడం విశేషం. మొదటి సినిమాలో వ్యవసాయం, రెండో దానిలో అంటరానితనం, మూడోది లంచగొండితనం, నాలుగోది రాజకీయ నాయకత్వంపై వచ్చాయి. ఇప్పుడు ఈ సినిమా సూపర్ హిట్, ఓ సంచలనం.

■■■

కదిరి జెండామాను సందులో నిత్యం కళకళలాడే ఇల్లు బుడేన్ సాబు, జమీలా బేగంలది. తమ ముందు తరాలకు

కూడుపెట్టిన బీడీలు చుట్టే ఉపాధినే ఆ జంట కూడా నమ్ము కున్నారు. వారి సంతానం ఏడు మంది మగపిల్లలే. పదేళ్ళ వయసు నుంచే ఆరుమంది పిల్లలకు బీడీలు చుట్టడం అలవాటు చేశారు. మండీనుంచి తూంకాకు తేవడం, నానబెట్టడం, దీర్ఘ చతురస్రాన్ని ఒకవైపు లాగినట్లుగా ఆకు కత్తిరించడం, ఆకు వెనక ఈనె జువరడం, పొగాకు తేవడం, తడపడం, సన్నగా కత్తరించ డం, బీడీలు చుట్టడం, కట్టలు కట్టడం, కట్టలను బండిళ్ళుగా పేర్చడం, బండిళ్ళు మండీలో అప్పగించడం లాంటి పనులు ఎవరికి వారుగా చేసుకుపోతుంటారు. గోడకానుకుని కూర్చుని బీడీలు చుడుతూ ఊగడం కొడుకులకు తల్లిదండ్రులనుంచి అల వడింది. ఊగి ఊగి వీపు సైజు మేర గోడకు సున్నం మాసి పోయి ఉంటుంది. ఎవరికి వారు తమ తమ సీట్లలో కూర్చో వడానికి అదే గుర్తు.

ఆర్థికంగా పర్వాలేదనిపించుకున్నాక బీడీలు చుట్టేందుకు పదిమంది కూలీలను పెట్టుకున్నారు. కొడుకులు, కూలీలనే తేడా లేకుండా అందరూ ఒకే కొట్టంలో కూర్చుని బీడీలు చుట్టేవారు. కొన్నాళ్ళకు ఇంకో పెద్దకొట్టం కట్టుకున్నారు. తూంకాకు, పొగాకు కత్తరించడం పాతకొట్టంలో చేసేవారు. కొత్తకొట్టంలో బీడీలు చుట్టేందుకు మరో యాభైమంది కూలీలు జమయ్యారు. కూలీలకు తురకం రాదు. ఇంట్లోవాళ్లకు తెలుగు అరకొర వచ్చు. దాంతో కూలీలకు కూడ అర్థమయ్యే తురక తెలుగు మాట్లాడడం ఇంట్లో అలవాటయ్యింది.

పదేళ్ళలో కుటుంబం స్వంతంగా 'ముంగిస మార్కు బీడీ' కంపనీ పెట్టింది. కంపెనీ బీడీలు తెలంగాణా, దక్షిణ కర్ణాటక, దక్షిణ తమిళనాడు ప్రాంతాల్లో బాగా అమ్ముడవుతుండటంతో, 'ఏ మట్టిలో రాలిన విత్తు ఆ మట్టిలోనే మానయినట్లు', వచ్చిన లాభాలతో కోయంబత్తూరు, షిమోగా, హైదరాబాదు శివార్లలో రియల్ ఎస్టేట్ భూములు కొన్నారు.

■■■

సినిమా నటులంటే అభిమానం ఈ ఆరుమంది పిల్లల రక్తంలో జీర్ణించుకుపోయింది. పెద్దపిల్లలు ముగ్గురు ఓ హీరో అభిమానులు, చిన్నవాళ్ళు ముగ్గురూ మరో హీరో అభిమానులు. నాలుగోవాడికి సినిమా హీరోల పిచ్చి లేదు. పుస్తకాల పిచ్చి మాత్రమే. అది గమనించిన తల్లిదండ్రులు అతడిని బెంగుళూరులో ఉంచి చదివిస్తున్నారు.

ఒకప్పుడు శతదినోత్సవం జరుపుకోవడం మంచి సినిమాకు ప్రామాణికమైతే, ఇప్పుడు వెయ్యి థియేటర్లలో రిలీజ్ చేయడం పెద్ద సినిమాకు ప్రామాణికం. ఆ శుక్రవారం ముగ్గురు పెద్ద కొడుకుల అభిమాన హీరో సినిమా రిలీజ్ కానుంది. ఆ హీరోకు పంపిణీ రంగంలో 'బ్లాక్ మార్కెట్ హీరో' అనే పేరుంది. ఊర్లో ఉండే ఐదు థియేటర్లలోనూ అదే సినిమా. అనుమతించిన నాలుగు షోలు కాకుండా రోజుకు ఎనిమిది షోలు ఆడిస్తారు. బెంచి నుంచి బాల్కనీ వరకు ఒకే రేటు. వెయ్యి రూపాయల లెక్కన టికెట్లు అమ్ముతారు. గురువారం మధ్యాహ్నమే ముగ్గురు పెద్ద కొడుకులు బీడీలు చుట్టడం ఆపేశారు. కోవిడ్ పుణ్యమాని ఇంటికొచ్చిన నాలుగో కొడుకును కూడా అన్నలు సినిమాకు తీసికెళ్లారు. తమ్ముడు బెంగుళూరులో చదువుతున్నాడని చెప్పు కోవడం అన్నలకు ఆనందం. అందుకే సినిమాలకు, గోలీలతోపుకు అతడిని తీసుకెళతారు.

తనను సినిమాకు తీసికెళ్తే ఎదురయ్యే సమస్య చిత్రమైంది. సినిమాలో హీరోయిన్ బాగుందా? అందాలు ఆరబోసిందా? అశ్లీల డాన్సుందా? ముద్దు సీన్లున్నాయా? డబల్ మీనింగ్ డైలాగు లున్నాయా? రొద్దకొట్టుడు ఉందా? అని ఆస్వాదించడు. సినిమా లో కథ ఉందా? కథ మనుషులకు సంబంధించిందా? అంటూ ఆరాలు తీస్తాడు. తత్త్వం తెలిసి కూడా అతడిని వెంటేస్కోని అన్నలు థియేటర్ల చుట్టూ తిరిగారు. ఇలా నలుగురు కొడుకులు మిడ్నైట్ షో చూసి వచ్చారు. మరుసటిరోజు సినిమాకు వెళ్ళని వాళ్ళు ఊగుతూ బీడీలు చుడితే, వీళ్ళు తూగుతూ చుట్టారు.

ఎవరూ అడగకనే రెండో కొడుకు షమీం బషీర్ "సిన్మా నూర్దినాల్ హోడ్తుంది." సినిమాపై రివ్యూ చెప్పాడు. సినిమాకు పోయినవాళ్ళు కథ చెప్పడం రివాజు. బాగుందంటే బీడీ చుట్టే కూలీలతో సహా మిగతా కుటుంబ సభ్యులు ఆ సినిమాకు పోతారు, లేదంటే పోరు.

నాలుగో కొడుకు అహ్మద్ షబ్బీర్ కథ చెపుతూ, "బేవార్స్ సిన్మా. పద్రోజులు గుడ్కా హోడ్డు. సిన్మా బాగ్లేదని తెలుస్కోకనే జనాల్ చూసెయ్యాలని హన్ని హాల్లలో రిలీజ్ చేస్నాడ్, దొంగ కొడ్కు. సిన్మా మొదట్లో కాలేజ్లో హీరోయిన్కి ఎవడో రాగింగు చేస్తాడ్. హీరోయిన్కి హీరో రక్షిస్తాడ్. హప్పటినుంచి హీరో చుట్టూ తిర్గుతూ తనను ఇష్క్ చెయ్మని హీరోయిన్ రచ్చ చేస్తుంటాడ్. హీరోకు ఇష్క్ హాలోచన్ హుండ్డు. ఆయప్ప తన బెహన్ పెళ్లి చెయ్యాలని తకరార్ పడ్తుంటాడ్. హీరోయిన్కి అబ్బా డ్రగ్స్ వ్యాపారం చేసి కోటీశ్వరుడ్ అయిఉంటాడ్. నాది కూతుర్కి కూట్కి గత్లేనోడ్ ఇష్క్ చేస్తాడ్? హనే కక్షతో కోటీశ్వరుడ్ హీరోయిన్కి అబ్బా హీరోపై దొంగ కేస్ పెట్టిస్తాడ్, జైల్లో ఏపిస్తాడ్. హీరో జైల్నుంచి తప్పించుకుంటాడ్. విలన్ హింటికెళ్ళి నీది కూతుర్కి నేన్ ఇప్పటిదాక ఇష్క్ చెయ్లేద్. నీది డ్రగ్స్ య్యాపారమ్ మానేస్తే ఇష్క్ చేయనంటాడ్. విలన్ హుండ్కు ఒప్పుకోడ్. హయితే నీది బేటీకి ఇష్క్ చేస్తా హని చాలెంజ్ చేస్తాడ్. హప్పుడు హీరో హీరోయిన్లు విదేశాల్లో పాట్లు పాడ్కుంటార్. సిన్మా చివరాకర్లో విలన్ మన్సుల్ యాభైమంద్కి హీరో మస్తుగా కొట్టేస్తాడ్. తనో అండర్గ్రౌండ్లో హున్న పోలీస్ హాఫీసర్ హని హబ్బుడు చెప్తాడ్ హీరో. డ్రగ్స్ య్యాపారం గురించి కనుక్కోవడానికే స్పెషల్గా హపాయింట్ చేశార్ హని చెప్తాడ్. హీరోను తుపాక్తో కాలుస్తాడ్ విలన్. గుండెకు గుండు తగ్లినా హీరో బత్కతాడ్. మీది అబ్బా డ్రగ్స్ వ్యాపారం చేస్తాడని, ఆ డ్రగ్స్ తినే మీది భయ్యా చచ్చాడని హీరో హీరోయిన్కు చెప్తాడ్. హీరోయిన్కి అమ్మా ఆ మాట్విని

తుపాక్తో మొగుడ్ని కాలుస్తుంది. ఆ దెబ్బకు విలన్ సఫా అయ్పోతూ, 'మాది బిడ్డకు బాగా చూస్కో' హని హీరోయిన్ చేత్ని హీరో చేత్లో పెడ్తాడ్. మొగుడ్ని చంపిన బాధ్లో హీరోయిన్ అమ్మా కూడా తుపాక్తో కాల్చుకుని సఫా హయిపోతుండ్. హింత పన్కిమాల్న సిన్మా జూసేకి నాల్గువేల్ దుంపనాశనమ్." అంటూ ముగించాడు.

కథ వింటున్న తల్లిదండ్రులు ఒకరి ముఖాలొకరు చూసు కున్నారు. పెద్ద కొడుకు ఇంటి జమాఖర్చులు చూస్తుంటాడు. గోళీలాటలో ఐదు రూపాయల కోసం రక్తగాయాలయ్యేటట్లుగా కొట్టుకునే కొడుకులు, రోజంతా బీడీలు చుడితేగానీ రెండొందలు సంపాదించలేని కొడుకులు, సినిమా చూడ్డానికి ఒక్కొక్కరికి వెయ్యి లెక్కన నాలుగు వేలు నాశనం చేయడమేంటి? 'రెండున్నర గంటల వినోదానికి ఐదు రోజుల కూలి డబ్బులు దండుకునే హీరోను మించిన దోపిడీదారెవరు?' అభిమానమనే పిచ్చి పట్టించిన హీరోలకు తమ కుటుంబం ఇంకా ఎన్ని వేల రూపాయలు ఋణపడి ఉందో? అనుకుని నిట్టూర్చారు.

మధ్యవాడితో కలిపి చిన్న కొడుకులు నలుగురు ఈ సారి మరో హీరో సినిమాకు పోయారు. పోయిన నెలలాగే ఈ సారి కూడా సినిమాకు ఖర్చుపెట్టారు. తెల్లవారుజాము షోకు పోయి వచ్చిన ఐదో కొడుకు సినిమా గురించి చెప్తూ, "హబ్బో హేమ్ సిన్మా తీస్నాడ్? హిదీ సిన్మా నూర్దినాలు హాడ్తుంది, ఖాయం." అంటూ రివ్యూ చెప్పాడు.

కథ నాలుగో కొడుకే చెప్పాడు. "మొన్న చూసిన్దాన్కంటే ముతాల్ సిన్మా హిది. విలన్ కెమికల్ ఫ్యాక్టరీల్ నడిపే రాజ్కీయ నాయ్కుడు, ప్రధాన్మంత్రి కావాలన్కుంటాడు. పద్విక పోటీ పడ్తారని తన్కంటే సీనియర్లయిన ముగ్రు తన పార్టీ ఎంపీలకు సఫా చేయిస్తాడ్. వోళ్ళు దాసిపెట్న దొంగ సొత్తు ఐదు లచ్చల కోట్లు కొట్కోని పోతాడ్. హది డబ్బు ఎంపీలకు హిచ్చి ప్రధాన్మంత్రి హవ్తాడ్. హీరోయిన్ ఈ ప్రధాన్మంత్రి కూత్రు. హీరో కాలేజ్కి సైకిల్పై పోతాడ్. హీరోయిన్ హిమాన్మంత కార్లో వస్తుంది. హీరోయిన్ హందానికి హీరో పడ్పోతాడ్. హీరోయిన్ హీరోను చూసి, 'నువ్వు నాకి చెప్పుల్ విల్వ్ చెయ్యి' హంటుంది. హయితే హొటళ్ళలో మిగ్లిపోయిన ఖానా హీరో బిక్షగాళ్ళకు తెచ్చి పెడ్తాడని తెల్సి హీరోయిన్ హతడ్ని ఇష్క్ చేస్తుంది. హీరో హీరోయిన్లు అమెర్కాలో రెండు పాట్లు పాడ్కుంటారు. అమెర్కాలో ఒగ న్యూస్పేపర్ యితడు ప్రధాన్మంత్రి హెలా హయ్యింది బైట్పెడ్తుంది. హప్డు అమెర్కాలోనే హున్న హీరోకు తను ప్రేమించే అమ్మాయే ప్రధానమంత్రి కూత్రని తెలుస్తాద్. హీరో ఇండియాకు వచ్చి, దేశ ప్రజల్కి మోసం జర్గిందని టీవీలో మాట్లాడ్తాడ్. ప్రధాన్మంత్రి చేసిన నేరాల్పై కేస్ వేస్తాడ్. కోర్టులో కేసు రుజ్వు కాద్. ప్రధాన్మంత్రి కెమికల్ ఫ్యాక్టరీల్లోంచి వ్యర్థాల్ ప్రజల్తాగే మంచినీళ్ళ చెర్వుల్లో పడ్తుంటాయ్. ఫ్యాక్టరీలపై హింకో కేసు వేస్తాడ్ హీరో. దాన్లో కూడ ఓడ్పోతాడ్. విలన్ హీరో మీద్కి గూండాల్కు పంపుతాడ్. అంతే హీరో ఒక్కడే నూర్మంది ప్రధాన్మంత్రి పెట్టిన గూండాల్కి దంచి కొడ్తాడ్. హిద్దరు విలన్ గూండాల్ ఒకేసారి రెండుపక్కల్ నుంచి హీరోకు కడుప్లో, వీప్లో పొడుస్తార్. హీరో గాయాల్కు మట్టి పూస్కోని, చొక్కా చింపి గాయాన్కి కట్కోని ప్రధాన్మంత్రి పెట్టిన గూండాల్కు సఫా చేస్తాడ్. హక్కడ రాళ్ళు, కట్టెలు, కత్తులు హున్నా హీరో చేతుల్తోనే పోరాడ్తాడ్. నేర్గా ప్రధాన్మంత్రి కూడా ఫైటింగ్ చేస్తాడ్. హీరోయిన్కి అమ్మా హీరోను తుపాక్తో కాల్చేకి చూస్తుండ్. హీరోయిన్ హడ్డగిస్తుండ్. అమ్మాకూతుర్కి మధ్య జర్గిన తోప్లాటాలో గన్ పేలి హీరోయిన్ అమ్మాకి బులెట్ తగుల్తుండ్. హాసుపత్రిలో చేర్చిన హీరోయిన్ తల్లికి రకతం హవసరమొస్తుండ్. హా గ్రూప్ రకతం హెక్డా దొర్కద్. ఎవరో తెలీక్నే హీరోకి అమ్మా హీరోయిన్కి అమ్మాకు రకతం హిస్తాద్. అంతే హీరోయిన్కి అబ్బా మార్పోతాడ్. ప్రధానమంత్రి పద్వికి రాజీనామా చేస్తాడ్. హీరో హీరోయిన్లకు పెండ్లి జర్పుతాడ్.

ప్రధాన్మంత్రి సెక్యూరిటీ ఏమయ్యిందో? ప్రధాన్మంత్రికి కొట్టినా పోలీసుల్, కోర్టు, లాయర్లు కన్పడ్రు. హీరో దేశం జెండాకి నమస్కారం పెడ్తాడ్, 'నా జన్మభూమి ఎంత గొప్ప దేశం' హని పాట పాడ్తాడ్. దేశ్భక్తి హంటే వివరిస్తాడ్. సిన్మా హయ్పోతుంది. ప్రధాన్మంత్రికి పద్వినుంచి దించేకి హెలాంటి వాడో ప్రజల్కు తెల్యజెప్పి, హతడ్జేసిన తప్పుల్కి జనాల్లో ప్రచారమ్జేసి, ప్రచారాన్కి జనాల్ నమ్మి, ఎన్నికల్లో హతడ్కి ఓడించారని కథ హుండద్. ముతాల్ సిన్మా, థూ. దీన్కి కూడా వెయ్యి లెక్కన టికెట్లు కొన్నామ్," అంటూ ఆ సిన్మా గురించి ముగించాడు.

"అన్నీ సిన్మాలు హిలాంటి ముతాల్ సిన్మాలే. హే పెద్ద హీరో సిన్మా జూస్నా ఒగ్టే. జనాల్ హేమ్ సిన్మాల్ చూడాలో హీరోలే హల్వాట్ చేస్నార్. చూసేవాళ్ళ ఆలోచనల్లోకి హీరో దూర్పోతాడ్. డైలాగ్లతో ఉద్వేగం కల్గిస్తాడ్. రొడ్డకొట్టుడ్తో రకతం ఉడికేట్టు చేసి, ప్రజల్కు పిచ్చోళ్ళకు చేస్తాడ్. సిన్మా జర్గేంత సేపు జనాల్ కూడా పిచ్చోళ్ళ మాద్రిగా చేస్తార్. డబల్ మీనింగ్ డైలాగ్లొచ్చినప్పు ఈల్లు, డాన్సులొస్తే సీట్ల సందుల్లోనే డాన్సుల్, ఫైట్లొచ్చినప్పు డిషుం డిషుం అంటూ చేతులు ఊప్డాలు.. అంతా రోత్రోత చేస్తార్. థియేటర్ బయట్కొచ్చి కూడా ఈల్లు, కేక్లు హేస్తార్."

"సినిమా అయిపోయిన తర్వాత్కూడా ఉద్వేగం, ఉద్రేకం హలాగే కొనసాగే ప్రమాదమ్ హుంటుండ్. పుత్తడ్ లాంటి మన్సులకు ఇత్తడ్ మాద్రిగా చేస్తార్. హింకా మాదర్చేద్ మాట హేమ్టంటే హిదీ హీరోలు వయసు పెర్గాక, సిన్మాల్లో పనికిరామేమో అనే అనుమానంతో, వీళ్ళపై జనాల్కి హుండే ఉద్వేగమ్, ఉద్రేకమ్, అభిమానమ్ ఉపయోగించుకుని ఓట్లు రాబట్టుకోవచ్చని రాజకీయాల్లోకి కూడా వస్తార్."

■■■

ప్రతిసారి మౌనంగా సినిమా కథలు వింటుంటాడు దిన కూలీ నరసింహా. చదువుకున్నోడయినా కడుపుకు జరక్క బీడీ చుట్టే పనికి వీళ్ళ కంపనీకే వస్తాడు. కూలీలలో ఒక్క నరసింహాతో

మాత్రమే కలివిడిగా మాట్లాడతాడు నాలుగో కొడుకు అహ్మద్. నరసింహ మాట్లాడుతూ,"సినిమాల్లో జనాలకు పనికొచ్చే కథ ఉండదని, జనాన్ని మోసం చేసే హీరోయిజం, ఉద్వేగం, ఉద్రేకం, ఉన్మాదం మాత్రమే ఉంటాయని, సినిమాలో ఉండేవి, ఉండాల్సినవి అన్ని విషయాలు చెప్తావు కదా? నువ్వే సినిమాల్లోకి పోవచ్చుగా!" అన్నాడు.

"మనలాంటోల్లు సిన్మాల్లోకి పోవాలంటే హిప్డు హుండే పెద్ద హీరోల కుటుంబాల్లో పుట్టిండాల్. పెద్ద హీరోల హిళ్ళలో హుండే బిడ్డల్కు హీరోల్ను హవనిస్తార్గానీ మనల్కి హవనియ్యర్? 'హా ఇళ్ళ కణికిరాయైన ఖరీదైన వజ్రమని భ్రమింపజేస్తార్, మన్లాం టోళ్ళ ఇళ్ళలో ఖరీదైన వజ్రమున్న కణికిరాయేనని నమ్మిస్తార్'. వాళ్ళు కాకుండా మరెవరైనా హీరో కావాలి హంటే పెద్ద పెద్ద కుటుంబాల నుంచి వచ్చిన్దాల్. కోట్లుకోట్లుగా ఎద్రు డబ్బులిచ్చి సిన్మాలో హీరోగా చెయ్యాల్. హయినా అలా వెళ్ళినా బత్కనీర్. మన్లాంటోళ్ళది ఒకటి సిన్మా హిట్ హయినా నల్వేస్తార్. వీడు తమ బిడ్డల్కు హడ్డం వస్తాడని సినిమాలు ఫ్లాప్ చేయిస్తార్. 'వాళ్ళ బిడ్డల్కోసం నిచ్చెన్లేయడంతో హాగర్, యిత్రుల బిడ్డల్కు పాముల్నో ట్లోకి తోసేస్తార్'. హంతగా మాన్లాంటోళ్ళకు సిన్మా పిచ్చి పడ్తే హీరో పక్క కామ్డీ చెయ్యాల్, హీరోయిన్తో తన్నుల్తినే హాక్టింగ్ చెయ్యాల్. లేదా విలన్ పక్కన గుంపుల్లో గూండా మాద్రిగా చెయ్యాల్." అహ్మద్ జవాబిచ్చాడు.

"జనాలు చూస్తుంటే సినిమా ఫ్లాఫ్ చేయించడం ఎలా వీలవు తుంది?" నరసింహ అనుమానాలు పెరిగినాయి.

"సుల్బంగా చేస్తార్. థియేటర్లూ హన్ని వాళ్ళవే, వాళ్ళ మిత్రుల్వే. జనాల్ చూస్తున్నా కొత్త సిన్మా రిలీజ్ ఉందని దీన్కి హెత్తి వేయిస్తార్. లేదు హంటే ఎద్రు థియేటర్లో పెద్ద హీరో సిన్మా రిలీజ్ చేయిస్తార్. సిన్మా బాగ్లేదని లోపల్లోపల్ ప్రచారం చేయిస్తార్. కలెక్షన్ లేద్ హని తక్కువ డబ్లు నిర్మాత్కు హిస్తార్. హదే వాళ్ళ బిడ్డల్కి హయితే ఎలాగైనా సాయం చేస్తార్. ఇతరుల్దైతే నాశ్నం చేస్తార్. వాళ్ళ బిడ్డల్కి సిన్మాకి 'హౌస్ఫుల్ కలెక్షన్లతో నడుస్తున్న' హని రాయించుకుంటార్. పత్రికల్లో 'పెద్ద పెద్ద రేటింగ్లు' హిప్పించుకుంటార్. ప్రేక్షకుల్ని సిన్మాకు రప్పించు కుంటార్."

"కొత్త హీరోల ఒకట్రొండు సిన్మాలు బాగా హాడ్తే, హతడి సిన్మా రిలీజ్ డేట్కు పెద్ద హీరోల సిన్మాలు రిలీజ్ హయ్యేటట్లు ప్రణాల్కలు వేస్తార్. పెద్ద హీరోల సిన్మాల్ ముందు కొత్త హీరోల సిన్మాల్ నల్గిపోతాయ్. మనలాంటోళ్ళు సిన్మాల్లోకి పొయ్ హీరో కావాలన్కుంటే హంతే. 'ఆనెల్ తీస్కునేకి హాస్పిటల్కు పోతే కిడ్నీల్ కొట్టేసినట్లు', నిండా గుండ్ గొర్గేస్తార్."

అహ్మద్ జవాబుతో సంతృప్తి చెందని నరసింహ ప్రశ్న కొన సాగించాడు. "వాళ్ల బిడ్డల్నే హీరోలు చేయడం ఎలా కుదుర్తుంది? అందంగా ఉండొద్దా? ఆక్టింగ్ రావొద్దా? డాన్సులు రావొద్దా, ఫైటింగ్ రావొద్దా?" అని.

"వాళ్ళ బిడ్డల్కు అందంగా లేకపోయ్నా జనాల్కు నచ్చేట్లుగా హాక్టింగ్, డాన్సుల్, ఫైట్లు నేర్పిస్తార్. హింకా హవసరం హైతే హండచెక్కించి, గెనంపెట్టించి, మడి నాటించి హీరోల్ను చేస్తార్."

"సేద్యానికి, సినిమాకు ఏమిటి సంబంధం?" నరసింహ ప్రశ్న అయిపోలేదన్నట్లు ముఖం పెట్టాడు.

"ముఖమో ముక్కో బాగ్లేదన్కో, హండ చెక్కినట్లు ప్లాస్టిక్ సర్జరీ చేయిస్తార్. పళ్ళు సరిగ్గా లేవన్కో, గెనం పెట్టినట్లు పళ్ళు కట్టిస్తార్. బట్ట తలన్కో, మడ్నాటినట్టు జుట్టు నాటిస్తార్." అహ్మద్ జవాబు చెప్పాడు.

"నీకు తెలుగు వచ్చుకదా, తురకతెలుగు ఎందుకు మాట్లాడ తావు?" చివరి ప్రశ్న వేశాడు నరసింహ.

"నా మాట మీరంతా అర్థం చేసుకోవాలిగా.. అందుకే మీరు మాట్లాడే బాషలో మాట్లాడతాను." అహ్మద్ ఇచ్చిన ఈ జవాబుతో తన వద్ద ప్రశ్నలు ముగిసినట్టు నరసింహ ముఖం పెట్టాడు.

■■■

వ్యాపారం విస్తరించడంతో బుడేన్ సాబ్ కుటుంబం బెంగ ళూరుకు తరలిపోయింది. తమతోపాటు ఎవరు తమతో వస్తామంటే వారికి బెంగుళూరులో తమ బీడీ కంపనీలోనే పని కల్పించారు. పదేళ్ళ సమయం గడిచిపోయింది.

పదేళ్ళ క్రితం నరసింహ అహ్మదును అడిగిన ప్రశ్న "నువ్వు సినిమాల్లోకి పోవచ్చుగా?" బుడేన్ సాబ్ దంపతుల మనసులో అలాగే ఉండిపోయింది. 'ఒక్క కొడుకునైన సినిమాల్లో హీరోగా ఎందుకు చెయ్యకూడదు?' అనే ఆలోచన తపన వారిలో స్థిరపడి పోయింది. హిందీ సినిమాల్లో పెద్ద హీరోల్లో చాలామంది ముస్లిములే కదా? అదే విషయం ఇంట్లో చర్చకు పెట్టారు. ముందుగా ఏ కొడుకైతే హీరోగా సరిపోతారనే చర్చ వచ్చింది. తల్లి పోలికలున్న నాల్గో కొడుకు హీరోగా సరిపోతాడనుకున్నారు. అతడినే హీరోగా చేయాలనే అంశంలో నరసింహ పాత్ర కూడా ఉంది. "ఖంగుమనే నీ వాయిస్, అచ్చమైన నీ తెలుగు, ఉచ్చారణలో స్పష్టత, మంచి మేధస్సు సినిమా హీరోల కంటే గొప్పగా ఉంటాయి. కొరుక్కు తినాలనిపించే నీ ముఖం, కండలు తిరిగిన శరీరం ఇంకా బాగుంటాయి. నీ పేరు మార్చుకుంటే సరిపోతుంది." అంటూ ఊదరగొట్టాడు.

"డబ్లు హిషయం హాలోచించద్దు. హైదరాబాదు, కోయం బత్తూరు, షిమోగాలో ఉండే హాస్తులు హమ్మేస్తాం" అన్నారు ఇంట్లో వాళ్ళు.

"సినిమా పరిస్థితులు మీకు తెలియవు," నాలుగో కొడుకు విడమర్చి చెప్పాడు. 'వండే బోకులుండే ప్రతివాడు నిత్యాన్నదానం చేస్తానని ప్రతిజ్ఞ చేయడం తప్పు' అంటూ వివరించాడు.

కుటుంబ సభ్యులు 'తాము పట్టిన కుందేటికి ఒకే కాలు' అన్నారు.

■■■

'కాలేజ్ డేస్' సినిమా విజయోత్సవాన్ని మిగతా సినిమా

విజయోత్సవాల్లాగా హీరో చేతులూపడమేనన్నట్లు ముగించలేదు. తెరవైపు స్టేజి ఏర్పాటుచేసి పదిమంది కూర్చోవడానికి ఏర్పాట్లు చేశారు. హీరో హీరోయిన్లతో పాటు నిర్మాత, దర్శకుడు, థియేటర్ యజమాని కూర్చున్నారు. మొదట థియేటర్ యజమాని అందరికి స్వాగతం పలికాడు.

"హీరో అభిజ్ఞగారి ఆలోచన చెప్పాలంటే సినిమా అంటే నిర్మాతల కోసమో, హీరో కోసమో కాదు. సినిమా ప్రజల కోసం, ప్రజా సమస్యలకు పరిష్కారం చూపడం కోసం అంటాడు. హీరోను మానావాతీత వ్యక్తిగా ఎందుకు చూపాలి? వందమందిని మట్టి కరిపించే శక్తిగా చూపడానికి హీరో పాశుపతాస్త్రమా? ఒక్క దెబ్బ వేయగానే వందమంది నేలకొరగడానికి యమకింకరు డా? హీరోయిన్తో కలిసి డాన్స్ చేయడానికి తిక్కలోడా? అశ్లీల డాన్స్ చేయడానికి ఊర్వశి, మేనక, తిలోత్తమ భూలోకానికి వస్తారా? హీరో నోట్నుంచి డైలాగులు రాగానే చూస్తున్న ప్రేక్షకులు తలలూపి వినడానికి ఆయన చెప్పేదేమైన భగవద్గీతనా? పోనీ చెప్పింది భగవంతుడా? సామాన్యులు కడుపులు కట్టుకుని నాలుగు రూకలు హీరోల కు ఇస్తున్నప్పుడు, వాళ్ల బాగోగుల కోసమే సినిమా తీయాలంటారు అభిజ్ఞ గారు. వారికి నా మనఃపూర్వక వందనాలు" అంటూ నిర్మాత ముగించాడు.

దర్శకుడు మైకు అందుకున్నాడు : "గతంలో 'కళ కళ కోసం కాదు సమాజం కోసం' అనే ధోరణి ఉండేది. సినిమా సమాజ మనోవికాసం కోసమనే చర్చసాగేది. ఇపుడు సినిమా అంటే ప్రేక్షకుల ఉద్వేగాన్ని, ఉన్మాదాన్ని పెంచేదే కాదు రొద్దకొట్టడాలు, అందాల ఆరబోతలు, అశ్లీల డాన్సులు చూపడానికి మాత్రమే. మాఫియాగా తయారై ప్రేక్షకులను మత్తుమందు లాంటి సినిమా లకే అలవాటు చేశారు. ఆ మార్గం నుంచి వేరుపడి సమాజం కోసం సినిమాలన్నట్లు అభిజ్ఞ గారు పయనించారు. అందులో మమ్మల్ని భాగస్వాముల్ని చేశారు. అందుకు వారికి జీవితమంతా రుణపడి ఉంటాం," అంటూ ముగించాడు.

హీరో అభిజ్ఞ మైక్ తీసుకున్నాడు. సభలో హెూరు ఆగడానికి రెండు నిముషాలు పట్టింది. తను మాట్లాడడం మొదలెట్టాడు. "మీరెవరూ నన్ను గుర్తుపట్టకపోవడం ఒకింత ఆశ్చర్యంగా ఉంది. మీ మధ్య పెరిగాను. నా చిన్నపుడు రోజుకు పదిసార్ల యినా ఈ థియేటర్ చుట్టూ తిరిగాను. బయట ఓ పిల్లవాడి పోటోకు దండలు వేశారు, ఆ పిల్లవాడిని గుర్తు పట్టారా?" ఎవరూ జవాబు చెప్పలేదు. "ఆ పిల్లవాడు నేనే. పోనీ ఈ ఊర్లో ముంగిస మార్కు బీడీ కంపెనీ ఉండేది తెలుసా?" థియేటర్ మొత్తం తెలుసు తెలుసు అన్నట్లు చేతులూపారు. "నా పేరు అభిజ్ఞ కాదు, అహ్మద్ షబ్బీర్. నేను దుబాయ్ హాస్పిటల్ ఇండస్ట్రీలో పేరు మోసిన రాధామాధవ గారి కొడుకును కాదు. ముంగిస మార్కు బీడీ కంపెనీ యజమాని బుడెన్ సాబ్ కొడుకును. నా మతాన్ని, కులాన్ని, చివరికి నా తల్లిదండ్రుల పేర్లను మార్చుకుని సినిమాల్లో నిలబడ్డాను. నా తల్లిదండ్రులు సంపాదించిన ఆస్తి అమ్ముకుని సినిమాల్లోకొచ్చాను. ముక్కుపుడక కొనడానికి ముప్పేట చైను అమ్ముకున్నట్లయింది నా సినీ ప్రయాణం."

"మీడియాలో ప్రచారం జరిగినట్లు నేను 'ముంబై స్కూల్ అఫ్ స్టైలిష్ లుకింగు' నుంచి డిప్లొమా పొందలేదు. 'హాంకాంగ్ స్కూల్ అఫ్ డిఫెన్సు లెర్నింగు'లో ఫైటింగు నేర్చుకోలేదు. 'లండన్ స్కూల్ అఫ్ ఆర్టు'లో ఆక్టింగ్ చదవ లేదు. ఈ ఊరి పరిస్థితులు, మనుషులు, వారి అగచాట్లు, కడగండ్లు నాకు పాఠాలు. కాకపోతే ముంబైలో ఓ చిన్న ఆక్టింగు స్కూల్లో మాత్రం పాఠాలు నేర్చుకున్నాను."

"సమాజానికి ఏ రకంగానూ ఉపయోగం లేని సినిమాలు తీయడం, డైలాగు డెలివరీ, రొద్దకొట్టుడుతో ప్రేక్షకుణ్ణి ఉద్వేగ, ఉద్రేక స్థాయిలోకి తీసికెళ్ళడం, ఆ ఉద్వేగం, ఉద్రేకాలనుఉన్మాద స్థాయికి చేర్చడం లాంటివన్నీ పరిశ్రమలో జరుగుతున్నాయి. 'అంతా మేమే, అంతా మాదే' అనే సంస్కృతి ఇండస్ట్రీలో నెలకొనడంతో ఈ దుస్థితి. నాలుగైదు కుటుంబాల నుంచి హీరోలుండటమే ఈ పరిస్థితి."

సభలో నాలుగు మూలలా కోలాహలం బయలుదేరింది. ఒక్కో మూల ఒక్కో హీరో అభిమానులు కూర్చోని ఉన్నారు. ఏ గుంపుకాగుంపు "అభిజ్ఞ డౌన్ డౌన్" అనడం మొదలెట్టారు. అందరినీ స్టేజీ వద్దకు రమ్మన్నాడు అభిజ్ఞ. వాళ్ళ కళ్ళలోకి సూటిగా చూశాడు. "మా హీరోని తప్పు పడుతున్నారు, దూషిస్తున్నారు. క్షమాపణ చెప్పాల్సిందే" నాలుగు గుంపుల వాళ్ళూ అన్నారు. "అభిజ్ఞ డౌన్ డౌన్" అనడం కొనసాగించారు. అభిజ్ఞ సామాజిక పరిస్థితి అర్థమయ్యాక మరింత ధైర్యం వచ్చింది వాళ్లకు. తను సమాజానికి పనికొచ్చే సినిమాలు చేస్తున్నందుకు ఆనందించాలో, లేక కులం చట్రంలో మిగిలిపోయిన యువతను చూసి సిగ్గు పడాలో అర్థం కాలేదు అతడికి... 'మొగుడు పోయినందుకు ఏడవాలో, విధవ పెన్సనొస్తున్నందుకు నవ్వాలో' అర్థం కానట్టు.

"నాది హీరోలను దూషించేంత వికృత మనస్తత్వం కాదు. ఎంతోమంది మేధావులు కలిస్తే తప్ప ఓ సినిమా తయారవదు. అంతమంది మేధావులు కలిసి సమాజానికి పనికొచ్చే సినిమాలు తీయలేరా?" తీక్షణంగా ఆ గుంపుల వైపు చూశాడు. మాట కొనసాగిస్తూ "ఆ హీరోలు చూపించే ఉద్వేగం, ఉద్రేకం, ఉన్మాదం, అశ్లీలం, అంగ ప్రదర్శన, రొద్దకొట్టుడుపై తుపుక్కున ఉమ్మేయండి." అంటూ విసవిసా మీటింగునుంచి వెళ్లిపోయాడు.

"ఘర్షణతో ముగిసిన అభిజ్ఞ సినిమా విజయోత్సవ సభ" అంటూ మరుసటిరోజు మీడియాలో బానర్ హెడ్డింగ్ పెట్టారు. ఇతర నటీనటులను అవమానించాడని 'నటీనటుల సంఘం' నుంచి అబిజ్ఞను బహిష్కరించారు. నిర్మాతల సంఘం, పంపిణీ దార్ల సంఘం, థియేటర్ల సంఘం అభిజ్ఞతో సినిమాలు తీయరా దని, పంపిణీ చెయ్యరాదని, ప్రదర్శించరాదని నిర్ణయం తీసు కున్నాయి.

విచిత్రం, విదేశీ చిత్రాల కేటగరీలో ఆస్కార్ అవార్డుకు ఈ

## పాట మరణించదు

**జ**నం మాటలను జానపదాలను
తన గుండె గొంతుక నుండి
ఎగసిపడే ధిక్కార స్వరాలుగా చేసి సంధిస్తూ
సూటిగా అడుగుతూ.. దీటుగా స్పందిస్తూ
నిజాన్ని కణకణమండే నిప్పులా రగిలిస్తూ.. జ్వలిస్తూ..గర్జిస్తూ
ప్రజల పక్షం వహిస్తూ.. పాలక పక్షాన్ని ఎదిరిస్తూ
పోటెత్తిన పాటై.. పోరాట బావుటై ...

అంధకారయుగ కర్తలుగా అవతారమెత్తి
అధికారాన్ని చెలాయిస్తున్న -
నయ వంచకులను ప్రశ్నిస్తూ నినదిస్తూ.. నిలదీస్తూ..
పిడుగులా.. ఉరుముతూ.. పిడికిలెత్తి.. కదులుతూ..

తొలి పొద్దులా వెలుగుతూ
తొలకరి జల్లులా కురుస్తూ
మట్టి మనిషిగా మాట్లాడుతూ
నేటి బతుకు తీరును పాడుతూ
భవితవ్యం చెంతకు కమ్ముకొస్తున్న
చిమ్మచీకట్లను ఛేదిస్తూ -
కారు మబ్బులను తొలగిస్తూ..

కోట్లాది అన్నార్తుల వేదనలను
బాధా సర్పద్రష్టుల గాథలను
ఉద్యమాలుగా మలిచి అందరి హృదయాల్లో నిలిచి
దగా పడిన వారికి దన్నుగా
దండు కట్టిన వారికి అండగా వుండి
ఎరుపెక్కిన పంథాను -
తన పాటల ఎజెండాగా ఎక్కుపెట్టి
పోరుబాటలో నడిచిన గద్దరన్నకు జోహారులు!
ఓ జన గీతాల వీరుడా!
ఓ ప్రజా పోరాట యోధుడా!
నీకు వందనాలు.. విప్లవాభివందనాలు

**- బి.గోవర్ధనరావు**
**94419 68930**

సినిమా నామినేట్ చేయబడింది. ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్స్ ప్రదర్శనకు అగ్రిమెంట్లు చేసుకున్నాయి. అభిజ్ఞ సినిమాలకై దేశ వ్యాప్తంగా ఓటిటి ఫ్లాట్‌ఫార్మ్‌లలో ఎదురుచూపులు మొదలయ్యాయి. మున్ముందు ఉద్వేగం, ఉద్రేకం, ఉన్మాదాలను ప్రేరేపించే సినిమాలను కాదని, సమాజ సమస్యలను ప్రతిబింబించే, పరిష్కార మార్గాలు చూపే, సినిమాలను మాత్రమే వీక్షకులు చూస్తారని ఆ ఫ్లాట్ ఫార్ములు నమ్మడం మొదలెట్టాయి. ■

## మేరా భాష మహాన్

**గ**మ్యాన్ని చేరడానికి ఒక బాట కావాలి
ఒక భాష కావాలి
భవితకు చదువుల దిక్సూచి భాష
నవ చరితకు సంస్కారాల మార్గదర్శి భాష
అలల నడకతో నదీ ప్రవాహగతిని గుర్తించినట్టు
భాషతోనే మన గుర్తింపు
గురిచూసి వదిలే బాణం
లక్ష్యాన్ని ఎలా చేరుతుందో
భాష కూడా అంతే!

భాష
పూర్వీకుల భిక్ష
స్వీయజాగ్రతలే శ్రీరామరక్ష
నూతనోత్తేజాన్ని జ్ఞానోదయాన్ని అభ్యుదయాన్ని
సామాజిక చైతన్యాన్ని అందించేది భాష
ఉనికిని అస్తిత్వాన్ని నిలబెట్టేది భాష
ముడిచిన రెక్కలతో మొగ్గలా కాదు
ముకుళిత హస్తాలతో గుభాళించేది భాష
సరళమైన సున్నితమైన మార్దవమైన భాష
కావాలని కోరను
కవిచెక్కే అక్షరశిల్పానికి
అలంకారాల డాంబికమైన ప్రాకులాడే భాష అనను
కథనానికి కావల్సి అవసరానికి మించిన
పదగుంభనమూ భాష అనను

ప్రతిభకు గీటురాయిగా నిలిచేది భాష
మానసిక పరిపక్వతా అవగాహన ఇచ్చేది భాష
స్పటికంలా స్వచ్ఛమైనది భాష
కొత్త సమాజాన్ని స్వప్నిస్తూ
కొత్త సామ్రాజ్యాన్ని శ్వాసిస్తూ
బుర్రను వేడెక్కించే
ఎర్రెర్రని భాష కావాలి!
దేశం భాష ఎంతలా మార్చినా మూలాలు మారవు కదా
వేషం, యాస ఎంతలా నేర్చినా అర్థాలు మారవు కదా!

**- కోటం చంద్రశేఖర్**
**94920 43348**




# అధ్యయనం, సాధన ద్వారా నానీల సృజన



- ఎన్.లహరి
98855 35506

**నా** పేరు ఎన్.లహరి. హైదరాబాద్. నానీలు నేర్చుకోవడంలో నా స్వీయ అనుభవం గురించి చెప్పడానికి ప్రయత్నిస్తాను.

నేను ఇప్పటికే 'అక్షర నేత్రాలు' అనే కవితా సంపుటిని వెలువరించాను. నాకు ఈ 'నానీల' ప్రయాణాన్ని ఆరంభించవలసిందిగా వీటి సృష్టికర్త, నాకు స్వయానా పెదనాన్న గారైన డా.ఎన్. గోపి గారు చెప్పడం జరిగింది. అప్పటిదాకా అడపా దడపా చదవడమే తప్ప.. ఎప్పుడూ రాసే ప్రయత్నమైతే చెయ్యలేదు. పెద్దనాన్న గారి మాట కోసం, తప్పక రాయాలని నిర్ణయించుకున్నాను. వీటిని రాస్తున్న క్రమంలో ఎన్నిసార్లు నిర్దాక్షిణ్యంగా కొట్టివేతలకు గురయ్యాయో మాటల్లో చెప్పలేను. "ఇలా అధ్యయనం లేకుండా రాయడం వల్ల ఏ రకమైన ప్రయోజనమూ ఉండదు. లోలోతుల్లోకి వెళ్లి, మూలలను స్పృశించి, అనుభవాలను అనుభూతుల రూపంలో పలవరించి కలవరిస్తూ రాయడంలో ఉండే.. ఒక రకమైన మమేకస్థితి.. జీవన లోతుల్ని తడుముతుంది." అన్న ఒక అపురూపమైన సలహా నన్నొక నానీల కవయిత్రిగా నిలబెట్టింది.

ఆ తర్వాత 'నానీ'లపై వచ్చిన మా పెద్ద నాన్నగారి రెండు పుస్తకాలు.. ఇంకా చాలామంది రాసిన ముందుమాటలూ, చదివి అధ్యయనం చెయ్యడంలో నాకో కొత్తచూపుని ప్రసాదించింది. లోతుగా విశ్లేషించుకుంటూ.. ఒక తార్కిక స్పృహతో చదవడం మొదలు పెట్టాను. అలా చదువుతున్నపుడు నానీల్లోని గొప్పతనం, మార్మిక స్పృహ, ధ్వని వ్యక్తీకరణ అనుభవ పూర్వకంగా ఒంటబట్టాయి. అప్పుడు సరికొత్త ఆలోచనలు నాలో స్ఫురించి పరోక్షంగా నన్ను సానబెట్టేవి. అంతర్మథనానికి గురిచేసి, మానసిక సంఘర్షణ రాపిడిలో చైతన్యపూరితమైన భావాలను సృజనాత్మక కోణంలో రాయడం నేర్పాయి. ఈ విషయంలో తెలిసిన సాహితీమూర్తుల సలహాలూ, సంప్రదింపులూ, మెలకువలనూ ఆకళింపు చేసుకునేలా చేశాయి. ఇక్కడ ఉన్న పాఠకప్రియులకు ఈ నానీల స్పృహ లేదని కాదు. చాలామందికి వీటి నిర్మాణరూపం, అభివ్యక్తీకరణ తెలియదని అనుకోను. ఎలా రాయాలో, ఏ రీతిలో రాయకూడదో అనే ఒక డోలాయమానమైన ఊగిసలాటలోంచి, ఆధునిక సూక్ష్మ కవితారూపంగా ఎలా రూపాంతరం చెందిందో.. ఇక్కడ కొన్ని అనుభవాలు మీతో పంచుకుంటాను.

నిజంగా నానీలు నేర్చుకోవాలనే తపన ఉన్నవాళ్ళకి.. నేను చెప్పే ఈ కొద్దిపాటి విషయాలూ.. కొద్దిలో కొద్దిగానైనా రచనాపరంగా సహాయం చేస్తాయని భావిస్తున్నాను. తొలిదశలో నానీలు నేర్చుకునే క్రమంలో.. కొన్నిసార్లు నిద్రలో కూడా కలవరించేదాన్ని. ఈ అపస్మారకమైన ఒక మమేక స్థితిలోంచే నానీలు అంతర్లీనంగా నాలో ఊపిరి పోసుకునేవి. పొద్దుట నిద్ర లేచేసరికి వీటిలో ఒకటి కూడా స్ఫురణకొచ్చేవి కావు. గుర్తుపట్టి తిరిగి రాసేంత వెసులుబాటు ఉండేది కాదు. అదంతా ఒక నిద్రాణమైన మౌన సంయోగ స్థితిలోంచి అపరిచితంగా జరిగే రోజువారీ యాంత్రిక దినచర్యకు పరోక్ష ఉదాహరణ మాత్రమే! ప్రత్యక్ష జీవితానుభవాలను దృష్టిలో పెట్టుకుని చూస్తే జీవన వాస్తవిక స్థితికి, చుట్టూ అల్లుకుంటున్న సహజ సంఘటనలనూ, అనుభూతులనూ గాఢ పరిశీలనలోంచి అధ్యయనం చేసి రాసినవే. దూరంగా ఎక్కడో, ఏదో జరిగే ఒక అంశం మీద రాసే దానికంటే.. కళ్ల ముందు జరుగుతున్న విషయాలనే నానీలుగా మలుచుకునేదాన్ని. నిజానికి ఇది చాలా తేలికైన పద్ధతి. విషయం మీద పట్టువుంటే ఈ నానీల అల్లిక చాలా తేలిక అనిపించింది.

ఆధునిక సూక్ష్మ సాహితీ ప్రక్రియల్లో ఈ నానీ కవితా ప్రక్రియకు ఒక విశిష్ట స్థానం ఉంది. నాలుగు వరుసల నియమంతో.. 20–25 అక్షరాల మధ్య సాగించే ఈ పద పాద నియమం విలక్షణమైనది. వీటిలో మొదటి రెండు పాదాలు ఒక అంశాన్ని ప్రతిపాదిస్తే, మిగిలిన కింద రెండు పాదాలు ఒక రకమైన పంచ్ లాగా, చరుపులాగా ముక్తాయింపుతో కూడిన భావ అన్వయం ఉండాలి. కొసమెరుపులాంటి ముగింపుతోనూ అసలు అర్థాన్ని ప్రతిబింబించే భావ సమన్వయం తొణికిస లాడాలి. ఇలా అన్వయించి రాసే పద్ధతిలో ఒక అంతర్లీనమైన జీవన తాత్వికత ఉట్టిపడుతుంది. నానీలు అనే పేరు చిట్టి అక్షర వరుసకు ప్రతిబింబ సూచికగా చెప్పుకోవచ్చు. ఒక పెద్ద భావ సారాంశాన్ని చిన్నపాటి వాక్యాల కుదింపులో అక్షర నియమానికి ఒదిగించి రాయడం కొన్నిసార్లు కత్తిమీద సామే. కానీ సానబెట్టి, సాధన చేసి, శ్రద్ధపెట్టి అర్థవంతంగా రాయ గలిగితే ఆ కూర్పులో ఉన్న నిర్మాణ రీతే వేరు. మినీ కవితతోనో, హైకూతోనో దీనిని పోల్చి చెప్పడం సరి కాదు. నానీ అంటే ఉన్న విషయాన్ని నాలుగు వాక్యాల్లో ఇమిడ్చి చెప్పాలి. ఈ నానీల్లోని అంశాలు పూర్తిగా భిన్నంగా ఉంటాయి. ఎందుకంటే నేనొక సాధారణ గఅహిణిని. మా ఇంటి చుట్టూ అనేక విషయాలు పెనవేసుకుని ఉంటాయి. వీటిని నాకు అనుకూలం గా మలుచుకుని వస్తుపరంగా 'నానీ'గా రాయడానికి ప్రయత్నించేదాన్ని.

మా నాన్నగారు నా పెళ్లి సమయంలో ఇచ్చిన టీవీ ఒక నానికి కవితా వస్తువైంది. అప్పట్లో దాని ఖరీదు, విలువ చాలా ఎక్కువ. కానీ మారుతున్న ఈ రోజుల్లో 'స్మార్ట్ టీవీ' చూడటానికి చాలా చిన్నదిగా అనిపిస్తుంది. అలా దాని నుండి పుట్టిన ఒక 'నానీ'ని ఇప్పుడు ఒకసారి మననం చేసుకుందాం.

" మా పాత టీవి
నాన్న బహుమతి
తీయలేను
పెట్టుకోలేను" అని అంటున్నపుడు కలిగే ఒక మానసిక బాధ ఉద్వేగభరితంగా మారినపుడు ఎలాంటి అంతర్గత అలజడిని సృష్టిస్తుందో ఈ నానీని పరిశీలిస్తే అర్థమవుతుంది. దానిని ఉన్న చోట నుండి తీయలేక.. అలా అని కాలం చెల్లిపోయాక దానిని యథాస్థానంలో ఉంచలేక పడే ఒకానొక మానసిక అవస్థే ఈ నానీకి ప్రత్యక్ష ప్రేరణ. అలాంటి మింగుడుపడని ఒక ఉద్వేగభరిత సందర్భాన్ని అక్షరీకరిస్తూ రాసిన నాని ఇది.

ఒక సాధారణ అంశాన్ని అసాధారణ అంశంగా చిత్రీకరించి, నానీ రూపంలో ఎలా అక్షరీకరించాలి అనే విషయాన్ని మరికొన్ని 'నానీ'ల ఉదాహరణలతో తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.

"పేదరికమే
గొప్ప చిత్రకారిణి
అమ్మ చీరపై
చిరుగుల చిత్రాలు'' అని అంటున్నపుడు చివికిన బీదరికంలోంచి ఒక కళాత్మక సౌందర్య దృష్టి సహజ దృశ్యచిత్రంగా ఒదిగిపోతుంది. పేదరికాన్ని కూడా ఒక వ్యంగ్య స్ప ౄహతో నానీగా మలచడంలో లోలోపట గూడుకట్టిన అంతర్గత వేదన ఆవేదనగా తొంగి చూస్తుంది.

ఇలాంటిదే మరొక జీవన స్ప ౄహ ఉట్టిపడే నాని. వాస్తవాన్ని బతుకు విషాదంగా పిండి నిరాశగా ఆరేస్తుంది.

"కల్లంలో రైతు
కలలు ఆరబెట్టాడు
వర్షం
కల్లలు చేసింది"

ఈ యథార్థ దృశ్యం ప్రతి రైతు జీవితంలో ఉన్న ఒక కఠోర జీవన వేదన సత్యమే. మానసిక సంఘర్షణకి అద్దం పట్టే శ్రమజీవి కష్ట నష్టఫలిత పర్యవసాన ప్రతిరూప దిగులు చిత్రమిది. చేతికందాల్సిన సమయంలో పంట వర్షపు నీటిలో తడిసి.. మునిగి గంగ పాలవుతుంటే, అప్పటిదాకా పడ్డ కాయకష్టం ఉస్సూరుమంటూ నిట్టూర్చి.. కొండంత ఆశల బతుకుల్లో విషాద నిరాశలనే పరుస్తుంది. కన్న కలలు కల్లలై పస్తులతో ఆకలిమంటల్నే చివరికి మిగుల్చుతుంది. ఈ నిస్సహాయ స్థితిని అనుభవైకవేద్యంగా కళ్ళకు కట్టినట్లుగా నిరూపించడమే ఈ భౌతిక విషాద వాస్తవికత.

ఇంకోచోట సహజత్వానికి విరుద్ధంగా చోటుచేసుకుంటున్న నవనాగరిక పరిణామాల్ని చమత్కార ధోరణిలో వ్యక్తపరచడానికి ప్రయత్నించాను.

"అతడు కుమ్మరి
ఫ్రిజ్జులో నీళ్ళే తాగుతాడు
ప్రపంచీకరణ
మాయాజాలం" అంటూ వర్తమాన కులవృత్తికి దూరంగా వినిమయ జీవితానికి ఎలా బానిసగా మారాడో ఈ చిన్న నాని ఉదహరిస్తుంది. వృత్తిపరంగా కుమ్మరే చల్లదనాన్ని పంచే నీళ్ల కూజాను, కుండను తయారుచేసి వేసవితాపం నుండి సేదతీరుస్తాడు. అటువంటి వృత్తికారుడు ఫ్రిజ్జులో నీటిని తాగే స్థితికి నెట్టబడడం ఈ ప్రపంచీకరణ మాయాజలం. ఇది సామాజిక జీవన వాస్తవికతకి అద్దం పడుతుంది.

ఇంకా ఇలాంటి బహుముఖ పార్శ్వాలను తడుముతూ కొత్తకోణాలను ప్రతిబింబించే అంశాలను ఎన్నింటినో ఈ నానీల రూపంలో పలవరించవచ్చు.

" కరెంట్ పోయినప్పుడు

ఆమె నవ్వింది

ఇప్పుడు ఆలస్యమైనా

పర్వాలేదు " అని చెప్పడంలో.. పైకి కనీకనిపించకుండా దాచే ఒక అంతర్లీన మార్మిక ధ్వని ఏదో ఇందులో ప్రతిధ్వనిస్తోంది. కరెంట్ పోయిన తర్వాత అలుముకున్న చీకట్లో ఆమె నవ్విన నవ్వే ఒక వెలుగుదీపంగా చుట్టూ కాంతిని ప్రసరింపజేసిన తీరును ఇక్కడ కవిత్వమయం చేసే చమత్కార ధ్వనిగా భావించవచ్చు. ఈ భరోసాలోంచే ఆలస్యమైనా పర్వాలేదన్న స్ఫుఅహను ఈ నానీ ఆవిష్కరిస్తోంది.

మరోచోట చెప్పినట్టుగా విలక్షణత ఉట్టిపడే భావ సౌందర్యాన్ని నర్మగర్భంగా పలికే స్వభావాన్ని చిత్రీకరిస్తుంది.

"అమూల్యమైన పుస్తకాలు

ఇంటినిండా

అతడి కంటే

ధనవంతుడెవరు?" అనే భావన పుస్తకాలను విజ్ఞానానికి ప్రతీకగా చేసి, మేధోపరమైన జ్ఞాన సమపార్జనని ఆలోచనల రూపంలో విలువైన ధనసంపదగా భావించి పెద్దపీట వెయ్యడం ఒక సఅజనాత్మక లోచూపుకి కొత్తద్వారాలు తెరవడం లాంటిదే. ఈ వైవిధ్యపూరితమైన ఊహే మస్తిష్కంలోని మేధోమథనానికి ఒక గీటురాయిగా పేర్కొనవచ్చు.

సున్నితమైన అంశాలను గాఢతతో పెనవేసుకున్నపుడు మమేకమయ్యే మానసిక స్థితిలోంచి ఊపిరిపోసుకునే కవిత్వం చాలా సహజంగా నిర్మలంగా ఉంటుంది. ఈ సత్యాన్ని తేటతెల్లం చెయ్యడానికి బాల్యాన్ని ఒక ప్రతీకగా చేసుకుని ఆ సందర్భాన్ని కవిత్వమయం చేసే దృశ్యాన్ని ఇప్పుడు మరో నానీలో పరిశీలిద్దాం.

"స్వచ్ఛమైన

నవ్వు దొరకలేదా

పసివాడి కేసి

చూడు చాలు " అంటూ ఆపేయడంలో ఉన్న ఆంతర్యం సహజ వాస్తవికతలో ఉన్న స్వచ్ఛదనాన్ని ఒక పసివాడి నిర్మలమైన చిరునవ్వులోంచి దర్శించే తత్వాన్ని తాత్విక స్ఫుఅహతో మమేకం చేస్తుంది. సాధారణ విషయాన్ని కూడా అసాధారణ రీతిలో అతి సౌమ్యంగా చిత్రించే తపనను ఇందులో వాస్తవిక దృష్టితో చూస్తాం. ఈ ఒడుపే పాఠకుడి మనసుని చాలా సన్నిహితంగా తడిమి, నానీలోని లోచూపుతో ఆకట్టుకునే ప్రయత్నం చేస్తుంది.

ఇలాంటి ఆహ్లాదభరితమైన మరో కోణాన్ని అందిపుచ్చుకోవడంలో ప్రదర్శించే నేర్పరితనాన్ని ఇక్కడ మళ్లీ మరో నానీలో చూడవచ్చు.

"మా ఇంటికి

అతిథిగా కొత్త కుండ

వేసవి మొత్తం

చల్లదనమే " అని వ్యాఖ్యానించడంలో.. మండు వేసవిలోని ఉష్ణశక్తిని అంతా, అతిథిగా వచ్చిన కుండ రూపంలోని నీటి చల్లదనంతో దాహార్తిని తీర్చి, వేసవిని కూడా శీతలమయంగా చేసే పరుసవేది విద్యని ఈ నానీ ప్రదర్శిస్తుంది. వస్తువులోని సహజగుణాన్ని గుర్తించి దాని లక్షణం ఆధారంగా మూల స్వభావాన్ని కవిత్వమయం చేసి చెప్పడం దీని ప్రత్యేకత.

ఇలా చెప్పుకుంటూ పోతే నడిచే కాలమే 'నానీ'లమయంగా మారిపోతుంది. వీటి కుదుపుల తాకిడికి తాదాత్మ్యం చెందే ప్రతీ క్షణమూ ఉద్వేగభరితమైన సున్నితదఅశ్యాలను కవితాత్మకంగా ఆవిష్కరించే ప్రయత్నం చేస్తాయి. ఇందులో తీసుకున్న ప్రతివస్తువూ మన చుట్టూ అందుబాటులో వున్న పరిసరాల్లోంచే స్వీకరించి.. పలు సందర్భాల్లోంచి వ్యక్తిగత దఅష్టితో చూసి.. స్వీయ అనుభవాలతో అనుభూతులుగా ఆవిష్కరించే తపనలోంచి పుట్టుకొచ్చినవే. కాకపోతే వీటిని చాలా నిశితమైన దఅష్టితో అధ్యయనం చెయ్యాలంతే. చూసే ప్రతి పార్శ్వంలోనూ సృజనాత్మకత ఉట్టిపడే మమేకత్వాన్ని ప్రదర్శించాలి. మస్తిష్కంలో విచ్చుకునే ఆలోచనలకు కొత్తచూపుతో పదునుపెట్టాలి. దార్శనిక స్వభావాన్ని ఆకళింపు చేసుకోవాలి. వీటన్నింటితోపాటు స్థితప్రజ్ఞతను చాటిచెప్పే మానసిక లోతుల్ని సమదఅష్టితో పరిశీలించే నేర్పు, ఓర్పు, తపన, వేదన, అవగాహన సమపాళ్ళలో మిళితం చేసి హఅదయావిష్కరణ చెయ్యాలంతే. తగిన కఅషితో సాధన చేస్తే సాధించలేనిదంటూ ఏదీ లేదు ఈ లోకంలో.

వీటితోపాటు లోతైన విమర్శనాత్మక అధ్యయనం తప్పని సరి. అలా సానబెట్టుకుంటూ వచ్చిన ఊహల్ని ఒకచోట కుప్పగా పోసి అక్షరసాధనతో లక్ష్యానికి గురిపెట్టాలంతే.. నానీలు వాటంతటవే చిన్నపిల్లల్లా పరిగెత్తుకుంటూ వచ్చి, మన చుట్టూ, మనసు చుట్టూ మౌన ప్రదక్షిణ చేస్తాయి. వీటిని శబ్దశక్తితో అక్షరమానం చేసి మన కలల్ని సాకారం చేసుకోవాలి. అలాంటి ఒక కఅషిలో ఒక భాగమే ఇన్నాళ్టి నా ఈ నానీల ప్రయత్నం. ఇందులో నాతోపాటు మీరు కూడా భాగస్వాములై ఈ వర్తమాన కాలాన్ని 'నానీ'లమయం చేద్దాం.

■



# కవిత్వం జీవధాతువులాగా ఉండాలి

- ఆచార్య బేతవోలు రామబ్రహ్మం

**ఇ**ప్పుడు అన్ని ప్రక్రియలూ నువ్వా నేనా అన్నట్టు సాంఘిక ప్రసార మాధ్యమాల్లో హెూరెత్తుతున్నాయి. అందువల్ల పద్యమైనా, వచన కవిత్వమైనా దేనికీ ఢోకా లేదన్నారు ప్రముఖ కవి, రచయిత, ప్రతిష్టాత్మక కేంద్రసాహిత్య అకాడెమీ భాషా సమ్మాన్ పురస్కార గ్రహీత ఆచార్య బేతవోలు రామబ్రహ్మం. కవి, రచయిత డా.టేకుమళ్ళ వెంకటప్పయ్య 'సాహిత్య ప్రస్థానం' తరఫున వారితో ముచ్చటించారు. ఆ ముఖా-ముఖి ఇదీ....

**మీ బాల్యం విద్యాభ్యాసం క్లుప్తంగా చెప్పండి.**

మాది తాడేపల్లిగూడెం దగ్గరలో ఉన్న నల్లజర్ల అనబడే కుగ్రామం. సత్యనారాయణమూర్తి, రాధారుక్మిణి గార్లు మా తల్లిదండ్రులు. ఎనిమిదిమంది సంతానంలో నేను ఒకణ్ణి. నా బాల్యం, ప్రాథమిక విద్యాభ్యాసం ఆ గ్రామంలో గడిచాక, అక్కడే కొత్తగా హైస్కూలు కూడా రావడంతో అందులోనే చదివాను. ఆరో తరగతిలో చేరే సమయంలో నాకు పదేళ్ళు నిండకపోవడంతో 25-05-1949ని మార్చి 28-06-1948 గా నమోదు చేశారు. ఎస్.ఎస్.ఎల్.సి పాసయ్యాక, నాన్నగారు హెల్త్ ఇన్స్పెక్టర్ ట్రైనింగ్ లాంటిదేదో ఇప్పిద్దామని నన్ను కొవ్వూరు తీసుకుని వస్తే, మా బావ గారు నచ్చజెప్పి, ఆంధ్ర గీర్వాణ విద్యాపీఠంలో భాషాప్రవీణలో చేర్పించారు. 1969లో సర్వప్రథముడిగా నిలిచి ఆంధ్ర విశ్వవిద్యాలయం వారి స్వర్ణ పతకం, అలాగే దువ్వూరి వీరభద్రయ్య మెమోరియల్ బహుమతి కూడా అందుకున్నాను.

**మీరు తెలుగు భాషవైపు ఆకర్షించబడడానికి ప్రేరణ ఎవరు?**

హైస్కూల్లో ఉన్నప్పుడు మా తెలుగు మాష్టారైన పార్థసారథి ఆచార్యులు గారు శ్లోకాలు, పద్యాలు కర్ణపేయంగా చదువుతూ ఉంటే ఆ అకర్షణలో పడిపోయాను. అక్కిపెద్ది కుటుంబ శాస్త్రి గారు తెలుగు అద్భుతంగా చెప్పేవారు. నాకు అన్ని సబ్జెక్టుల కంటే తెలుగులోనే ఎక్కువ మార్కులొచ్చేవి. ఇక భాషాప్రవీణ చదువుతున్న రోజుల్లో కర్రి శ్రీరామమూర్తి గారు గొప్ప వైయాకరుణుడు. ఆయన నాకు సంస్కృతపై ఉన్న భయాన్ని పోగొట్టారు. సాహిత్య పాఠాలు చెప్పిన రావూరి వెంకటేశ్వర్లు వీరంతా సంస్కృతాంధ్రాల్లో నన్ను తీర్చిదిద్దినవారు. వీరి ప్రభావ కారణంగానే నాకు సంస్కృతాంధ్రాలపై విశేష మక్కువ ఏర్పడి తద్వారా విస్తృత అధ్యయనానికి తోడ్పడింది.

**మీరు 18 సం.లకే అవధానాలు చేసినట్లు విన్నాను. ఆ వివరాలు క్లుప్తంగా చెప్పండి?**

అవును. మా కళాశాలలో నాకు సాహిత్య పాఠాలు చెప్పిన రావూరి వెంకటేశ్వర్లు గారు సుప్రసిద్ధ అష్టావధాని. నాలో ఉన్న ఆసక్తిని గమనించి ఆయన ఇచ్చిన ప్రేరణవల్లనే గణపతి నవరాత్రి ఉత్సవాల్లో ప్రిలిమినరీ విద్యార్థిగా ఉన్న నేను మొదటి సారి 1967లో అష్టావధానం చేశాను. అలా ఆరంభమైన అవధానాలు 200 పైనే చేసి ఉంటాను. నేను నాగార్జున విశ్వ విద్యాలయంలో బోధకుడిగా చేరేవరకూ అవి కొనసాగాయి.

**మీ పిహెచ్.డి విశేషాలు చెప్పండి.**

'తెలుగు వ్యాకరణాలపై సంస్కృత ప్రాకృత వ్యాకరణాల ప్రభావం' అంశం నేను చెప్పగానే ఆచార్య తూమాటి దోణప్ప గారు ముచ్చటపడి ప్రత్యేకానుమతితో నాకు సీట్ ఇచ్చారు. చాలా సంతృప్తికరంగా ఆ సిద్ధాంత గ్రంథ రచన చేశాను.

**నాగార్జున విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్నప్పుడు మీ కెరీర్ కొత్త మలుపు తిరిగినట్టుంది?**

నా పిహెచ్.డి అంశం, దోణప్పగారి అనురాగం నన్ను

నాగార్జున విశవిద్యాలయానికి చేర్చాయి. తర్వాత నా దృష్టి ఆధునిక సాహిత్యం, పరిశోధన వైపు మళ్ళింది. అక్కడ ప్రారంభించిన వ్యాఖ్యాన రచన మహాయజ్ఞం, తెలుగు విశ్వవిద్యాలయం రాజమండ్రి సాహిత్యపీఠానికి అధ్యక్షునిగా వచ్చాక తారాస్థాయికిచేరి, హైదరాబాదు విశ్వవిద్యాలయానికి వెళ్ళాక శాఖోప శాఖలుగా విస్తరించింది. నేటికీ కొనసాగుతూనే ఉంది.

**రాజమండ్రి సాహిత్య పీఠంలో మీరు చేసిన కృషి?**

అక్కడ డీన్‌గా నేను ప్రారంభించిన ప్రాజెక్టు లక్ష్యం ఏమిటంటే 'వ్యాఖ్యా స్రవంతి' పేరుతో తెలుగులో వ్యాఖ్యానాలు లేని సంస్కృత నాటకాలకు, తెలుగు పద్యకావ్యాలకు సమర్థుల చేత వ్యాఖ్యానాలు వ్రాయించడం, వారికి తగిన పారితోషిక మిచ్చి, ప్రచురింపజేసి తక్కువ ధరలో పాఠకులకు అందించడం. అలా కాశీఖండం, కుమార సంభవం, శివరాత్రి మాహాత్మ్యం వెలువడ్డాయి. నేను స్వయంగా వేణీసంహారం, అనర్ఘరాఘవం, నాగానందం అనే సంస్కృత కావ్యాలకు వ్యాఖ్యానాలు సమకూర్చాను.

**హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ప్రాచీన తెలుగు అధ్యయన కేంద్రం లో తెలుగుకు మీరు చేసిన కృషి క్లుప్తంగా చెప్పండి.**

ఈ కేంద్రాన్ని యూజీసి నుంచీ ప్రత్యేకంగా మంజూరు చేయించి మరీ అప్పటి వి.సి ఆచార్య హస్నైన్ గారు నాకు అప్పజెప్పారు. ఈ కేంద్రంలో దాసరి లక్ష్మణస్వామిగారు చేసిన దాదాపు ఏడువేల పద్యాల సంకలనానికి, పాఠకమిత్ర వ్యాఖ్యానంతో 'వర్ణన రత్నాకరం' పేరుతో 23 సంపుటాలు ప్రచురింపజేయడం. నేను అద్దంకి శ్రీనివాస్, నరాల రామారెడ్డి, ఆర్వీఆర్కే శాస్త్రి... ఇలా ఎంతోమంది కలిసి వ్యాఖ్యానం సమకూర్చాం. తర్వాత వచ్చిన వి.సి ఆచార్య రామకృష్ణ రామస్వామి గారు నా పదవీకాలం పొడిగించి మరీ ఆ 23 సంపుటాలను పూర్తిచేసే అవకాశం కల్పించారు. ఆ తరువాత ఆ కేంద్రం మూతపడడం విచారించదగ్గ అంశం.

**కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నెల్లూరులో ఉన్న ప్రాచీన తెలుగు విశిష్ట కేంద్ర కృషి, కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ప్రాచీన తెలుగు అధ్యయన కేంద్రం చేస్తున్న కృషి ఒకటేనా? కొంచెం వివరంగా చెప్పండి?**

ఇప్పుడు నెల్లూరులో ఉన్న ప్రాచీన తెలుగు విశిష్ట కేంద్రం లక్ష్యాలు, కర్తవ్యాలు ఇంకా స్పష్టంగా వెలుగులోకి రావలసి ఉంది. ప్రాచీన పద్యకావ్యాలకు వ్యాఖ్యానాలు రచింపజేసి ఈనాటి పాఠకుడికి చేరువ జేసే వారిదృష్టిలో ఉన్నట్టు లేదు. దాని లక్ష్యాలు, ప్రాధమ్యాలేమిటో తెలియాలంటే కొంతకాలం వేచి చూడాల్సి ఉంది.

**మీరు తెలుగుపై కాక ఎక్కువ సంస్కృత కావ్యాల మీదనే ఫోకస్ పెట్టడానికి కారణం?**

అలా అని ఏమీ లేదు. తెలుగు పద్యకావ్యాలను ఆధునిక పాఠకులకు అందించే విషయానికే అగ్ర తాంబూలం ఇచ్చాను. ఆ కోవలో హరివంశము, కేయూరబాహు చరిత్రము, రాజశేఖర చరిత్ర, వరాహపురాణం, ఉత్తర రామాయణం, పృథ్వీ భాగవతం వంటి ఎన్నో తెలుగు గ్రంధాలకు వ్యాఖ్యానం వ్రాశాను. ప్రస్తుతం వెన్నెలకంటి సూరన విష్ణుపురాణానికి వ్యాఖ్య వ్రాస్తున్నాను. అలాగే అభిజ్ఞాన శాకుంతలం, కుందమాల వ్యాఖ్యానాలు కూడా వ్రాశాను. అలా వ్యాఖ్యాన స్రవంతి తెలుగు, సంస్కృతాలలో సాగుతూనే ఉంది.

**మీకు వచన కవిత్వం పట్ల ఉన్న అభిప్రాయం ఏమిటి?**

వచన కవిత్వం నేను గుంటూరులో ఉండగా కొంత ప్రయత్నం చేశాను. అ.ర.సం. వారి ప్రోత్సాహంతో ఆఫ్రికన్ కవియైన సింఘోర్ కవిత్వాన్ని తెలుగులో వచన కవిత్వంగా మలచడానికి ప్రయత్నించాను. నాకే నచ్చలేదు. ఇది నా ప్రక్రియ కాదని వదిలేశాను. వచనమైనా, పద్యమైనా అందులో కవిత్వం లేకపోతే ఎవరినీ ఆకర్షించదు. కవిత్వం జీవధాతువులాగా ఉండాలి. ఏ ప్రక్రియైనా ప్రజలు నెత్తిమీద పెట్టుకోవడానికి కానీ, నేలకు విసిరి కొట్టడానికి గాని, ఆయా కవులే కారణం.

**పద్యం మళ్ళీ పుంజుకున్నట్టు కనిపిస్తోంది. దాని భవిష్యత్తు?**

ఒక ప్రక్రియ హోరెత్తడం, ఒక ప్రక్రియ సద్దుమణగడం అనేది ప్రసార సాధనాల మహిమ. ఇప్పుడు ఎవరి ప్రసార సాధనం వాడిది. వ్రాసిన ప్రతిదీ యూట్యూబుల్లోను, ఇతర మాధ్యమాల్లోకి యెక్కించి వరద కట్టిస్తాడు. ఎగజిమ్ముతాడు. ఇప్పుడు అన్ని ప్రక్రియలూ నువ్వా నేనా అన్నట్టు హోరెత్తు తున్నాయి. అందుకని పద్యమైనా, వచన కవిత్వమైనా దేనికీ ఢోకా లేదు. నిశ్చింతగా ఉండొచ్చు.

**మీరు వ్రాసిన గ్రంధాల్లో మీకు బాగా సంతృప్తినిచ్చిన గ్రంధం?**

నేను వ్రాసిన గ్రంధాలన్నీ ముమ్మాటికీ అన్నీ నాకు సంతృప్తినిచ్చినవే! పాఠకాదరణకు విశేషంగా నోచుకున్నవి. కొన్ని చెప్పాలంటే, విమర్శల్లో పద్యకవిత పరిచయం, వ్యాసగౌతమి, అనువాదాల్లో దేవీభాగవతం, సంస్కృత నాటక వ్యాఖ్యానాల్లో అనర్ఘరాఘవం, మృచ్ఛకటికం. పద్యకావ్యాల్లో హరివంశము. పాటల్లో ఉమాశంకర స్తుతిమాల. పద్యకృతుల్లో కొత్త గోదావరి. నృత్యరూపకాల్లో శకుంతలా దుష్యంతం,

సౌందర నందం.

**మీరు వ్రాసిన బౌద్ధులకు సంబంధించిన నృత్యరూపకం 'సౌందర నందం' విదేశాల్లో కూడా పేరు తెచ్చుకున్నది కదా! ఆ వివరాలు చెప్పండి?**

అవును. సౌందరనందం అనే నృత్యరూపకం నాగార్జున విశ్వవిద్యాలయంలో ఉండగా, బుద్ధిస్ట్ స్టడీ సెంటర్ ప్రారంభోత్సవానికి, భూటాన్‌నుంచీ బౌద్ధ మతాచార్యులు (జెఖెంపో) బృందం విచ్చేసింది. వారికోసం బౌద్ధం నేపథ్యంలో ఒక గంటకు సరిపోయే విధంగా రూపకం కావాలని అడగడం వల్ల దాన్ని వ్రాసిచ్చాను. ఆనాడు ప్రదర్శన ఒక అద్భుతంగా సాగింది. ఆ మఠాధిపతి తమ దేశానికి ఆహ్వానించి రాచమర్యాదలతో అక్కడ మూడు ప్రధాన నగరాలలో సౌందరనందం ప్రదర్శింపజేశారు. అక్కడ కూడా రూపకం విజయఢంకా మ్రోగించింది. అంతే కాదు తిరిగి వస్తూ ఢిల్లీలో విజ్ఞాన్ భవన్లో ఉపరాష్ట్రపతి వెంకటరామన్ గారి కోరికమేరకు ఒక ప్రదర్శన జరిగింది. వారు, అప్పటి యూజీసీ అధ్యక్షుడు కొత్త సచ్చిదానందమూర్తిగారు తిలకించి పరవశించిపోయారు. తర్వాత దేశవిదేశాల్లో ఎన్నో ప్రదర్శనలు జరిగాయని విన్నాను.

**అన్నమయ్య కీర్తనలపై మీలాంటి వారు దృష్టి పెడితే క్రొత్త రహస్యాలు వెలుగులోకి వస్తాయని వేటూరి ఆనందమూర్తిగారు లాంటి పెద్దలు కోరుకుంటున్నారు. మీరేమంటారు?**

ఈ విషయంలో నేను చెప్పేదేమిటంటే అందరూ అన్నిటికి ఎగబడకూడదు. ఏ ప్రక్రియ, ఏ రచనతో మనకు తాదాత్మ్యం కుదురుతుందో దానికి పరిమితం కావడం మంచిది. లేకపోతే ఆ ప్రక్రియకు పూర్తి న్యాయం చేసినవాళ్ళం కాలేమంటాను.

**ఇటీవల కేంద్ర సాహిత్య అకాడమీ వారి భాషా సమ్మాన్ పురస్కారానికి మీరు ఎంపికవడం ఆనందదాయకం.. దానిపై మీ అనుభూతి మాతో పంచుకోండి.**

ఇటీవల ప్రకటించిన 'భాషా సమ్మాన్' ఆనందాన్ని, సంతృప్తిని పుష్కలంగా కలిగించిందన్న మాట వాస్తవం. ఇది నేను కృషి చేస్తున్న రంగానికి సంబంధించిన పురస్కారం. ప్రాచీన-మధ్య యుగాల సాహిత్యాన్ని (క్రీ.శ 11 నుంచీ 18 వ శతాబ్ది) ఆధునిక పాఠకులకు చేరువజేస్తున్న కృషికి గుర్తింపు. దక్షిణ భారతీయ భాషల్లో ఎవరో ఒకరికి మాత్రమే యిచ్చే పురస్కారం. దేవీభాగవతం అనువాదానికి వచ్చినప్పటికన్నా, ఇప్పటి ఆనందం మిన్న. మునుపు ప్రెసిడెంట్స్ సర్టిఫికేట్ ఆఫ్ ఎక్సలెన్సు పొందినప్పటి ఆనందంతో సరిసమానమైన సంతృప్తి, ఆనందం కలిగాయి.

**యువ కవులకు మీ సందేశం ఏమిటి?**

నా సందేశం ఒక్కటే - 'మీ కోసం మేమందరం శ్రమపడి వ్రాస్తున్న వ్యాఖ్యానాలను శ్రద్ధగా చదవండి. లబ్ధి పొందండి. మా శ్రమ వృథా కానివ్వకండి'.

■

## ప్రొజెక్షన్

**మే**ము పంజరాలు బద్దలుకొట్టి
బయటపడి చాల కాలమైంది
మళ్ళీ కొత్తగా నీ ఆధిపత్యం ఏంది
దేవత, మహా ఇల్లాలు, మహా పతివ్రతా
బిరుదులిచ్చి వేసిన సంకెళ్ళు చాలిక !

మా నవ్వుల మీద, మా తిండి మీద
మా బతుకుల మీద నీ మనువు ముసుగు
ఎంతకాలం వేసుకోమంటావు?
పొడుగు పొట్టి లావు సన్నం తెలుపు నలుపు
మా ఒంటి కొలతల చుట్టూ
నీ నిఘా ఎందుకు అనుక్షణం?
మా గుండెలను చున్నీతో కప్పుకోమనడం కాదు
ఎన్ని ఒంపుసొంపులున్నాయని
తొమ్మిది నెలల పసిదాన్ని కాటు వేస్తివి
నడుంమీద ఎన్ని మడతలున్నాయని
జేజమ్మను చెరపడితివి
బీగామి పాలియాండ్రి చిన్నిల్లు
ఇవి చాలక ఎదురుపడిన స్త్రీని
వెకిలి చూపులు చూసే నీ మకిలి బుద్ధికి
జ్ఞానపు అద్దాలు తొడుక్కో ఇక
నువ్వు దొరవి కాదు నేను బానిసని కాదు
నీ ఆధిపత్యం సాగదిక్కడ
శ్రామిక తల్లి కొంగుని నడుముకి బిగిస్తుంది
రెజ్లర్ చెల్లి బరిలో దిగితే టీ షర్ట్ తొడుక్కుంటుంది
లోహవిహంగపు మహిళ
డ్యూటీలో కోటును వేసుకుంటుంది
అథ్లెట్ పరుగుపందెంలో షార్ట్సు వేసుకుంటుంది
ఎప్పుడెలా ధరించాలి ఏమి ధరించాలి
అది పూర్తిగా మా ఇష్టం
మా వస్త్రాల మీద నీ శల్య పరీక్షలు కాదు
మదపు సమాధిలో కూరుకుపోయిన నీ మనసుపైన
వివేకపు చెద్దరు కప్పుకోవాల్సింది నువ్వే!

విజ్ఞానం నేర్చిన వాళ్ళం విజ్ఞత ఉన్న వాళ్ళం
వివేచన పొందిన వాళ్ళం విలువలు తెలిసిన వాళ్ళం
నీ అజ్ఞానపు ఆధిపత్య ప్రొజెక్షన్ ఆపుకో ఇక
లేకుంటే వినాశనం నీకు
చాలా దగ్గరలోనే ఉందిక!

**- రోహిణి వంజారి**
90005 94630



# సాహిత్య బాటసారి శారదా నటరాజన్

- దాసరి రామచంద్రరావు
97044 59373

**1995**లో రెండవ ముద్రణగా 96 పేజీలతో 'సాహిత్య బాటసారి శారద వెలువడింది. దీనిని ఆలూరు భుజంగరావు రాసారు. ఈ పుస్తకానికి ఈ పేరును చలసాని ప్రసాదరావు గారు పెట్టేరు. చరిత గ్రాఫిక్స్ వారు ప్రచురించేరు. ఈ పుస్తకం రెండవ ముద్రణ నాటికి అంటే 1995 నాటికి 'శారద మరణించి నలభై సంవత్సరాలయ్యింది. శారద అసలు పేరు, ఎస్నటరాజన్. తెనాలి శారద నటరాజన్ కి ఇష్టమైన ఊరు. ఈ పుస్తకావిష్కరణ తెనాలిలోనే జరిగింది. నాటి పత్రికల్లో ఈ పుస్తకం మీద మంచి సమీక్షలే వచ్చాయి.

అఖిల భారత విప్లవ సాంస్కృతిక సమితి కార్యదర్శి కేవిఆర్ 1985లో శారద గురించి రాస్తూ 'మరువగూడని రచయిత శారద. హొటల్ సర్వర్‌గా ఉంటూ కూడా స్వయం కృషితో రచయితగా మారి అభ్యుదయ పంథా పట్టిన మట్టిలో మాణిక్యం ... శారదనటరాజన్. అతడ్ని, అతడితో గడిపిన జ్ఞాపకాలను నెమరువేసుకొని తిరిగి శారద వ్యక్తిత్వాన్ని సజీవం చేసిన భుజంగరావు గారికి అభినందనలు...' అని అభినందించారు. శారద నటరాజన్ మరణించిన తర్వాత 1956 జనవరి త్రైమాసిక సంచిక 'అభ్యుదయ'లో 'మన శారద' శీర్షికన నార్ల చిరంజీవి వ్యాసం రాసారు. అందులో – " ఆకలి, దారిద్ర్యం, చీకట్లో బతుకు, కన్నీళ్లు ఇవే అతని కలం నుంచి వేయి ముఖాలతో రూపొందాయి. ఏ మిత్రులతో సాహితీ ద్వారంలోంచి ప్రవేశించాడో ఆ మిత్రులకు 'మీ రచనలకు సరియైన పారితోషకం పొందండి. అది మన హక్కు' అని హెచ్చరిస్తూ వెళ్ళిపోయాడు. సరస్వతిని జయించాడు గాని, మృత్యువు ముందు తలవంచాడు. అమరుడూ, అభ్యుదయ రచయితలందరికీ ఆత్మీయుడూ, అభిమాన పాత్రుడు అయిన శారద నటరాజన్ ను ఏనాడూ ఎవరూ మర్చిపోరో.మరచిపోలేరు..." అంటూ 'శారద' గురించి నార్ల చిరంజీవి అభిప్రాయం కూడా ఈ పుస్తకం లో ఉంది. 'శారద అకాల మరణం' శీర్షికన కృష్ణాపత్రిక ప్రకటన కూడా ఈ పుస్తకంలో ఉంది.

1949 ఫిబ్రవరి 18 తెలుగు స్వతంత్ర సంచికలో 'నాదైన సమస్యలు' అంటూ స్వయంగా శారద నటరాజన్ తన అవస్థను రాసుకున్నారు. అందులోంచి రెండు వాక్యాలు... ఇప్పుడే నా జీవితం ఇంత దుర్భరంగా ఉంటె మిగిలిన జీవితకాలం ఎలా గడవబోతుండా అని తగని భయం వేస్తోంది. స్వతంత్రం వచ్చేక ఇట్లా ఉండదనుకున్నాను. కానీ అలా జరగలేదు. పత్రికల వారు కథలు రాస్తే ఇచ్చే డబ్బులు నా మూర్ఛరోగాన్ని నయం చేసుకోవడానికన్నా సరిపోతయ్యేమో అని సంతోషించాను. అదీ వట్టిదైపోయింది..." అంటూ వేదన చెందుతాడు. చదువుతుంటే అతని వేదన మనల్ని నిలువునా కుదిపేస్తుంది.

ఇక 'సాహిత్య బాటసారి శారద' పుస్తకానికొస్తే ఆలూరి భుజంగరావు, (పుస్తక రచయిత) శారద నటరాజన్ తో వున్నా సానిహిత్యాన్ని వివరిస్తూ – ఇందులో 1943 నుండి 1955 వరకూ సాగిన మా జీవితక్రమాన్ని వివరించడానికి ప్రయత్నించానని... నా జీవితంలోంచి శారద జీవితాన్ని చెప్పాలని, అంటే నా జీవిత చట్రాన్నా శారద జీవితం ,పాటంగా ఉండాలని నాటి రాజకీయ,సాంఘిక,సాహిత్యక స్థితిగతుల్ని నేను అవగాహన చేసుకున్నంత వరకూ యధోచితంగా చిత్రించాల నున్నానని భుజంగరావు గారు తనముందు మాటలో చెప్పుకున్నారు.

'సాహిత్య బాటసారి శారద' పుస్తకం నటరాజన్ జీవిత చరిత్రను సంక్షిప్తంగా తెలియజేస్తుంది. నటరాజన్ జీవితం

కూడా సంక్షిప్తంగానే ముగుస్తుంది. ఆలూరి భుజంగరావు గారి జ్ఞాపకాల దొంతరలే ఇందులో పేజీలు .శారదకు-స్నేహితుడూ, సాన్నిహితుడూ సాహిత్య సహచరుడూ, చివరివరకూ నిబద్ధతతో జీవితాన్ని గడిపిన ఆలూరి భుజంగరావు గారి రచనగా వెలువడిన ఈ పుస్తకం విస్వసనీయతకు నిలువెత్తు నిదర్శనంగా నిలబడుతుంది.

శారద భుజంగరావు ల సాహిత్యబంధమూ,జీవన సంఘర్షణ లోని సారూప్యామూ, అనుభవాలూ జమిలిగా నడుస్తాయి. ఒకరి జీవిత పరిచయంతో మరొకరి జీవితమూ,సాహిత్యానుబంధమూ, మరికొందరి జీవనసంఘర్షణలూ విశదపడతాయి.

సాహిత్య బాటసారి శారద పుస్తక పరిచయమూ అంటే ఇంచుమించు రచయిత మాటల్లోనే విశదపరచాల్సి ఉంటుంది. అప్పుడే శారద విషాదాంత జీవితం లోని గాడత వ్యక్తమై అనుభూతమవుతుంది. ఎన్నోరెట్లు వత్తిడీ ,దారిద్ర్యం లోంచీ, ఎ పరికరాలూ వేసులుబాతులేని సత్తి లోనూ అనుక్షణం ఎదురయ్యే ప్రతికూల పరిస్తితిల్లోనూ మనిషికున్న ఒకే ఒక శక్తి సృజనాత్మకత. దాంతోనే అన్ని బంధనాలనూ తుట్టినియల్ని చేసిన శారద నటరాజన్ జీవితమూ , రచనలూ ఈ తరం రచయితలకూ,పాటకులకూ తెలియాల్సిన అవసరం ఎంతో ఉంది. ఆయన జీవన పోరాటం,మానసిక సంఘర్షణా మనిషితనాన్ని గెలిపించాలన్న నిరంతర తపన మనకు శక్తినీ,ధైర్యాన్నీ ఇస్తాయి. అని ఈ పుస్తకం ద్వారా భుజంగరావు గారు నిరూపిస్తారు.

ఇంకా తను ఒక పక్క కాలిపోతూనే మనిషితనాన్ని అనంతంగా ప్రేమించి, ఈ లోకాన్ని దీవించి అమూల్యమైన రచనలను సాహితీలోకానికి కానుకులగా ఇచ్చి బదులుగా హేళనా, తిరస్కారమూ, నిరాదరణ, అనుభవించేడు శారద నటరాజన్,అంటూ ఎంతో వేదన వెలిబుచ్చుతారు ,భుజంగరావుగారు. ఇంకా శారద గురించి చెప్తూ- రోజుకు పద్దెనిమిది గంటలు బండ చాకిరీతో ఆటూ పోటు జీవితపు అలలమీద,నిప్పుల కొలిమిలో తన కలల యాత్ర సాగించేడు శారద అని అంటారు.

'సాహిత్యబాటసారి శారద' పుస్తకం ద్వారా శారద మద్రాసు నుంచి తెనాలికి వలస రావడం తెలుగు నేర్చుకోవడమూ, జీవనమూ జీవన పోరాటమూ వ్యక్తిత్వమూ సాహిత్య కృషీ మొదలైనవి పొరలు పొరలుగా తెలియవస్తాయి.

శారద నటరాజన్ 1937 లో తన పన్నెండవ ఏట మద్రాసు నుంచి తన తండ్రి తో వాల్స్ వచ్చేడు. వచ్చిన రెండేళ్లకే-తండ్రి మరణిస్తాడు.తన చిన్నతనం లోనే తల్లిని కోల్పోయిన నటరాజన్ ను బావగారైన ఎల్లాప్రగడ భీమారావు నడుపుతున్న హోటల్లో కప్పులు కడగడం, అవసరమైనప్పుడు సర్వరు పనిచేస్తూ రోజుకు 18 గంటల బండచాకిరీకి పావలా ప్రతిఫలం. అప్పుడప్పుడూ ఈ చాకిరీ భరించలేక పారిపోతుండే వాడు. అక్కడ కూడా కడుపు నింపుకోడానికి తనకు తెలిసిన పని కప్పులు కడగడం. ఆ పనికే కుదిరేవాడు. అక్కడా ఆ చుక్కెదురే. తిరిగి తిరిగి ఆ బావగారి దగ్గరికే వచ్చేవాడు.

పావలా కూలీతోనే గడుపుతూ చుట్టుపక్కల తనలాంటి వారితో పరిచయాలు పెంచుకునేవాడు. కొందరు మిత్రులతో కలసి, హోటళ్ళలో మిగిలిపోయిన భోజన పదార్థాలు సేకరించి వికలాంగులకు పంచిపెట్టేవాడు.

ఏడవ తరగతి వరకూ చదివిన శారద, అతి తొందరగానే తెలుగు నేర్చుకున్నాడు. అరచేతుల చొక్కా, తెల్లని పంచె అడ్డకట్టు ఇదీ శారద ఆకారం. తెలుగు బాగా చదవడం, రాయడం వచ్చేక తెనాలిలో మోరిస్ పేటలోని లైబ్రరీని, మున్సిపల్ లైబ్రరీని వదిలిపెట్టేవాడు కాదు. చలం, కొ.కుల సాహిత్యంతో పాటు గోరా నాస్తికత్వం... అలా దొరికిన ప్రతి పుస్తకమూ చదవడమే కాకుండా మిత్రుల చేతా చదివించేవాడు.

అప్పుడే తెనాలిలో వస్తున్న రాజకీయ, సాహిత్య, సాంఘికోద్యమాలూ, పరిణామాల గురించి వింటున్నాడు. తాపీ ధర్మారావు గారి అధ్యక్షతన అభ్యుదయ రచయితల సమావేశం తెనాలిలో జరిగింది. దానికి శారద హాజరయ్యేడు. బాగా ప్రభావితుడయ్యేడు. కమ్యూనిస్ట్ పార్టీ ప్రత్యేకతను తెలుసుకునే అవకాశం బహుశా అక్కడే కలిగి ఉంటుంది. ఈ నేపథ్యం శారదను రచయితగా మార్చేయి. అయితే జీవితంలో కడుపు నిండా తిండీ, కంటినిండా నిద్ర ఎరుగని శారద అధ్యయనం మాత్రం ఆపలేదు.

ఆలూరు భుజంగరావు స్వయంగా "...శారద నన్ను సాహిత్య వీధుల్లోకి చేయిపట్టుకు నడిపించేడు కమ్యునిస్ట్ పార్టీ ని పరిచయం చేసాడు..." అని చెప్తారు. అంతేకాదు ఓ పక్క తీరీ తీరని ఆకలి,చాలీ చాలని డబ్బు, దానికి తోడూ మూర్ఛరోగం. అణా రొట్టె,,రాకప్పు కాఫీ-ఒక బీడీ-అరుగులమీద నిద్ర-సాహిత్య చర్చలు.ఎప్పుడో సినీమా.శారదకు భుజంగరావు తో పాటు అతని తమ్ముడు ప్రకాశం కూడా సన్నిహితుడే.

భావసారూప్యం కలిగిన మిత్రులతో కలిసి కమ్యునిస్ట్ పార్టీ సభ్యులయ్యేరు. ఆ తర్వాత నటరాజన్ భావాలలో జీవన క్రమంలో బాగా మార్పు వచ్చింది. స్వంతంగా బతకడం కోసం 'టిక్కీ' హోటల్ పెట్టారు. అది నాలుగు రోజులే సాగింది. కొన్నాళ్ళు ఘోరమైన పస్తులున్నారు. అయినా సరే సాహితీ తృష్ణ తీరేదికాదు.అయినప్పటికీ తాపీ గారి సంపాదకత్వంలో వస్తున్న 'జనవాణి' ప్రేరణతో ఒక వ్రాత పత్రిక 'ప్రజావాణి'ని

తీసుకువచ్చారు.సరైన బట్టల్లేక ఉండడానికి నీడ లేక– తిండికి కటకటలాడుతున్నా శారద నటరాజన్ దృష్టి సాహిత్యం మీదే ఉండేది.

గుంటూరులో పెద్దపూడిలో సాహిత్య పాఠశాల ఒక నెలరోజులపాటు జరిగింది. దానికి హాజరైన నటరాజన్‌లో గొప్ప మార్పు వచ్చింది. 1946లో 'ప్రపంచానికి జబ్బుచేసింది' మొదటి కథ రాసేడు. అది ప్రజాశక్తిలో అచ్చయ్యింది. అది మొదలు చనిపోయినంతవరకూ రాస్తూనే ఉన్నాడు (1955). సుమారు వంద కథలు రాసేడు. ఆరు వరకూ నవలలు రాసేడు. నాటికలు రాసేడు. రాజకీయ వ్యంగ్య రచనలు చేసేడు.

శారద మీద చలం, కొ.కు వంటి వారి ప్రభావం ఉన్నప్పటికీ కొ.కు రాయని అథోజగత్తు జీవితాలనీ, చలం పాత్రలకు తెలీని ఆకలినీ వస్తువులుగా కథలు మలిచేడు.

ఈ కాలంలో కమ్యూనిస్టు పార్టీ సభ్యులుగా ఊరేగింపులలోనూ, సభల్లోనూ పాల్గొనడం వాళ్ళ శారదకు ఎక్కడా పట్టుమని పదిరోజులు పని నిలిచేది కాదు. ఆ తర్వాత కొన్నాళ్ళు పని దొరికేది కాదు. ఆముదం దీపం వెలుగులో రచనలు చేస్తుండేవాడు.

శారదను తెనాలిలో గొన్నాబత్తుల సోమలింగాచారి, ముక్కామల మల్లికార్జునరావు చాలా విధాలుగా ఆదుకున్నారు. భుజంగరావు గారి తల్లి శారదను కొడుకులా చూసుకునేది. రావూరి భరద్వాజతో స్నేహం ఉండేది. కన్నెగంటి హనుమంతు, అల్లూరి సీతారామరాజుల సినిమాలు తీయాలని కలలు కనేవాడట. శారద చేతిలోఎప్పుడూ ఏదో ఒక పుస్తకం ఉండేదట.

అవి తెలంగాణా పోరాటం ముమ్మరంగా సాగుతున్న రోజులు. 1948లో జ్యోతిలో 'శారద' కలం పేరున 'గొప్పవాడి భార్య' పేరున కథ అచ్చయింది. గంధర్వుడూ, శక్తి కూడా అతని కలం పేర్లే. అది మొదలు జ్యోతి, తెలుగు స్వతంత్ర, ప్రజామత, ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, విశాలాంధ్ర వంటి పత్రికల్లో విరివిగా రాసేవాడు. పారితోషికం దక్కకపోయినా రచయితగా పేరు వచ్చింది. పతితలు, భ్రష్టులు, దగాపడిన తమ్ముళ్ళు, మట్టిమనుషుల జీవితాల్లోకి తొంగి చూసి కథలుగా, నవలలుగా అక్షరబద్ధం చేస్తూనే మరొకపక్క కడుపు నింపే తక్షణ ఆర్థిక అవసరాలకోసం రేరాణి, అభిసారిక వంటి పత్రికలకూ రచనలు చేసేవాడు.

శారద నటరాజన్‌కు 24వ ఏట పెళ్ళయింది. సంసార భారం పెరిగింది. కొన్నాళ్ళు మజ్జిగ అమ్మేడు. గారెల కళాయి వేసేడు. ఒకపక్క మూర్ఛజబ్బు పెరుగుతూ వస్తోంది. కొందరి మిత్రుల సహకారంతో 'చంద్రిక' మాసపత్రిక తెచ్చేడు. డబ్బులేని ఉత్సాహం రెండో పత్రికను తేలేకపోయింది. జ్యోతి కార్యాలయంలో కొన్నాళ్ళు పనిచేసేడు. అదీ నిలవలేదు. తర్వాత టీ కొట్టు పెట్టేడు. హోటల్ పెట్టాడు. కలిసిరాలేదు. అప్పటికే ఆరోగ్యం దారుణంగా చెడింది. ఆకలీ, ఆరోగ్యమూ, అనంతంగా రాయాలనే తపనా శారద ఆయుష్షును పరిమితం చేసాయి. 1955 ఆగస్టు 17న మూర్ఛరోగానికి పూర్తిగా లొంగిపోయాడు. తన 32 ఏట 'జాగ్రదై, జాగ్రదై' అంటూ ఒరిగిపోయాడు. శారద జీవితం ముగిసిపోయింది.

ఎంతో విషాదాన్ని దిగమింగి భుజంగరావు గారు, ఇంత మంచిపుస్తకం పాఠకలోకానికి అందించేరు. 'శారద ఒక తుఫాను వేగంతో సాహిత్యంలోకి వచ్చేడు. అంటే వేగంతో జీవితం నుండి నిష్క్రమించేడు' అని బాధపడ్డారు. 'శారద అజాత శత్రువు. ఎవరినీ ద్వేషిస్తూ మాట్లాడిన సందర్భం ఎప్పుడూ రాలేదు. బతుకు పోరాటంలో ఎక్కడికీ వలస వెళ్తాననేవాడు కాదు. తెనాలి అంటే అంత యిష్టం. అక్కడే ఉంటాననేవాడు. అర్ధాంతరంగా శారద చనిపోకపోతే ఒక గొప్ప నవలాకారుడిగా తెలుగు సాహిత్యంలో వెలుగొందేవాడు.' అని రాశారు.

'శారద మరణం తర్వాత అతని భార్య అన్నపూర్ణమ్మ – అతని రచనలనూ, అసంపూర్ణ , అముద్రిత రచనలు తెచ్చి నన్ను శారద సాహిత్య వారసునిగా భావించి అందించింది. కానీ నా బతుకు పోరాటంలో వాటిని పోగొట్టుకొని, చెడ్డ వారసున్ననిపించుకున్నాను.' అని ఎంతో నిజాయితీగా భుజంగ రావు తన పొరపాటును ఒప్పుకున్నారు.

ఈ పుస్తకంలో అక్కడక్కడా రచయిత ఫుట్ నోట్సు ఇచ్చారు. అనేకమంది మిత్రుల పేర్లు, జరిగిన సభలూ హాజరైన ప్రముఖులు, జరిగిన సంఘటనలు, ఆకలితో పోరాటం చేసిన అనేకమందినీ ఆప్యాయతతో అక్కున చేర్చుకున్న సౌజన్యులూ, అథోజగత్తు సోదరులూ, తెలంగాణా పోరాటం సంగతులూ, కమ్యూనిస్టు పార్టీ వ్యాప్తి– నడక వంటివి మనకు తెలుస్తాయి.

ఈ పుస్తకం శారద నటరాజన్ మోనోగ్రాఫ్ లాంటిది. ప్రతికూల పరిస్థితుల్లో ఎదురీత ఎలాంటిదో ఈ తరం వారికి తెలియచెబుతుంది. శారద జీవితం గురించిన ఒక్కొక్క పేజీ తిరగేస్తుంటే మనకు హృదయభారం పెరిగిపోతుంది.

ఈ పుస్తకం ద్వారా శారద నటరాజన్ సాహిత్యం , జీవితం అనేకులకు తెలిసింది. కాకతీయ యూనివర్సిటీ వారు శారద నటరాజన్ నవల మంచి – చెడును బిఎ విద్యార్థులకు పాఠ్య గ్రంథంగా నిర్ణయించారు. కొందరు సాహిత్య పరిశోధక విద్యార్థులు శారద కథలు, నవలల మీద ఎం.ఫిల్, పిహెచ్.డి చేస్తున్నారు కూడా. ప్రతి ఒక్క సాహిత్యాభిమానీ చదివి తీరవలసిన పుస్తకం ఇది.

■




# విశ్వ విద్యాలయాల విధ్వంసం !

- ప్రభాత్ పట్నాయక్

**బి**జెపి పాలనకు ప్రజానీకం ముగింపు పలికిన అనంతరం భారతీయ సమాజానికి, రాజకీయ, ఆర్థిక వ్యవస్థలకు అది కలిగించిన నష్టాన్ని పూడ్చుకునే పని జరుగుతుంది. ఐతే రెండు అంశాలలో అది చేస్తున్న విధ్వంసాన్ని పూడ్చడం చాలా కష్టమౌతుంది. మొదటిది: బిజెపి ప్రభుత్వం ధ్వంసం చేస్తున్న పురాతన, చారిత్రిక కట్టడాలను తిరిగి నిర్మించుకోవడం. ఈ విధ్వంసం బాబ్రీ మసీద్ కూల్చివేతతో మొదలైంది, కేవలం రెండు మతాల ప్రజల నడుమ విద్వేషపూరిత వాతావరణాన్ని సృష్టించడం ఒక్కటే కాదది. 400 సంవత్సరాలకు పైబడిన చరిత్ర ఉన్న ఆ పురాతన కట్టడాన్ని ఏమాత్రం నాగరికత ఉన్న వారైనా ఆ విధమైన వినాశనానికి పూనుకోరు. కనీసం ప్రజల పట్ల ఏ పాటి గౌరవ మర్యాదలున్నా ఆ విధమైన వినాశనానికి సిద్ధపడరు. ఈ విధ్వంస ధోరణి ఆ తర్వాత కూడా కొనసాగుతోంది. పార్లమెంటు భవనానికి పక్కనే మరొక నిర్మాణాన్ని ఈ ప్రభుత్వం చేపట్టింది. ఎంతో శ్రద్ధతో రూపొందించిన పాత లే-ఔట్‌కు లోబడి వ్యవహరించాలన్న కనీసమైన బాధ్యత కూడా ఈ ప్రభుత్వానికి లేదు (ఆ లే-ఔట్‌ను పాత వలస పాలకులు రూపొందించారని, దానిని ఖాతరు చేయనవసరం లేదని చెప్పడం ఎంతమాత్రమూ సమర్ధనీయం కాదు.).

ఇక రెండవ అంశం: దేశంలోని యూనివర్సిటీలను బిజెపి ప్రభుత్వం భారీ ఎత్తున ధ్వంసం చేస్తోంది. వాటి వ్యవస్థలను విధ్వంసం చేశాక కలిగే నష్టాన్ని పూడ్చడం అంత తేలికైన విషయం ఏమీ కాదు. యూనివర్సిటీలు అంటే కొన్ని భవనాల సముదాయం మాత్రమే కాదు. అక్కడ కేవలం పాఠాలను బోధించడం మాత్రమే జరుగుతుంది అనుకోరాదు. ఏ కోచింగ్ సెంటర్ లోనైనా పాఠాలను బోధించవచ్చు. యూనివర్సిటీ అంటే అక్కడ ఆలోచనకు విలువ ఉండాలి. అలా ఆలోచనకు విలువనిచ్చే శీలవంతమైన వాతావరణాన్ని రూపొందించాలి. అలా చేయడానికి కొంత సమయం పడుతుంది. మూడవ ప్రపంచ దేశాలలో ఆ విధమైన వాతావరణాన్ని సృష్టించడం చాలా కష్టం. ఐతే ఆ విధమైన వాతావరణం ఉన్న కొద్ది కేంద్రాలనైనా భారతదేశం రూపొందించుకోగలిగింది. ఇది గొప్ప విషయం. దీనికి దోహదం చేసిన అంశాలలో మన దేశం పెద్దదిగా ఉండడం ఒక కారణం. మన ఇరుగు పొరుగు దేశాల యూనివర్సిటీలలోని మేధావులు తమ తమ దేశాలలో విద్యావిషయికంగా ఒక సక్రమమైన వాతావరణాన్ని నిర్మించుకునేందుకు తగిన వనరులు లేవని వాపోతుంటారు. అదొక్కటే కాదు. మన భారతీయ సమాజంలో లోతైన, గంభీరమైన ఆలోచనల పట్ల అందరికీ గౌరవం ఉంది. ఆ విధమైన ఆలోచనలతో వారు ఏకీభవించకపోయినా, వాటిని గౌరవించే సాంప్రదాయం ఉంది.

ఫాసిస్టు స్వభావంతో ఉండే సంస్థలకు స్వయంగా అటువంటి గంభీరమైన ఆలోచనలు అంటూ ఏమీ ఉండవు. అంతేగాదు, అటువంటి ఆలోచనల పట్ల వాటికి ఏమాత్రమూ గౌరవం ఉండదు కూడా. దేశంలో ఉన్న కొద్దిపాటి గంభీరమైన మేధో కేంద్రాలను అన్నింటినీ ఎలాగైనా నాశనం చేయడానికి ఒక పద్ధతి ప్రకారం మొండిగా సాగుతోంది. యూనివర్సిటీలపై బిజెపి ప్రభుత్వం సాగిస్తున్న ఈ దాడి వలన దేశానికి ఎనలేని నష్టం కలుగుతుంది.

మొదట్లో ప్రభుత్వ యూనివర్సిటీలతో మొదలైన ఈ దాడి ఇప్పుడు ప్రైవేటు యూనివర్సిటీలకు సైతం పాకింది. ప్రపంచంలోని అత్యుత్తమ డిగ్రీ కోర్సులను బోధించే డిల్లీ యూనివర్సిటీ, సామాజిక శాస్త్రాలలో తమ వద్ద జరిగే చర్చలతో సామ్రాజ్యవాద దేశాలకు విద్యా రంగంలో గల ఆధిపత్యాన్ని సవాలు చేయగలిగిన జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ,

రవీంద్రనాథ్ టాగూర్ దృక్పథంతో రూపొందిన విశ్వభారతి యూనివర్సిటీ– ఇవన్నీ ఇప్పుడు తమ గత వైభవాన్ని కోల్పోయి శిథిలాలుగా మిగిలాయి. ఆర్ఎస్ఎస్‌కు సంపూర్ణ విధేయతను కలిగివుండడమే ప్రధాన అర్హతగా ఉన్న వ్యక్తులను వీటికి ఉప కులపతులుగా నియమించింది బిజెపి ప్రభుత్వం. యూనివర్సిటీలను తమ "స్వాధీనం లోకి" తెచ్చుకునే లక్ష్యంతో తగిన విద్యార్హతలుగాని ప్రమాణాలు గాని లేనివారిని బోధనా సిబ్బందిగా అడ్డగోలు నియామకాల ద్వారా నింపివేసింది. విద్యార్థులను కూడా ఆ విధమైన కొలబద్దల ఆధారంగానే తీసుకుంది. యూనివర్సిటీలలో ఉండే వివిధ అకడమిక్ సంస్థలను, తనకు లొంగివుండే వారితో నింపివేసింది. డీన్ లుగా, చైర్‌పర్సన్ లుగా ఉండే తన బంటుల పదవీకాల పరిమితులు అయిపోయినా, వారినే కొనసాగిస్తోంది. ఈ చర్యలతో యూనిర్సిటీలలో ఉండే చైతన్యశీలమైన ప్రజాస్వామిక వాతావరణం, విలువలు నాశనమయ్యాయి. తనకు అనుయాయులుగా వ్యవహరించే గూండాలను దింపి తమను వ్యతిరేకించేవారిని భయభ్రాంతులకు గురిచేసింది. అంతేకాదు. ఒకప్పుడు ఉన్నత విద్యా, బోధనా ప్రమాణాలకు పేరుపొందిన ఈ ప్రతిష్ఠాత్మక విద్యాకేంద్రాలలోని విద్యా ప్రమాణాలను కూడా నీరుగార్చింది. ఇవన్నీ చాలవన్నట్టు ఈ యూనివర్సిటీలకు నిధుల కొరతను కూడా కలిగించింది.

ఇప్పుడు ఈ తరహా దాడి ప్రైవేటు విశ్వవిద్యాలయాలకు కూడా వ్యాపించింది. ప్రభుత్వ రంగ యూనివర్సిటీలు బలహీనపడుతున్న కాలంలో ఈ ప్రైవేటు యూనివర్సిటీలు ఏర్పడ్డాయి. అశోకా యూనివర్సిటీలో జరిగింది చూస్తే అటువంటిది ఇంకెక్కడా జరిగివుండదని అనిపిస్తుంది. ఆ యూనివర్సిటీలోని ఒక అధ్యాపకుడు ఒక అకడమిక్ పేపర్‌ను రూపొందించాడు. సేకరించిన గణాంకాలను చాలా శ్రద్ధగా విశ్లేషించి, దాని ఆధారంగా రూపొందించిన పత్రం అది. 2019 పార్లమెంట్ ఎన్నికలలో కొన్ని నియోజక వర్గాలలో ఎన్నికల ఫలితాలను తారుమారు చేసినట్టు ఆ పత్రం నిర్ధారించింది. ఈ మాదిరి పరిశోధనా పత్రాలు యూనివర్సిటీలలోనే తయారు కావాలి. కాని బిజెపికి చెందిన సోషల్ మీడియా మూకలు ఆ అధ్యాపకుడిపై ఒక్కపెట్టున విరుచుకుపడ్డాయి. అదే సమయంలో ఆ యూనివర్సిటీ యాజమాన్యం ఆ పరిశోధనా పత్రంతో తనకేమీ సంబంధం లేదంటూ ప్రకటించింది. యూనివర్సిటీకి విరాళాలు ఇచ్చే వారితో ప్రధానంగా ఏర్పడిన యూనివర్సిటీ గవర్నింగ్ బాడీ ఈ విద్యాపరమైన పరిశోధనా పత్రాన్ని చర్చించి దానిలో కొన్ని మార్పులను కూడా సూచించింది. నిజానికి గవర్నింగ్ బాడీ పని కాదది. ఈ పరిణామాల అనంతరం ఆ అధ్యాపకుడు తన రాజీనామాను సమర్పించాడు. ఐతే యూనివర్సిటీ ఈ విషయంలో వ్యవహరించిన తీరు పట్ల అతను పని చేసిన విభాగం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. అంతేగాక, అతడిని తిరిగి విధులలోకి తీసుకోకపోతే నిరసనలకు దిగవలసి వస్తుందంటూ హెచ్చరించింది.

ప్రైవేటు యూనివర్సిటీల గవర్నింగ్ బాడీ అంటే దానిలో కొంతమంది వ్యాపారవేత్తలు దాతల పేరుతో ఉంటారు. అటువంటి గుంపు ఒక అకడమిక్ పేపర్ మీద తీర్పు చెప్పడానికి తయారవడం అనేది గతంలో ఎన్నడూ జరగలేదు. ఈ విషయం అశోకా యూనివర్సిటీ అధికారులకు గాని, ఆ గవర్నింగ్ బాడీ సభ్యులకు గాని తెలియనిదేమీ కాదు. కాని వాళ్ళకి బిజెపి ప్రభుత్వం అంటే ఉన్న భయం వల్ల వారంతా ఆ విధంగా ప్రవర్తించారు. తనపై ఏ విమర్శ చేసినా అలా చేసినవారిపట్ల శత్రుపూరితంగా బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తుంది. అది కేవలం ఒక విద్యావిషయిక పత్రం రూపంలో వచ్చినా సరే దానిని సహించదు. ఆ సంగతినే ఆ యూనివర్సిటీ అధికారుల ద్వారా, గవర్నింగ్ బాడీ ద్వారా యూనివర్సిటీ మొత్తానికి తెలియజెప్పింది బిజెపి.

ఒక యూనివర్సిటీగా తనను పరిగణించాలనుకునే ఏ సంస్థా ఇటువంటి పరిస్థితులను సహించదు. దేశంలో పేదరికం అంతకు ముందు కాలంలో కన్నా బిజెపి పాలనా కాలంలో పెరిగిందంటూ ఎవరైనా ఒక పరిశోధనా పత్రం సమర్పిస్తే దానిని రాసిన వ్యక్తికీ ఇదే గతి పడుతుందన్నమాట. గణాంకాల ఆధారంగా ఒకానొక పత్రం గనుక వ్యవసాయ సంక్షోభం కొనసాగుతున్న ఫలితంగా గ్రామీణ తలసరి ఆదాయం అంతకు మునుపటి కన్నా బిజెపి పాలనాకాలంలో తగ్గిపోయిందని నిర్ధారిస్తే, దానిని అధికారులు ఆదేశించిన విధంగా మార్పులు చేయవలసిందే అన్నమాట. ఇటువంటి నేపథ్యంలో పరిశోధన అంటే బిజెపి ప్రభుత్వం ప్రచారం చేసుకునే కరప్రత్రాలను రూపొందించడమే ఔతుంది. యూనివర్సిటీలలో బోధన అనేది ఎప్పటికప్పుడు అక్కడ జరిగే పరిశోధనల ప్రాతిపదికన తన ప్రమాణాలను పెంచుకుంటూ పోతుంది. మరి ఆ పరిశోధనే నిలిచిపోతే బోధన కూడా దారీ తెన్నూ లేకుండా అయిపోతుంది. అంటే ఆ యూనివర్సిటీ చచ్చిపోయినట్టే లెక్క.

ఈ నిర్ధారణ మరీ అతిగా ఉందని కొందరు అనుకోవచ్చు. ప్రతీ ప్రైవేటు యూనివర్సిటీలోనూ అధికారులు, విరాళాలిచ్చే దాతలు ఆ యూనివర్సిటీ విద్యా వాతావరణం మీద చాలా బలమైన ప్రభావాన్ని చూపించడం సహజమేనని వారు చెప్పవచ్చు. ఉత్తర అమెరికా ఖండంలోని యూనివర్సిటీలలో వాళ్ళు అటువంటి బలమైన ప్రభావాన్ని చూపించడం, అక్కడ

నియామకాలను నియంత్రించడం పరిపాటి. పాతరోజుల్లో ఉత్తర అమెరికా యూనివర్సిటీలు విద్యావేత్తలైన యూదులపట్ల ప్రతికూల వైఖరిని, వివక్షతను పాటించారు. ఇప్పటికాలంలో పాలస్తీనా పోరాటం పట్ల, సానుభూతి ప్రదర్శించేవారి పట్ల అటువంటి వైఖరినే అవలంబిస్తున్నారు. ఇక మార్క్సిస్టుల పట్ల ఆ యూనివర్సిటీలు ప్రదర్శించే వివక్షత సంగతి చెప్పనక్కరలేదు. పాల్ ఎం స్వీజీ (ప్రముఖ మార్క్సిస్టు రాజకీయ, ఆర్థికవేత్త) గౌరవ ప్రొఫెసర్‌గా వ్యవహరించమని కోరుతూ చాలా యూనివర్సిటీల నుండి వచ్చే ఆహ్వానాలను తిరస్కరించవలసి వచ్చింది. ఆ యా యూనివర్సిటీలలో బోధన నిమిత్తం తాత్కాలిక ప్రాతిపదికన నియమించబడిన మార్క్సిస్టు పరిశోధకులను తొలగించేందుకు అతని పర్యటనలను ఒక సందర్భంగా ఆ యూనివర్సిటీల యాజమాన్యాలు ఉపయోగించుకోవడమే అతను ఆహ్వానాలను తిరస్కరించ డానికి కారణం.

ఐతే, విదేశీ ప్రైవేటు యూనివర్సిటీలలో అధికారులుగాని, విరాళాలిచ్చే పారిశ్రామికవేత్తలు గాని ప్రదర్శించే వివక్షత, కక్ష సాధింపులకు, ఇక్కడ ప్రస్తుతం భారతదేశంలో యూనివర్సిటీలలో సాగుతున్నదానికి రెండ మౌలికమైన తేడాలు ఉన్నాయి. మొదటిది: అక్కడ జరిగే అణచివేతల వెనుక ప్రభుత్వం జోక్యం కనిపించదు. అక్కడ దాతలకుండే పక్షపాత ధోరణి కాని, వారు పాలక ప్రభుత్వం పట్ల సానుకూల వైఖరి తీసుకోవడం కాని వారి చర్యలకు దోహదం చేసివుండవచ్చు. కాని ప్రత్యక్ష రాజకీయ జోక్యం, బ్లాక్ మెయిలింగ్ వంటివి ఉండవు. ఇక రెండవది: విదేశీ ప్రైవేటు యూనివర్సిటీలలో గవర్నింగ్ బాడీలు గాని, అధికారులు గాని అక్కడ విద్యా విషయికంగా రూపొందిన పరిశోధనా పత్రాల విషయంలో జోక్యం కలిగించుకోవడం చాలా అరుదు. అన్ని పరిశోధనా పత్రాలనూ ఆ పరిశోధకులకు మార్గదర్శకులుగా వ్యవహరించే ప్రొఫెసర్లు స్వతంత్రంగా, ఎటువంటి ఒత్తిడులూ లేకుండా పరిశీలించి చూస్తారు. ఆ పత్రాలలో ఉండే విషయాన్ని మార్చివేయాలన్న వత్తిడి, జోక్యం బైటనుండి ఉండవు. కాని ఇక్కడ అశోకా యూనివర్సిటీలో జరిగింది మాత్రం చాలా అసాధారణమైన విషయం. ఒక ఫాసిస్టు రాజ్యం విమర్శను ఏ మాత్రమూ సహించలేకపోవడం, ఆ విమర్శ పూర్తిగా విద్యావిషయికమైనదైనా, దానిని అణచివేయాలనుకోవడం, ఆ విమర్శలు వెలుగులోకి రాకుండా కప్పిపుచ్చడానికి పూనుకోవడం ఇక్కడ కనిపిస్తోంది.

కాని, అటువంటి ధోరణి ఫలితంగా సామాజిక శాస్త్రాలలో ఏ విధమైన పరిశోధనలూ జరిగేందుకు అవకాశమే లేకుండా పోతుంది. సామాజిక శాస్త్రాలు ప్రధానంగా సమాజంతో, అందులో జరిగే పరిణామాలతో ముడిపడి వుంటాయి. ఆ పరిణామాలు ప్రధానంగా ప్రభుత్వ నిర్ణయాలతోను, ప్రభుత్వం చేపట్టే చర్యలతోను ముడిపడి వుంటాయి. వాటన్నింటినీ అధ్యయనం చేయకుండా వాటి ఫలితాలను వాస్తవిక దృష్టితో చూడకుండా, ఒక పరిశోధకుడు తన శోధనను ఏవిధంగా సాగించగలుగుతాడు?

పరిశోధనలకు పడే కళ్ళెం సామాజిక శాస్త్రాల దగ్గరే ఆగిపోతుందని అనుకోకూడదు. త్వరలోనే ప్రకృతి శాస్త్రాలలోని పరిశోధనలకూ ఇదే గతి పడుతుంది. హిందూత్వ శక్తులు ప్రచారం చేసే మూఢనమ్మకాలను ఈ రంగాలలో జరిగే శాస్త్ర పరిశోధనలు ప్రశ్నిస్తాయి. అప్పుడు హిందూత్వ శక్తులు జోక్యం చేసుకుని ఆ పరిశోధనలను తిరగరాయాలని ఒత్తిళ్లు తెస్తాయి. అప్పుడు యూనివర్సిటీల హేతుబద్ధతే అదృశ్యం అయిపోతుంది. ఇక ఆ యూనివర్సిటీలు కోచింగ్ సెంటర్ల స్థాయికి దిగజారుతాయి. మోడీ ప్రభుత్వం ఆత్మనిర్భర భారత్ గురించి గొప్పలు చెప్పుకుంటూ వుంటుంది. ఆత్మనిర్భరత అంటే స్వావలంబన అని అర్థం. ఒక దేశంలోని యూనివర్సిటీలను ధ్వంసం చేసిన తర్వాత ఇక ఆ దేశం ఆత్మనిర్భరత ఏ విధంగా సాధించగలుగుతుంది?

**(29.8.2023 ప్రజాశక్తి నుంచి)**



## కనువిప్పు

**చీ**కటిలో కనువిప్పు గలిగితే
మబ్బులు కనుమరుగైపోతాయి
వెలుగులో కనువిప్పు గలిగితే
నీరు ఆవిరైపోతూ
ఆఖరి క్షణాన్ని గుర్తుకు చేస్తాయి!

**– గిద్దలూరు సాయి కిషోర్**



# నీ కృప చాలును

– కెంగార మోహన్
94933 75447

వరండాలో విరిగి కట్లుకట్టిన పడక్కుర్చీ మీద పడుకుని ఏదో ఆలోచిస్తూ కూర్చుని ఉన్నాడు ఈశ్వరప్ప. మనసు విరిగి బతుకు కకావికలమై బతుకుతున్నోడికి ఈ పడక్కుర్చీకున్న కట్లోకలెక్కా! నీతిగా బతుకుతున్నోడు. సహకార శాఖలో ఈశ్వరప్ప నిజాయితీని అధికార్లెవరూ జీర్ణించుకునేవారు కాదు. సహకార శాఖ పరిధిలో నడపబడుతున్న సహకార బ్యాంకు ద్వారా నడిచే సహకార సొసైటీకి కార్యదర్శి ఈశ్వరప్ప. ఆ సొసైటీ అధ్యక్షుడు రాజకీయంగా పలుకుబడి ఉన్నవాడు. అదే ఊరిలో ఉన్న ఓ నాయకుడు రాష్ట్ర రాజకీయాల్లోనే క్రియాశీలకమైన వ్యక్తి. ఆ నాయకుడి అనుచరుడే సొసైటీ అధ్యక్షుడు. అతడు చెప్పిందే అక్కడ అమలయ్యేది. ప్రభుత్వం నుండి సహకార బ్యాంకు ద్వారా వచ్చే సబ్సిడీ రుణాలు అర్హత లేని వారికి కూడా ఇవ్వమని సొసైటీ అధ్యక్షులు చెప్తుంటాడు.

సొసైటీ కార్యదర్శి ఈశ్వరప్ప చాలాసార్లు "సార్ నిబంధనలకు విరుద్ధంగా నేను పనిచేయలేను. అర్హులైన వారికే సబ్సిడీ రుణాలు ఇవ్వాలి. రైతులకందించే ఏ సబ్సిడీ రుణాలైనా, సంక్షేమమైనా నిజాయితీగా లబ్ధిదారులకు ఇచ్చేందుకే నన్ను నియమించారు. నా విధులకు ఇలా ఇబ్బంది కలిగించవద్దు." అని సొసైటీ అధ్యక్షుడిని ఎన్నోసార్లు వేడుకున్నా ప్రయోజనం లేదు.

అతడు చెప్పిన మాట వినడం లేదనే అక్కసుతో సొసైటీ అధ్యక్షుడు ఈశ్వరప్పను చాలాసార్లు తిట్టిన సందర్భాలు కూడా ఉన్నాయి. అలా తిట్లు పడటానికీ కారణముంది. కార్యదర్శి అంటే పెయిడ్ సెక్రెటరీ. అతను వేతనాలు తీసుకోవాల్సింది కూడా సొసైటీ ద్వారానే. అదీ సొసైటీ అధ్యక్షుడి సంతకం తోనే.. కాబట్టి ఎన్నిసార్లు కులం పేరుతో గద్దించినా ఈ కార్యదర్శి మాత్రం నోరు మెదపడు. ఖరీఫ్ సీజన్‌లో సహకార బ్యాంకు అనేక సబ్సిడీ పథకాలు ఇస్తుంది. ఆ లబ్దిదారుల జాబితా ఆ పెద్ద మనిషి సూచనతో అధ్యక్షుడు ఈశ్వరప్పకు పంపిస్తాడు. ఆయనిచ్చిన జాబితాకనుగుణంగానే ఇవ్వాలి. అసలు ఆ ఊళ్ళో సొసైటీ పుట్టినప్పటి నుంచి ఆ పెద్ద మనిషి కుటుంబం నుంచి లేదా ఆయన సూచించిన వాళ్ళే అధ్యక్షులుగా ఉంటున్నారు.

ఈశ్వరప్ప చిన్నప్పటి నుంచి పుస్తకాలు బాగా చదివేటోడు. సమాజం గూర్చి బాగా అవగాహన చేసుకున్నోడు. ఏదో ఒకటి సమాజానికి మేలు చేయాలని కలలు కనేవోడు. ఉన్న జీతంలోనే పిల్లల్ని బాగా చదివించాడు. కూతురు టీచరైంది. మరొక కూతురు, కొడుకు పెళ్ళీడుకొచ్చారు. పనిచేసిన ప్రతి చోటా నిజాయితీగా ఉండటం వల్ల అతన్ని ఏదో ఒక కారణంతో బదిలీ చేస్తారు. పెయిడ్ సెక్రటరీకి బదిలీలుండవు. కానీ ఈశ్వరప్పను రాజకీయ పలుకుబడితో అతన్ని వేరే ఊళ్ళకు బదిలీ చేస్తుంటారు. ఈశ్వరప్ప నిజాయితే బదిలీకి కారణమౌతుంది.

❖❖❖

తెలతెలవారుతోంది. అక్కడక్కడా టీ కొట్లు తెరుచుకున్నాయి. 5 గంటలకే రిపోర్టు చేయమనడంతో శ్రీనివాసులు ఏసిబి కార్యాలయానికి చేరుకున్నాడు. బహుశా పెద్ద అవినీతి పరున్నెవరినో పట్టుకునేందుకే వల పన్నుతుండవచ్చు. ఎవరి టీంవాళ్ళు వాళ్ళ వాళ్ళ వాహనాల్లో ఎక్కారు. శ్రీనివాసులు టీం నెంబర్ ఒకటి. శ్రీనివాసులు డీయస్పీ టీం సభ్యుడు కాబట్టి డీయస్పీ గారు కారు ఎక్కిన వెంటనే నిర్దేశించిన ముగ్గురూ ఎక్కేశారు. కారుకున్న

పోలీస్ బోర్డు తీసి పక్కన బెట్టారు. సిఐ కారు నడుపుతున్నారు. సిటీలో కొద్దిదూరం వెళ్ళాక డీయస్పీ టీ తాగుదామన్నాడు. ఒక టీకొట్టు ఉన్నచోట ఆపి టీ ఆర్డర్ చేశారు. అందరూ మఫ్టీలోనే ఉన్నారు. టీ డబ్బులు చెల్లించి కారు కదిలించి నగరం అవుట్ స్కర్ట్స్‌కు వెళ్ళి ఒకచోట ఆపుకున్నారు. డీయస్పీ ఎవరితోనో ఫోన్‌లో మాట్లాడుతూనే ఉన్నారు.

"సార్.. న్యూస్ పేపర్ కుర్రాడు పేపర్ విసరేసి వెళ్ళాడు. గేటు తీయలేదు" అని డీయస్పీకి ఫోన్‌లో చెబుతున్నాడు అవతలి వ్యక్తి.

"సరే పాలవాడైనా వస్తాడేమో, వచ్చి మెయిన్ గేటు తీస్తాడేమో చూడు. వాళ్ళు వచ్చి గేటు తెరిచాకే వెళదాం" అన్నాడు డీయస్పీ.

మధ్యమధ్యలో అందరితో డీయస్పీ చాలా సరదాగా మాట్లాడు తున్నారు. సమయం గడిచిపోతూనే వుంది

కాసేపటికి డీయస్పీ తన మొబైల్ మెసేజ్ చూసుకుని "మెయిన్ గేటు తెరిచినట్లు సమాచారం వచ్చింది. ఇక పదా రాజేష్" అని సిఐతో అన్నాడు.

రాజేష్ వెంటనే వేగం పెంచాడు. కొన్ని నిమిషాల వ్యవధి లోనే లోకేషన్ దగ్గరకు చేరుకున్నారు. అక్కడ ఒకరిద్దరు టీం సభ్యులు ఆ ఇంటికి సమీపంలో తచ్చాడుతూ ఉన్నారు. డీయస్పీ గారికి సమాచారం అందిస్తున్నది వీళ్లే అని అర్థమైంది. బృందం గానే పై పోర్షన్‌లో ఉన్న ఇంటిమెట్లు ఎక్కారు. ఇంటి తలుపు కొట్టాడు టీంలోని మరొక సిఐ.

"తలుపుకు కాలింగ్ బెల్ ఉంది కదా చూసుకోవా? కొట్టడం దేనికి. మరీ మొరటోడ్లా వున్నావే" అన్నాడు నవ్వుతూనే మరొక సిఐని డీయస్పీ.

కాలింగ్ బెల్ కొట్టాడు. కాసేపటికి ఒకతను వచ్చి తలుపు తీశాడు. బహుశా అతను ఇంటి యజమాని అనుకుంటా. అంత మందిని చూసి ఆశ్చర్యపోయి "ఎవరు మీరు?" అన్నాడు

"మేం ఏసిబి వాళ్ళం. నీ పేరేమిటి" అన్నాడు సిఐ రాజేష్.

"నా పేరు యాకోబ్" అన్నాడు.

"సువార్తమ్మ ఎవరూ" అన్నాడు డియస్పీ.

"మా ఆవిడ సార్" అన్నాడు యాకోబ్.

"మీ దగ్గర ఆదాయానికి మించిన ఆస్తులున్నాయని సమా చారం వచ్చింది. మీ ఇంటిని సెర్చ్ చేయాలి. ఇదిగో కోర్టిచ్చిన సెర్చ్ వారెంట్." అన్నాడు డీయస్పీ.

అంతలోనే కళ్ళు పులుముకుంటూ ఒక పెద్దావిడ బహుశా యాభై ఏళ్ళకు పైనే ఉంటాయి. హాల్లోకి నడిచి వస్తూ "నేనే సువార్తమ్మ. మీరెవరు?" అన్నది.

"మేము ఏసిబి వాళ్ళం. మీ పేరు సువార్తమ్మే కదా" అన్నాడు డీయస్పీ.

ఆమెక్కూడా అన్ని వివరాలు చెప్పి, "ఇదిగో కోర్టు ఉత్తర్వు ప్రకారం మీ ఇంటిని సోదా చేయాలి. మీరు సహకరించండి." అని శ్రీనివాసులును పిలిచి ఈ సెర్చ్ వారెంట్‌పై మీ సంతకం పెట్టండి సార్" అన్నాడు డీయస్పీ.

శ్రీనివాసులుతో పాటు మరొక లెక్చరర్ కూడా సంతకం పెట్టాడు.

ఆ భార్యాభర్తలు ఆశ్చర్యంగా అందరినీ చూస్తూ నిశ్చేష్టులై నిల్చున్నారు. నోటీస్ సువార్తమ్మ చేతిలో పెట్టి 'మీ ఫోన్ ఇవ్వండి' అని తీసుకున్నాడు డీయస్పీ. ఆమె భర్త యాకోబ్ ఫోను కూడా తీసుకున్నారు.

ఇంట్లో ఇంకెవరెవరు ఉన్నారని అడిగాడు సిఐ రాజేష్.

పిల్లలు పక్క బెడ్ రూంలో పడుకున్నారని సువార్తమ్మ చెప్పింది.

"వాళ్ళ దగ్గరున్న మొబైల్స్, ట్యాబ్స్, లాప్‌టాప్స్ కూడా తీసుకు రండి." అన్నాడు డీయస్పీ ఆమె భర్తను.

❖❖❖

ఈశ్వరప్ప నిధుల్ని దిగమింగాడని సొసైటీ అధ్యక్షులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయడంతో విచారణకొచ్చారు.

"చెప్పండి ఈశ్వరప్ప గారు.. మీరు దాదాపు 5 లక్షల 60 వేలు సొంతానికి వాడుకున్నట్లు సొసైటీ ప్రసిడెంట్ మీ మీద కంప్లైంట్ చేశారు. దీనికి మీ సమాధానం" అని విచారణాధి కారులు ప్రశ్నిస్తున్నారు.

"అవన్నీ నకిలీ ఆధారాలు. రికార్డులు తారుమారు చేశారు." ఈశ్వరప్ప నిజాయితీగానే సమాధానం చెబుతున్నాడు.

"సొసైటీ సెక్రెటరీ సంరక్షణలో కదా రికార్డులుండాల్సింది. అధ్యక్షుడెలా తారుమారు చేస్తారు." అధికారి ప్రశ్నించాడు

"ఇక్కడ తాళాలు రెండుసెట్లుంటాయి. ఒక సెట్టు అధ్యక్షుడి దగ్గర మరొక సెట్టు నా దగ్గర. ఇదేమిటని అడిగాను. ఇవన్నీ అడక్కూడదని నన్ను బెదిరించారు. మినిట్స్ పుస్తకం కూడా మరొకటి ఆయనతో ఉంది." ఈశ్వరప్ప జవాబిచ్చాడు.

"మరి మా దృష్టికి ఎందుకు తీసుకురాలేదు?" అని ఆ అధికారి ఈశ్వరప్పను ప్రశ్నిస్తూనే సొసైటీ అధ్యక్షుడి వైపు చూసి కనుసైగ చేశాడు.

ఈశ్వరప్పకు అర్థమైంది, కుట్రతోనే ఈ కేసులో తనను ఇరికిస్తున్నారని.

"మీరు అవినీతి చేశారనడానికి ఆధారాలు దొరికాయి. మీరు ఏదైనా ఉంటే కోర్టులో నిరూపించుకోండి. మిమ్మల్ని సస్పెండ్ చేస్తున్నాం"అని చెప్పి, అధికారులు బయల్దేరడానికి సిద్ధమయ్యారు.

"సార్ నన్ను నమ్మండి. నేను ఏ తప్పూ చేయలేదు. మీక్కూడా తెలుసు, నేను ఏ తప్పు చేయనని. ఇవాళ మీరు అమ్ముడు పోయి ఈ తప్పుడు కేసులో నన్ను ఇరికిస్తున్నారు. ఇది అన్యాయం. సొసైటీ సభ్యులు ఈ ముగ్గుర్ని అడగండి. నేనేమిటో" అంటూ

ఆవేదనగా ఆవేశంతో ఈశ్వరప్ప మాట్లాడుతున్నా పట్టించుకోకుండా కారెక్కి వెళ్ళిపోయారు అధికారులు. ఈశ్వరప్ప సస్పెండ్ అయ్యాడు.

❖❖❖

సువార్తమ్మ ముఖానికి కొంగు అడ్డం పెట్టుకుని ఉంది. ఒక్కొక్క రూంలోంచి పత్రాలు, బంగారం, విలువైన వస్తువులు ఇలా అన్నీ తెచ్చి సిబ్బంది హాల్లో వేస్తున్నారు.

“పిల్లలేం చదువుకుంటున్నారమ్మా” డీయస్పీ సువార్తమ్మను అడిగాడ

ఆమె నోరు విప్పేలోపు వాళ్ళమ్మాయి “నేను ఎమ్మెస్సీ పూర్తి చేశానుసార్. ప్రస్తుతం గ్రూప్స్‌కు ప్రిపేరవుతున్నాను. మా అన్నయ్య మెడిసిన్ పూర్తి చేసి పీజికి ప్రిపేర్ అవుతున్నాడు” అంది.

హాల్లో వేసిన డాక్యుమెంట్లను బంగారాన్ని వేటికవే విభజిస్తున్నారు ఏసిబి అధికారులు. పొలాలు, స్థలాలు, అపార్ట్‌మెంట్లలో ఫ్లాట్లు ఇలా అన్ని పత్రాలు చూస్తూ సువార్తమ్మను ప్రశ్నిస్తున్నారు. ఒకపక్క అధికారులే అందరికీ బ్రేక్‌ఫాస్ట్, టీలు అందిస్తున్నారు. వెసులుబాటున్న వాళ్ళను తినమని డీయస్పీ చెబుతున్నాడు. అధికారులు ల్యాప్‌ట్యాప్‌లు కనెక్ట్ చేసుకుని ఏవేవో ప్రొఫార్మాలను నింపుతున్నారు. ఆస్తుల వివరాలను నమోదు చేస్తున్నారు. ఈ ఆపరేషన్ గురించి సమగ్రంగా తెలుసుకోవాలనే ఆసక్తి శ్రీనివాసులుకు కలిగింది.

“లాకర్ తీయడానికి ఒక టీం వెళ్ళండి” అని మరొక సిఐ అహ్మద్ భాషను డీయస్పీ ఆదేశించాడు.

“సువార్తమ్మను కూడా లాకర్ తెరవడానికి తీసుకువెళ్ళాలి కదా.. రాజేష్ ఆ పని చూడు” అన్నాడు డీయస్పీ.

సువార్తమ్మను తమ కార్లోనే ఏసిబి అధికారులు బ్యాంక్ లాకర్ తెరవడానికి తీసుకెళ్ళారు.

“ఎలావుంది ఏసిబి రైడ్స్ అనుభవం..” అని శ్రీనివాసులును ఏసిబి సిఐ పవన్ అడిగాడు

“కొత్తగా వుంది.. పవన్ సార్ ఫ్రీనేనా.. కాసేపు మాట్లాడుకోవచ్చా మనం” అన్నాడు శ్రీనివాసులు

“అసలు ఇప్పుడు పనేముండదు. అస్తుల వివరాలు బ్యాంక్ పాసు పుస్తకాలు ఇతరాలన్నీ దేనికవే విభజించడానికి చాలా టైం పడుతుంది. బ్యాంకు లాకర్ నుండి ఏమున్నాయో తీసుకురావాలి. బంగారమైతే అప్రైజర్‌ను పిలిపించి తూకమేయించి లెక్క కట్టాలి. ఈలోపు మనం ఎంతసేపైనా మాట్లాడుకోవచ్చు. డీయస్పీ సార్ చాలా షార్ప్. అన్ని విషయాల్లో నిక్కచ్చిగా ఉంటారు. పనుంటే ఆయనే ఎవరికి ఏం పని అప్పుజెప్పాలో చెప్తాడు. కాబట్టి నోప్రాబ్లం. ఎంతసేపైనా మాట్లాడుకుందాం” అన్నాడు సిఐ పవన్

“సరే.. అవతలికి పోదామా” అన్నాడు శ్రీనివాసులు.

‘‘వైనాట్ ’’ అంటూ కదిలాడు పవన్. ఓ మూల కుదురుకున్నాక, “ఆ.. ఏమి నీ డౌట్స్” అనడిగాడు.

‘‘అసలు ఈ రైడ్స్ ఎలా జరుగుతాయి..’’ అన్నాడు శ్రీనివాసులు.

“రైడ్స్ రెండు రకాలుగా జరుగుతాయి. ఒకటి : ఏసిబి టోల్‌ఫ్రీ నెంబర్‌కు అవినీతిపై కాల్స్ వస్తాయి. అలా వచ్చిన ఫిర్యాదులను రికార్డ్ చేసి చాలా పకడ్బందిగా పథకమేసి వలపన్ని పట్టుకోవడం. రెండోది అసెట్స్ రైడ్స్. ఒక ప్రభుత్వ ఉద్యోగికి ఆదాయానికి మించిన ఆస్తులుండటం. అంటే ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా ఎంతటి స్థాయి ఉన్న ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నా తన ఉద్యోగ జీవితంలో మహా అయితే అయిదు కోట్లు సంపాదిస్తాడనుకుందాం. అంతకు మించి సంపాదిస్తే అక్రమార్జనే కదా..”

“అవును నిజమే” అన్నాడు శ్రీనివాసులు.

“అయితే ఒక ఉద్యోగిపై ఫిర్యాదు వచ్చిన వెంటనే రైడ్స్ జరగదు. ఫిర్యాదులో నిజమెంతో ముందు నిర్ధారించుకుంటారు. చాలా లోతుగా రహస్యంగా ఇన్వెస్టిగేషన్ చేస్తారు. కొన్ని నెలలు పట్టొచ్చు. సదరు వ్యక్తి బంధువులను కూడా ట్రేస్ చేసి వాళ్ళకు సంబంధించిన సమాచారాన్ని కూడా తీసుకుంటారు. ఒకవేళ అసెట్స్ వాళ్ళ ఇళ్ళలో దాచడమో లేదా వాళ్ళ పేర్లపై ఉంచడమో చేసి వుంటారేమో కదా..! ఇవన్నీ చూస్తారు. అన్ని వివరాలతో అధికారులకు నివేదిక పంపి రాష్ట్రస్థాయి అధికారులతోనూ సంప్రదింపులు జరిపి వారి నుంచి అనుమతి వచ్చాక సదరు నివేదికను స్థానిక ఏసిబి కోర్టుకు సమర్పిస్తారు. మెజిస్ట్రేట్ సెర్చ్ వారెంట్ ఇస్తారు. వారెంటు కోర్టు ఇచ్చాకే రైడ్స్‌కు ప్రణాళిక వేస్తారు. ఈ రైడ్స్ చేయడానికి వివిధ శాఖల ఉద్యోగులను సాక్షులుగా ఆయా శాఖల ఉన్నతాధికారులకు లేఖలను రాసి తీసుకుంటారు. అలానే మీరు కూడా ఈ రైడ్స్‌కు మీ శాఖ నుండి ఇప్పుడొచ్చింది.” అన్నాడు సిఐ పవన్.

“ఇంకేమైనా డౌట్స్ ఉన్నాయా” అన్నాడు తనే మళ్ళీ..

“సంవత్సరంలో ఎంతమంది మీద రైడ్స్ చేస్తారు.”

“అంతమంది ఇంతమంది అనేం లేదు. ఫిర్యాదుల్ని బట్టి అనుమతుల్ని బట్టి ప్రాసస్ కంప్లీట్ అయ్యిందంటే ఆపరేషన్ ప్లాన్ చేసుకోవడమే..”

“మీకు వత్తిడి ఏమైనా ఉంటుందా. ఐ మీన్ పొలిటికల్ ప్రెజర్..”

“అసలు సమాచారం బయటకు పొక్కే చాన్స్ లేదు కాబట్టి వత్తిడి ఉండదు. ఈ ఇంటిని రైడ్ చేస్తున్నామని మా డిపార్ట్‌మెంటులో కూడా హయ్యర్ క్యాడర్ వాళ్ళకు మాత్రమే తెలుస్తుంది. ఏ దశలోనూ లీక్ జరగదు. అంతా ట్రాన్స్‌పరెన్సీగా ఉంటుంది. ఏ మాత్రం మా వాళ్ళు లీక్ చేసినట్లు తెలిస్తే

క్రమశిక్షణా చర్యలు తీవ్రంగా ఉంటాయి"

అప్పుడే బయటి నుండి డీయస్పీ పిలుపు 'పవన్' అని.

"మళ్ళీ మాట్లాడదాం" అంటూ వెంటనే డీయస్పీ దగ్గరకు వెళ్ళాడు పవన్.

"మిగతా చోట్ల పరిస్థితి ఏంటి, కనుక్కున్నావా" అనడిగారు డిఎస్పీ.

"ఎవ్విరిథింగ్ ఓకే సార్. కనుక్కున్నా" అన్నాడు పవన్

సువార్తమ్మకు సంబంధించి అందరి బంధువుల ఇళ్ళ వద్ద ఒకేసారి ఏడు టీములు ఏడు చోట్ల సోదాలు చేస్తున్నాయి. ఒక్కొక్క టీము వివరాలన్నీ డీయస్పీకి ఎప్పటికప్పుడు అందిస్తున్నాయి.

❖❖❖

ఈశ్వరప్ప సస్పెన్షన్ కాలంలోనే రిటైర్డ్ అయ్యారు. రావాల్సిన బెన్ఫిట్స్ అన్నీ పెండింగులో పెట్టారు. కారణం అతడిపై కేసు కోర్టులో ఉండటం. ఫిర్యాదు చేసిన సొసైటీ అధ్యక్షులు కేసు విత్‌డ్రా చేసుకోడానికి సిద్ధమయ్యాడు. అయితే ఒక కండీషన్ పెట్టాడు. తనకాళ్ళు పట్టుకోవాలని షరతు విధించాడు. ఈశ్వరప్ప ఆత్మాభిమానం గల మనిషి. దానికి ససేమిరా అన్నాడు. రాయబారం తెచ్చిన వాళ్ళతో చావైనా చస్తాను గాని.. కాళ్ళు పట్టుకునే ప్రసక్తే లేదన్నాడు.

సువార్తమ్మ ఇంట్లో సోదాలు పూర్తయి డాక్యుమెంట్లు సిద్ధం చేసే సరికి మరుసటి రోజు ఉదయమైంది. ఆమెను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపుతున్నట్లు అక్కడికొచ్చిన విలేకరులతో డీఎస్పీ చెబుతున్నారు

ఒక విలేకరి.. "సార్ ప్రాపర్టీ ఎంత వరకు లభించింది.. ఎన్ని కోట్లని అంచనా వేస్తున్నారు?" అనడిగాడు.

డీయస్పీ పూసగుచ్చినట్లు వివరించాడు.

మరొక విలేకరి "రైడ్స్ దళితుల మీదనే ఎందుకు జరుగుతున్నాయి? ఇటీవలి కాలంలో ఈ జిల్లాలో చేసిన నాల్గు రైడ్లలలో దళితుల్నే పట్టుకున్నారు. కోట్లు కొల్లగొడుతున్న అగ్రవర్ణ అవినీతిపరులపై దాడులు చేయలేదు. ఫిర్యాదులు అగ్రవర్ణ అధికారుల మీద రాలేదా?" అనడిగాడు.

"మా శాఖకు వాళ్ళు వీళ్ళనేది ఉండదు. ఫిర్యాదు ఎవరి మీద వచ్చినా చట్టపరంగా ముందుకు వెళతాం. మాకెటువంటి డిస్క్రిమినేషన్ ఉండదు." అన్నాడు డీయస్పీ

నీతిని నిజాయితీని నమ్ముకున్న ఈశ్వరప్పను తమ మాట వినేలేదని తప్పుడు ఆధారాలతో సస్పెండ్ చేయించారు. ఇప్పటికీ కేసు కొలిక్కి రాకుండా ఎంక్వైరీల మీద ఎంక్వైరీలతో కేసు నడుస్తూనే ఉంది. అక్రమంగా సంపాదించిన సువార్తమ్మ దళిత అధికారే.. తను అక్రమంగా సంపాదించిందనే అక్కసుతో తన బంధువులు ఫిర్యాదు చేయడంతో ఈ రైడ్ జరిగిందని అసలు ఒకరు ఎదుగుతుంటే ఎలా ఇలా ఎదుగుతారనే ఈర్ష్యతో ఇరుగు పొరుగువాళ్ళే ఫిర్యాదు చేస్తారని అర్థమైంది.

ఇక మేమంతా సువార్తమ్మ ఇంటి నుండి బయలు దేరడానికి సిద్ధమౌతుంటే ఆమె ఇంట్లో షోకేసులో ఫ్రేముకట్టిన బైబిల్ వాక్యం నన్ను బాగా ఆకర్షించింది, నీకృప నాకు చాలును.. అని! ■



## జీవితం

**దీ**నమ్మ జీవితం
టైయానికి అన్నం లేదు
తింటే అరగదు పంటే నిద్ర రాదు

ప్లాటు కొందామని పోరు
ధరల రెక్కల హోరు
ఫ్లాట్ల అమ్మకంలో ప్రభుత్వం జోరు
జనం కొనలేక బేజారు
పనితీరక దినమంతా బేకారు
కొందరేమో కారులో షికారు

ఆశలేమో ఆకాశంలో
ఆదాయం అగాధంలో
భవిష్యత్తంతా అప్పుల బందిఖానాలో
బతుకంతా ఈఎంఐల ఇరకాటంలో
ఉండాలనే ఉబలాటం
లేని దానికోసం పోరాటం
సంపాదించాలనే ఆరాటం

దీనమ్మ జీవితం
టైయానికి ఆకలి కాదు
తింటే అరగదు పంటే నిద్ర రాదు
మనసంతా ఒకటే ఉక్కపోత
ఊపిరాడనంత ఉక్కపోత!

**- డా. ఎడ్ల కల్లేశ్**

**98667 65126**





# జీవన తాత్వికతను ఒంపుకున్న చిన్ని చిన్ని సంగతులు

- సురగౌని రామకృష్ణ
79897 23820

"ప్రజల కవివై గొంతు, రగిలించి పాడితే ఒక్కడొక్కలు రేగి ప్రళయమారుతమట్లు తక్కువెక్కువలెల్ల ఒక్క దెబ్బను కూల్చి లోకాలనూగింపరా! ఓ కవీ! శోకాల తొలగింప రా" అంటూ కవి చైతన్య దీప్తిలా నిలవాలని దిశానిర్దేశం చేశారు తాపీ ధర్మారావు గారు. "అబద్ధాలాడడమంత సులభం కాదు సుమా! కవిత అల్లడం" అని దాశరథి కృష్ణమాచార్యులు గారన్నట్టు వాస్తవాలను కవిత్వం చేయడంలో కవికీ నిబద్ధత ఉండాలి.

కవిత్వ ప్రథమ లక్షణం సామాజిక ప్రయోజనం. ఈ క్షణంలో ఈ కవిత రాయకపోతే చచ్చిపోతాం అన్నంత అవేశం వస్తే కానీ ఒక మంచి కవిత ఉదయించదు. కవిత పాఠకుడి కంటే ముందు కవిని కదిలించాలి. ఆలోచనా ధోరణిలో కొత్తదనం ఉన్నపుడు కొత్త తరహా వ్యక్తీకరణ కోసం కొందరు కవులు సరికొత్త ప్రయోగం చేస్తుంటారు. అటువంటి వారిలో శ్రీనివాస్ గౌడ్ ముందు వరుసలోనే ఉంటారు. అన్నం ముఖ్యం కానీ ఏ పాత్రలో వండారన్నది కానట్టు- వండిన పాత్రను పట్టి అన్నానికి పేరు మారదు. అందులో ఆహారం కాగల జీవశక్తినిచ్చే కవిత్వం ఉండాలన్నది నిర్వివాదాంశం. "నాకొంచం నమ్మకమివ్వు కొండల్ని పిండిచేస్తా"నని ఆలూరి బైరాగి గారన్నట్టు కవికీ కాస్త స్వేచ్ఛను, నమ్మకాన్ని కల్పించాలి.

"చిన్ని చిన్ని సంగతులు"లో అల్పాక్షరాల్లో అనల్పార్థ రచన గావించారు కవి. చదువుతున్నంత సేపు అమ్మ చేతివంట తిన్న ఆనందం చివరిదాకా ఆ రుచిని అలాగే గుబాళింపు చేశారు. ఆర్ద్రత నిండిన హృదయం కవిది. జ్ఞాపకాల గాలిపటాన్ని ఎగురవేసి దారాన్ని భద్రంగా తనతోనే ఉంచుకున్నాడు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉపాధ్యాయుడిగా పని చేసిన అనుభవం పిల్లల్ని అనేక కోణాల్లో కవిత్వం చేయడం కనిపిస్తుంది. ఇంటి నిర్మాణ కళ తెలిసిన వ్యక్తిగా ఇటుక ఇటుక పేర్చి అందమైన భవనాన్ని నిర్మించినట్టు, అక్షరాలను ఆడించి పాడించి బుజ్జగించి బలమైన భావాల సిమెంట్‌తో ఔరా అనిపించేలా కవిత్వాన్ని నిర్మించారు. కవితా నిర్మాణం, ఎత్తుగడ, ముగింపు కవితలన్నీ పాఠకుల్ని ఆసాంతం చదివింపజేస్తాయి.

"అబద్ధమని తెలిసి కలకనడం మానలేను/ మాయని తెలిసి కూడా మనిషిని నమ్మడం మానలేను" అంటూనే "గుండె అరల్లోంచి విప్పారే పువ్వులాంటి చిరునవ్వుని మాత్రమే సత్యమని నమ్ముతాను" అంటారు కవి. "ఒక తడి విత్తనం పాతేసి నువ్వు వెళ్లిపోతావు" అంటూ ఒక తడి విత్తనం లాంటి మంచిని, ఒక మంచిని పెంచే తడి విత్తనాన్ని నువు నడిచిన దారులెంట సుగంధంలా వెదజల్లుతూ పోతే ఆ ఫలితం పొందినవారు గుండె చేతులు జోడించి తల్చుకుంటారని, "అప్పుడు తల నెరసి ఉంటావో/ తల వాల్చేసి ఉంటావో/ నువ్వు చేసిన పని మాత్రం తలఎత్తి నిలబడుతుంది" అంటూ మనిషి జీవితంలోని మార్మిక కోణాన్ని బోధపరుస్తాడు.

తల్లిదండ్రులు పిల్లల్నే కాదు; వారి కలల్ని కూడా కంటారు. "చితికిన మన కలలు/ పిల్లలు పొదగాలి" అంటూ కవిత్వాన్ని ఎంతో చిక్కగా హృద్యంగా అల్లేశాడు. మనల్ని చప్పరించమంటూ పిప్పరమెంటు బిళ్ళ చేతిలో పెట్టి బరబరా ఈడ్చుకెళ్లి బాల్యబిలంలోకి తోసేస్తారు కవి. చిన్ననాటి జ్ఞాపకాలను మిత్రుల సాహచర్యాన్ని గుర్తుకు తెచ్చి మనసుల్ని తేలికపాటి వానలో తెలిపోయేలా చేస్తారు. "దిగులు బెంచి" మీద కూర్చోవడం ఇద్దరూ ఒక్కటై "బాల్యబిలం"లోకి జారిపోవడం అద్భుత రూపకాలను చూసి ఔరా అనుకుంటాం.

ఒక జీవిత కాలాన్ని "కాసేపు జీవితమంటూ" భార్యాభర్తల మధ్య సున్నితమైన భావోద్వేగాలను చిలిపి తగాదాలు, గిల్లికజ్జాలు, మనసును ఒంటరి అడవిని చేస్తుంటాయి. ఇవి లేకపోయినా

జీవితం జీవితంలా ఓ పట్టాన సాగదు. అలా కాసేపు ఆగిపోయిన మాటల్ని చూపులు కలపడం ఇక్కడ ఒక గమ్మత్తు అయిన ప్రక్రియ. చివరగా ఇద్దరి మధ్య మౌనం నిండిన ఆ కాసేపు జీవితం బాగుంది అంటారు శ్రీనివాస్. ఒక్కసారిగా గాలి ఆగిన సంకటం, సాఫీగా సాగుతున్న జీవితాన్ని గాలివాన బీభత్సం సృష్టించినట్లు అవుతుంది. "చిన్నప్పటి ఇంటిముందు చెల్లాచెదురై ఉన్నాను/ ఇప్పుడు అమ్మలేదు/ అమ్మలాంటి ఇల్లు లేదు" అంటూ అప్పటిదాకా నవ్వుతూ తుల్లుతూ గడిసిన బాల్యం ఒక్కసారిగా కుదుపులకు లోనై, "పెద్దపులిలా మెడ పట్టుకుని నిర్దాక్షిణ్యంగా లాక్కుపోతున్న జ్ఞాపకాలు" అంటూ అమ్మలేని జీవితాన్ని గుర్తు చేసుకుని గుండెల్ని బరువెక్కించారు.

అనువాదం ఒక కళ. ఒక భాషా సాహిత్యాన్ని ఇంకో భాషలోకి అనువదించటమంటే కత్తి మీద సాము చేయడమే! ఈ సంపుటిలో చైనా, జపాన్, అమెరికా, ఉర్దూ, గుజరాతీ భాషల కవిత్వాన్ని మూల భావం, కవి హృదయం చెడకుండా మన నేటివిటీకి దగ్గరగా అనువదించి ఔరా అనిపించారు ఈ కవి. "నవ్వుల కోసం/ రెబ్బలు రెబ్బలుగా రాలిపోయే నిట్టూర్పు" అనడంలో సరికొత్త అభివ్యక్తి కనబరిచాడు.

జీవితం పట్ల సరైన అవగాహన, సమాజంపట్ల స్పందించే గుణం నిండుగా ఉన్న కవి. "మరుక్షణమెప్పుడూ/ జీవితం మనకిచ్చిన బహుమతి" అంటూ జీవితాన్ని తాత్విక కోణంలో ఆవిష్కరిస్తారు. స్త్రీల త్యాగాలను గుర్తించలేని మనం ఆమె ఎదుగుదలను ఓర్వలేని తనాన్ని తరతరాలుగా గూడుకట్టుకున్న అహాన్ని పటాపంచలు చేశారు. "ఆమెలో/ అప్పటిదాకా ఒక యోధని/ గుర్తించలేని నాలో ఒకడు తల తెగిపడ్డాడు." ఆ ఒక్కడూ ఎవ్వరంటే వాడి పేరే అహం.

ఈ కవిది ఒక సామాజిక బాధ్యత నిండిన ప్రయాణం. అందులోనూ ఉపాధ్యాయుడిగా విధి నిర్వహణలో పిల్లల్లో పిల్లవాడిలా మారిపోవాలి అంటాడు. "పాఠం చెప్పాలంటే/ పాఠంలో పిట్ట అవ్వాలి /కోయిల అవ్వాలి నవ్వే సింహం అవ్వాలి" అంటూనే "పాఠం చెబుతూ పిల్లల దగ్గర కొన్ని పాటలు నేర్చుకోవాలి" అంటాడు. మనిషి ఎన్ని వేషాలు వేసినా, ఎన్ని దేశాలు తిరిగినా, ఎన్ని భాషలు నేర్చినా తన కాలి కింద నేలను చూస్తూ నడవాల్సిందే! ఎన్నటికైనా తన అస్తిత్వాన్ని తడిమి చూసుకోవాల్సిందే! తరతరాలుగా తనకు కూడు పెడుతూ వచ్చిన 'పగిలిన కుండ'ను గూర్చి చెప్పుకుంటూ తన మూలాలను భద్రపరుచుకున్నాడు కవి.

"అది పగిలిన కుండా / పట్టెడన్నం పెట్టిన కూటికుండా / సరిగా చూడు" అంటూ పగిలిన కల్లుకుండను గుండెలపై బోర్లించుకున్నాడు కవి. "ఎండ వచ్చినా/ వచ్చిన పని మరిచి పొగ మంచుతో ప్రేమలో పడింది" అంటూ చిక్కని భావాన్ని మన హృదయాల్లోకి ఒంపాడు. ఎండ పొగ మంచుతో ప్రేమలో పడ్డట్టు నేను ఈ వాక్యపు మాయలో పడిపోయాను. ప్రపంచానికీ నాకు మధ్య అద్దం అలాగే ఉంది స్వచ్ఛంగా... అన్నట్టు అద్దం ఎప్పటిలాగే స్వచ్ఛంగానే ఉంది,ఉంటుంది కూడా. ప్రపంచమే మసకబారిపోయింది, స్వచ్ఛతను కోల్పోయింది" అంటాడు కవి.

"పురా ప్రేమలు" కవితలో – "పూల భాషలో భూమి ప్రేమలేఖ రాస్తే/ రాత్రి ఆకాశం వెన్నెల ఉత్తరం వేస్తుంది." ఎంత గొప్ప భావన! ఇలాంటి అద్భుతమైన వాక్యాలు ఎదురైనప్పుడు గుండెకు హత్తుకుని కాసేపు ఆగి జీర్ణించుకుని మళ్ళీ ముందుకు సాగాల్సిందే! ఎవరో రెండో జడల అమ్మాయి కవి గారి మనసును గిల్లి గిలిగింతలు పెట్టి వెళ్లిపోయినట్టుంది. ఆ జ్ఞాపకాల వాగులోనే దాహార్తి తీర్చుకుంటున్నాడు. కవి గొప్ప ప్రేమికుడు. చెట్టు, పుట్ట అన్నింటినీ ప్రేమిస్తాడు, పలవరిస్తాడు. ఇక్కడ రెండు జడల అమ్మాయి కవి హృదయ కొలనులోకి వలపు రాయి విసిరి నట్టుంది. మనసంతా అలలు అలలుగా అల్లకల్లోలం అయింది. అందుకే ఏ రెండు జడల అమ్మాయిని చూసినా హృదయారణ్యంలో కస్తూరి మఱగంలా సంచరిస్తూ "ఆ అమ్మాయే" అంటూ పలవరిస్తున్నాడు. అనుకున్నవి వెంటనే జరిగిపోవు. కాలం కనుపాపల్లో కరుగుతూ ఉండాలి. "ఏదో ఒక రోజు వచ్చి వరిస్తుంటాయి / ఆ క్షణంలో నువ్వు/ లోన జ్వలించే కన్నుతో/ దోసిట పట్టి ఉండాలి" అంటారు. "ఒక కలగనడం మినహా నేనేం చేశాను/ నా కలని పదిమంది కనేట్టు చేయడమే నా కల" అంటూ కవులు సమ సమాజాన్ని కలగనడం, దానిని అక్షరాలు చేసి సమాజపు భుజాలపై నుంచి ఆకాశంలోకి ఎగురవేయడం సహజాతి సహజం. ఇక్కడ "నా" అస్తిత్వాన్ని నిటారుగా నిలబెట్టాడు కవి. "మోయలేని ద్వేషంలో/ ద్వేషం మోయడం కన్నా/ సిలువ మోయడం సులువు కదా" అంటూ ఈర్ష్య అసూయ ద్వేషాలతో రగిలిపోతున్న సమాజాన్ని చూసి నివ్వెరపోతాడు. ఇందులో శివారెడ్డి గారికి గొప్పగా కవితాహారతి పట్టాడు. "అతను ఎందుకు వచ్చాడు/ వచ్చినందుకు నగరానికి రెండు చేతులు ఇచ్చాడు/ ఒకటి కలుపు తీయడానికి/ ఒకటి కవిత్వం రాయడానికి" అంటూ "నడుస్తున్న పల్లెపదంలో నగరమంతా నాట్లేస్తున్నాడు" అని ఇష్టకవిని హృదయానికి హత్తుకున్నారు.

"చిన్ని చిన్ని సంగతులు" కవితలో "చిన్న చిన్నయ్యే/ ఒక కాలు భూమి మీద/ ఒక కాలు ఆకాశం మీద" అంటూ వామనుడిలా విజఅంభించాడు కవి. "పెగలని మాటతో/ మాటే కాదు/ మౌనం కూడా గాయమే మనకు" అంటాడు. పెగలని మాటతో మనం పెనుగులాడుతాం చాలాసేపు. నిజమే మాట


చేసినంత గాయం మౌనం కూడా చేస్తుంది. మరోచోట "చీకటి ఆరేసిన చీర మీదే తారల తళుకు" అంటూ అబ్బుర పరుస్తారు. ప్రతి మనిషి జీవితంలో స్త్రీ పాత్ర మరువలేనిది, ఎనలేనిది. ఆమె లేని అతని జీవితం ఎప్పటికీ అసంపూర్ణమే! ఆ లోటు ఎవరూ భర్తీ చేయలేనిది భార్యాభర్తల అనురాగాన్ని సంపూర్ణం చేశారు.

స్త్రీల మనసుని అర్థం చేసుకునే సున్నిత మనస్కుడు శ్రీనివాస్. స్త్రీ జీవితపు వేదనల్ని వ్యక్తికరించేటప్పుడు వీరిలో ఆర్తి పలుకుతుంది. గుండె తడి చేసుకుంటాడు తడి గల కవి. "గుంజాటన" కవితలో ఇష్టం లేని స్త్రీ బతుకులోని ఇరుకుతనాన్ని వ్యక్తపరిచిన తీరు అద్భుతం. స్వేచ్ఛ లేని తనాన్ని చెబుతూనే ఉండాల్సిన స్వేచ్ఛని చెబుతూ "ఆ అక్కకు" ఒక ధైర్యవచనమై నిలబడతాడు. ఈ కవితలో "ఆమెది గుంజకు కట్టేసిన/ లేగ దూడ గుంజాటన/ పసుపు తాడు/ పలుపుతాడు/ అయినా ఇంకా మించిందేం లేదు" అని వెలుగు రేఖయై కనిపిస్తాడు. "తనకు తాను సాయం చేసుకునే సమయం ఎప్పుడూ అస్తమించదు" అంటూ అక్కను అభ్యుదయ పంథాలో నడిపిస్తాడు "యుద్ధభూమి మధ్యలో నిలబడి మనిషికి ప్రేమ లేఖ రాస్తున్నాడు" అంటూ ఆశారాజు గారిని ఆవిష్కరించిన తీరు అమోఘం. తన మిత్రుడు తాను బడి ఎగ్గొట్టి మునిసిపాలిటీ పార్కులో గ్రంథాలయానికి అలవాటు చేశాడంటూ గత జ్ఞాపకాల గాథలు తవ్వి పోసుకుంటాడు.

''కాటి కాపరి కూడా కన్నీటిని తగిలేయంలేక కాలిపోతున్నాడు" అంటూ కరోనా మిగిల్చిన విషాదాన్ని ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి చేసిన వైనాన్ని ఆర్ద్రతగా కవిత్వం చేశాడు. ''కవిత్వ కరచాలనం" అనే కవితలో ''నన్ను తలచుకున్నప్పుడు/ నాకంటే ముందు నేను రాసిన వాక్యం గుర్తుకు రావాలి" అని కవిగా మనసులోని మాటను ఆవిష్కరిస్తాడు. తకేకియో తలపోసినట్టు "కనీసం ఏ కవి పక్కనో నన్ను ఖననం చేయండి" ఒక కవిగా ఇంతకంటే ఏమి కోరుకోగలరు! "భూమి పొరల కింద ఒకరికొకరు/ కవిత్వ కరచాలనం చేసుకుంటాం" అంటూ కవిత్వం పట్ల తనకున్న సాన్నిహిత్యాన్ని వ్యక్తీకరిస్తారు. మనసులోని బాధను, ఒంట్లో తీయని గాయాన్ని కూడా పాజిటివ్‌గా తీసుకోగల ఆత్మస్థైర్యం ఒక కవికి మాత్రమే ఉంటుందని శ్రీనివాస్ నిరూపించారు. ఇందులో "కోసి ఎవరికి ఇవ్వడానికి వీల్లేదు/ దాచి ఇంట్లో ఉంచడానికి వీల్లేదు" అంటూ తన ఒంట్లోని డయాబెటిస్‌ని కూడా కవిత్వం చేయగలిగారు.

"రాళ్లేసిన వాళ్లకి పూలు, పండ్లను ఎలా బదులివ్వాలా? అని తపస్సాధన చేస్తున్నా" అంటూ, ఎదుగుతుంటే కాళ్లు పట్టి లాగే వాళ్ళు ఎక్కువ. కాసే రాళ్ల దెబ్బలు అన్నట్టు ఫలవంతమైన మనిషికి రాళ్ల దెబ్బలు సహజం. అలాంటి వాళ్లకు తిరిగి రాళ్లకు బదులుగా పూలు పళ్ళు బదులిచ్చే సాధన చేస్తున్నాడు కవి.

ఇలా "చిన్న చిన్న సంగతులు" కవిత్వం నిండా లోతైన, పదునైన భావాలు పలికించటంలో కవి సఫలుడయ్యాడు. తాత్వికత, మార్మికత నిండిన భావాలతో ఎన్నో జీవితాలను వడబోసి కన్నీళ్లు, జ్ఞాపకాలు, ప్రేమలు, ఆర్తి ఆవేదన నిండిన అక్షరాల పొదిగా మనకు అనేకానేక కోణాల్లో దర్శనమిస్తారు శ్రీనివాస్. ■




## వేకువ రాగం

**చీ**కటి చుట్టిన జీవన పయనంలో
వెన్నెల రెక్కలు కట్టి తలుపు తడితే..
మది నిద్దుర మరచిన కన్నుల్లోకి
ఇంద్ర ధనస్సు వచ్చి పలకరిస్తే..

చెలిమి తాకిన హృదయ రాగంలో
అనురాగపు మధురిమలు
ఆప్యాయతను అల్లుకొని
మమతలన్నీ తీగలా చుట్టుకున్నాయి..

వెన్నెలను ఎక్కుపెట్టిన ఆ నిశి రాతిరి
అద్భుతమైన స్వప్న లోకంలో విహరింపజేసింది
జీవితాన్ని సరికొత్తగా మార్చేసింది
కలలకు ఇపుడు కొత్తగా వెలుగు రేఖలు పూస్తున్నాయి!
మెలుకువ రాగాలు కంటి రెప్పలని
తట్టి తట్టి లేపుతున్నాయి..!

**- స్వప్న**
**90522 21870**





# అస్తవ్యస్త వర్తమానంపై ఆవిష్కృతమైన కవిత్వం

- సత్యాజీ
94900 99167

**మ**న ప్రమేయం ఉన్నా, లేకున్నా చుట్టూ ఉన్న పరిస్థితులు నిరంతరంగా మారుతూనే ఉంటాయి. మారిన పరిస్థితులతో సంఘర్షిస్తూనో, సమన్వయం కుదుర్చుకుంటూనో మనం కూడా ముందుకు సాగిపోతాం. ఏ మార్పు ప్రభావమైనా అందరి మీదా సమానంగా ఉండదు. అందరికీ సమాన ఫలితాలను ఇవ్వదు. అందరికీ సమాన అవకాశాలను కల్పించదు. తక్కువమందికి మేలు, ఎక్కువమందికి కీడూ కలిగించే మార్పు సామాజిక వ్యత్యాసాలకు కారణమవుతుంది. సంఘర్షణలకు దారి తీస్తుంది. అయితే, ఆ సంఘర్షణ ప్రబలంగా బయటకు రాకుండా ఉండటానికి పాలకులుగా ఉన్న వాళ్లు ఉపశమన చర్యలూ, ఉద్ధరణ కార్యక్రమాలూ ఏదో ఒక మేర చేపడతారు. అవి పరిస్థితిని కొంత సద్దుమణిగేలా చేయొచ్చేమో కానీ, సాంతం సామరస్యాన్ని, సమ న్యాయాన్ని చేకూర్చలేవు. తాత్కాలిక మంత్రంగా కొంతమేర పనిచేస్తాయి. ఇలాంటి పరిస్థితుల నేపథ్యం అనేక రూపాల్లో ప్రజల జీవనం మీద ప్రభావం చూపిస్తుంది. విద్య, వైద్యం, కూడు, గూడు తదితర ప్రాథమిక అవసరాలనూ ప్రభావితం చేస్తుంది. అవసరాలు తీరటంలోని వ్యత్యాసం కొందరి జీవితాలను ఆనందదాయకం చేస్తే, మరికొందరి బతుకులను అస్తవ్యస్తం చేస్తుంది. దేశంలో కార్పొరేట్ శక్తులు అన్ని రంగాల్లోకి ప్రవేశించాక, ప్రజలందరికీ ఎంతోకొంత సమాన అవకాశాలను కల్పించటానికి ప్రయత్నించిన ప్రభుత్వరంగ సంస్థలను ఓ పథకం ప్రకారం నిర్వీర్యం చేయడం మొదలైంది! దేశం బాగుపడటానికి ప్రయివేటీకరణ, కార్పొరేటీకరణలే అత్యంత అవసరమని సాక్షాత్తూ ప్రజల చేత ఎన్నికైన ప్రభుత్వాలే నేరుగా ప్రచారం చేయడం మొదలెట్టాయి. చూస్తుండగానే విద్య, వైద్యం వంటి మౌలిక రంగాలు కార్పొరేటు శక్తుల ప్రాబల్యంలోకి వెళ్లిపోయాయి. నిర్వీర్యం చేయబడిన ప్రభుత్వ బడులు, ఆసుపత్రులు నీళ్లు పోయని మొక్కల్లాగ నీరసించిపోయాయి. ప్రయివేటు చదువు కోసం, ఆరోగ్యం కోసం ఇప్పుడు జీవితాలనే వెచ్చించాల్సి వస్తోంది.

జరుగుతున్న మాయాజాలం ప్రజలకు అర్థం అవుతుంటే, ఆ అప్రమత్తతని అడ్డుతోవ తొక్కించటానికి మత రాజకీయం మనుషులను విడదీస్తోంది. ఉద్వేగాలూ ఉద్రేకాలను రెచ్చగొట్టి, ఆలోచించే వివేచనను వెర్రి ఆవేశంతో అదిమేస్తోంది. పాలకులు పైపై ఉపశమనాలకు పరిమితమవుతూ, వాగ్దాన ప్రగల్భాలతో అధికార పీఠం ఎక్కుతున్నారు. ప్రజల ఆశలకూ ఆకాంక్షలకు పాతరేసి, ప్రభుత్వ ఆస్తులను సులభంగా చేజిక్కించుకుంటున్న కార్పొరేట్లకు, బడాబాబులకు మేలు చేసే విధానాలకు గేట్లు ఎత్తుతున్నారు. వేగంగా విస్తరిస్తున్న కార్పొరేటీకరణ అన్ని సంబంధాల్లోనూ వ్యాపారాన్ని, లాభాపేక్షను బలంగా నాటు కుంటూ పోతోంది. తత్ఫలితంగా స్థానిక భాషా సంస్కృతులు, సంప్రదాయక వ్యవహారాలూ, గ్రామీణ సంబంధాలూ, మానవ అనుబంధాలూ అత్యంత వేగంగా దెబ్బతినిపోతున్నాయి. ఇది మన కళ్ల ముందు నడుస్తున్న చరిత్ర. ఈ అస్తవ్యస్త పరిస్థితుల మధ్య నిలబడి ... కవి కెవిఎన్ మూర్తి (వెంకట్) – సందిగ్ధావస్థ కు, సంఘర్షణకూ గురై, తీవ్ర సంక్షుభిత మనస్కుడై, తను ఏ పక్షం తీసుకొని, ఎలాంటి స్వరం వినిపించాలో నిర్ణయించుకొని, ఈ కవిత్వాన్ని వినిపిస్తున్నాడు.

**త**న చుట్టూ జరుగుతున్న పరిణామాల్లో న్యాయం లోపించిం దని ఈ కవి నమ్ముతున్నాడు. మానవ సంబంధాలు బలహీనమై పోతూ ఉండడం పట్ల తీవ్ర ఆవేదన చెందుతున్నాడు. ఉద్ధరిస్తాయని నమ్మిన రాజకీయాలూ, ప్రభుత్వాలూ ప్రజలను మోసగిస్తున్నాయని తీర్మానించుకున్నాడు. ఉన్నచోటే ఉండి ఉన్న దాంతోనే నెమ్మదిగా, నిజాయితీగా ఎదగటంలో ఆనందం

ఉందని బలంగా భావిస్తున్నాడు. మనుషులను ప్రేమించాలని, మానవ సంబంధాలు వర్ధిల్లాలని, మనిషి మనిషిలాగానే బతకాలని, మర మనిషిగా మారకూడదని అంటున్నాడు. ఇలాంటి ఎరుకను, చైతన్యాన్ని తన చుట్టూ ఉన్న సమాజం ప్రదర్శించటం లేదని తీవ్రంగా బాధపడుతున్నాడు కూడా!

దాదాపు ఇవే ఇతివృత్తాలుగా, ప్రధాన వస్తువులుగా మూర్తి కవిత్వం రూపుదిద్దుకొంది. సామాజిక అంశాలకే తన కవిత్వంలో ఎక్కువ ప్రాధాన్యం దక్కింది. అత్యంత సామాన్యమైన మనిషి మూర్తి కవిత్వానికి కేంద్ర బిందువు. శ్రామికుడిలో, సామాన్యమైన రైతులో, శారీరకంగా కుదేలైపోయిన వృద్ధ కవిలో, మూతపడిన టూరింగు టాకీసులో, అనుభవాలతో తలపండిన వయోవృద్ధుడిలో ... మేలిమి అంశాలను పుణికి పుచ్చుకోవాలనుకుంటున్నాడు. తన చుట్టూనే ఉన్న మంచిని, మేలిమిని ఎంచుకోవటానికి మూర్తి పడుతున్న తాపత్రయం ఈ పుస్తకం నిండా పరుచుకొని ఉంది. తన పాత జ్ఞాపకాల్లోంచి, మన వారసత్వంలోంచి వర్తమానాన్ని అవలోకించి, భవిష్యత్తును నిర్మించుకోవాలన్న తపన కనిపిస్తోంది.

వీరగాథ, అడుగుజాడలు, చీకటి, స్వేచ్ఛకు సంకెళ్లు, తదితర కవితల్లో దేశం పట్ల ఈ కవికి ఉన్న భావన వ్యక్తమవుతుంది. ప్రజాకవుల పట్ల, స్వాతంత్ర్య సమరయోధుల పట్ల ఉన్న గౌరవం, వారి వారసత్వాన్ని కొనసాగించటం పట్ల ఆసక్తి వెల్లడవుతాయి. కవిత్వం నెరవేర్చే సామాజిక కర్తవ్యం మీద అపారమైన నమ్మకం ఉండడం వల్లనే 'అతన్నలా వదిలేయకండి..' అనగలిగాడు. ఈ పుస్తకానికి శీర్షికగా అమరిన ఈ కవిత ఒక కవిని ఉద్దేశించి రాసినది. ఆ కవి నేడు వార్ధక్యం చేతనో, మరో కారణం వల్లనో బయటికి రాలేని, రాయలేని స్థితిలో ఉన్నప్పుడు – అతడిని అలా వదిలేయకండని సమాజాన్ని, సాటి వర్తమాన కవుల సమూహాన్ని కోరుతున్నాడు. గతంలో ఆ కవి సమాజ చైతన్యం కోసం ప్రయోగించిన అక్షర ఫిరంగులను గుర్తు చేశాడు. సామాజిక మార్పు కోసం అతడు సాగించిన కవన సమరాన్ని కళ్లకు కట్టించాడు. ఇంతవరకూ చెప్పి, అతన్నలా వదిలేయకండి అంటే – ఆ వృద్ధకవి మీద జాలినో, దయనో, గౌరవాన్నో ఉత్పన్నం చేయటానికి మాత్రమే కవిత పరిమితం అయ్యేది. కానీ, మూర్తి అంతటితో వదిలేయలేదు. ఒకే ఒక్క మాట వాడడం ద్వారా గొప్ప సామాజిక, చైతన్య స్ఫురణ కలిగించాడు. **"అతన్నలా వదిలేయకండి/ మీలో ఆవాహన చేసుకోండి."** అన్నాడు. ఈ కవిత ప్రాధాన్యాన్ని, ప్రయోజనాన్ని ఈ ఒక్కమాటా పతాక స్థాయికి చేర్చింది. మూర్తి కవిత్వ శైలిలో, భావనాపథంలో అలాంటి స్పృహ, మెలకువ బహు మెండుగా ఉన్నాయని ఇంకా చాలా కవితలు నిరూపిస్తాయి.

మానవత్వానికి జేజేలు, పలకటం, మతోన్మాదాన్ని ఈసడించటం 'మతోన్మాదం' కవితలో చూడొచ్చు. పీల్చే గాలికి, తాగే నీటికి, మసలే నేలకూ లేని మతం నీకెక్కడినుంచి వచ్చిందని ప్రశ్నిస్తాడు. **"ఏ ఉత్సవమైనా, ఉరుసులైనా/ మనుష్యుల్లో ఏకత్వానికే కదా!"** అంటాడు. 'భిన్నత్వంలో ఏకత్వం' అన్న మన సాంస్కృతిక వారసత్వం ఈ మాటల్లో ధ్వనిస్తోంది.

దురాక్రమణలు, దౌర్జన్యాలు, దుర్మార్గాలకు పాల్పడి ఆధిపత్యం చెలాయిస్తే, అధికారం సంపాదిస్తే – అది ఎన్నాళ్లు సాగుతుందని ప్రశ్నించాడు **"ఎవరు విజేత?" కవితలో. ఈ సంపుటిలోని ఉత్తమ కవితల్లో ఇదొకటి. "మనిషి పుట్టుక మొదలై/ యుగాలు గడిచాయి/ నాది అని నువ్వు విర్రవీగిన ఈ నేల/ మునుపు ఎవ్వడో పొరాడిన పాచి నేల!"** అన్నాడు. ఈ ఒక్క మాటలో అధికారం యొక్క అహానికి కోలుకోలేనంత దెబ్బ కొట్టాడు కవి. **"నువ్వు తొడుక్కొని ఊరేగుతున్న చొక్కా ఇంతకుముందు ఎవడో వాడి పారేసిందిరా సన్నాసీ .."** అన్నంత ఈజీగా చెప్పాడు. "పొరాడిన పాచి నేల" అనటం కవి అవగాహనా పరిధికి, దృక్పథానికి ఓ చక్కని ఆనవాలు. ఇదే కవితలో "నువ్వు రక్తంతో తడిపిన నేల/ నీకై వెర్రినవ్వుతో వేచే ఉంటుంది." అనటం ఓ పెద్ద చురక. కొమ్ములు తిరిగిన నియంతలను, తామే ధరాధిపతులమని విర్రవీగే అధికార, ధనమదాంధులను "వ్వె .. వ్వె..." అని వెక్కిరిస్తూ ఈసడిస్తోంది ఈ మాట. ఒక మనిషిని మరో మనిషి దోచుకునే ధూర్త, దుర్మార్గ సమాజాన్ని ఈసడించే మాటలు, కవితలు ఈ పుస్తకంలో ఇంకొన్ని ఉన్నాయి.

"మార్పు" కవితలో గొప్ప సామాజిక సత్యం గోచరిస్తుంది. **"మాట్లాడే నోరు మూగబోయి కూర్చుంటే ../ కదలాడే కాళ్లు బంధనాలు తొడుక్కుంటే ../ పోరాడే చేతులు పిడికిలి బిగించకుంటే ../"** ఏమవుతుందో చెబుతున్నాడు. **"చెమట చిందించని కామందు బూట్లు / శ్రమజీవుల ఘర్మ జలాలతో మెరుస్తున్నాయి."** ఈ కవితా నిర్మాణంలో గొప్ప టెక్నిక్ పాటించాడు మూర్తి. నోరు, కాళ్లు, చేతులు చేయాల్సిన, చేయగలిగిన సహజమైన పనులను పేర్చుకుంటూ వచ్చాడు. మాట్లాడ్డం, ప్రశ్నించటం నోరు సహజ గుణం. కదలాడడం, ముందుకు నడవడం కాళ్ల సజీవ లక్షణం. పనిచేయడమే కాదు; పోరాడ్డం కూడా చేతుల సహజ స్వభావం. ఈ విషయాలను చెప్పకనే చెప్పి– అలాంటి నోరూ, కాళ్లు, చేతులూ అచేతనం అయిపోతే ఎలా అని ప్రశ్నిస్తూ – వాటి పర్యవసానం ఏమిటో

ఈ కవితలో వివరించాడు. **"పిడికిలి బిగించి పోరాటం చేస్తేనే/ ఏరులైన నీ స్వేదం నీకు ఊపిరి పోస్తుంది./ లేకుంటే వీధుల్లో ఎంగిలి విస్తరిలా / ఏ ఎండ గాలికో మండిపోయి రాలిపోతావ్."** అని హెచ్చరించాడు.

ఇలాంటి ఎన్నో చైతన్యస్ఫోరకమైన కవితలు ఆర్తిగా, ఆవేదనగా, ఆవేశంగా పాఠకులను చుట్టుముడతాయి. అంతరంగాన ప్రశ్నలను రేకెత్తిస్తాయి. అంతే కాదు; అమ్మ, నాన్న, అన్నయ్యల గురించి ఎంతో ప్రేమగా, ఇష్టంగా రాసుకున్న కవితలూ ఈ సంపుటిలో ఉన్నాయి. ఆఖరి పేజీల్లో ఫక్తు ప్రేమ కవితలూ ఉన్నాయి.

**చు**ట్టూ చెలరేగుతున్న అన్యాయాలను చూస్తూ, సహిస్తూ, రాజీ పడుతూ బతికేస్తున్న సాటి సమాజం మీద మూర్తికి తీవ్రమైన బాధ ఉంది. కొన్ని కవితల్లో అది నిరాశగా, నిస్పృహగా కూడా ధ్వనించింది. సామాజిక బాధ్యత వహించాల్సిన కవి ఆశాభావాన్ని వదులుకోకూడదు. సమాజాన్ని మరింతగా అధ్యయనం చేయటం ద్వారా మాత్రమే ఏ కవికైనా అలాంటి అక్షర దిటవు ఏర్పడుతుంది. మూర్తి మరింత అధ్యయనం చేయడం ద్వారా, నిరంతరంగా రాయడం ద్వారా ఒక ప్రజాపక్ష కవిగా నిలుస్తాడని ఈ తొలి సంపుటిలోని కవిత్వం వాగ్దానం చేస్తోంది. వేగవంతమైన అనేక పరిణామాలకు, పాలకుల ప్రయోగాలకు, కార్మిక చైతన్యానికి, ప్రజాకవుల వారసత్వానికి విశాఖపట్నం బలమైన వేదిక. ప్రజల తరఫున గొంతెత్తే అక్షరాలను అక్కున చేర్చుకునే ప్రియ నగరం.

మూర్తి విశాఖ విశాల ప్రజావసరాలకు ఒక బలమైన గొంతులా ఆవిర్భవించాలి. "అతన్నలా వదిలేయకండి." అన్న సంకల్పం, పిలుపూ తనకే ఒక నినాదమై మార్మోగుతూ ఉంటుందని భావిస్తున్నాను. మూర్తి విశాఖ స్టీల్‌ప్లాంటులో ఉద్యోగం చేస్తున్నప్పటికీ– తెలుగు సాహిత్యం పట్ల మక్కువ చేత ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎంఎ తెలుగు సాహిత్యం చదువుతున్నాడు. శ్రీశ్రీని పలవరిస్తున్నాడు. కాళోజీని కలవరిస్తున్నాడు. ప్రజాకవులను తలదాల్చుకున్నాడు. అక్షరానికి, కవిత్వానికి సామాజిక బాధ్యత ఉందని నమ్ముతున్నాడు.

**"ఎదురు తిరిగే ధైర్యం బెదురుచూపులు చూస్తున్నది**
**గళం విప్పే కంఠాలు కత్తివేటుకు తెగిపడుతున్నాయి"** అని వర్తమాన వాస్తవాన్ని చెబుతూనే – కవి బాధ్యతను, కర్తవ్యాన్ని కూడా తనే గుర్తు చేస్తున్నాడు మూర్తి.

**"జగన్నాథ రథ చక్రాలై అదిలించే కలం కదుపు**
**నీ చేతులు కాగితాలపై ఏదో శక్తిని ప్రోది చేస్తున్నాయి.."**

**అవును ... ఈ కవి తన గొంతును మరింత బలంగా వినిపించాలి. ఉత్తరాంధ్ర అందించే మరో ప్రజాకవిగా ప్రభవించాలి.**

■



## కణాలు

**గా**నం చేసేవన్నీ పాటలు కావు
రాసేదంతా కవిత్వం కానట్టు!
అందరూ
రూపాయిల్ని పండిస్తున్నా,
ఎక్కడెక్కడి అశాంతిని,
శూన్యతను, కన్నీళ్లను పంచుకొంటూ
ఒక సామాజిక జీవన స్వరూపాన్ని చిత్రిస్తుంటాను
ఒంటరి యుద్ధంలో
అద్భుత ప్రపంచాన్ని
కలకంటుంటాను
ప్రతిరోజూ రక్త సంబంధాల్లో
స్నేహ సంబంధాల్లో మునిగి
అనుక్షణం ఆత్మవంచన చేసుకొంటూ
ఇస్త్రీ చొక్కా గాంభీర్యంతో
ఇరుకు మనుషుల మధ్య
నాదైన స్వరాన్ని వినిపిస్తుంటాను
నా దేశంలో చనిపోతున్నది
మనుషులు కాదు
పోరాటానికి ప్రతిబంధకాలైన
మనిషి ఆలోచనల కణాలు!

**- ఏటూరి నాగేంద్రరావు**

**74166 65323**



# ఎన్ని అవరోధాలు ఎదురైనా ధైర్యంగానే ...

- ఎస్ఆర్ పృథ్వి
99892 23245

ప్రముఖ కవి, విమర్శకుడూ అద్దేపల్లి రామ్మోహనరావు జీవితం సాగరం వంటిది. కవిత్వం కెరటాలై ఉరుకుతుంది. సాగరం నుంచి కెరటాలను ఎలాగైతే విడదీయలేమో, అలాగే అద్దేపల్లి జీవితం నుంచి ఆయన కవిత్వాన్ని విడదీయలేము. ఆయనే అనేక సందర్భాల్లో అన్నారు : "నాకు జీవితమూ, కవిత్వమూ వేర్వేరు కాదు" అని. సాహితీలోకం అంగీకరించిన సత్యమిది.

అద్దేపల్లి కవితా వృక్షానికి కాచిన గ్రంథ ఫలాల్లో 'అయినా ధైర్యంగానే' ఒకటి. 'గోదావరి నా ప్రతిబింబం' తర్వాతను కుంటాను ఈ పుస్తకం వెలువడింది. రెండింటికీ నడుమ సుమారు పుష్కరకాల విరామం. ఆ విరామంలో రెండు దీర్ఘ కవితా కావ్యాలు వెలువడ్డాయి. గ్రంథాలను పూర్వం కుసుమాలతో పోల్చేవారు, మనసుకు హాయిగొలిపే పద్యాలతో రసవత్తరంగా, సుకుమారంగా ఉండేవి. కాలం మారింది. కవిత్వమిపుడు ప్రజలపరమైంది. అద్దేపల్లి కవిత్వం, ప్రజా సమస్యల గుండెలకి విల్లెక్కు పెట్టినట్టుంటుంది. అందుకే గ్రంథ ఫలాలు అన్నాను.

'అయినా ధైర్యంగానే' సంపుటిలో 30 కవితలు ఉన్నాయి. వాటిలో మూడు మినహా అన్నీ 1992- 99 మధ్యకాలంలో రాసినవే. అద్దేపల్లి ఏది రాసినా, అది ప్రగతి శీలమై, సమాజంలోని విభిన్న కోణాలు దర్శనమౌతాయి. అందుకు కారణం, సమాజం గురించి, ఆ సమాజంలో జీవించే వారి గురించి ఆయన ఆలోచన ఉంటుంది. సమాజాన్ని పరిశీలించే వారికి ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక పతనం ఏ దిశగా జరుగుతా వుందో బాగా తెలుస్తుంది. వాటిని కేంద్రంగా చేసుకుని రాసిన కవిత్వం ఈ సంపుటిలో దర్శనమౌతుంది.

ఈ కవితా సంపుటికి "అయినా ధైర్యంగానే" అని పేరు పెట్టడంలో అద్దేపల్లి వారి ఉద్దేశ్యం అయితే నాకు తెలియదు గాని, నాకనిపించింది, ఇక్కడ చెప్పి తీరాలి. ఈ పుస్తకం వెలువరించే కాలంలో సుమారు ఐదు సంవత్సరాలు మేమిద్దరం ఒకే చోట ఉండే వాళ్ళం. అంటే, వారి ఇంటి వెనుక నేను; నేనుండే ఇంటి వెనుక వారు.

అద్దేపల్లి వారి నిజ జీవితం, సాహితీ జీవితంల ముద్ర, ఆ శీర్షికలో నేను చూడగలిగాను. ఎన్నో ఒడుదుడుకుల్ని నెట్టుకుంటూ ధైర్యంగా జీవితయాత్రతో, సాహితీయాత్రను పెనవేసి, విజయ శిఖరాన్ని అధిరోహించిన వ్యక్తి అద్దేపల్లి. అటువంటి క్లిష్టతరమైన రోజుల్లో వెలువడిన సంపుటి 'అయినా ధైర్యంగానే'. ఈ పుస్తకానికి ముఖచిత్రం శిఖరాన్ని అధిరోహిస్తున్న మనిషి చిత్రం. బహుశా, శీలావీ గారు వేసినట్లు గుర్తు. ఈ కవికి జీవితం ఎప్పుడు ఒక కొత్త బిందువు లాగ కనిపిస్తుంది. ఏ సాహిత్య ప్రక్రియ కానీయండి, ఏ సాహిత్య వాదం తలెత్తనీయండి, వాటిల్లోకి దూసుకెళ్ళి, మంచి చెడులను విశ్లేషిస్తూ ముందుకు సాగిపోతారు.

ఈ సంపుటిలోంచి రెండు, మూడు అంశాలను మాత్రం స్పృశిస్తాను.

"లక్షల గుండెల్లోని నెత్తురు బొట్లు
గొంతుల్లోంచి ఏకధారగా ఊటలైరేగి
అన్ని దిక్కులూ చిమ్మినపుడు
ఆ వేడి, రెప్పల్ని కాల్చినపుడు
మత్తుగా పడివున్న చరిత్ర
ఒక్కసారి ఉలిక్కిపడుతుంది
ఉలిక్కిపడిన చరిత్ర కళ్ళలోని
ఎర్ర జీరలే ఉద్యమాలుగా అల్లుకుంటాయి" అంటారు.

ఇవి, 'ఆకాశం కళ్ళల్లో అగ్ని సముద్రం' అనే కవితలోని పంక్తులు. ఈ పంక్తుల్లో తీవ్ర స్థాయిలో ఉన్న ఉద్యమ స్వరూపం కనిపిస్తుంది. వివిధ ఉద్యమాల చరిత్ర తెలిసిన సీనియర్ కవి

మాత్రమే ఈ విధంగా చెప్పగలడు. ఒక ఉద్యమం ఆవిర్భవించ డానికి గల నేపథ్యం ఎలా ఉంటుందో, ఒక దృశ్యరూపంగా మన ముందు నిలుస్తుంది.

చుట్టూ దీపాలు వెలుగుతా ఉంటై, కాని, మధ్యన చీకటి అలుముకొని ఉంటుంది. చూడండి :

శవం తల పక్కన పెట్టిన దీపం
శవానికి వెలుగునిస్తుంది గాని/ జీవితాన్ని వెలిగించదు"

ఇది యథార్థమే కదా! ఇలా వ్యవస్థలోని ఎన్నో అంశాల్ని ఉదహరిస్తారు కవి. తాత్కాలికంగా కొద్ది మేర వెలుగు నిచ్చేది కాదు కావలసింది. ఈ వ్యవస్థకి శాశ్వత ప్రయోజనం కూర్చే వెలుగు అవసరమై ఉంది. దాని సాధన కోసం శ్రమించాలన్నది కవి కోరిక. ఎందరో త్యాగమూర్తులను కన్న ఈ దేశంలో మానవత్వం కోసం ప్రాణాన్ని దహింపచేసే ఒక్కొక్క మహ నీయుడు ఒక్కో దీపం వంటివాడు.

అద్దేపల్లి వారు, కవితల్లో ముగింపును చాలా జాగ్రత్తగా ఆలోచిస్తారు అనేది వారి కవిత్వం చదివిన వారికి అర్థమౌతుంది. చూడండి :

"పాటలో పరవశించిన వాడు
దీపంగా మారతాడు
అపశ్రుతుల్లో గిలగిల్లాడేవాడు/ నీడగానే మిగుల్తాడు"

దీపం లక్షణం అందరికీ తెలిసిందే. ప్రమిదలో చమురు ఉన్నంత వరకు చుట్టూ ఉన్న చీకటిని చీల్చే ఖడ్గమౌతుంది. ఆ విధంగా ఒక మంచి పనిలో నిబద్ధతగా లీనమైన వాడు, సమాజ ప్రయోజనం కోపం జీవితాన్ని కూడా పణంగా పెట్టడం జరుగుతుంది. అదే స్వార్థచిత్తుడు గానీయండి. సమాజ వినాశనాన్ని కోరే వాడు కానీయండి. వాడు వ్యవస్థకు భారమై, పీడలాగ కనిపిస్తాడు. మనిషితో పాటు నీడ కదిలినా, జీవమున్నది మనిషికి మాత్రమే!

ఈ కవి, వసంతాన్ని మట్టిలో వెతుక్కుంటారు. ఒకడి కల, మరొకడికి నిజం కావచ్చుంటారు. పెట్టుబడి దారీ వర్గపు కలలు నిజం కావడానికి, శ్రామికులు, వినియోగదారులు, ఊహాలోకాల్లోకి నెట్టబడతారు. ఒక ఆకు రాలిపోగానే మరొక ఆకు ఉనికిలోకి రావడానికి చిగురు వేస్తుందంటారు.

"నేను మరెవరో లాగ మారిపోతున్నాను
మరెవరో లాగ మార్చబడుతున్నాను" అంటారు.

'నా లోంచి నేను' అనే కవితలోని పంక్తులివి. ఇక్కడ వ్యక్తి ప్రమేయం లేకుండానే ఆ వ్యక్తి మారిపోతున్నాడు. పరిస్థితులు మార్చివేస్తున్నాయి. మార్చేది ఎవరు? పెట్టుబడిదారీ వర్గం. పై పంక్తుల్లోంచి రెండు అంశాలు గమనించవచ్చు. మనిషి, తనకున్న మనోదౌర్బల్యాల ప్రభావంలో పడి, పాశ్చాత్య విష సంస్కృతి కోరల్లోకి జారిపోవడాన్ని ఊహించవచ్చు. మరొకటి – అధికారం, తన ప్రాపకం కోసం ప్రపంచాధిపత్యపు ఊబిలోకి భవిష్యత్తు నెట్టివేయబడుతున్న ధ్వనిని గమనించవచ్చు.

కవికి అనుభవంలోకి వచ్చిన అంశాలను అక్షరబద్ధం చేసిన కవితలు కొన్ని ఈ సంపుటిలో కనిపిస్తాయి. వాటిలో "కన్నీళ్ళలో కొట్టుకు పోయే కాగితాలు" ఒకటి. న్యూస్ పేపరు కొనుక్కొని బస్సెక్కిన వాడు, బస్ దిగే సమయానికి తను చదవ డానికి మిగల్చకుండా తలొక ముక్క తీసుకుని, చివరికి, మరెవడో చంకలో పెట్టుకుని వెళ్ళిపోతాడు. (సెల్ ఫోను రంగప్రవేశం చేయక ముందు పరిస్థితి) చూడండి..:

"వెనక్కి తిరిగి చూస్తే
ఒక కాగితం తూర్పున పెద్ద మనిషి చేతుల్లో
మరొకటి, పడమటి జంటిల్మన్ హస్తంలో
ఇంకోటి దక్షిణాన మర్యాదస్తుడి కౌగిట్లో
వేరొకటి ఉత్తరాన ఠీవిగా కూర్చున్న మనిషి వేళ్ళ మధ్య
అయ్యో! అయ్యో! అందరూ వినండి
దోచుకునే వాడిదే దేశం/ లాక్కునే వాడిదే పేపరు
కొట్టే వాడిదే రాజ్యం/ కొట్టేసేవాడిదే వస్తువు!"

వ్యవస్థ యొక్క రూపు లేఖల్ని, మనుషుల నైజాన్ని ఈ కవిత ద్వారా మన ముందుంచారు కవి.

సామ్రాజ్యవాదం గురించి చెబుతూ ...

"ఫ్యూడల్ దశలో స్త్రీని బానిసనుకున్నాను
క్యాపిటల్ దశలో స్త్రీని మార్కెట్ వస్తువనుకున్నాను
బానిసైనా అనుబంధాలన్నీ ఉన్నై
మార్కెట్ వస్తువైనా అనుభవాలన్నీ ఉన్నై
రాబోయే ఇంటర్నెట్ యుగంలో
స్త్రీ ఒకే ఒక్క అవయం అవుతుంది"

కవి భవిష్యత్తును చూస్తాడు – అనడానికి ఈ మాట ఒక ఉదాహరణ.

ఇంకా ఈ సంపుటిలో పర్యావరణం గురించి, అమెరికాకు వలస జీవితం గురించి చెప్తారు. నా తోటలో నా చేత్తో పెంచిన మొక్కల వేళ్ళకి, సముద్రాల అవతల నుంచి తవ్విన వ్యాపారపు పైపులైన్ల ద్వారా నీళ్ళందుతుంటే నా జీవజలాలపై పొరల్లోనే ఇంకిపోతుంటే ఎలా భుజం తట్టేదని ప్రశ్నిస్తారు. ఇందులోని కవితలన్నీ మానవాభ్యుదయాన్ని, సమాజ శ్రేయాన్ని కాంక్షిస్తాయి. అందుకే కవి, నిత్యనూతన చైతన్య శీలి. ఎందరికో మార్గదర్శకంగా నిలిచిన కవి డా॥ అద్దేపల్లి రామమోహనరావు తెలుగు సాహిత్య రంగంలో నిరంతరంగా నిలిచిపోతారు.

■

## స్వర్ణకారుడు

ఆరుగాలం కష్టించే కర్షకుడిలా
నగలు మలిచే కంసాలి కూడా
కష్టపడ్తున్న విశ్వ కార్మికుడే
ఇప్పటికీ జవాబు దొరకదు అతని ప్రశ్నలకీ
నివురు కప్పుకుంటున్న కుదురు కుంపటి
నిరాశలు అలముకుంటున్న ఆ కళ్లకి
బాధల ఊసులే నిండాను ...
ఎటుబాయే అరుణారుణ ఎర్రని లోహపు కమ్ముల కాక
ఎండిన కడుపులో మిగిలింది ఆకలి వెర్రి కేక
సాలు పొడుగునా ఆకలి ఆకలి
అతని దుకాణంలో బోసిపోయి చూస్తున్నవి సుత్తే ధాకలి
ఆకాశం దిగి రావు బంగారం ధరలు
అవుసలాయన కళ్లలో వీడిపోవు ఆశల ఎదురుచూపులు
అపరంజి సూక్ష్మ అద్భుత కళా నిపుణుడైతేనేం
చిక్కుకుని ఉన్నది అంతలోతు అప్పుల ఊబిలో
ఊరందరికీ మంగళ స్వరూపుడు స్వర్ణకారుడు
కంసాలి వృత్తితోబాటు
కనుమరుగవుతున్న చెమట శ్రామికుడు
పెళ్లి వస్తువులు పుస్తెలు, మట్టెల జోడు
పనులు చేసే భాగ్యం లేక
మోసం చేస్తున్నది మాఘం ప్రతి యేడూ
తీగ తీసే కమ్మొచ్చులు, పట్టుగార్లు, పొగగొట్టాలు,
మూసలు, తేజాబ్ గాజుసీసలు
శూన్యంగా దీనంగా చూస్తున్నవి
దుకాణంలో చారి వంకా
పసిడికాంతులు విరాజిల్లే కుంపటి కొలిమి
పాడువడ్డ గుడి శిథిల శిలావిగ్రహంలా
బూడిదరాశులతో కళాహీనంగా చూస్తున్నది
నగరాల్లో మెగా జ్యువెలరీ షాపుల ఆఫర్ల ముందు
ఎల్ఈడీ మిలమిలల వెలుగుల ముందు
పనిపాటల్తో రాగాలు పాడే
కంసాలి చిరు దుకాణాలు మూగబోయినాయి
వెండి బంగారు ఆభరణాల తయారీలో
వినబడే వినసొంపుల సుత్తిమోతల శబ్దం కరువై
వింతగా ఏలుతున్నది దుకాణమంతా నిశ్శబ్దం
బతుకు ట్రాజడీ మరుపుకోసం
సెల్లులో మెలోడి పాటగా మోగుతుండు స్వర్ణకారుడు
గిరాకీ సూర్యుడు కనిపించక దిగులుతో
ఒంటరి ఏకాకితనాన్ని కప్పుకుంటున్న
దు:ఖపు మంచు సమూహంగా మారుతుండు స్వర్ణకారుడు
అండమాన్ సముద్రంలో దీనదీవులు
ఆశలన్నీ ఆవిరైన ఎడారి ఎండమావులు కదా నేడు
ఏ ఆసరా లేని కంసాలి నిరుపేద కుటుంబాలు
శప్తమయ జీవితాలకు ప్రతిబింబాలు
అసహనం, ఆక్రోశం అగ్నిపర్వత లావాగ్నులుగా
రగులుతున్న గడ్డురోజులివి
రుంజానాదం ధ్వనించినచోట
జడమౌనం వెక్కిరిస్తున్న మహాచెడ్డరోజులివి
బాధల ఋతువేమో ఇది
కంసాలి వృత్తి రాలుటాకుల శిశిరం ఇది
వస్తే ఏంటి వసంతం, ఉగాది
ఈ వృత్తి కష్టాలే ఉగాది చేదు రుచి కాబోలు
ఇటున్న సుత్తె అటుపెట్టంగానే అమ్మో ఒకటో తారీఖు
కరెంటు, షాపు రెంటూ ఎక్స్ట్రా
నెలఖర్చులు తడిసి మోపెడు కదా
వేళకు ఐదు వేళ్లు నోట్లోకి పోలేని ఈ వెతల సమరంలో
తిన్న తిండీ రక్తం కాదు శరీరంలో
నాన్నల వారసత్వ అడుగు జాడల్లో నడుస్తన్న వాళ్లు
కడగండ్ల కుంభవృష్టిలో చిక్కుకుని తడుస్తున్నా బడుగువాళ్లు
కులవృత్తి తటాకంలో నట్టనడమ ఆగివున్న
నావ చందమాయే స్వర్ణకార వృత్తి జీవితం!
వేరు ఒక ఓడ లేదు, ఈత రానే రాదు
వేరే ఆధారం లేనేలేదు
ఎంతదూరమో కనిపించి చావదాయే బతుకు తీరం
కంసాలి గుండెచప్పుడే
కవులు పాడుకుంటున్న పద్యమవుతున్నది
అతని బాధలమంచు కరిగి నీటిమట్టం పెరిగిపోయి
దిగులు మహా సముద్రమవుతున్నది!
కళాకాంతులీనే స్వర్ణకారుడు
ఇపుడు లోకాన బాధావర్ణ దిగంబరుడు
చిరచింతల ఈ చీకట్ల సహవాసం పోదు
రేపటి భవిష్యత్తుపై గురిజెత్తు విశ్వాసం లేదు
ఈ దు:ఖం ఎన్నాళ్లు?
ఎవరు తుడవాలి ఈ కన్నీళ్లు?

**- రమేశ్ నల్లగొండ**
**83094 52179**

# గాంధీ మెమోరియల్‌లో బాపిరాజు స్మరణ



గాంధీ మెమోరియల్ హాల్లో సమావేశ దృశ్యం

- డా. నాగసూరి వేణుగోపాల్
94407 32392

**స**రిగ్గా పదేళ్ళ క్రితం మే మాసం చివరలో, తేదీ కూడా చెప్పాలంటే 2013 మే 27న మదరాసు ఆకాశవాణిలో నేను, బదిలీ మీద కడప నుంచి వచ్చి చేరాను. మదరాసు ఆకాశ వాణిలో ఉద్యోగం చేస్తానని అసలెప్పుడూ ఊహించలేదు, ఎందు కంటే మొదట్లోనే నాన్ తెలుగు ఆకాశవాణిలో మూడేళ్లు చేశాను కనుక ఇతర భాషా ప్రాంతాల్లో రేడియో ఉద్యోగం చేయడం ఇష్టంలేదు. మద్రాసు తెలియని ఊరు కాదు, అప్పటికి పుష్కరం క్రితం ఎం.ఏ. జర్నలిజం పరీక్షల కోసం, అలాగే ఆ కోర్సు సంబంధించిన కాంటాక్ట్ ప్రోగ్రామ్స్ కోసం వెళ్ళి ఉన్నాను నాలుగు సార్లు! తెలుగు ఆకాశవాణి పురుడు పోసుకుని నోరు తెరిచింది మదరాసులోనే... 1938 జూన్ 16నే! అదే తొలి తెలుగు ఆకాశవాణి కేంద్రం. స్వాతంత్ర్యం వచ్చాక ఆంధ్ర రాష్ట్రంలో తొలి ఆకాశవాణి కేంద్రం 1948 డిసెంబరు 1వ తేదీన విజయవాడలో మొదలైంది. అంతవరకు ఉర్దూ ప్రసారాలు ప్రధానంగా చేసే హైదరాబాద్‌లోని 'నైజామ్ రేడియో' 1950 ఏప్రిల్ 1న తెలుగు ఆకాశవాణిగా పరిణ మించడం చరిత్ర! మద్రాసులో తెలుగు వ్యావహారిక భాషలో పత్రికలు, సినిమాలు పరిణమించిన తరుణంలో ఆకాశవాణి మొదలవ్వడం, మహామహులు ఎందరో ఇందులో ఉద్యోగులు గా, కళాకారులుగా గొప్ప సేవ చేశారు. అటువంటి మద్రాసు ఆకాశవాణిలో తెలుగు విభాగం అధిపతిగా చేసే గొప్ప అవకాశం అది!

మళ్ళీ అనుకోకుండా, ఈ పెళ్ళి సందర్భంగా సరిగ్గా పదేళ్ళకు మదరాసు పోవడమూ దానికి నాలుగు రోజుల క్రితమే నా సహోద్యోగి, మిత్రురాలు డాక్టర్ జయా మహదేవన్ మదరాసు ఆకాశవాణి డైరక్టరు కావడం కారణంగా మెరీనా బీచ్‌కు ఎదురుగా ఉండే మద్రాసు ఆకాశవాణికి జూన్ 5 మధ్యాహ్నం 3.30 ప్రాంతంలో వెళ్ళాం. కార్యక్రమాల రూప కల్పనలో, శ్రోతల స్పందనలో నాకు ఉద్యోగిగా చాలా తృప్తి నిచ్చిన మదరాసు కేంద్రంలో మళ్ళీ అడుగు పెట్టడమూ, స్టూడియోలు పరామర్శించడమూ డాక్టర్ జి. లలిత వంటి సహోద్యోగినిని అక్కడ కలవడమూ చాలా ఆనందాన్ని చ్చాయి. ఆకాశవాణిలో టి తాగుతుండగానే 'మీకు కారు రెడీగా వుందోచ్' అంటూ బాలాంత్రపు శ్రీమతి రామనాథ్ ఫోన్ చేశారు. ఆవిడ పేరే శ్రీమతి! ఈ హడావుడిలో జయా మహదేవన్‌తో ఫొటో దిగడం అనే ప్రణాళిక గల్లంతయ్యింది.

మదరాసు ఆకాశవాణి అనగానే ఆచంట జానకిరాం. అయ్యగారి వీరభద్రరావు వంటి పేర్లతోబాటు బాలాంత్రపు రజనీకాంతరావు పేరు కూడా గుర్తుకు వస్తుంది. 'రజని'గా పిలువబడే రజనీకాంతరావు అన్న నళినీ కాంతరావు. 'నళిని'గా పేరుమోసిన నళినీ కాంతరావు పండితుడిగా అనువాదకుడిగా సంపాదకుడిగా విశేష ప్రతిభ కనబరిచినా ఆ స్థాయిలో గుర్తింపు రాలేదని నాకు అనిపిస్తూంటుంది. నళినీకాంతరావు గారి అమ్మాయిల్లో శ్రీమతి, లావణ్య గార్లకు సాహిత్య, సంగీత, నృత్య కళల పట్ల చాలా అభిరుచి వుంది. అందువల్ల వారిద్దరూ మదరాసులో నేను ఆకాశవాణి బయట తెలుగువారికి చేసిన కార్యక్రమాల్లో స్నేహహస్తం అందించేవారు. ఇంగ్లీషు సాహిత్యం మీద పట్టు ఉన్న శ్రీమతి గారు తెలుగులో కూడా చక్కని రచనలు చేయగలరని పాలగుమ్మి పద్మరాజు గురించిన వ్యాసం చదివి గమనించి ఉన్నాను. కనుక ఆమెతో అడివి బాపిరాజు, యద్దనపూడి సులోచనారాణి గార్ల గురించి చాలా చక్కని వ్యాసాలు ఇటీవల కాలంలో రాయించుకున్నాను.

మదరాసు వస్తున్నాను అనగానే, "మనం కలుద్దాం మిత్రులతో ఎక్కడో ఓ చోట" అని శ్రీమతి ప్రతిపాదించి 'రండి




కలుసుకుందాం. అఖిల కళా వైభవశ్రీ అడివి బాపిరాజు సంకలనాల సంపాదకులు డా. నాగసూరి వేణుగోపాల్ గారిని' అంటూ ఓ పాతికమందికి కుదిరే వెన్యూలో గెట్ టు గెదర్‌ని జూన్ 5 సోమవారం సాయంత్రానికి ప్లాన్ చేశారు. 2023 మార్చిలో 870పై చిలుకు పుటలతో, బాపిరాజు విభిన్న రంగాల కృషిని విశదం చేసే రీతిలో నాలుగైదు తరాల 98 మంది రచయితల విశ్లేషణలతో ఈ గ్రంథం రెండు భాగాలుగా వెలువడింది. మద్రాసు ఆకాశవాణి నుంచి నేరుగా శ్రీమతి వాళ్ళ ఇంటికి వెళ్ళి, అల్పాహారం కానించి ఆళ్వారు పేటలోనే వుండే సమావేశ స్థలం 'శ్రీనివాస గాంధీ నిలయం' చేరాం. లోపలికి వెళ్ళిన కాసేపటికే, 'ఈ ప్రదేశం ప్రాముఖ్యత తెలుసా? అడివి బాపిరాజుకి, మీకూ ఇష్టమైన అనుబంధం ఈ ప్రాంతంతో వుంది' అంటూ ఆ భవనం ముందు వున్న తులసి బృందావనాన్ని చూపించారు. అందులో గాంధీ మహాత్ముడి చితాభస్మాన్ని నిక్షిప్తం చేశారు. అయితే ఈ భవనంలో గాంధీజీ మద్రాసు వచ్చి నప్పుడు ఉన్నారని చెప్పారు. గాంధీజీకి సంబంధించిన మద్రాసులోని నాలుగైదు ముఖ్య స్థలాల్లో ఇదొకటి. దానికి ఆధారాలు వెతికితే లభించలేదు. దాంతో గాంధీజీ గురించి తమిళంలో 'ఆగస్టు 15' అనే విజయవంత మైన పుస్తక రచయిత, ఆకాశవాణి అనౌన్సర్ నీలకంఠాన్ని వివరించమని ఫోన్ చేసిన తర్వాత ఇటీవల లభించిన సాధికారిక సమాచారమిది.

ఆ భవనంలో ఒక స్వచ్ఛంద సేవా సంస్థను 1948 నుంచి అంబుజమ్మ అనే స్వాతంత్ర్య సమరయోధ, గాంధేయవాది చాలా ఏళ్ళు నేతృత్వంవహించారు. అంతకుముందు నేను మద్రాసులో ఉద్యోగం చేసినా ఈ ప్రదేశం గురించి నాకు తెలియదు. స్త్రీల హక్కులకోసం ఖాదీ, హిందీ, ఉప్పు సత్యాగ్రహం, సహాయ నిరాకరణోద్యమం, భూదానోద్యమంలో పాల్గొని 'అక్కమ్మ'గా పిలువబడిన అంబుజమ్మకు 1964లో పద్మశ్రీ గౌరవం కూడా లభించింది. దక్షిణభారతదేశంలోనే శాసనసభకు ఎంపికైన తొలి మహిళ, శారదా చట్టం కోసం పోరాడిన తెలుగు యోధురాలు డా॥ ముత్తులక్ష్మి రెడ్డి, అంబుజమ్మకి మిత్రురాలు, సహ ఉద్యమ శీలి! అలాగే దివ్యజ్ఞాన సమాజంతో ముడిపడి వున్న మార్గరేట్ కజిన్స్ కూడా అంబుజమ్మ మిత్రురాలే. 'థర్డ్ డిక్టేటర్'గా పేరుగాంచిన అంబుజమ్మ కనుకనే చాలా కాలం ఆ స్వచ్ఛంద సంస్థ ద్వారా అవసరమైన వాళ్ళకు గంజి, పాలు, మందులు వంటివి ఉచితంగా పంపిణీ చేసేవారు. ఇప్పుడు ఒక డాన్స్ స్కూల్ పద్ధతిగా నడవటాన్ని ఆ ప్రాంగణపు శుభ్రతను బట్టి నేను పసిగట్టాను. అంబుజమ్మ గారు టివిఎస్ సుందరం బంధువని, ఆమె తన తండ్రి పేరు, గాంధీజీ పేరు కలిపి ఆ భవనానికి 'శ్రీనివాస గాంధీనిలయం' అని నామకరణం చేశారని కూడా తెలిసింది.

స్వాతంత్ర్య సమరయోధుడిగా, కవిగా, గేయకర్తగా, కథా రచయితగా, నవలాకర్తగా, నృత్య సంగీత విశారదుడిగా, 'మీజాన్' దినపత్రిక సంపాదకుడిగా, తొలి తెలుగు సినిమా కళాదర్శకుడిగా బహుముఖ ప్రజ్ఞ విశేషంగా ప్రదర్శించిన అడివి బాపిరాజు గురించి 870 పైచిలుకు పుటలతో నా రెండు సంకలనాలుగా వచ్చిన సందర్భంగా ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పాతిక మందే వచ్చినా వారిలో శ్రీమతి, లావణ్య గార్లు కాకుండా జిడ్డు కృష్ణమూర్తి పరిశోధకులు, రచయిత్రి సరోజినీ ప్రేమ్ చంద్, గాయని బి.వసంత చెల్లెలు గాయని బి సావిత్రి వంటి చాలా గౌరవించదగ్గ మిత్రులు రావడం విశేషం. ఆ పూట సభలాగా కాకుండా పాతిక మంది కుర్చీలను గుండ్రంగా వేసుకుని బాపిరాజు రచనలను గుర్తు చేసుకున్నాం. ఆ సంకలనంలో వ్యాసాలు ఇచ్చిన మరో ఇద్దరు రచయిత్రులు డాక్టర్ రాయదుర్గం విజయలక్ష్మి, డాక్టర్ ప్రభల జానకి ఆ సమావేశానికి రాలేకపోవడంలోటే అని చెప్పాలి.

పొట్టి శ్రీరాములు స్మారక కేంద్ర నిర్వాహకుడిగా, ఆయన పుస్తకాలు వెలువరించిన ప్రచురణ కర్తగా పేరుగాంచిన వై.యస్.శాస్త్రి కుమారుడు వై రామకృష్ణ రావడం నాకు చాలా ఆనందాన్నిచ్చింది. అలాగే నా రచనలు చదివి ఫోన్ ద్వారా పరిచయమయిన వయోవృద్ధులు, రేణిగుంట ప్రాంతపు వారు, 'కలియుగ దైవం' సినిమా దర్శకులు రోసిరాజు కూడా కుమారుడితో కలిసి వచ్చారు. ఇక్కడ ప్రత్యేకంగా సి.నాగేంద్ర ప్రసాద్ గురించి చెప్పుకోవాలి. వీరి నాన్న సి.నరసింహం బ్రిటీషు హయాంలో 16 ఏళ్ళు, స్వాతంత్ర్య భారతంలో పాతికేళ్ళు పనిచేసిన ఐఏఎస్ ఆఫీసర్. మదరాసు కార్పొరేషన్‌లో పనిచేస్తున్నప్పుడు అడయారులోని గాంధీనగర్, కస్తూరిబా నగర్ కాలనీలను, మైలాపూరులో కాశీనాథుని నాగేశ్వరరావు పార్కును ఏర్పాటు చేసినవారు. ఆయన మా హిందూపురంలో 1935లో మునిసిపల్ కమిషనర్‌గా కూడా పనిచేశారు. అలాగే



హొస్‌పేట, కోయంబత్తూరు, విజయవాడలలో పనిచేయడమే కాకుండా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన తొలి రోజుల్లో కర్నూలులో రాజధానికి అసరమైన నిర్మాణాలను తక్కువ ఖర్చుతో పటిష్టంగా నిర్మించిన చరిత్ర కూడా వీరిదే. 'మీ అండ్ మై టైమ్స్' అనే జ్ఞాపకాల సంపుటిని, 'వేర్ వుయ్ ఫెయిల్డ్' అనే విశ్లేషణా గ్రంథాన్ని వెలువరించిన శ్రీ చల్లగళ్ళ నరసింహం కుమారుడే ఈ నాగేంద్రప్రసాద్. తనకన్నా 20 సంవత్సరాల పైచిలుకు చిన్నవాడినయినా నాగేంద్రప్రసాద్ నా పట్ల ఎంతో ఆదరంగా, గౌరవంగా వుంటారు.

అలాగే తమిళ ప్రాంతంలో తెలుగు వారిగా గుర్తింపు లేకుండా, ఎంతో చరిత్ర సృష్టించిన కొందరు మహానుభావుల గురించి 'దక్షిణాంధ్ర దారిదీపాలు' అనే వ్యాస సంకలనాన్ని ఐదారేళ్ళ క్రితం తీసుకు వచ్చాను. దానికి మిత్రులు పోజుల ముద్దుకృష్ణుడు ఎంతో సహకరించారు. వయసుతోపాటు కలిగే అనారోగ్య కారణాలతో ఆయన రాలేదు, కానీ ఆయన శిష్యుడు, నా సమవయస్కుడు మన్ని వెంకటేశ్వర్లు మా సమావేశానికి వచ్చి లోటు తీర్చాడు. మరో విశేషం గురించి కూడా చెప్పాలి. హైదరాబాద్లో దూరదర్శన్ తెలుగు ప్రసారాలు ప్రారంభం కావడానికి సంవత్సరం ముందు నాలుగు ప్రాంతీయ భాషల్లో కార్యక్రమాలు మద్రాసులో మొదలయ్యాయి. ఆకాశవాణి ప్రఖ్యాత గాయని వింజమూరి సీత కుమార్తె సీతారత్నాకర్ మద్రాసులో మొదలైన తొలి తెలుగు టీవీ ప్రసారాల ప్రొడ్యూసర్. కాగా శ్రీమతి తొలి తెలుగు టెలివిజన్ అనౌన్సర్ కమ్ యాంకర్! వీరిద్దరూ ఆరోజు సమావేశానికి రావడం నా అదృష్టం. ఇంకా తిరుమల రామచంద్ర కుమార్తె ఆముక్తమాల్యద, ఆకాశవాణి సోదరి జి. లలిత, అనౌన్సర్ చారుశ్రీ,, శ్రీనివాస్, సంగీతరావు మొదలైన మిత్రులు కూడా వచ్చారు. బాపిరాజు పాటను బి. సావిత్రి గారు పాడటంతో మొదలైన సమావేశం ఆయన బహుముఖ ప్రజ్ఞను కొనియాడుతూ రెండు గంటల వ్యవధిలో తృప్తిగా ముగిసింది.

ఈ కార్యక్రమం తర్వాత టి నగర్ వచ్చేశాం. టి.నగర్ అంటే వాగ్గేయకారులు త్యాగరాజు గుర్తుగా నామకరణమని కొందరు భావిస్తారు, కానీ అది సమాచార లోపంతో వచ్చిన సమస్య. మద్రాసు నగరపు తొలి మేయరుగా 1920 సంవత్సరం నుంచి సేవలందించిన పిట్టి త్యాగరాయం శెట్టి గారిని స్మరిస్తూ గౌరవ సూచకంగా వచ్చిన పేరు అది. 1876లో కనీ వినీ ఎరుగని కరువు సంభవించినపుడు ఈ తెలుగు నాయకుడు సొంత పైకంతో గంజి కేంద్రాలు ఏర్పరిచారు. ఆ ప్రాంతం గంజిదొడ్డిగా, ఆ స్థలంలో కట్టిన ఆసుపత్రి గంజిదొడ్డి ఆసుపత్రిగా పిలువబడ్డాయి. ఆ ఆసుపత్రే నేటి స్టాన్లీ ఆసుపత్రి. 1916లో డా॥ టి. ఎమ్. నాయర్‌తో కలసి జస్టిస్ పార్టీ పెట్టిన వీరు మూడు సార్లు ముఖ్యమంత్రి అయ్యే అవకాశాన్ని తిరస్కరించారు. అటువంటి టి నగర్ నేడు చాలా పెద్ద షాపింగ్ సెంటర్. ప్రఖ్యాతి గాంచిన పానగల్ పార్కు ఆ ప్రాంతంలోనే ఉంటుంది. నిజానికి శ్రీకాళహస్తి దాపులో ఉండే ఒకప్పటి సంస్థానం పానగల్లు. ముఖ్యమంత్రిగా సేవలందించిన పానగల్లు రాజా వారి పేరు మీద అక్కడి పార్క్‌కు అలా నామకరణం చేశారు. పెద్ద పెద్ద సినిమా స్టార్ట్స్ తొలి రోజుల్లో తిండి, ఇల్లు లేక అలమటించే సమయాల్లో ఆసరా అయ్యింది ఈ పానగల్ పార్కేనని చాలా చోట్ల చదివాం. ఈ పార్క్ దగ్గర నల్లి కుప్పుస్వామి సిల్క్ షాప్ ఉంది. వారిది బళ్ళారి నుంచి కంచి మీదుగా మద్రాసు చేరిన తెలుగు కుటుంబం. ఆయన నాకు మిత్రుడు కనుక అటు వెళితే పలకరించి ఆయనతో కాఫీ తాగడం అలవాటు. అలా ఒకసారి కుప్పుస్వామి షాపుకు వెళ్ళినప్పుడు సినీతార వైజయంతిమాల గారిని పరిచయం చేశారు. 2016 ఆగస్టు మధ్యలో నేను తిరుపతి ఆకాశవాణి కేంద్రానికి బదిలీ మీద వచ్చేశాను. అప్పటికి మెట్రో రైలు మద్రాసు మొహం చూడలేదు, కానీ ఇప్పుడుంది. హైదరాబాద్లో గమనించనిది ఓ విషయం అక్కడ తారసపడింది. మనం రోడ్డు మీద ప్రయాణం చేస్తూ మెట్రో పిల్లర్లను గమనిస్తే ఒక పిల్లర్ రెండు ముఖాలను ఒక యూనిట్‌గా పరిగణించి పెయింటింగ్ చిత్రాలు అలంకరించారు. టూ డైమన్షనల్‌గా అదనంగా శోభనిస్తోంది ఈ ప్రయోగం!

అలా జూన్ నాలుగవ తేదీ మధ్యాహ్నం మదరాసు చేరిన మేము ఈ కార్యక్రమాలన్నిటినీ ముగించి అలిసిపోయినా ఆనందంగా గడిచిందని భావన చేస్తూ మరుసటి రోజు అంటే 2023 జూన్ 6వ తేది ఉదయం ఎన్ని గంటలకి బయల్దేరాలి, ఎలా వెళ్ళాలి.. వగైరా చర్చించి, లగేజి సర్దేసి నిద్రపోయాం.

**(ఇంకావుంది)**

# అలా మొదలైంది ...

- డా.ఎన్. గోపి



**మా**మూలు అనుభవాలే
వాటిని గొప్ప కవితలుగా మార్చిన
చిన్ననాటి కవి మిత్రులే నాకాదర్శం
చర్మ చక్షువులకు కనిపించేవి
సామాన్య దృశ్యాలే కావొచ్చు
వారి లోపలి నేత్రాలు
దర్శించే తీరు అబ్బుర పరిచేది!

బిక్కు బిక్కుమనే గుండెను
చిక్కబట్టు కొని
తీర్చిదిద్దిన ఆనాటి అక్షరాలు,
ఆత్మ న్యూనతాభావాన్ని
నిబ్బరపు అంచుల దాకా
తీసుకెళ్లిన వాక్య విన్యాసాలు,
గింతే అనుకున్న జ్ఞాన పరిధిని
ఎంతో ఎత్తుకు ఎగరేసిన ఉడ్డీనాలు
రుణపడి పోయాను వారికి
ఆ రకంగా వచ్చాను ఈ దారికి.

పల్లెలో అయినా నగరంలో అయినా
రాత్రి రాత్రే.
నిద్ర పట్టని చిక్కని చీకటిలో
వెలుగు ముద్రలు వేసిన సూర్యోదయాలు వారు!

తెలియకుండానే
ఒక ఆంతరిక ప్రయాణం జరిగింది
తెలియకుండానే
ఒక నిరంతర నిగూఢ గానం సాగింది
ఎదుగుదల పైకి కనిపించేది కాదు
నాకు నేనే కొత్తగా కనిపించే
మొగలి రేకు లాంటి పరిమళ కాఠిన్యం
అడుగడుగునా రుణభారమే
ఎక్కడా తెగిపోని బతుకు దారం.

హృదయ సంబంధాలను మించిన
ధనముంటుందా!
మనసుకు మనసు
మమతకు మమత
కష్టపడి సాధించిన సమత
కారుణ్యంతో కడిగిన
మాలిన్యమే ఈ కవిత! ■

## పరిమళం

**గ**డ్డి పోచపై
నిలిచిన అశ్రు బిందువు జీవితం
ఒంటరి ఆత్మకు బంధువై
ఓ లేత కిరణం స్పృశించినంతనే
అవుతుంది అమృత సాగరం
సహస్ర యుగళ గీతాలతో
పరిమళిస్తుంది చిరకాలం !

- డా. డి.వి.జి.శంకర రావు,
మాజీ ఎంపీ,
94408 36931


విజయవాడ సభలో ప్రసంగిస్తున్న ఎంవిఎస్ శర్మ

# ప్రజా గాయకుడు గద్దర్ సంస్మరణ సభలు


గుడివాడలో ...

ప్రజా గాయకుడు గద్దర్‌కు నివాళ్లు అరిస్తూ ప్రజా నాట్యమండలి, సాహితీస్రవంతి, ఇతర ప్రజాసంఘాల ఆధ్వర్యాన విజయవాడ, విశాఖపట్నం, గుడివాడ తదితర చోట్ల సంస్మరణ సభలు జరిగాయి. పాటను సరళంగా, సమరశీలంగా సాధారణ జనం వద్దకు చేర్చిన గద్దర్ జీవితాంతం ప్రజా పక్షపాతిగా ఉన్నారని వక్తలు పేర్కొన్నారు. మతోన్మాద, కార్పోరేటు శక్తులకు వ్యతిరేకంగా పాటను, ప్రజాకళలను ఉపయోగించుకోవవల్సిన అవసరం నేడు ఎంతైనా ఉందని పేర్కొన్నారు.

తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా 29.8.2023 మంగళవారం విశాఖపట్నంలోని కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీలో సభ జరిగింది. వాడుక భాషోద్యమ నాయకుడు గిడుగు రామమూర్తి పంతులు చిత్రపటానికి పూలమాల వేసి, జివిఎంసి అధికారి పల్లె నల్లనయ్య మాట్లాడారు. సాహితీ స్రవంతి విశాఖ నగర అధ్యక్ష కార్యదర్శులు పొలమరశెట్టి ఫ్రాన్సిస్, పెంటకోట రామారావు ప్రసంగించారు. కళాశాల ప్రిన్సిపాల్ కెవి రమణ, హెఒడి బి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు. పెద్దసంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు.





యువ రచయిత్రి, సీనియర్ జర్నలిస్టు అనుపమ పద్మజ మల్లాజోస్యుల రచించిన ఆంగ్ల నవల 'ది మ్యాంగో లేడీ' పరిచయ సభ 22.8.2023 సాయంత్రం విజయవాడలోని బాలోత్సవ్ భవనంలో జరిగింది. ప్రముఖ సాహిత్య విమర్శకులు డా.బాలాంత్రపు ప్రసూన పుస్తక పరిచయం చేశారు. శాంతిశ్రీ అధ్యక్షత వహించగా, శమంతకమణి, గోళ్ల నారాయణరావు, రచయిత్రి అనుపమ పాల్గొన్నారు.

# గురజాడ అప్పారావు

జననం : 21.9.1862 మరణం : 30. 11.1915



'ముత్యాలసరాలు'తో కవిత్వంలోనూ, 'కన్యాశుల్కం'తో
నాటకరంగంలోనూ సంచలనం సృష్టించారు.
మానవతా సందేశంతో నవకవిత్వానికి నాంది పలికారు.
వాడుక భాష వ్యాప్తికోసం గిడుగుతో కలిసి పోరాడారు.
ఇతివృత్తాలలోనూ, పాత్రల ఎంపికలోనూ నూతన సంప్రదాయాలను
ప్రవేశపెట్టారు. మూఢనమ్మకాలను త్రోసిపుచ్చారు.

SAHITYA PRASTHANAM ▪ SAMPUTI - 4 ▪ SANCHIKA - 12 ▪ KRISHNA ▪ September 2023
RNI NO.APTEL/2004/18396 ▪ Postal Regd. No.VJ/187/2023-25 PAGES : 68
Date of Posting : 2nd of Every Month ▪ Date of Publication : 27.08.2023

రెండు దశాబ్దాల మీ సాహిత్య నేస్తం

# సాహిత్య ప్రస్థానం

## అక్టోబర్ - నవంబర్ 2023

## ఇరవయ్యేళ్ల ప్రత్యేక సంచికగా రాబోతోంది !

సాహిత్య ప్రస్థానం 2003 డిసెంబర్ త్రైమాసికగా మొదలై త్వరలోనే మాసపత్రికగా మారి రెండు దశాబ్దాలుగా అవిచ్ఛిన్నంగా నడుస్తోంది. సాహిత్య ప్రస్థానం వచ్చాక సాహిత్య పత్రికల రూపురేఖలే మారిపోయాయి. కొత్త గొంతులను పలికించి... కొత్త భావాలు వెలిగించిన... సమగ్ర దృష్టి కోణాలు ఆవిష్కరించిన నిబద్ధతకు కొత్త నిర్వచనమిచ్చిన సాహిత్య ప్రస్థానం ఇరవయ్యో వార్షికోత్సవ సందర్భం ఇది.

మానవ చైతన్య వికాసంలో సాహిత్యం మహత్తర పాత్ర నిర్వహించింది. మూఢత్వాన్ని, ఆధిపత్యాన్ని, పీడనలూ దోపిడీను ప్రశ్నించడానికి అక్షరాలా ఆయుధంగా నిలిచింది. అభాగ్యులకు ఊపిరిగా మారింది. సంఘ సంస్కరణలోనూ, స్వాతంత్ర్య పోరాటాలలోనూ, విప్లవ విజయాలలోనూ ప్రేరణగా నిలిచింది. ఈ కారణంగానే దేశ దేశాల్లో సాహిత్యకారులు, రచయితలు, కవులు అనేక నిర్బంధాలనూ నిషేధాలను ఎదుర్కోవలసి వచ్చింది. మన దేశంలోనూ ఇటీవలి దశకు వచ్చిన అనేక పరిణామాల నేపథ్యంలో ఉజ్జ్వలమైన ఉత్తేజకరమైన ఈ చరిత్రను మననం చేసుకోవడం అవసరమని భావిస్తున్నాం. గతంలో వచ్చిన మా ప్రత్యేక సంచికలను మించి ప్రతిష్ఠాత్మక రచయితలు మేధావుల రచనల సమాహారంగా ఈ సంచిక వెలువడనున్నది.

సాహిత్య ప్రస్థానం ప్రత్యేక సంచికకు ప్రకటనలు ఇచ్చి ప్రోత్సహించవలసిందిగా ప్రకటనకర్తలకు విజ్ఞప్తి చేస్తున్నాం. చిరకాలం దాచి ఉంచుకోదగిన స్థాయిలో వెలువడుతున్న ఈ ప్రత్యేక సంచికకు మీ నుంచి అదే విధమైన ప్రత్యేకాదరణ లభిస్తుందని ఆశిస్తున్నాం.

---

సమగ్ర సాహిత్య దర్శిని ప్రస్థానం, ఇరవయ్యేళ్ల విశేష సంచిక.

ప్రత్యేక సంచికల్లో మరో విశిష్ట ప్రయోగం, చరిత్ర గమనంలో వెలుగని అక్షర దర్పణం.